www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 26-4-2024 | పేజీలు: 18 + 4 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 10 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళపక్షం; తిథి: విదియ ఉ. 7.46 తదుపరి తదియ; నక్షత్రం: అనూరాధ తె. 3.40 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: ఉ. 6.36-8.17; దుర్ముహూర్తం: ఉ. 8.26-9.16, మ. 12.38-1.28; అమృతఘడియలు: సా. 4.43-6.24; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 5.55; సూర్యాస్తమయం: 6.30 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శుక్రవారం | 26-4-2024 | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ



39 Years of Excellence 1986-2024

అసాధ్యం అనుకొనే విద్యార్థుల JEE MAIN కలలను శ్రీచైతన్య విజయవాడ

(మయూరి భవన్, రామన్ భవన్, శ్రీచక్ర భవన్, గాయత్రి నగర్ బ్రాంచ్‌లు)

విద్యార్థులు సుసాధ్యం చేశారు



JEE MAIN 2024 టాప్ ర్యాంకర్స్‌తో శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ శ్రీమతి సుష్మ శ్రీ గారు

ALL-INDIA ALL CATEGORY BELOW 10 RANKS

Rank	Name	Appl No
1	G N NIRMALKUMAR	240310385062
1	K C BASAVA REDDY	240310618179
2	A SINGH RATHORE	240310112318
3	REDDI ANIL	240310238514
3	THOTAMSETTY NIKILESH	240310813888
5	VASANTA SRIRAJ	240310160867
6	HIMANSHU THALOR	240310580429
6	D SRINIVASA REDDY	240310682440
6	T SRI CHANDRAVADAN	240310166340
7	SALLURI VIVEK	240310251202
9	M V MANIKANTA SAI TEJA	240310867335
9	MAVURU JASWITH	240310542275

ఆలిండియా ఓపెన్ కేటగిరీలో టాప్ 1000లోపు ర్యాంకులు

Rank	Name	APPL.No.
106	SAGARIKA SINHA	240310003797
109	DHRUV GAUD	240310290608
115	PATURI HEMANTH SAI	240311090980
116	SATIVADA JYOTHIRADITYA	240310812058
120	PUTTI KUSHAL KUMAR	240310241276
121	RHYTHM KEDIA	240310512973
122	PALAKSH GOYAL	240310459363
123	DHRUVIN HEMANT DOSHI	240310466751
124	AMAAN KHAN	240310481404
131	MUTHU S	240310329404
135	KESHAV NAVANDAR	240310809123
140	Y SATYA SRI NEELESH	240310541589
150	N SIDDHARTH REDDY	240310623454
153	AKSHAR ZALA	240310718875
157	DASARI UPENDRA	240310655505
165	SHUBHAJEET DAS	240310154855
167	LAKSHAY KUMAR	240310153979
178	SIDDU CHANDRA TEJA	240310833016
189	NEELA PRATHIK KUMAR	240310041626
193	C G CHANDRA SAI RAM	240310236301
194	SOHAM DANGE	240310223082
206	NITHISH B	240310043437
209	P V S D SAI MOHITH	240310038215
213	INAPAKURTI RAJESH	240310836734
214	Y T RAVINDRA SREE	240310809529
243	UJJWAL SINGH	240310429164
260	TUSHAR	240310494913
261	DHANUKONDA SRINIDHI	240310153268
262	SANKE BHARGAV SAI RAJ	240310696571
270	INESH AGGARWAL	240310323403
272	LUKKA AKSHARA	240310437162
280	ERANKI VENKATA JHANANI	240310180237
297	KESHAV SINGHAL	240310309470
308	MAYANK JAIN	240310033270
311	GOLLA LEKHA HARSHAA	240310806676
320	GURRAM HARI CHAITANYA	240310835301
323	PRABANDHAM SRINIKETAN	240310359133
326	RIDDHI	240310129920
333	P NIKHIL CHANDRA	240310640628
335	NAGARJUNAPU NAVYASRI	240310455150
343	V AAKASH AADHITHYA	240310007449
359	RAGALA AKHIL	240310889954
363	K HARI HARA TEJA	240310804760
364	DESABOINA SRI SATHWIK	240310225118
365	KOTHA HARDHIK REDDY	240310154330
366	SATYENDU KAR	240310008918
369	SRUTARSHI TRIPATHI	240310000561
382	D G V N S ARYA CHARAN	240310821243
390	SUJAL SATISH MOTAGI	240310865567
391	ADITYA ADHANA	240310182249
394	KODALI RAMANA GOPAL	240310531999
397	BOOSARAJU SACHIN	240310163864
414	PRABHNOOR	240310667271
415	BIBASWAN BISWAS	240310414582
420	NIKET GARG	240310355912
422	SALLURI VIVEK	240310251202
428	G SIDHARTHA REDDY	240310294369
432	V NITHEESH KUMAR	240310902461
434	KOLLI SURYA SHASHANK	240310651471
436	G V S S R K TEJAS REDDY	240310653574
437	CHETAN SRIRAMA	240310616509
438	A S S D B SIDHVIK SUHAS	240310815144
439	K SAMPATH RAJIV	240310545376
440	A SINGH RANA	240310680377
441	M HARSHA VARDHAN	240310816122
443	SHREYAS BALLATIGI	240310288522
444	LINGAMSETTI RAJASA	240310187797
446	SIDHARTH PILLAI	240310112504
450	P KARTHIKEYA	240310481114
452	K VISHAL REDDY	240310540195
463	VASANTA SRIRAJ	240310160867
464	T ARNAV GORAKSHNATH	240310017668
465	YASHDEEP SINGH	240310062156
466	JULAPELLY HANIKAR RAO	240310289991
473	METTA SATEESH CHANDRA	240310483275
474	K A KARTHIK REDDY	240310300365
475	TANAY CHETAN KAKLIYA	240310427817
478	KASAVAJJALA SAI SHREYAS	240310173477
480	MURARI GANESH SAI	240310831164
485	SRINIVAS REDDY GUNTAKA	240310615188
487	KORUPOLU SAI RAKESH	240310154846
492	MACHA HAREESH	240310457602
499	SIKHAKOLLI GURU SAI TEJA	240310113802
508	BHERI SAHITI	240310153717
512	M V SATYA PAVAN KUMAR	240310367085
513	GURNOOR SOHAL	240310231254
517	ANIMESH SINGH RATHORE	240310112318
539	BETHI PRIYESH REDDY	240310551201
542	ARMAN SINGHAL	240310363633
549	Y RAM CHARAN GOUD	240310496254
552	AYUSH RAI	240310369804
559	S VARSHITH REDDY	240310096405
560	ARYAN GUPTA	240310051537
563	B SRI SAI SIVA ADITYA	240310506690
565	PARTH DHAMIJA	240310239396
567	V VENKATA AKHIL	240310467366
569	CHELLURI CHAKRADHAR	240310181118
572	CHIRAG V GOWDA	240310578926
586	GUNDA GNANESH	240310288956
587	BUDDA TANMAY	240310946408
588	K SAI HANEESH REDDY	240310446816
589	P SRI VAATSAV REDDY	240310199599
592	A SAHASRANSH REDDY	240310197694
594	P N VENKATA NAVADEEP	240310550114
595	ANURAG KISHOR PATIL	240310628042
598	IBTESAM AHMED	240310322819
605	T PRUDHVI REDDY	240310186552
624	N V SASHANK REDDY	240310624570
630	JALAGAM SAI RISHITH	240310677967
633	K SUMANTH REDDY	240310658506

*T & C apply | Note: Any inadvertent error published in this advertisement could be brought to our notice | Note: The information is as per students feedback

* DLP | @ Gen-EWS | $ OBC-(NCL) | % SC | # ST | & GEN

IIT-JEE & NEET LONG-TERM 2024

ADMISSIONS OPEN

FOR NEET : 040 660 60606

ADMISSIONS OPEN

Knowledge Hub

NEET | IIT JEE | FOUNDATION

COACHING CENTRES

www.srichaitanyaknowledgehub.com

VIZAG - 91774 44307

Scan the QR code for offer on JEE Courses

LONG-TERM JEE-MAIN & ADVANCED

VIJAYAWADA RAMAN BHAVAN-I : 97040 65666, 96526 99222

VISAKHAPATNAM 80740 17511, 91772 06961

GUNTUR 97042 88444

www.andhrajyothy.com
ABN ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
ABN ఆంధ్రజ్యోతి
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 26-4-2024

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

కాసుల రాజకీయం

లోక్‌సభ ఎన్నికల ఖర్చు 1.2-1.35 లక్షల కోట్లు

అమెరికా అధ్యక్ష ఎన్నికలకు మించి వ్యయం.. ఇది ప్రపంచంలోనే అత్యధికం

2019లో ఒక ఓటుకు పెట్టిన ఖర్చు రూ.700.. ఇప్పుడది రూ.1,400

పార్టీలు, అభ్యర్థులు, ఈసీ.. అందరి ఖర్చు ఇది

సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ చీఫ్ భాస్కర్‌రావు

6

అవినాశ్ చిన్న పిల్లోడు

తప్పు చేయలేదని నమ్మా కాబట్టే టికెట్ ఇచ్చా: జగన్

అవినాశ్ జీవితం నాశనం చేయాలని కుట్ర

ఈ కుట్రలో నా ఇద్దరు చెల్లెళ్లు కలిశారు

వైఎస్ పేరు తుడపాలని చూసిన పార్టీలో చేరిక

వైఎస్ శత్రువు ఇంటికి పసుపుచీర కట్టుకెళ్లారు

వివేకాను చంపానన్న వ్యక్తికి మద్దతు

చిన్నాన్నను ఓడించిన వారితో చెట్టపట్టాల్

వీళ్లా రాజశేఖరరెడ్డి వారసులు?

పులివెందుల సభలో షర్మిల, సునీతలపై ముఖ్యమంత్రి జగన్ విమర్శలు



పులివెందులలో నామినేషన్ దాఖలు చేస్తున్న సీఎం జగన్. పక్కన అవినాశ్‌రెడ్డి

కడప, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): "వైఎస్ అవినాశ్ ఏ తప్పూ చేయలేదని నేను బలంగా నమ్మాను. కాబట్టే టికెట్ ఇచ్చాను. మాఅందరి కన్నా చిన్నపిల్లాడు అవినాశ్. అటువంటి పిల్లాడి జీవితం నాశనం చేయాలని పెద్దపెద్ద వాళ్లంతా కుట్రలు చేస్తున్నారు" అని సీఎం జగన్ అన్నారు. పులివెందుల అసెంబ్లీకి నామినేషన్ వేసేందుకు ఆయన గురువారం తాడేపల్లి నుంచి పులివెందుల

మిగతా 7వ పేజీలో...



అవినాశ్‌ను నిర్దోషి అంటున్న జగన్‌కు వ్యవస్థలపై నమ్మకముందా?

నిందితుడని సీబీఐ తేల్చిన వ్యక్తికి మూడోసారి టికెట్టా?

ఇది మీకు తగదు.. అలా చేయకండి

అవసరమైతే నా భర్తను, ఆయన అన్ననూ అరెస్టు చేయండి

నా తండ్రి వివేకకు మాత్రం న్యాయం చేయండి: సునీత

చిన్న పిల్లాడైతే స్కూలుకు పంపాలి

వివేకానందరెడ్డి హత్యపై లైవ్ డిబేట్‌కు సిద్ధం

మీ చానల్‌కే వస్తా.. మీరు చర్చకు సిద్ధమేనా?

సీఎం జగన్‌కు వివేకా కుమార్తె సునీత సవాల్

జగన్.. నీకిది తగునా?

నీ సొంత మీడియాలోనే మీ చిన్నాన్న వ్యక్తిత్వ హననమా?

కుటుంబ సభ్యుడిగా కాకపోయినా.. ముఖ్యమంత్రిగా ఇదేనా నీ కర్తవ్యం?

నీ చెల్లెళ్లను టార్గెట్ చేస్తుంటే ఏం పట్టదా?

నిందితుడికే మళ్లీ పోటీ అవకాశమా?

జగన్‌కు వివేకా సతీమణి సౌభాగ్యమ్మ లేఖ

7

సభ్యత, సంస్కారం ఉన్నాయా?

నేను కట్టుకున్న చీర గురించి మగవాళ్ల ముందు మాట్లాడతావా?.. జగన్‌పై షర్మిల ఫైర్

సొంత చెల్లి అన్న ఇంగితం ఉండొద్దా?.. ఇంత దిగజారుడా?

పసుపు చీర కట్టుకోకూడదా?.. నీ పత్రిక పసుపు రంగులో లేదా?

బాబు వద్ద మోకరిల్లింది నేను కాదు.. నువ్వే మోదీ వద్ద మోకరిల్లావు

నీ కేసుల చార్జిషీటులో వైఎస్ పేరును చేర్పించింది నీ లాయర్ కాదా?

సీఎంకు పీసీసీ అధ్యక్షురాలి స్ట్రాంగ్ కౌంటర్

7



విజయవాడ ప్రచారంలో షర్మిల

పులివెందులలో వివేకా గురించి ఒక్క ముక్క మంచిగా మాట్లాడావా?

రాజశేఖర్‌రెడ్డి తమ్ముడని అన్నావా?

చివరి నిమిషందాకా వైసీపీలోనే ఉన్నాడని ఎందుకు చెప్పలేదు?

అవినాశ్ భవిష్యత్‌ను మేమెందుకు పాడుచేస్తాం?

వివేకా వద్దన్నా ఎంపీ టికెట్ ఇచ్చినప్పుడు మేం కాదనలేదే!

సౌభాగ్యమ్మ లేఖ చూసినా చలించలేదంటే మీది గుండేనా.. బండనా?

పాపం.. పిల్లోడు!

వివేకా కేసులో ఈ పిల్లోడిదే కీలక పాత్ర

సాక్ష్యాధారాలతో నిరూపించిన సీబీఐ

అయినా జగన్ దృష్టిలో అవినాశ్ పసివాడే

7

నాడు -నేడు మారిన సీను

2019లో అమ్మ ముద్దు.. వెంట వివేకా బామ్మర్ది

ఈసారి జగన్ నామినేషన్‌లో కనిపించని ఆ దృశ్యాలు

నామినేషన్‌కు ముందు అప్పుడూ ఇప్పుడూ సభ

అప్పట్లో భారీగా తరలొచ్చిన వివేకా అభిమానులు

హత్యలో నిజాలు వెలుగుతో నేడు కనిపించని ఊపు

6

తిరుగుబాటు మొదలైంది!

డ్రామా కంపెనీని మూసేసి జగన్ ఇంటికే: చంద్రబాబు

ఇష్టానుసారం పాలిస్తే జనం తిరగబడతారు

ఆయన మళ్లీ వస్తే ఆస్తులు దోచేస్తాడు

చిత్తుగా ఓడించి గులకరాయి గాయానికి ప్రజలే చికిత్స చేయాలి

కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులందరికీ 3 సెంట్లు.. ఇల్లూ కట్టిస్తాం

ఏప్రిల్ నుంచే రూ.4 వేల పెన్షన్.. ఫస్టునే ఇంటికొచ్చి ఇస్తాం

మొదటి సంతకం మెగా డీఎస్సీపైనే

ఉద్యోగం వచ్చే వరకు 3 వేల నిరుద్యోగ భృతి

టీడీపీ అధినేత హామీలు



రైల్వేకోడూరు సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు. పక్కన పవన్, కిరణ్‌కుమార్ రెడ్డి



రాయచోటి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అధికారం ఉంది కదా అని ఇష్టానుసారంగా పరిపాలన చేస్తే ప్రజలు తిరగబడతారని టీడీపీ అధినేత చంద్రబాబు స్పష్టం చేశారు. రాయలసీమలోని అన్ని నియోజకవర్గాల్లోనూ జగన్‌రెడ్డి ప్రభుత్వంపై తిరుగుబాటు మొదలైందన్నారు. ఎన్నికల్లో వైసీపీని చిత్తుచిత్తుగా ఓడించాలని ప్రజలకు పిలుపిచ్చారు. అప్పుడు జగన్‌రెడ్డి డ్రామా కంపెనీ వైసీపీని మూసేసి ఇంటికి వెళ్లడం ఖాయమన్నారు. ప్రజాగళంలో భాగంగా గురువారం అన్నమయ్య జిల్లా రాజంపేట, రైల్వేకోడూరుల్లో జరిగిన భారీ బహిరంగ సభల్లో ఆయన, జనసేనాని పవన్ కల్యాణ్, మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రసంగించారు. ఎన్నికల్లో వైసీపీ గెలిచి జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే

మిగతా 6వ పేజీలో...

రాష్ట్రంలో మార్పు తథ్యం

జగన్‌ను ఓడించేందుకు జనం సిద్ధం: పవన్

రాజంపేట, రైల్వేకోడూరులో ఉమ్మడి సభలు

ఒక్క చాన్స్‌తో వందేళ్లకు షాక్!

పాదయాత్ర, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు 730.. 85 శాతం అమలే చేయలేదు

నమ్మక ద్రోహానికి ట్రేడ్ మార్క్ జగన్.. జనం నెత్తిన రూ.13 లక్షల కోట్ల అప్పుల గుదిబండ

ఒక్కో కుటుంబంపై పదేసి లక్షల భారం.. అమ్మ ఒడికి 13 వేలు.. నాన్న బుడ్డితో లక్ష స్వాహా

మద్యం వ్యాపారంలో లక్ష కోట్ల దోపిడీ.. ఇసుక, గనుల్లో అక్రమాలతో మరో లక్ష కోట్లు

ఈ ఐదేళ్లలో పదిసార్లు విద్యుత్ చార్జీల బాదుడు.. జనంపై రూ.75 వేల కోట్ల భారం

విషపూరిత మద్యంతో 30 వేల మంది మృతి.. అనారోగ్యం బారిన 35 లక్షల మంది

7

జగన్ ఐదేళ్ల పాలనపై ఎన్డీయే చార్జిషీటు

ఆంధ్రజ్యోతి
స్పోర్ట్స్
విజయవాడ ● శుక్రవారం 26 ఏప్రిల్ 2024

నేటి మ్యాచ్ | రాత్రి 7.30 గం. | వేదిక: కోల్‌కతా

కోల్‌కతా X పంజాబ్

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లీ (బెంగళూరు)	బుమ్రా (ముంబై)
430 (9 మ్యాచ్‌లు)	13 (8 మ్యాచ్‌లు)





రజత్ పటీదార్ (20 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 50)

రైజర్స్‌కు ముకుతాడు

సత్తా చాటిన బౌలర్లు ● పటీదార్, కోహ్లీ అర్ధసెంచరీలు

35 రన్స్‌తో బెంగళూరు ఘనవిజయం

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు గెలిచింది. అవును.. సరిగ్గా నెల రోజుల క్రితం తొలి విజయం సాధించిన ఈ జట్టు ఆ తర్వాత వరుసగా ఆరు పరాజయాలతో అభిమానులను నిరాశ పరిచింది. ఇక లీగ్‌లో భారీ స్కోర్లతో విరుచుకుపడుతున్న సన్‌రైజర్స్‌తో మ్యాచ్ అనగానే అందరూ ఆర్‌సీబీపై జాలి చూపిన వారే.. కానీ బలహీనంగా భావిస్తున్న వారి బౌలింగ్ విభాగమే ఎస్ఆర్‌హెచ్ బ్యాటర్లకు ముకుతాడు వేసింది. తద్వారా జట్టు రెండో విజయం అందుకుంది.


కోహ్లీ (43 బంతుల్లో 51)

1 ఐపీఎల్ ఓ సీజన్‌లో 100+ సిక్సర్లు బాదడం సన్‌రైజర్స్‌కిదే తొలిసారి. గతం (2022)లో 97 సిక్సర్లు అత్యధికం.

హైదరాబాద్: ఐపీఎల్‌లో పట్టపగ్గాల్లేకుండా దూసుకెళుతున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ జోరుకు బ్రేక్ పడింది. 277, 287, 266.. ఇలా భారీ స్కోర్లతో బెంబేలెత్తిస్తున్న సన్‌రైజర్స్‌ను వారి సొంత ఇలాకాలోనే రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఓడించింది. ఈ సీజన్‌లో ఓవర్‌కు 11 పరుగుల రన్‌రేట్‌తో ప్రత్యర్థి జట్లకు అత్యధిక పరుగులిచ్చుకుంటున్న ఆర్‌సీబీ బౌలర్లు చివరకు సత్తా చాటారు. ఫలితంగా గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో 35 రన్స్‌తో డుప్లెసి సేన ఘనవిజయం సాధించింది. ముందుగా బెంగళూరు 20 ఓవర్లలో 7 వికెట్లకు 206 పరుగులు చేసింది. రజత్ పటీదార్ (20 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 50), కోహ్లీ (43 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 51), గ్రీన్ (20 బంతుల్లో 5 ఫోర్లతో 37 నాటౌట్) రాణించారు. ఉనాద్కట్‌కు 3, నటరాజన్‌కు 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో హైదరాబాద్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 171 పరుగులు చేసి ఓడింది. షాబాజ్ (40 నాటౌట్), అభిషేక్ (31), కమిన్స్ (31) మాత్రమే మెరుగ్గా ఆడారు. గ్రీన్, కర్ణ్, స్వప్నిల్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా పటీదార్ నిలిచాడు.

ఆరంభం నుంచే తడబాటు: తాజా సీజన్‌లో రైజర్స్ దూకుడు ముందు 207 పరుగుల ఛేదన చిన్నదే అనిపించినా.. ఆర్‌సీబీ బౌలర్లు మాత్రం అదరగొట్టారు. వరుస విరామాల్లో వికెట్లు తీసి ఒత్తిడిలోకి నెట్టారు. ప్రమాదకర హెడ్ (1)కు తొలి ఓవర్‌లోనే జాక్స్ షాకిచ్చాడు. మూడో ఓవర్‌లో అభిషేక్ 4,6,6తో 20 రన్స్ సాధించడంతో ఇక జోరు ఆరంభమైందనిపించింది. కానీ తర్వాతి ఓవర్‌లోనే అతడి వికెట్‌ను యష్ తీయగా.. స్పిన్నర్ స్వప్నిల్ ఐదో ఓవర్‌లో డబుల్ షాకిస్తూ మార్‌క్రమ్ (7), క్లాసెన్ (7) వికెట్లను తీయడంతో ఎస్ఆర్‌హెచ్ 56/4తో పీకల్లోతు కష్టాల్లో పడింది. కాసేపటికే నితీశ్ (13), సమద్ (10) కూడా పెవిలియన్ చేరారు. ఈ దశలో కెప్టెన్ కమిన్స్ ధాటిని ప్రదర్శిస్తూ 11వ ఓవర్‌లో 6,6.. 12వ ఓవర్‌లో 4,6తో ఆశలు రేపాడు. కానీ అతడూ ఎక్కువ సేపు క్రీజులో నిలవలేకపోయాడు. పేసర్ గ్రీన్ తన వరుస ఓవర్లలో కమిన్స్‌తో పాటు భువనేశ్వర్ (13) వికెట్లను తీయడంతో ఇక చేసేదేమీ లేకపోయింది. చివర్లో షాబాజ్ ఒంటరి పోరాటం ఏమాత్రం ఫలితాన్నివ్వలేదు.

పటీదార్, విరాట్ హాఫ్ సెంచరీలు: రైజర్స్ బ్యాటర్ల విధ్వంసాన్ని దృష్టిలో ఉంచుకునో ఏమో.. టాస్ గెలవగానే ఆర్‌సీబీ బ్యాటింగ్ ఎంచుకుంది. వీరి ఇన్నింగ్స్‌లో రజత్ పటీదార్ ధనాధన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకోగా.. విరాట్ ఆటలో వేగం లేకపోవడం భారీ స్కోరుపై ప్రభావం పడింది. చివర్లో గ్రీన్ బ్యాట్ ఝుళిపించడంతో వరుసగా మూడో మ్యాచ్‌లో స్కోరు 200 దాటింది. పేసర్ ఉనాద్కట్ తన వందో ఐపీఎల్ మ్యాచ్‌లో విశేషంగా రాణించి కీలక వికెట్లు తీశాడు. ఓపెనర్లు విరాట్, డుప్లెసి తొలి వికెట్‌కు 48 పరుగులు అందించడంతో జట్టుకు శుభారంభమే దక్కింది. రెండో ఓవర్‌లోనే డుప్లెసి మూడు ఫోర్లతో రాణించగా, ఆ తర్వాత విరాట్ రెండు ఫోర్లు, డుప్లెసి సిక్సర్‌తో 19 పరుగులు జత చేరాయి. కానీ నాలుగో ఓవర్‌లోనే డుప్లెసి వికెట్ నటరాజన్ తీయడంతో ఆర్‌సీబీకి తొలి షాక్ తగిలింది. ఆ తర్వాత రెండు ఓవర్లలో పరుగులు తగ్గడంతో పవర్‌ప్లేలో జట్టు 61/1 పరుగులు చేసింది. ఆ వెంటనే విల్ జాక్స్ (6) నిరాశపరిచినా.. కోహ్లీకి జత కలిసిన పటీదార్.. రైజర్స్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. కానీ మరో ఎండ్‌లో కోహ్లీ నుంచి ఆ స్థాయి ప్రదర్శన కనిపించలేదు. రజత్ మాత్రం ఓవర్‌కో బౌండరీ ఉండేలా చూడగా, స్పిన్నర్ మార్కండే ఓవర్ (11వ)లో అయితే వరుసగా 4 సిక్సర్లతో 27 పరుగులు రాబట్టాడు. దీంతో స్కోరు వంద దాటింది. అటు 19 బంతుల్లోనే వరుసగా తన రెండో ఫిఫ్టీని కూడా పూర్తి చేశాడు. అయితే పటీదార్ దూకుడుకు ఉనాద్కట్ 13వ ఓవర్‌లో తెర దించాడు. ఫుల్ టాస్ బంతిని ఆడిన పటీదార్ డీప్ స్క్వేర్‌లో సమద్‌కు క్యాచ్ ఇవ్వడంతో మూడో వికెట్‌కు 65 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మరోవైపు 37 బంతుల్లో హాఫ్ సెంచరీ చేసిన విరాట్ మధ్య ఓవర్లలో పూర్తిగా నెమ్మదించాడు. ఆరో ఓవర్‌లో సిక్సర్ బాదాక.. 15వ ఓవర్‌లో అతను అవుటయ్యే వరకు కూడా మరో బౌండరీ సాధించలేకపోయాడు. ఉనాద్కట్ అతడి వికెట్ తీయగా.. తన తర్వాతి ఓవర్‌లోనే లొమ్రోర్ (7)ను సైతం పెవిలియన్‌కు చేర్చాడు. గ్రీన్ మాత్రం ధాటిని కనబరుస్తూ 19వ ఓవర్‌లో మూడు ఫోర్లతో 15 రన్స్ అందించాడు. కానీ భీకర ఫామ్‌లో ఉన్న దినేశ్ కార్తీక్ (11) అదే ఓవర్‌లో వెనుదిరిగాడు. చివరి ఓవర్‌లో స్వప్నిల్ (12) 6,4తో 12 పరుగులు వచ్చాయి.

స్కోరుబోర్డు

బెంగళూరు: కోహ్లీ (సి) సమద్ (బి) ఉనాద్కట్ 51, డుప్లెసి (సి) మార్‌క్రమ్ (బి) నటరాజన్ 25, జాక్స్ (బి) మార్కండే 6, పటీదార్ (సి) సమద్ (బి) ఉనాద్కట్ 50, గ్రీన్ (నాటౌట్) 37, లోమ్రోర్ (సి) కమిన్స్ (బి) ఉనాద్కట్ 7, కార్తీక్ (సి) సమద్ (బి) కమిన్స్ 11, స్వప్నిల్ (సి) అభిషేక్ (బి) నటరాజన్ 12, **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 20 ఓవర్లలో 206/7; వికెట్ల పతనం:** 1-48, 2-65, 3-130, 4-140, 5-161, 6-193, 7-206; **బౌలింగ్:** అభిషేక్ 1-0-10-0, భువనేశ్వర్ 1-0-14-0, కమిన్స్ 4-0-55-1, నటరాజన్ 4-0-39-2, షాబాజ్ 3-0-14-0, మార్కండే 3-0-42-1, ఉనాద్కట్ 4-0-30-3.

సన్‌రైజర్స్: అభిషేక్ (సి) కార్తీక్ (బి) యశ్ దయాల్ 31, హెడ్ (సి) కర్ణ్ శర్మ (బి) జాక్స్ 1, మార్‌క్రమ్ (ఎల్బీ) స్వప్నిల్ 7, నితీశ్ కుమార్ (బి) కర్ణ్ శర్మ 13, క్లాసెన్ (సి) గ్రీన్ (బి) స్వప్నిల్ 7, షాబాజ్ (నాటౌట్) 40, సమద్ (సి అండ్ బి) కర్ణ్ శర్మ 10, కమిన్స్ (సి) సిరాజ్ (బి) గ్రీన్ 31, భువనేశ్వర్ (సి) సిరాజ్ (బి) గ్రీన్ 13, ఉనాద్కట్ (నాటౌట్) 8, **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 20 ఓవర్లలో 171/8; వికెట్ల పతనం:** 1-3, 2-37, 3-41, 4-56, 5-69, 6-85, 7-124, 8-141; **బౌలింగ్:** జాక్స్ 2-0-23-1, సిరాజ్ 4-0-20-0, యశ్ దయాల్ 3-0-18-1, స్వప్నిల్ 3-0-40-2, కర్ణ్ శర్మ 4-0-29-2, ఫెర్గూసన్ 2-0-28-0, గ్రీన్ 2-0-12-2.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	8	7	1	0	14	0.698
కోల్‌కతా	7	5	2	0	10	1.206
హైదరాబాద్	8	5	3	0	10	0.577
లఖ్‌నవూ	8	5	3	0	10	0.148
చెన్నై	8	4	4	0	8	0.415
ఢిల్లీ	9	4	5	0	8	-0.386
గుజరాత్	9	4	5	0	8	-0.974
ముంబై	8	3	5	0	6	-0.227
పంజాబ్	8	2	6	0	4	-0.292
బెంగళూరు	9	2	7	0	4	-0.721

గమనిక: ఆ: ఆడినవి; గె: గెలిచినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

జింబాబ్వే మాజీ క్రికెటర్ గై విట్టల్‌పై చిరుత దాడి




హరారే: జింబాబ్వే మాజీ ఆల్‌రౌండర్ గై విట్టల్ (51)పై చిరుతపులి దాడి చేసింది. దీంతో తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చేరిన అతడి తలకు సర్జరీ చేయగా, ప్రస్తుతం కోలుకుంటున్నాడు. హుమాని అటవీ ప్రాంతంలో విట్టల్ తన కుటుంబ సభ్యులతో కలిసి సఫారీ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నాడు. అక్కడే ట్రెక్కింగ్‌కు వెళ్లిన సమయంలో ఈ దాడి జరిగింది. అయితే అతడి పెంపుడు శునకం కూడా విట్టల్‌ను రక్షించే క్రమంలో గాయపడింది. విట్టల్‌ను, అతని శునకాన్ని హెలికాప్టర్‌లో ఆస్పత్రికి తరలించారు. కాగా 2013లో ఓ అడుగు ఎత్తు మాత్రమే ఉన్న తన మంచం కిందికి 8 అడుగుల మొసలి చేరి రాత్రంతా అక్కడే ఉన్నా విట్టల్ బతికిపోయాడు. విట్టల్ 1993-2003 మధ్య 46 టెస్టులు, 147 వన్డేలు ఆడాడు.

పసిడి పోరుకు ధీరజ్ టీమ్

సెమీస్‌లో జ్యోతి సురేఖ

షాంఘై: ఆర్చరీ వరల్డ్‌కప్ స్టేజ్-1లో తెలుగు కుర్రాడు ధీరజ్ బొమ్మదేవర నేతృత్వంలోని భారత పురుషుల రికర్వ్ జట్టు ఫైనల్ చేరి పతకాన్ని ఖాయం చేసుకోగా.. కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో జ్యోతి సురేఖ, ప్రియాన్ష్ సెమీస్‌కు దూసుకెళ్లారు. గురువారం జరిగిన రికర్వ్ టీమ్ సెమీస్‌లో ధీరజ్, ప్రవీణ్ జాదవ్, తరుణ్‌దీప్ త్రయం 5-1తో ఇటలీపై గెలిచింది. ఆదివారం జరిగే ఫైనల్లో కొరియాతో తలపడనుంది. కాగా, దీపిక, అంకిత, భజన్ కౌర్‌లతో కూడిన మహిళల జట్టు రెండో రౌండ్‌లో 3-5తో మెక్సికో చేతిలో ఓడింది. కాంపౌండ్ వ్యక్తిగత ఈవెంట్ క్వార్టర్స్ పోరులో జ్యోతిసురేఖ 143-142తో అవనీత్ కౌర్‌పై నెగ్గగా.. అదితి గోపీచంద్ 142-144తో బెసెర్రా (మెక్సికో) చేతిలో పరాజయం పాలైంది. పురుషుల క్వార్టర్స్‌లో బటుహాన్ అకావ్‌గ్లూ (టర్కీ)పై ప్రియాన్ష్ టైబ్రేకర్‌లో నెగ్గాడు.



ఒక్క పరుగూ ఇవ్వకుండా 7 వికెట్లు

రొహ్మాలియా ప్రపంచ రికార్డు

న్యూఢిల్లీ: ఇండోనేసియా బౌలర్ రొహ్మాలియా.. అంతర్జాతీయ టీ20 క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ గణాంకాలు (3.2-3-0-7) నమోదు చేసింది. బాలీ బాష్ మహిళల టీ20 సిరీస్‌లో మంగోలియాతో జరిగిన మ్యాచ్‌లో అరంగేట్రం స్పిన్నర్ రొహ్మాలియా 3.2 ఓవర్లలో ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా 7 వికెట్లు పడగొట్టింది. ఈ క్రమంలో నెదర్లాండ్స్ మహిళా క్రికెటర్ ఫ్రెడ్రిక్ ఓవర్డిజ్క్ (4-2-3-7) రికార్డును బద్దలు కొట్టింది. రొహ్మాలియా రికార్డు ఫీట్‌తో ఇండోనేసియా 127 పరుగుల తేడాతో మంగోలియాపై గెలిచింది.

స్విమ్మింగ్‌లో తీర్థుకు కాంస్యం



హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తీర్థు సామదేవ్ అంతర్జాతీయ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో రజత పతకంతో మెరిశాడు. కౌలాలంపూర్‌లో జరుగుతున్న మాలో మలేసియా ఇంటర్నేషనల్ స్విమ్మింగ్ పోటీల 1500 మీ. ఫ్రీస్టయిల్ రేస్‌ను తీర్థు 16ని.18.31సె.లలో పూర్తి చేసి మూడో స్థానం దక్కించుకున్నాడు. ఏపీకే చెందిన సంపత్ కుమార్ 16ని.33.75 సె. టైమింగ్‌తో నాలుగో స్థానంలో నిలిచాడు.

పాక్ మాజీ కెప్టెన్ బిస్మా అనూహ్య రిటైర్మెంట్



కరాచీ: పాకిస్థాన్ మహిళా క్రికెట్ జట్టు స్టార్ ఆల్‌రౌండర్ బిస్మా మరూఫ్ అనూహ్య నిర్ణయం తీసుకుంది. 32 ఏళ్ల ఈ మాజీ కెప్టెన్ అన్ని ఫార్మాట్లనుంచి రిటైరవుతున్నట్టు గురువారం ప్రకటించింది. ఎడమచేతి వాటం బ్యాటర్, లెగ్ స్పిన్నర్ మరూఫ్ 136 వన్డేలు, 140 టీ20లలో ప్రాతినిధ్యం వహించింది.

ధోనీ, జొకోలే స్ఫూర్తి!


గుకేష్‌కు ఘన స్వాగతం

చెన్నై: క్యాండిడేట్స్ చెస్ టైటిల్‌తో చరిత్ర సృష్టించిన టీనేజ్ గ్రాండ్ మాస్టర్ గుకేష్ దొమ్మరాజుకు స్వదేశంలో ఘన స్వాగతం లభించింది. గురువారం తెల్లవారు జామున 3 గంటలకు చెన్నై ఎయిర్‌పోర్టులో దిగిన గుకేష్‌కు తాను చదువుకున్న వేలమ్మాళ్ స్కూల్ విద్యార్థులు గార్డ్‌ఆఫ్ ఆనర్‌తో స్వాగతం పలికారు. గుకేష్ కోసం అతడి తల్లి పద్మ ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తూ కనిపించారు. కాగా తన కెరీర్‌ను తీర్చిదిద్దడంలో దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ పాత్ర ఎంతో ఉందని గుకేష్ చెప్పాడు. దిగ్గజాలు ధోనీ, నొవాక్ జొకోవిచ్‌ను తానెంతో అభిమానిస్తానని చెప్పాడు. ఎంతో ఒత్తిడిలో అత్యుత్తమ ప్రదర్శన చేసే వారిద్దరూ తనకు స్ఫూర్తి అని అన్నాడు.

బిజినెస్

రూ.404 లక్షల కోట్లు

సరికొత్త రికార్డు స్థాయికి స్టాక్ మార్కెట్ సంపద

మళ్లీ 74,000 పైకి సెన్సెక్స్... 22,550 ఎగువ స్థాయికి నిఫ్టీ

5 రోజుల్లో రూ.11 లక్షల కోట్లు పెరిగిన బీఎస్ఈ మార్కెట్ క్యాప్



ముంబై: స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా ఐదో రోజూ లాభాల్లో పయనించాయి. ఆసియా మార్కెట్ల బలహీన సంకేతాల కారణంగా గురువారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్, నిఫ్టీ మధ్యాహ్నం వరకు స్వల్ప లాభ, నష్టాల మధ్య ఊగిసలాడాయి. ఆ తర్వాత బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, లోహ రంగ షేర్లలో జోరుగా కొనుగోళ్లు జరగడంతో రివ్వున ఎగిశాయి. ఒక దశలో 718 పాయింట్ల వరకు ఎగబాకి 74,500 ఎగువ స్థాయిలో ట్రేడైన సెన్సెక్స్.. చివరికి 486.50 పాయింట్ల లాభంతో 74,339.44 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 167.95 పాయింట్ల వృద్ధితో 22,570.35 వద్ద ముగిసింది. గడిచిన ఐదు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 1,850.45 పాయింట్లు (2.55 శాతం) పుంజుకోగా.. ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.11.29 లక్షల కోట్లకు పైగా పెరిగి సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.404.18 లక్షల కోట్లకు (4.87 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 22 లాభపడగా.. యాక్సిస్ బ్యాంక్ షేరు 5.98 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. ఎస్‌బీఐ సైతం 5.10 శాతం పుంజుకుంది. జేఎస్‌డబ్ల్యూ స్టీల్, నెస్లే ఇండియా, సన్‌ఫార్మా, ఐటీసీ షేర్లు 2 శాతానికి పైగా పెరిగాయి. కాగా, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేరు అత్యధికంగా 10.85 శాతం క్షీణించింది. త్రైమాసిక ఆర్థిక ఫలితాలు నిరాశపర్చడంతో హెచ్‌యూఎల్ షేరు సైతం ఒక శాతానికి పైగా క్షీణించింది.

ఏడాది చివరినాటికి 25,800 స్థాయికి నిఫ్టీ!

ఈ ఏడాది చివరి నాటికి ఎన్ఎస్ఈ నిఫ్టీ సూచీ 25,800 స్థాయికి చేరుకోవచ్చని బ్రోకింగ్ సేవల సంస్థ ప్రభుదాస్ లీలాధర్ తాజా రిపోర్టులో అంచనా వేసింది. నిలకడైన ఆర్థిక విధానాలు, సాధారణ వర్షపాతం వంటి సానుకూల అంశాలు దేశంలో వినిమయ గిరాకీ వృద్ధికి ఊతమివ్వనున్నాయని నివేదికలో పేర్కొంది. ప్రస్తుతం నిఫ్టీ 22,570 స్థాయిలో ఉంది. ఈ డిసెంబరు చివరినాటికి సూచీ మరో 3,240 పాయింట్లు (14.35 శాతం) మేర వృద్ధి చెందవచ్చని ప్రభుదాస్ లీలాధర్ భావిస్తున్నది. "ఈమధ్యనే నిఫ్టీ సరికొత్త జీవితకాల గరిష్ఠాన్ని తాకింది. కానీ, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ముడిచమురు ఇతర కమోడిటీ ధరల్లో తీవ్ర హెచ్చుతగ్గులు, అమెరికా వడ్డీ రేట్ల తగ్గింపు జాప్యం కావచ్చన్న అంచనాల కారణంగా సూచీ 4 శాతం మేర క్షీణించింద"ని బ్రోకింగ్ సంస్థ పేర్కొంది.

కోటక్ బ్యాంక్ షేరు ధమాల్

రూ.40,000 కోట్లు తరిగిన బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్

అత్యంత విలువైన బ్యాంక్‌ల్లో ఐదో స్థానానికి జారిన కోటక్

ఆర్‌బీఐ ఆంక్షల ఫలితంగా గురువారం కోటక్ మహీంద్రా బ్యాంక్ షేరు ధర బీఎస్ఈలో ఒక దశలో 12.10 శాతం పతనమై సరికొత్త ఏడాది కనిష్ఠ స్థాయి రూ.1,620 వద్దకు జారుకుంది. చివరికి 10.85 శాతం నష్టంతో రూ.1,643 వద్ద ముగిసింది. దాంతో బ్యాంక్ మార్కెట్ విలువ (క్యాపిటలైజేషన్) ఒక్క రోజులోనే రూ.39,768.36 కోట్ల మేర తరిగిపోయి రూ.3.26 లక్షల కోట్లకు పరిమితమైంది. సెన్సెక్స్ నమోదిత కంపెనీల్లో కోటక్ బ్యాంక్ షేరు టాప్ లూజర్‌గా మిగిలింది. అంతేకాదు, మార్కెట్ విలువపరంగా దేశంలోని అతిపెద్ద బ్యాంక్‌ల్లో ఐదో స్థానానికి జారుకుంది. యాక్సిస్ బ్యాంక్ నాలుగో స్థానానికి ఎగబాకింది. త్రైమాసిక ఆర్థిక ఫలితాల జోరుతో యాక్సిస్ బ్యాంక్ షేరు ఆరు శాతం వరకు వృద్ధి కనబరిచింది. దాంతో బ్యాంక్ మార్కెట్ విలువ రూ.19,696 కోట్ల మేర పెరిగి రూ.3.48 లక్షల కోట్లకు చేరుకుంది. కోటక్ మహీంద్రా బ్యాంక్ కొత్త క్రెడిట్ కార్డులు జారీ చేయకుండా ఆర్‌బీఐ బుధవారం నిషేధం విధించింది. అలాగే, ఆన్‌లైన్, మొబైల్ బ్యాంకింగ్ ద్వారా బ్యాంక్ కొత్త ఖాతాదారులను చేర్చుకోకుండా వేటు వేసింది. బ్యాంక్ ఐటీ మౌలిక వ్యవస్థలపై సరైన పర్యవేక్షణ లేకపోవడం, బ్యాంక్ వృద్ధి రేటుకు అనుగుణంగా నియంత్రణలు లేకపోవడంతో ఖాతాదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు చేపట్టినట్లు ఆర్‌బీఐ తెలిపింది.

స్విగ్గీ రూ.10,400 కోట్ల ఐపీఓ

ఆన్‌లైన్‌లో ఆహారం, కిరాణా సరుకుల బుకింగ్, డెలివరీ సేవలందించే స్విగ్గీ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు వచ్చేందుకు వాటాదారుల నుంచి గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఐపీఓ ద్వారా రూ.10,414 కోట్ల వరకు సమీకరించే ప్రతిపాదనకు ఈ నెల 23న నిర్వహించిన అసాధారణ సమావేశం (ఈజీఎం)లో ప్రత్యేక తీర్మానం ద్వారా ఈ ప్రతిపాదనకు వాటాదారుల నుంచి ఆమోదం పొందినట్లు తెలిసింది. ఐపీఓలో రూ.3,750 కోట్ల తాజా ఈక్విటీ జారీ చేయడంతో పాటు రూ.6,664 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించాలని కంపెనీ భావిస్తోందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. 2014లో బెంగళూరు కేంద్రంగా ప్రారంభమైన స్విగ్గీ ప్రస్తుతం 1,270 కోట్ల డాలర్ల (రూ.1.06 లక్షల కోట్లు) స్థాయి మార్కెట్ విలువను కలిగి ఉంది.

సైయెంట్ లాభం రూ.173 కోట్లు

సైయెంట్ డీఈటీ (డిజిటల్, ఇంజనీరింగ్, టెక్నాలజీ).. మార్చితో ముగిసిన త్రైమాసికంలో రూ.1,489 కోట్ల ఆదాయంపై రూ.173 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే ఆదాయం స్వల్పంగా 2.8 శాతం పెరగగా లాభం మాత్రం 9.1 శాతం వృద్ధి చెందింది. అంతర్జాతీయంగా సవాళ్లు ఉన్నప్పటికీ నిలకడైన వృద్ధిని నమోదు చేసినట్లు సైయెంట్ పేర్కొంది. కాగా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను రూ.5,911 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.689 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసినట్లు తెలిపింది.

లారస్ ల్యాబ్స్ లాభంలో 26% వృద్ధి

మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో రూ.76 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్లు లారస్ ల్యాబ్స్ ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే లాభం 26 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ మొత్తం ఆదాయం కూడా 4 శాతం వృద్ధితో రూ.1,440 కోట్లుగా నమోదైంది. కొవిడ్ సంబంధిత ఉత్పత్తుల కొనుగోలు ఆర్డర్లు తగ్గుముఖం పట్టినప్పటికీ సంస్థకు చెందిన అన్ని వ్యాపార డివిజన్లు నిలకడైన పనితీరును కనబరచటం ఎంతగానో కలిసివచ్చిందని లారస్ ల్యాబ్స్ సీఈఓ సత్యనారాయణ చావా తెలిపారు. ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో ఒక్కో షేరుకు 40 పైసల మధ్యంతర డివిడెండ్‌ను బోర్డు సిఫారసు చేసింది. కాగా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను రూ.5,041 కోట్ల ఆదాయంపై రూ.161 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసినట్లు కంపెనీ వెల్లడించింది.


కోరమాండల్ లాభంలో భారీ క్షీణత

గడచిన ఆర్థిక సంవత్సరం (2023-24) నాలుగో త్రైమాసికంలో కోరమాండల్ ఇంటర్నేషనల్ లాభం 33 శాతం క్షీణించి రూ.163.91 కోట్లుగా నమోదైంది. 2022-23 ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో లాభం రూ.246.44 కోట్లుంది. ఆదాయంలో క్షీణతే లాభాలు తగ్గడానికి కారణమని కంపెనీ తెలిపింది. కాగా మొత్తం ఆదాయం కూడా రూ.2012.93 కోట్ల నుంచి రూ.1640.64 కోట్లకు దిగజారింది. మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో నికర లాభం రూ.5,522.68 కోట్ల నుంచి రూ.3,996.25 కోట్లకు, ఆదాయం రూ.29,799.03 కోట్ల నుంచి రూ.22,289.75 కోట్లకు పడిపోయాయి. కాగా కోరమాండల్ ఇంటర్నేషనల్ చైర్మన్ పదవి నుంచి ఏ వెల్లాయన్ తప్పుకున్నారు. ఈ నెల 25న వెల్లాయన్ పదవీ విరమణ చేసినట్లు కంపెనీ తెలిపింది. ఆయన స్థానంలో అరుణ్ అలగప్పన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా నియమితులయ్యారు. అయితే వెల్లాయన్ ఈ నెల 26 నుంచి కంపెనీ చైర్మన్ ఎమిరెటస్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తారని తెలిపింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.ల్లో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,270 ▼	66,250 ▼	86,000 ▼
ముంబై	72,094 ▲	66,038 ▲	80,898 ▲



ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

26వ తేదీ

హైదరాబాద్	350	విజయవాడ	380
వరంగల్	352	గోదావరి	380
చిత్తూరు	453	విశాఖపట్నం	400
		డజను గుడ్లు రూ.60	



ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	123	గోదావరి	129
వరంగల్	123	విజయవాడ	129
కరీంనగర్	123	గుంటూరు	133
మహబూబ్‌నగర్	123	ఒంగోలు	133
కర్నూలు	123	చిత్తూరు	125
విశాఖపట్నం	121		

స్ట్రీమింగ్ బిజినెస్‌లో రిలయన్స్ విప్లవం

నెలకు రూ.29కే రిలయన్స్ సినిమా

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ తీరే వేరు. కారు చౌకగా సేవలు ప్రారంభించి మార్కెట్‌ను కైవసం చేసుకోవడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. రిలయన్స్ జియో ద్వారా టెలికాం రంగంలో విప్లవం సృష్టించిన అంబానీ దృష్టి ఇప్పుడు స్ట్రీమింగ్ బిజినెస్‌పై పడింది. నెలకు రూ.29 చందాతో ఖాతాదారులు జియో సినిమా ప్రీమియం సేవలు పొందవచ్చని జియో సినిమా మాతృసంస్థ వయాకామ్18 ప్రకటించింది. అంటే రోజుకు రూపాయి కంటే తక్కువ ధరకే జియో సినిమా ప్రీమియం చందాదారులు బాలీవుడ్, టాలీవుడ్, హాలీవుడ్‌తో సహా అనేక భాషల సినిమాలు, టీవీ షోలు ప్రకటనల తలనొప్పి లేకుండా తమకు ఇష్టమైన ఒక డివైస్‌లో చూడవచ్చు. అదే రూ.89తో ఫ్యామిలీ ప్యాక్ తీసుకుంటే నాలుగు డివైసెస్‌లో చూడవచ్చు.

టెక్ మహీంద్రా లాభం రూ.661 కోట్లు

న్యూఢిల్లీ: ఐటీ సర్వీసుల కంపెనీ టెక్ మహీంద్రా కన్సాలిడేటెడ్ లాభం 2023-24 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం (క్యూ4)లో భారీగా క్షీణించింది. 2022-23 క్యూ4తో పోల్చితే లాభం 41 శాతం క్షీణించి రూ.1,117.7 కోట్ల నుంచి రూ.661 కోట్లకు పడిపోయింది. కంపెనీ క్యూ4 ఆదాయం కూడా 6.2 శాతం తగ్గుదలతో రూ.12,871 కోట్లకు దిగివచ్చింది. మార్చి 31వ తేదీతో ముగిసిన ఏడాదిలో కూడా కన్సాలిడేటెడ్ లాభం 51.2 శాతం తగ్గి రూ.2,358 కోట్లుగా నమోదైంది. ఇదే కాలంలో మొత్తం ఆదాయం సైతం 2.4 శాతం క్షీణించి రూ.51,996 కోట్లకు దిగివచ్చింది. అయితే ఐటీపై క్లయింట్ల వ్యయాలు పెరుగుతాయన్న అంచనాతో ఈఏడాది మెరుగైన ఆదాయాలు సాధించగలమని భావిస్తున్నట్టు కంపెనీ సీఈఓ మోహిత్ జోషి చెప్పారు.

రూ.700 కోట్లతో దివీస్ విస్తరణ

హైదరాబాద్ కేంద్రంగా పని చేసే ఫార్మా దిగ్గజం దివీస్ లేబొరేటరీస్ తన ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత విస్తరిస్తోంది. ఇందుకోసం రూ.700 కోట్లతో ప్రత్యేక యూనిట్ ఏర్పాటు చేస్తోంది. 2027 జనవరి నాటికి ఈ యూనిట్ ఉత్పత్తి ప్రారంభిస్తుందని కంపెనీ తెలిపింది. ఒక ఖాతాదారుడితో కుదిరిన దీర్ఘకాలిక సరఫరా ఒప్పందం షరతులు నెరవేర్చేందుకు ఈ విస్తరణ చేపడుతున్నట్టు తెలిపింది. అయితే ఆ ఖాతాదారుడి పేరు గానీ, ఏ ఉత్పత్తిని ఎంత కాలం ఆ ఖాతాదారుడికి సరఫరా చేస్తారు? అనే వివరాలను మాత్రం కంపెనీ వెల్లడించలేదు. ఈ విస్తరణ ప్రాజెక్టుకు అవసరమైన రూ.700 కోట్లను అంతర్గత వనరుల ద్వారా సమకూర్చుకుంటామని దివీస్ ల్యాబ్స్ తెలిపింది.

తగ్గిన ఒలెక్ట్రా గ్రీన్ టెక్ లాభం

ఒలెక్ట్రా గ్రీన్‌టెక్.. మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన రూ.282.74 కోట్ల ఆదాయంపై రూ.11.67 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో కంపెనీ మొత్తం ఆదాయం రూ.369.23 కోట్లుగా ఉండగా లాభం రూ.27.80 కోట్లుగా ఉంది. కాగా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరాని (2023-24)కి గాను కంపెనీ రూ.1,126.19 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.73.64 కోట్ల లాభాన్ని నమోదు చేసింది.

నెస్లేతో డాక్టర్ రెడ్డీస్ జేవీ

హైదరాబాద్: బ్రాండెడ్ పోషకాహార ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం నెస్లే ఇండియా-డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ ఒక జాయింట్ వెంచర్ (జేవీ) కంపెనీని ఏర్పాటు చేస్తున్నాయి. ఈ మేరకు రెండు కంపెనీల మధ్య ఒక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం నెస్లే హెల్త్‌సైన్స్ కంపెనీకి చెందిన ఎంపిక చేసిన కొన్ని బ్రాండెడ్ పోషకాహార ఉత్పత్తులు, డాక్టర్ రెడ్డీస్‌కు చెందిన ఎంపిక చేసిన కొన్ని బ్రాండెడ్ పోషకాహార ఉత్పత్తులను ఈ భాగస్వామ్య సంస్థ భారత్ సహా మరికొన్ని ఇతర దేశాల్లో మార్కెట్ చేస్తుంది.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
శుక్రవారం | 26-4-2024
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Vijayawada | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

ముగిసిన నామినేషన్ల పర్వం

175 అసెంబ్లీ స్థానాలకు 5,751

25 ఎంపీ స్థానాలకు 1,070 దాఖలు

నేటి నుంచి నామినేషన్ల పరిశీలన

29 వరకు ఉపసంహరణకు చాన్స్



కుప్పంలో పార్థసారథిరెడ్డి అనే స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ ఫీజు కోసం చెల్లించిన చిల్లర నాణేలు

6

మంత్రా మజాకా!

ఎన్నికల ముందు సిఫారసుల బది'లీలలు'

653 మంది టీచర్ల అక్రమ బదిలీలకు ఓకే

వారి జీతాల కోసం ర్యాటిఫికేషన్ ఉత్తర్వులు

అంతకుముందు మరో 600 మంది బదిలీ

ఒక్కో బదిలీకి రూ.4 నుంచి రూ.5 లక్షలు

ఎన్నికలకు ముందు భారీగా దోచేసిన మంత్రి

రూ.50 కోట్ల మేర దండుకున్న వైనం



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'మా ప్రభుత్వంలో అక్రమాలకు చోటు లేదు. అంతా పారదర్శకమే. అసలు అవినీతి ఊసే ఉండదు..' వైసీపీ ప్రభుత్వంలోని ఓ సీనియర్ మంత్రి తరచూ వల్లెవేసే నీతి వాక్యాలివి.! ఆయన మాటలు వింటే.. అంతా నిబంధనల ప్రకారమే చేస్తారు కాబోలు అని అందరూ భ్రమపడతారు. ఏదైనా సిఫారసు బదిలీ కావాలని ఆయన వద్దకు వెళ్లాలన్నా జంకుతారు. అయితే ఇదంతా పైకి కనిపించేది మాత్రమే. ఏ నోటితో అయితే అంతా పారదర్శకం అన్నారో ఆయన ఇచ్చిన మౌఖిక ఆదేశాలతోనే పాఠశాల విద్యాశాఖ అడ్డగోలు బదిలీలు చేసింది. అది కూడా ఒకటి.. రెండు కాదు ఏకంగా 1,200 మంది టీచర్లను సాధారణ బదిలీల అనంతరం అక్రమంగా బదిలీ చేసింది. ఒక్కో అక్రమ బదిలీకి

మిగతా 3వ పేజీలో...



జేఈఈలో తెలుగు విద్యార్థుల సత్తా

100 పర్సంటైల్ సాధించిన 56 మందిలో 22 మంది తెలుగు రాష్ట్రాల అభ్యర్థులే

15 మందిది తెలంగాణ, ఏడుగురిది ఏపీ

మహారాష్ట్ర అభ్యర్థులకు 1, 2 ర్యాంకులు

పల్నాడు అభ్యర్థి అనూప్‌కు 6వ ర్యాంకు

సిక్కోలు విద్యార్థి సతీష్‌కు 8వ ర్యాంకు

5 విభాగాల్లో 24 మంది టాపర్లు మనోళ్లే

జనరల్ క్యాటగిరీలో 40 మందికి 12 మంది

ఈడబ్ల్యూఎస్‌లో టాపర్లు అందరు కూడా..

జేఈఈ మెయిన్ సెషన్ 2 ఫలితాలు విడుదల

మే 26న అడ్వాన్స్‌డ్ పరీక్ష

అమరావతి/హైదరాబాద్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్‌లో తెలుగు రాష్ట్రాల విద్యార్థులు సత్తాచాటారు. అత్యుత్తమ మార్కులతో జాతీయస్థాయిలో మెరిశారు. ఈ నెల 4 నుంచి 12 తేదీల్లో నిర్వహించిన సెషన్-2(పేపర్-1 బీఈ, బీటెక్) పరీక్ష ఫలితాలను జాతీయ పరీక్షా సంస్థ(ఎన్‌టీఏ) గురువారం విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 10.67 లక్షల మంది రాసిన ఈ పరీక్షలో 56 మంది 100 పర్సంటైల్ సాధించగా, వీరిలో 22 మంది తెలుగు రాష్ట్రాలకు చెందిన వారే. వీరిలో తెలంగాణ నుంచి 15 మంది, ఏపీ నుంచి ఏడుగురు ఉన్నారు. అయితే.. తొలి రెండు(1, 2) ర్యాంకులు మహారాష్ట్రకు చెందిన నిర్మల్‌కుమార్, సంజయ్ విఙ్రా దక్కించుకున్నారు. కాగా, ఈడబ్ల్యూఎస్ విభాగంలో ఆరుగురు మాత్రమే 100 పర్సంటైల్ సాధించారు. వీరంతా తెలుగు వారే. తెలంగాణ నుంచి నలుగురు, ఏపీ నుంచి ఇద్దరున్నారు. జనరల్ విభాగంలో మొత్తం 3,77,921 మంది పరీక్ష రాయగా 40 మంది 100 పర్సంటైల్ సాధించారు. వీరిలో తెలంగాణ నుంచి 9, ఏపీ నుంచి ముగ్గురు.. విద్యార్థులు ఉన్నారు. ఓబీసీ నాన్ క్రీమీలేయర్ (ఎన్‌సీబీ) విభాగంలో మొత్తం 10 మంది 100 పర్సంటైల్

మిగతా 6వ పేజీలో...

పథకాలు పీకేసి.. దళితులకు దగా చేసి..

జగన్ పాలనలో 23 పథకాలు దూరం

విద్యకు సంబంధించే 10 నిర్వీర్యం

చాలా పెద్ద తప్పు చేశాం

చంద్రబాబును కాదనుకుని జగన్‌ను తెచ్చుకున్నాం

'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో పెన్షనర్స్ పార్టీ అధ్యక్షుడు

'ఎస్మా'సురుడు



8 9

సమగ్ర కథనాలు నేటి 'జన కేతనం'లో..

మలి దశ ఎవరిదో?

13 రాష్ట్రాల్లోని 88 స్థానాలకు నేడు పోలింగ్

కేరళలోని మొత్తం ఇరవై సీట్లకూ ఓటింగ్

కర్ణాటకలో 14, రాజస్థాన్‌లో 13, మహారాష్ట్ర, యూపీల్లో 8, మధ్యప్రదేశ్‌లో 7 స్థానాలు

4

బీజేపీకి గట్టి పోటీ తప్పదంటున్న విశ్లేషకులు

రాహుల్, థరూర్ సహా బరిలో ప్రముఖులు

కేరళ తీర్పు.. వయా వయనాడ్

జాతీయ స్థాయిలో కాంగ్రెస్, లెఫ్ట్ దోస్తీ.. ఇక్కడ కుస్తీ

వయనాడ్ నుంచి పోటీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్

ప్రత్యర్థిగా సీపీఐ జాతీయ కార్యదర్శి రాజా భార్య సవాల్

తిరువనంతపురంలో థరూర్‌పై కేంద్ర మంత్రి రాజీవ్

4

అలప్పుళ బరిలో మరో కీలక నేత కేసీ వేణుగోపాల్

స్టీల్‌ప్లాంట్ భూములు, ఆస్తులపై యథాతథ స్థితి పాటించండి



కేంద్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ప్రైవేటీకరిస్తున్నాం.. మూసివేయడం లేదు

అదనపు సొలిసిటర్ జనరల్ వివరణ

విచారణ జూన్ 19కి వాయిదా

3

స్టీల్ ప్లాంట్ ప్రయోజనాలు పరిరక్షించడం ముఖ్యం

బొగ్గు నిల్వల ఓడను విశాఖ పోర్టుకు మళ్లించండి

అదానీ పోర్టు యాజమాన్యానికి హైకోర్టు ఆదేశం

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మరో బీభత్సం...!

రెండువందలరోజులు దాటిన గాజాయుద్ధం మరో బీభత్స కాండదిశగా అడుగులువేస్తున్నది. దక్షిణప్రాంత నగరమైన రాఫా లోపలకు ఇజ్రాయెల్ సైన్యం ఏ క్షణమైనా చొరబడవచ్చు. కొద్ది రోజులుగా రాఫా నగరంమీద జరుగుతున్న వైమానికదాడులు గురువారం మరింత తీవ్రమైనాయని, ఈజిప్టుతో సరిహద్దులు పంచుకుంటున్న ఈ నగరంనుంచి ప్రజలను వెళ్ళగొట్టే ప్రయత్నాలు జోరందుకున్నాయని వార్తలు వస్తున్నాయి. ఒకప్పుడు మూడులక్షలమంది జనాభా ఉండే రాఫానగరం ఇజ్రాయెల్ దమనకాండ ఆరంభమైన తరువాత శరణార్థులుగా తరలివచ్చిన మరో పదిలక్షలమందితో కలిసి క్రిక్కిరిసిపోతున్నది. పదమూడులక్షలమందికి కాస్తోకూస్తో నీడనిస్తున్న ఈ నగరంలోకి ఇజ్రాయెల్ సైన్యం ప్రవేశిస్తే ఆ బీభత్సం ఊహకు అందనిది. రాఫాలో చొచ్చుకుపోయేందుకు సైన్యం సర్వసన్నద్ధంగా ఉన్నదని, అది సమధికోత్సాహంతో ఎదురుచూస్తున్న ఆదేశాలు ఏ క్షణాన్నయినా వెలువడవచ్చునని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమీన్ నెతన్యాహూ అధికార ప్రతినిధి అంటున్నారు.

రాఫా దాడికి వ్యతిరేకంగా ఈజిప్ట్ ఏవో హెచ్చరికలు చేస్తున్నది కానీ, నెతన్యాహూ వీటిని లక్ష్యపెట్టే అవకాశాలు ఎంతమాత్రం లేవు. ఇప్పటివరకూ ఇజ్రాయెల్ గ్రౌండ్ ఆపరేషన్స్ చేపట్టని కీలకమైన నగరం ఇదే. హమాస్ ఉగ్రవాదులు తలదాచుకున్నారన్న ఆరోపణతో మిగతానగరాలను నాశనం చేయడం, జల్లెడపట్టడం పూర్తిచేసిన ఇజ్రాయెల్‌కు రాఫానగరంమీద చాలా అనుమానాలున్నాయి. నాలుగు హమాస్ బెటాలియన్లకు ఈ నగరం స్థావరమని, వీరికితోడు ఆర్నెల్ల యుద్ధంలో వేర్వేరు ప్రాంతాలనుంచి పారిపోయివచ్చిన వేలాదిమంది హమాస్ ఫైటర్లు ఇక్కడే తలదాచుకుంటున్నారని ఇజ్రాయెల్ వాదిస్తోంది. హమాస్ అపహరించుకుపోయిన ఇజ్రాయెలీలను విడిపించుకోవాలంటే ఈ నగరాన్ని జల్లెడపట్టాల్సిందేనని అంటోంది. హమాస్‌ను నాశనం చేయడం పేరిట ఈ ఆర్నెల్లకాలంలో ఇజ్రాయెల్ ఎంత అమానుషంగా వ్యవహరించిందో తెలుసు. పక్షంరోజుల క్రితం దక్షిణ గాజానుంచి ఇజ్రాయెల్ వ్యూహాత్మక అవసరాల రీత్యా సైన్యాన్ని ఉపసంహరించుకున్న తరువాత, అక్కడ అది పాల్పడిన అరాచకాలు ఇప్పుడు వెలుగుచూస్తున్నాయి. ఇజ్రాయెల్ సైన్యం ప్రజలను చంపివేసి, సామూహికంగా ఖననం చేసిన ప్రాంతాలను పాలస్తీనా అధికారులు గత కొద్దిరోజులుగా తవ్వితీస్తున్నారు. ఖాన్ యూనిస్ ప్రాంతంలోని నాసర్ ఆస్పత్రి ప్రాంగణంలో నాలుగువందల మృతదేహాలు బయటపడ్డాయి. రోగులని కూడా చూడకుండా చిత్రహింసలు పెట్టి వారిని చంపివేశారని, కొందరి చేతులు కాళ్ళు కట్టివేశారని పాలస్తీనా అధికారులు ఆరోపిస్తున్నారు. గాజా సిటీలోని అతిపెద్ద ప్రధాన ఆస్పత్రి అల్ షిఫా ప్రాంగణంలోనూ సజీవంగా ఖననమైన పాలస్తీనియన్ల మృతదేహాలు బయటపడ్డాయి.

ఇవన్నీ అసత్యప్రచారాలని ఇజ్రాయెల్ కొట్టిపారేస్తున్నప్పటికీ, చిన్నపిల్లల మృతదేహాలు కూడా అక్కడ బయటపడటం ఇజ్రాయెల్ అరాచకాలకు పరాకాష్ట. రోగులు, వైద్యుల ముసుగులో హమాస్ ఉగ్రవాదులు తిరుగుతున్నారని, ఆసుపత్రుల నేలమాళిగల్లో వారి ఆయుధనిల్వలున్నాయని ఆరోపిస్తూ వాటిని నేలమట్టం చేసిన ఇజ్రాయెల్ రోగుల పట్ల కూడా ఎంత అమానుషంగా వ్యవహరించిందో ఈ ఉదంతాలు చెబుతున్నాయి.

అక్టోబర్ ఏడునుంచి మొదలైన ఈ పాశవిక, ప్రతీకార దాడిలో హమాస్ ఎంతగా దెబ్బతిన్నదో తెలియదు కానీ, ముప్పైఐదువేలమంది పాలస్తీనియన్ల ప్రాణాలు తీసింది ఇజ్రాయెల్. మరో డెబ్బయ్ ఐదువేలమంది క్షతగాత్రులైనారు. 23లక్షలమంది జనాభా గల గాజానుంచి 85శాతంమంది తరలిపోయి అది మరుభూమిగా మిగిలింది. చివరకు శరణార్థులకు అన్నం కూడా దక్కనివ్వకుండా, వారంతా ఆకలితో మరణించేట్టుగా ఇజ్రాయెల్ కుట్రకు పాల్పడింది. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోని యుఎన్ఆర్‌డబ్ల్యూఏలో కొందరు ఉద్యోగులు ఇజ్రాయెల్‌పై హమాస్ జరిపిన దాడికి సహకరించారని ఆరోపించి, అమెరికా సహా పదహారు దేశాలతో సదరు సంస్థకు విరాళాలు దక్కకుండా చేసింది. కానీ, ఆ ఆరోపణలన్నీ అబద్ధాలని ఇటీవల తేలిపోయింది. ఇజ్రాయెల్‌మీద అలిగినట్టుగా, ఆగ్రహించినట్టుగా నటిస్తూనే దానిని ఆయుధాలతో ఆదుకుంటున్న అమెరికా అద్భుతమైన నాటకాన్ని ప్రదర్శిస్తోంది. భద్రతామండలిలో ఇజ్రాయెల్ వ్యతిరేక తీర్మానాలకు అడ్డుతగులుతూ, అది తనకు నచ్చిన రీతిలో ఊచకోతలు కోసేందుకు వీలుకల్పిస్తోంది. ఇజ్రాయెల్ జీనోసైడ్‌కు పాల్పడుతున్నదని అంతర్జాతీయ న్యాయస్థానం అప్పట్లో నేరుగా అనలేదు కానీ, జరుగుతున్నది అదే. రఫాలోకి ఇజ్రాయెల్ సేనలు అడుగుపెట్టినపక్షంలో అక్కడ జరగబోయేది ఊహకు కూడా అందనంత ఘోరంగా ఉంటుంది.

వ్యర్థ జలాలు – జలభద్రత

నీరు నీరు వంకకే పారుతుంది... ఇది మన ఇంగిత జ్ఞానం. నీరు నీటికే చేరాలిగాని వ్యర్థమై పోకూడదు అనేది నేడు మనం నేర్చుకోవాల్సిన ఒక ఆవశ్యక పాఠం.

స్వచ్ఛమైన నీరు మనకు అందుబాటులో లేకపోతే మన ఆరోగ్యం దెబ్బ తింటుంది, జీవితం దుర్భరమవుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దశాబ్దాలుగా గ్రామీణ ప్రజలకు పరిశుభ్రమైన మంచినీటిని సమకూర్చేందుకు శతథా ప్రయత్నిస్తున్నాయి. వాస్తవంలో జరుగుతున్నదేమిటి? నీటి సరఫరా సదుపాయాలు గ్రామాలకు సమకూరుతున్నా గ్రామస్తులకు నీరు అందుబాటులో లేని గ్రామాలు పెద్ద సంఖ్యలో ఉంటున్నాయి. ఎందుకిలా జరుగుతోంది? నీటి సరఫరా అనేది కేవలం పైప్‌లైన్స్‌ల నిర్మాణ వ్యవహారం మాత్రమే కాదు, సరఫరా వ్యవస్థకు మూలమైన జలవనరు నిరంతరాయంగా నీటిని సమకూర్చేదిగా ఉండేలా మనం జాగ్రత్తపడాల్సిన అవసరమున్నది. నీటి సరఫరా సదుపాయాలు ఉండవచ్చు. అయితే సరఫరాకు మూలమైన జలవనరు ఎండిపోయినా, కలుషితమయినా నీటి పంపిణీ యంత్రాంగం నిరుపయోగమైపోతుంది.



■ సునీతా నారాయణ్

మట్టివాసన

నీటి సరఫరా వ్యవస్థ నిరంతరం పని చేసేలా చూడడం, ముఖ్యంగా సరఫరాకు ప్రధాన ఆధారమైన జలవనరు శాశ్వతంగా ఉండేలా చేయడమనేది చాలా అవసరం. ఇందుకు చేపడుతున్న చర్యలు లోపభూయిష్టంగా ఉంటున్నాయి. భారత ప్రభుత్వ జల్ జీవన్ మిషన్ (జెజెఎమ్) ఈ మౌలిక లోపాన్ని గుర్తించి, దాన్ని తొలగించేందుకు ప్రాధాన్యమిచ్చింది. పైప్‌లు, ట్యాప్‌ల ద్వారా నీరు నిరంతరం ప్రవహించేలా చేయడమే జెజెఎమ్ లక్ష్యంగా ఉన్నది. ప్రతి గృహంలోనూ ట్యాప్ నేర్పాటు చేయడమే కాకుండా, ఆ ట్యాప్ అవిశ్రాంతంగా పని చేస్తుండడం అంటే నీటి సరఫరాను అన్ని వేళలా కొనసాగిస్తుండడమే జెజెఎమ్ అతి ముఖ్య లక్ష్యంగా ఉన్నది.

ఈ లక్ష్యం నెరవేరాలంటే జల వనరుల మన్నికను మెరుగుపరచడంపై దృష్టిని కేంద్రీకరించవలసి ఉన్నది. మరింత స్పష్టంగా చెప్పాలంటే కుంట, చెరువు, సరస్సు ఎట్టి పరిస్థితులలోను అక్రమ ఆక్రమణలకు గురికాకుండా జాగ్రత్తపడాలి. వాటర్ షెడ్ (సరస్సు, నది మొదలైన కేంద్ర స్థానాలకు నీరంతా ప్రవహించే భూభాగం) సురక్షితంగా ఉండాలి. నీటి వనరు నది, సరస్సు లేదా చెరువు ఏదైనప్పటికీ అది సదా పునశ్శక్తిమంతమవుతూ ఉండాలి. భూమిపై విసర్జించిన మల మూత్రాలు లేదా టాయ్‌లెట్లు, ట్యాప్‌లు ఉన్న గృహాలలో వినియోగించి వదిలివేసిన నీటి మూలంగా జలవనరులు కలుషితం కాకుండా ఉండాలి.

గృహావసరాలకు సరఫరా చేస్తున్న నీటిలో 80 శాతాన్ని వ్యర్థ జలంగా వదిలివేస్తున్నాం. ఇది విస్మరించలేని వాస్తవం. గ్రామీణ గృహాలలో కనిష్ఠ పరిమాణంలో నీటిని వినియోగించే టాయ్‌లెట్ల నిర్మాణానికే ప్రభుత్వాలు అమలుపరుస్తున్న పారిశుధ్య కార్యక్రమాలు ప్రాధాన్యమిస్తున్నాయి. వ్యర్థ జలంలో చాలా భాగం గ్రే వాటర్ (స్నానాలకు, బట్టలు ఉతకడానికి లేదా వంట పాత్రలు కడగడం మొదలైన పనులకు ఉపయోగించగా వెలువడిన నీరు). ఈ నీటిని వీధుల్లోకి వదిలివేయడం కద్దు. ఆ వ్యర్థ జలాలతో వీధుల్లో మడుగులు ఏర్పడుతాయి. అవి రోగ కారక క్రిములకు నెలవులై అంటువ్యాధులు ప్రబలడానికి కారణమవుతున్నాయి. అంతేకాకుండా ఆ నీటి మడుగులు, భూగర్భ జలాలు, ఉపరితల జలాలు కలుషితమయ్యేందుకు కూడా కారణమవుతున్నాయి. ఈ వ్యర్థ జలాలను సాగు ప్రయోజనాలకు ఉపయోగించడం లేదా భూగర్భ జలాలను పునశ్శక్తిమంతం (రీఛార్జ్) చేసేందుకు వినియోగించడమనేది చాలా ముఖ్యం. అప్పుడే నీటి సరఫరా నిరంతరాయంగా జరుగుతుంది. ఇది నీరు నీటికి చేరడమే. ఆ నీరు వ్యర్థమైపోదు.



నీటి సరఫరాను పారిశుధ్య, వ్యర్థ జల ఉత్పాదన వ్యవస్థతో అనుసంధానం చేయాలి. గృహావసరాలకు సరఫరా చేస్తున్న నీటిలో 80 శాతాన్ని వ్యర్థ జలంగా వదిలివేస్తున్నాం. ఈ వ్యర్థ జలాలను సాగు ప్రయోజనాలకు ఉపయోగించడం లేదా భూగర్భ జలాలను పునశ్శక్తిమంతం చేసేందుకు వినియోగించడమనేది చాలా ముఖ్యం. అప్పుడే నీటి సరఫరా నిరంతరాయంగా జరుగుతుంది.

నీటి సరఫరాను పారిశుధ్య, వ్యర్థ జల ఉత్పాదన వ్యవస్థతో అనుసంధానం చేయవలసి ఉన్నది. మనం నీటిని కలుషితం చేస్తున్నామంటే దానిని వృథా చేస్తున్నామన్న వాస్తవాన్ని అర్థం చేసుకోవాలి. నిజమేమిటంటే వ్యర్థ జలాలను సురక్షితంగా వదిలివేయడం జరగనంత వరకు టాయిలెట్ నిర్మాణ కార్యక్రమం పరిపూర్ణం కాదు. టాయిలెట్ గుంటలలోని మల పంకాన్ని అదే విసర్జన స్థలంలోనే శుద్ధి చేయాలి లేదా మలాన్ని సేకరించి శుద్ధికేంద్రాలకు తీసుకువెళ్లేందుకు అవసరమైన ఏర్పాట్లు ఉండాలి. అలా శుద్ధి చేసిన మలాన్ని నీరు లేదా నేల కలుషితం కాకుండా ఎరువుగా ఉపయోగించుకోవచ్చు. శుద్ధి చేసిన తరువాత దానిని నేలపై పునః ఉపయోగించాలి.

మనం తిన్న తరువాత విసర్జించే ఆహారమే మల పదార్థం. పోషకాలు సమృద్ధిగా ఉండే నత్రజని, భాస్వరాన్ని మన ఆహార వనరులు నేల నుంచి తీసుకుంటాయి. ఆహారాన్ని తిని విసర్జించిన తరువాత ఆ మలపదార్థాన్ని మళ్లీ భూమిలో కలిసిపోయేలా చూడాలి. అయితే శుద్ధి చేసిన తరువాత మాత్రమే అలా చేయాలి. వ్యర్థ పదార్థాల పునర్వినియోగమనేది మన ఆరోగ్యానికి హానికరం కాకూడదు.

మరో ముఖ్యమైన వాస్తవమేమిటంటే ప్రజాసమూహాలు భాగస్వాములు కానంతవరకు నీటి సరఫరా పథకాలు సక్రమంగా పని చేయనివిగా మిగిలిపోతాయి. నిజానికి పూర్తిగా నిష్ప్రయోజనమవుతాయి. సమస్యేమిటంటే నీటి వనరుల నిర్వహణ, భూముల వ్యవహారాల సంబంధిత అధికార వ్యవస్థలు వేర్వేరుగా ఉండడమే. నీటి వనరుల నిర్వహణ బాధ్యత, నీటిపారుదల వ్యవస్థపై నియంత్రణ వేర్వేరు ప్రభుత్వ విభాగాల పరిధిలో ఉంటాయి. ఆరగాణి ప్రాంతం మరో విభాగం పరిధిలో ఉంటుంది. జల భద్రత సమకూరాలంటే ఈ పరిస్థితి మారాలి. జలవనరులపై స్థానిక ప్రజా సముదాయాలకు యాజమాన్య హక్కులు కల్పించాలి. అధికారాల వికేంద్రీకరణే నీటి వనరుల నిర్వహణకు సరైన మార్గం. స్వచ్ఛమైన నీరు ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి వచ్చేలా అధికారాల వికేంద్రీకరణ తప్పనిసరిగా జరగాలి.

వాతావరణ మార్పు ప్రభావాలు తీవ్రమవుతున్న ప్రస్తుత తరుణంలో నేటి సమాజాలకు ఈ వికేంద్రీకరణ చాలా ముఖ్యం. సమీప కాలంలోనే ప్రాకృతిక వైపరీత్యాలను మనం మరింత తీవ్ర స్థాయిలో చూడనున్నాం. ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని జలవనరుల నిర్వహణలో పెట్టుబడులను మరింతగా పెంచాల్సిన అవసరమున్నది. జల ప్రళయం లాంటి కుంభవృష్టిని సైతం తట్టుకుని సురక్షితంగా ఉండగలగాలి. ఈ విషయంలో మన కృషిని మరింత వేగవంతం చేయవలసిన అవసరమున్నది. లేని పక్షంలో వాతావరణ మార్పు ప్రభావంతో తరచు అతివృష్టి లేదా సుదీర్ఘ అనావృష్టిని చవిచూడవలసి వస్తుంది. వాననీటిని మరింత భద్రంగా పట్టుకుని కాపాడుకోవల్సి ఉన్నది. ఎక్కడ పడిందో అక్కడే పట్టుకోవాలి. అక్కడే నిల్వ చేసి ఆ ప్రాంత భూగర్భ జలాలను పునశ్శక్తిమంతం చేయాలి.

నదులు, సరస్సులు, చెరువులు మొదలైన జల వనరులను కాపాడుకునేందుకు మనం చూపే శ్రద్ధాసక్తులపై మన జల భవిష్యత్తు ఆధారపడి ఉన్నది. నీటి కొరత అంటే కేవలం వర్షాలు పడకపోవడం కాదు. ప్రకృతి మనకు ప్రసాదించే జీవధార అందరిదీ. సకల ప్రజలకూ దానిపై హక్కు ఉన్నది. ప్రతి ఒక్కరికీ ఆ హక్కును న్యాయబద్ధంగా అమలుపరచాలి. దురదృష్టవశాత్తు మన సమాజం ఈ విషయంలో విఫలమవుతోంది. ఆ వైఫల్య పర్యవసానమే జల సంక్షోభాలు.

(సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

అప్పటి ఆధిక్యం నిలిచేనా?

లోక్‌సభ ఎన్నికల రెండో దశలో భారతీయ జనతా పార్టీ ఒక ప్రత్యేకమైన సమస్య నెదుర్కొంటున్నది. రెండో దశ పోలింగ్ జరగనున్న నియోజకవర్గాలలో అత్యధిక స్థానాలు బీజేపీ అధీనంలో ఉన్నాయి. నేడు పోలింగ్ జరగనున్న 87 స్థానాలలో బీజేపీ, దాని మిత్రపక్షాలు 2019లో 62 కైవసం చేసుకోగా, కేవలం 24 సీట్లలో మాత్రమే ఇండియా కూటమి విజయం సాధించింది. ఆ ఆధిక్యతతో అధికార కూటమి ప్రస్తుత ఎన్నికలలో కూడా అత్యధిక సీట్లను గెలుచుకోగలదనుకోవడం భ్రమే అవుతుంది. ఇందుకు అనేక కారణాలున్నాయి. 2019 నాటి సంఖ్యాబలం ప్రస్తుత పరిస్థితులను ప్రతిబింబించడం లేదు. 2019 అనంతరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రాతిపదికన చూసినప్పుడు అధికార ప్రతిపక్ష కూటముల బలాబలాల్లో చోటుచేసుకున్న మార్పులు తెలియవస్తాయి. 2019 అనంతర అసెంబ్లీ ఎన్నికలలో సాధించిన ఆధిక్యతలతో సర్దుబాటు చేసినప్పుడు ఉభయ కూటముల మధ్య పోటీ ఇంచుమించు సమస్థాయిలో ఉన్నట్టు అర్థమవుతుంది. ఈ ప్రకారం ఎన్‌డీఏ 44 సీట్లలోను, ఇండియా కూటమి 43 సీట్లలోను ముందంజలో ఉన్నట్టు స్పష్టమవుతుంది. బీజేపీకి మరో సమస్య కూడా ఉన్నది. రెండు రాష్ట్రాలలో మినహా బీజేపీ ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న సీట్లలో ఆ పార్టీ వివిధ స్థాయిలలో బలహీనంగా ఉన్నది. కాగా ఇండియా కూటమి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలు ఇప్పటికీ ఆ ప్రతిపక్ష కూటమికి కంచుకోటలుగా ఉన్నాయి. బీజేపీ ఎట్టి పరిస్థితులలోను ఆ కోటల్లో పాగా వేయలేదు. చెప్పవచ్చిన దేమిటంటే ఈ రెండో దశ ఎన్నికలలోను బీజేపీ నష్టాలను చవి చూడనున్నది. ఎన్‌డీఏ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలలో పోలింగ్ శాతం, ఇండియా భాగస్వామ్యపక్షాలు ప్రాతినిధ్యం వహిస్తున్న స్థానాలలో కంటే తక్కువగా ఉంటే అధికార కూటమికి సంభవించే నష్టాలు గణనీయమైనవిగా ఉంటాయి.



నేడు దేశవ్యాప్తంగా 87 నియోజకవర్గాలలో రెండవ విడత పోలింగ్ జరగనున్నది. ప్రతిపక్ష ఇండియా కూటమి ప్రాతినిధ్యం వహిస్తున్న స్థానాలలో కంటే ఎన్‌డీఏ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలలో పోలింగ్ శాతం తక్కువగా ఉంటే అధికార కూటమికి సంభవించే నష్టాలు ఎక్కువగా ఉంటాయి.

రెండో దశ ఎన్నికలు జరగనున్న స్థానాలలో ఇండియా కూటమి గతంలో వలే ఇప్పుడూ బలోపేతంగా ఉండడానికి ప్రధాన కారణం కేరళ. ఈ రాష్ట్రంలోని మొత్తం 20 లోక్‌సభ స్థానాలలోనూ నేడు పోలింగ్ జరగనున్నది లోక్‌సభ ఎన్నికలలో ఇంతవరకు ఈ రాష్ట్రంలో బీజేపీ ఒక్కసారి కూడా విజయం సాధించలేకపోయింది. అయితే తన ఓట్ల శాతాన్ని మెరుగుపరచుకుంటూ వస్తోంది. 2019లో ఒక నియోజకవర్గం– తిరువనంతపురంలో బీజేపీ రెండవ స్థానంలో ఉన్నది. స్వల్ప శాతం ఓట్ల తేడాతో ఓడిపోయింది. మరో రెండు నియోజకవర్గాలలో ఓట్ల వాటాలో నాలుగో స్థానంలో ఉన్నది. కేరళలో బీజేపీ తన ప్రప్రథమ విజయాన్ని సాధించగలిగితే ఆ పార్టీ మహదానందభరితమవుతుంది అయితే కేరళలో గెలుచుకునే సీట్లు బీజేపీ మొత్తంగా గెలుచుకునే సీట్ల సంఖ్యను పెద్దగా పెంచలేవు.

ఈ రెండో దశ ఎన్నికలలో బీజేపీ అదృష్ట దురదృష్టాలు కర్ణాటక, రాజస్థాన్, మహారాష్ట్రలో నిర్ణయమవనున్నాయి. గత సార్వత్రిక ఎన్నికలలో మూడు రాష్ట్రాలలో అత్యధిక స్థానాలు గెలుచుకున్న బీజేపీ ఈసారి గట్టి పోటీ నెదుర్కొంటున్నది. కర్ణాటకలో రెండో విడత పోలింగ్ జరగనున్న 14 స్థానాలు రాష్ట్ర దక్షిణ ప్రాంతంలో ఉన్నాయి. పాత మైసూరు, కూర్గ్, కోస్తా ప్రాంతాలలో ఈ నియోజకవర్గాలు ఉన్నాయి. కోస్తా ప్రాంతాలలో బీజేపీకి మొదటి నుంచీ మంచి ఆదరణ ఉన్నది. పాత మైసూరు సంస్థానంలో బీజేపీకి పెద్దగా ఆదరణ లేదు. గత సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ గెలుచుకున్న ఒకే ఒక్క స్థానం మైసూరు ప్రాంతంలోనే ఉన్నది. మిగతా రెండు నియోజకవర్గాలను జనతాదళ్ (సెక్యులర్) గెలుచుకున్నది. గ్రామీణ ప్రాంతాలలో ఒక్కలిగ కులస్తులదే పూర్తి ప్రాబల్యం. యూపీలో ఆర్ఎల్‌డీతో పొత్తు దోహదం చేసిన విధంగా ఒక్కలిగల నాయకత్వంలోని జనతాదళ్ (ఎస్)తో మైత్రి కర్ణాటకలో తన విజయావకాశాలను మెరుగుపరుస్తుందని బీజేపీ విశ్వసిస్తోంది. గతంలోని ఎన్నికల ఫలితాలను పరిశీలించినప్పుడు బీజేపీ–జనతాదళ్(ఎస్) పొత్తు ఉభయతారకమైనదని చెప్పవచ్చు. 2023 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రాతిపదికన చూస్తే నేడు పోలింగ్ జరగనున్న 14 స్థానాలలో తొమ్మిదిని గెలుచుకోవలసి ఉంటుంది. అయితే బీజేపీ–దళ్(ఎస్)లకు లభించిన ఓట్లను కలిపి లెక్కిస్తే కాంగ్రెస్‌కు ఈ 14 సీట్లలో కేవలం 3 మాత్రమే లభించే అవకాశమున్నది. ఇందుకు బీజేపీ, జనతాదళ్(ఎస్) పార్టీల మధ్య ఓట్ల బదిలీ పూర్తిగా జరగవలసి ఉంది. అయితే అది జరిగే అవకాశం లేదు. అంతేకాకుండా సిద్ధరామయ్య ప్రభుత్వానికి లభిస్తున్న విశేష ప్రజాదరణ కాంగ్రెస్‌కు లబ్ధి సమకూర్చనున్నది. ఓటర్లు నిజంగా కాంగ్రెస్ వైపు మొగ్గితే బీజేపీ– దళ్(ఎస్) కూటమి 3 నుంచి 5 స్థానాలను కోల్పోయే అవకాశమున్నది.



■ యోగేంద్ర యాదవ్

రాజస్థాన్‌లో కూడా ఇండియా కూటమి మంచి లబ్ధి పొందే అవకాశమున్నది. అయితే మొదటి దశలో మాదిరిగా ఈ రెండో దశలో లబ్ధి పొందే అవకాశం లేదు. రాజస్థాన్‌లో ఈ రెండో దశ ఎన్నికలు మార్వార్, మేవార్ హరోటి ప్రాంతాలలో జరగనున్నాయి. 2019 సార్వత్రిక, 2023 అసెంబ్లీ ఎన్నికలలో ఈ ప్రాంతాలలోనే బీజేపీ ఘన విజయాలు సాధించింది. ఈ మూడు ప్రాంతాలలోని 13 నియోజకవర్గాలలో కేవలం 4 స్థానాలలో మాత్రమే కాంగ్రెస్‌కు విజయావకాశమున్నది. రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీతో పొత్తు పెట్టుకోవడంతో పాటు చివరి క్షణంలో భారత్ ఆదివాసీ పార్టీతో ఒక అవగాహనకు వచ్చినందున మరో మూడు సీట్లను కూడా కాంగ్రెస్ గెలుచుకోవచ్చు. మొత్తం మీద బీజేపీ మరో 3 నుంచి 5 సీట్లను కోల్పోయే అవకాశమున్నది.

మహారాష్ట్రలో ఈ సార్వత్రిక ఎన్నికలు ఐదు విడతలుగా జరగనున్నాయి. సిట్టింగ్ ఎంపీలలో అత్యధికులు, గణనీయమైన సంఖ్యలో ఎమ్మెల్యేలు ఎన్‌డీఏ భాగస్వామ్య పక్షాలకు చెందినవారే కావడం గమనార్హం. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిండే నాయకత్వంలోని శివసేన, అజిత్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ తమ మాతృ పార్టీ పేరు, చిహ్నాన్ని స్వాయత్తం చేసుకోవడంలో సఫలమయ్యాయి. ఈ రెండు పార్టీల మాతృపార్టీలు ఇప్పుడు శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే), ఎన్‌సీపీ–శరద్‌చంద్ర పవార్ అనే కొత్త పేర్లతో వ్యవహరింపబడుతున్నాయి. మాతృపార్టీల కార్యకర్తల్లో అత్యధికులు ఈ రెండు పార్టీల పక్షానే ఉన్నారు. అలాగే ఓటర్లు కూడా. గత అసెంబ్లీ ఎన్నికలలో శివసేన, ఎన్‌సీపీలకు లభించిన ఓట్లు సమాన స్థాయిలో చీలిపోతే బీజేపీ, దాని మిత్రపక్షాలు నేడు పోలింగ్ జరగనున్న 8 సీట్లలో మూడింటిని కోల్పోతాయి. వంచిత్ బహుజన్ అఘాది ఈ రెండో విడత ఎన్నికలలో 6 స్థానాలలో పోటీ చేస్తోంది. 2019లో కంటే ఇప్పుడు వీబీఏ బలహీనంగా ఉన్నప్పటికీ పలు స్థానాలలో ఇండియా కూటమికి చెప్పుకోదగిన నష్టాన్ని కలిగించే అవకాశమున్నది. మొత్తం మీద మహారాష్ట్రలో ఈ విడత ఎన్నికలలో ఇండియా కూటమి పరిమిత లబ్ధిని మాత్రమే పొందగలదు.

ఇతర రాష్ట్రాలలో నేడు పోలింగ్ జరగనున్న కొద్ది నియోజకవర్గాలలో కూడా బీజేపీకి స్వల్ప నష్టం జరిగే అవకాశమున్నది. ఛత్తీస్‌గఢ్‌లో నేడు పోలింగ్ జరగనున్న మూడు నియోజకవర్గాలలోను కాంగ్రెస్ గెలిచే అవకాశమున్నది. పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర బెంగాల్ ప్రాంతపు మూడు నియోజకవర్గాలలో బీజేపీ ఒక ప్రధాన పోటీదారుగా ఉన్నది. గత అసెంబ్లీ ఎన్నికలలో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఈ మూడు నియోజకవర్గాలలో రెండిటిపై పూర్తి పట్టును సాధించింది. బిహార్‌లో ముస్లిం జనాభా అత్యధికంగా ఉన్న సీమాంచల్, భాగల్పూర్ ప్రాంతాలలో నేడు పోలింగ్ జరగనున్నది. ఈ ప్రాంతాలలోని పూర్ణియా నియోజకవర్గంలో ఇండియా కూటమి అంతర్గత విభేదాలు దానికి ప్రతికూలంగా పరిణమించే అవకాశమున్నది. ఇక కిషన్‌గంజ్ నియోజకవర్గంలో ఎఐఎమ్ఐఎమ్ నుంచి ఇండియాకు గట్టి సవాల్ ఎదురవుతున్నది. పశ్చిమ యూపీలో నేడు పోలింగ్ జరగనున్న ఎనిమిది నియోజకవర్గాలలో ఎస్పీ–కాంగ్రెస్ కంటే బీజేపీ–ఆర్ఎల్‌డీకే స్పష్టమైన ఆధిక్యత ఉన్నది. అయితే రెండు అంశాలు బీజేపీకి ప్రతికూలంగా పరిణమించవచ్చు. పశ్చిమ యూపీకి ప్రత్యేక రాష్ట్ర ప్రతిపత్తి కల్పించాలనే డిమాండ్‌ను మాయావతి మళ్లీ తలకెత్తుకున్నారు (ఆర్ఎల్‌డి ఒకప్పుడు ఇదే డిమాండ్ చేస్తుండేది). మరో అంశం బీజేపీ పట్ల రాజ్‌పుట్‌ల అసంతృప్తి. అభ్యర్థుల ఎంపికలో తమ వర్గం వారికి సముచిత ప్రాధాన్యమివ్వనందుకు బీజేపీ పట్ల రాజ్‌పుట్‌లు అసంతృప్తితో ఉన్నారు.

18వ సార్వత్రిక ఎన్నికల రెండో దశ పోలింగ్ జరగనున్న నియోజకవర్గాలు అన్నిటిలోను 2019లో 70 శాతం పోలింగ్ జరిగింది. మిగతా దశలలో కంటే రెండో దశలోనే అత్యధిక పోలింగ్ జరిగింది. మరి ఈసారి ఈ దశలో పోలింగ్ శాతం, ముఖ్యంగా హిందీ రాష్ట్రాలలో తగ్గిపోనున్నదా? ఈ సంభావ్య విషయం బీజేపీని అమితంగా కలవరపరుస్తోంది. ఎందుకంటే మొదటి దశలో పోలింగ్ శాతం తగ్గిపోయింది. (మొదటి దశ ఎన్నికలు జరిగిన నియోజకవర్గాలలో ఎన్‌డీఏ బలంగా ఉండడంతో పాటు 2019లో వాటిలో సగానికి పైగా సీట్లను గెలుచుకున్నది.) 2019లో ఎన్‌డీఏ గెలుచుకున్న నియోజకవర్గాలలో ఈసారి మొదటి దశ పోలింగ్ 5.1 శాతం తగ్గిపోగా గతంలో ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు గెలుచుకున్న సీట్లలో ఇప్పుడు పోలింగ్ శాతం 2.4 శాతం మాత్రమే తగ్గింది. పోలింగ్ శాతం మొదటిదశలో వలే రెండో దశలో కూడా తగ్గిపోయిన పక్షంలో తరువాయి దశల్లో బీజేపీకి సవాళ్లు ముమ్మరమవుతాయి.

(వ్యాసకర్త కన్వీనర్, భారత్ జోడో అభియాన్)

(శ్రేయాస్ సర్దేశాయి, రాహుల్ శాస్త్రి సహకారంతో)

మధ్యతరగతీ ఎక్కడికి నీ ప్రయాణం!

ఎన్ని పరిమితులు, పక్షపాతాలు ఉన్నప్పటికీ మంచికైనా చెడుకైనా మధ్యతరగతి ఇప్పుడు మహాచోదక శక్తిగా మారింది. ఆర్థిక రథాన్ని తన వినియోగ శక్తితో పరుగుపెట్టిస్తోంది. ప్రపంచస్థాయి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుకోవటంలో దూసుకుపోతోంది. నవకల్పనలలోనూ ముందుంటోంది. ప్రజాస్వామ్యాన్ని ఏదో విధంగా కాపాడుతూ వస్తోంది. అదే సమయంలో అసహన ధోరణులకు ఆహ్వానం పలుకుతోంది. ఆధిపత్య భావజాలాల ప్రభావాలకు అనుచితంగా లోనవుతోంది. గతమంతా గొప్పదనే అభిజాత్యాన్ని ప్రదర్శిస్తోంది. కుల నిర్దేశిత పెద్దాచిన్నా దృష్టిని పూర్తిగా వదుల్చుకోలేక పోతోంది. వీటిని త్యజించి వివేచనను ప్రదర్శిస్తే దేశాన్ని మేలిమలుపు తిప్పుతుంది. నియంతృత్వాలన్నీ ముందు చూపులేని మధ్యతరగతి మద్దతుతోనే వచ్చాయి. చరిత్ర చెప్పే పాఠం అదే!

పుర్రెకో బుద్ధి–జిహ్వకో రుచి అనేది మనిషి విశిష్టతను చెప్పే ఒక సామెత. అన్ని సంస్కృతుల్లోనూ ఇలాంటి సామెతలు కచ్చితంగా ఉంటాయి. విశిష్టతతో పాటు మనిషికి సాధారణ ప్రవర్తనా ఉంటుంది. సాధారణ ఆలోచనా రీతీ ఉంటుంది. సమాజ మనుగడకు ఇదే కీలకం. సాధారణ ప్రవర్తన లోపిస్తే మనుషుల మధ్య బంధమే ఏర్పడదు. ప్రతి విషయంలోనూ మనుషులు పరస్పరం పొసగని రీతిలో వ్యవహరిస్తే సామాజిక జీవితం సాధ్యంకాదు. కాలక్రమంలో మనుషుల మధ్య విపరీత అంతరాలు ఏర్పడి అసమానతలు తలెత్తిన తర్వాత వర్గాలు, తరగతులుగా మనుషుల స్వభావాలను అంచనా వేయటం మొదలైంది. కార్మికులు, రైతులు, వ్యాపారులు, పెట్టుబడిదారులు, భూస్వాములు, కౌలుదారులు, వ్యవసాయ కూలీలు, మధ్య తరగతి... ఇలా సమాజంలో ఎన్నో సమూహాలు ఉంటాయి. సామాజిక, ఆర్థిక, విద్యా స్థాయిలో కాస్త అటుఇటుగా సమానస్థాయి ఉన్న ప్రజలను భిన్న వర్గాలుగా, తరగతులుగా పరిగణిస్తారు.

అన్ని దేశాల్లోలాగే మన సమాజంలోనూ ఈ వర్గాలు ఉన్నా ఇప్పుడు ఎక్కువగా మాట్లాడుకుంటున్నది మధ్యతరగతి గురించే. మధ్యతరగతి చుట్టూనే రాజకీయాలు తిరుగుతున్నాయి. ఆర్థిక విధానాలు ఎక్కువగా వారిని దృష్టిలో పెట్టుకునే రూపొందుతున్నాయి. వార్తా, వినోద మాధ్యమాల గురీ మధ్యతరగతి పైనే. విదేశీ విలువల అనుకరణలో ముందున్నదీ ఈ తరగతే. కొత్త వస్తువులు, పరికరాల కోసం పరుగులెత్తేది ఈ వర్గమే. సోషల్ మీడియాను విపరీతంగా ఉపయోగించేది వీరే. అంతెందుకు 2014 నుంచి రాజకీయాలను విపరీతంగా ప్రభావితం చేస్తున్నదీ ఈ వర్గమే. ఇన్ని విధాలుగా ప్రాధాన్యం కలిగిన ఈ వర్గం స్వభావం గురించి చాలా పరిశోధనలు జరుగుతున్నాయి. హిందూత్వ ప్రభావానికి బలంగా లోనవుతున్నది ఈ వర్గమే. మత అసహనమూ ఈ వర్గం నుంచే ప్రధానంగా వ్యక్తమవుతోంది. లౌకిక విధానం, ప్రజాస్వామ్యం, రాజ్యాంగబద్ధపాలన భవిష్యత్తు ప్రధానంగా ఈ వర్గం ప్రవర్తన, ఆలోచనా ధోరణులపైనే ఆధారపడి ఉంటుంది. అటువంటి ఈ వర్గం గురించి సమతూక దృష్టితో పరిశీలనలు చేసిన వారిలో సురీందర్ ఎస్. జోధ్కా ఒకరు. అసీం ప్రకాష్‌తో కలిసి రాసిన 'ద ఇండియన్ మిడిల్ క్లాస్' అనే పుస్తకంలో మధ్యతరగతి స్వభావాన్ని లోతుగానే విశ్లేషించారు. ఆర్థికంగా పైకి ఎదగటానికి ఈ వర్గం చేస్తున్న ప్రయత్నాలు, ఆదాయాన్ని ఖర్చుపెడుతున్న తీరు, కొత్త విషయాలకు ఆహ్వానం పలకటం, నాయకత్వ లక్షణాలు, అవకాశాల కోసం దేశం లోపలా వెలుపలా చేసే అన్వేషణలు, పాలనా సంస్కరణల కోసం పట్టుపట్టటం, అవినీతిపై ప్రదర్శించే వైఖరి... ఇలా మధ్యతరగతికి మక్కువైన విషయాలపై చాలామంది రాశారు. ఏ తరగతీ శూన్యం నుంచి ఊడిపడదు. ప్రతిదానికీ నేపథ్యం ఉంటుంది. చరిత్రా ఉంటుంది. వీటిపై దృష్టి పెడితే మధ్యతరగతి అసలు సంగతులూ తెలుస్తాయి.

అభివృద్ధి చెందిన దేశాల్లో మధ్యతరగతి సంఖ్య చాలా ఎక్కువ. మన దగ్గరా దీని సంఖ్య 1990ల తర్వాత బాగా పెరిగింది. ముఖ్యంగా ఆర్థిక సంస్కరణల తర్వాత మధ్యతరగతి విస్తరించింది. పెద్ద యూరపు దేశాల మొత్తం జనాభాని మించి ఇక్కడ మధ్యతరగతి ఉంది. జనాభాలో 30శాతం వరకూ మధ్యతరగతి ఉంటుందనే అంచనాలు ఉన్నాయి. తాజా లెక్కల ప్రకారం మన జనాభా 144 కోట్లు. ఇందులో 30 శాతం అంటే 48 కోట్లు. ఈ సంఖ్యను చూసి భారత్‌లో మధ్యతరగతి మహాయుగం వచ్చేస్తుందనే వ్యాఖ్యానాలు ఊపందుకున్నాయి. గణాంకాలపై ఏకాభిప్రాయం మనకు చాలా అరుదు. అందుకే మధ్యతరగతి ఇంత ఉందంటే అంగీకరించలేని వాళ్లూ ఉన్నారు. జనాభాలో 10 నుంచి 25 శాతం లోపే ఈ వర్గం సంఖ్య ఉంటుందనే అంచనాలూ ఉన్నాయి. ఎంత ఆదాయం ఉన్న వారిని మధ్యతరగతిగా పరిగణించొచ్చు అన్న దానిపైన కూడా ఏకాభిప్రాయం లేదు. ఏడాదికి రెండు లక్షల నుంచి 12 లక్షల రూపాయల వరకూ ఆదాయం ఉన్న వారిని మధ్యతరగతిగా పరగణించవచ్చనీ ఆర్థిక నిపుణులు సూచించారు.

ఆదాయ–వ్యయాల ప్రకారం మొత్తంగా ప్రజలను అయిదు విభాగాలుగా విభజించొచ్చు. అట్టడుగున ఉన్న 20 శాతాన్ని నిరుపేదలుగానూ, ఆ తర్వాత ఉన్న 20 శాతాన్ని పేదలుగానూ పరిగణించి పరిశీలన చేసే పద్ధతి ఉంది. మరో 20 శాతాన్ని కింది మధ్యతరగతిగా భావించొచ్చు. ఆ తర్వాతి 20 శాతాన్ని మధ్య ఆదాయ మధ్యతరగతిగా పరిగణించొచ్చు. అందరికంటే పైనున్న 20 శాతాన్ని ఎగువ మధ్యతరగతి–ధనిక వర్గంగా లెక్కించొచ్చు.

కేవలం ఆదాయాన్నే తీసుకుని ఈ విభాగాలను పరిశీలించటం వల్ల సామాజిక వాస్తవాలు కనపడవు. ఏ విభాగంలో ఏ కులాల ప్రజలు ఎక్కువగా ఉన్నారు? హరిజనులు, గిరిజనులు, బీసీలు, ఓసీలు ఏ విభాగంలో ఎంతెంత శాతంగా ఉన్నారు? అన్ని కులాలకు మధ్యతరగతిలో చోటు లభించటం వల్ల కుల దృష్టి తగ్గుతోందా? తామంతా ఒకటేనన్న భావన మధ్యతరగతిలో పెరుగుతోందా? సమాన ఆర్థికస్థాయి సామాజిక హెచ్చుతగ్గులను చెరిపేస్తోందా? లేక కుల పక్షపాతం మామూలుగానే కొనసాగుతూ ఆధునిక రంగాల్లో కూడా అది ప్రభావాన్ని చూపిస్తోందా? అన్నవి కీలకమైన ప్రశ్నలు. వీటికి జవాబులు వెతికితేనే వాస్తవ చిత్రం ఎంతో కొంత అర్థం అవుతుంది. జాతీయ నమూనా సర్వే (2011–12) వెల్లడించిన తలసరి నెలవారీ వ్యయం లెక్కల ఆధారంగా చూస్తే ఎవరు ఎక్కడున్నారో స్పష్టంగా తెలుస్తుంది.

ఎస్టీల సంగతే చూద్దాం. నిరుపేదల్లో 36శాతం, పేదల్లో 23శాతం, దిగువ మధ్యతరగతిలో 17శాతం, మధ్య ఆదాయ మధ్యతరగతిలో 14శాతం, ఎగువ మధ్యతరగతిలో 10శాతం చొప్పున ఉన్నారు. ఎస్సీల్లో ఈ శాతాలు వరుసగా 25, 23, 20, 18, 13 చొప్పున ఉన్నట్లు తేలింది.


బీసీల్లో 18, 20, 21, 21, 20 శాతం చొప్పున ఉన్నారు. ఓసీల్లో 11, 16, 20, 22, 31 శాతంగా ఉన్నారు. ఇవన్నీ గ్రామీణ ప్రాంతానికి చెందినవి. పట్టణ ప్రాంతాలకు వచ్చేటప్పటికీ శాతాల్లో కొంత తేడాలున్నా పరిస్థితిలో పెద్ద తేడాలేదు.

ఎస్టీ, ఎస్సీ, బీసీలకు సామాజికంగా దిగువ స్థాయిని, అగ్ర కులాలకు ఉన్నతస్థాయిని ఇవ్వటం మన సమాజంలో ఎప్పటి నుంచో ఉంది. సామాజిక స్థాయికి తగ్గట్టుగానే ఆర్థికస్థాయీ ఒకప్పుడు ఉండేది. అనేక పరిణామాల వల్ల కులాల్లోపలా ఆర్థిక పరమైన తేడాలు వచ్చేశాయి. 1990ల తర్వాత అవింకా వేగాన్ని పుంజుకున్నాయి. ఎస్సీల్లో కూడా ఎగువ మధ్యతరగతి ప్రజలు 13 శాతం ఉండటమే దీనికి నిదర్శనం. మధ్యఆదాయ వర్గంలోనూ 18 శాతం ఉన్నారు. ఇంకో ఆసక్తికర పరిణామం ఏమిటంటే దిగువ, మధ్యస్థ తరగతులనే తీసుకుంటే బీసీ, ఓసీల మధ్య పెద్ద తేడాలేదు. ఎగువమధ్య తరగతి వచ్చే సరికి మాత్రం ఈ తేడా 11 శాతం వరకూ ఉంది.

ఈ శాతాలను బట్టి కులాల్లో ఆర్థిక అంతరాలను విస్మరించలేని పరిస్థితి మనకు కనపడుతుంది. మరోవైపు ఇంకో వాస్తవం కూడా మన ముందుకు వస్తుంది. మధ్యతరగతికి చేరుకున్న తర్వాత కూడా కుల, జాతి భావనలు ప్రజల్లో పూర్తిగా తగ్గలేదని చెప్పటానికి సురీందర్ పలు పరిశీలనలను ప్రస్తావించారు. వీలున్నచోట్ల మధ్యతరగతి కుల పక్షపాతాన్ని ప్రదర్శిస్తోంది.



■ రాహుల్ కుమార్



ఇందులోనూ అగ్రకులాల వాటానే పెద్దది. సమాజంలో బాగా పరపతిని కలిగి ఉండి అవసరమైన చోట కొత్త పరిచయాలను ఏర్పరచుకోవటంలో అగ్రకులాలకు చాకచక్యం ఉంది. దీన్నే సోషల్ క్యాపిటల్ అంటారు. ఇతర కులాలకు అవకాశాలు దక్కకుండా పలు సందర్భాల్లో దీన్ని ఉపయోగిస్తారు. అందుకే కుల సంఘీభావం పనిచేయని రంగం ఉందని చెప్పుకోలేం. పాశ్చాత్య దేశాల్లో జాతి ఆధిక్యతా భావాలు ఉన్నప్పటికీ కులం నుంచి ఉత్పన్నమయ్యే ఇన్ని పక్షపాతాల్లేవు. ఈ పక్షపాతమే చాలా సందర్భాల్లో సమస్యలపై సంఘటితం కాలేని దుస్థితిని తెచ్చిపెడుతోంది. అయితే అందరూ ఈ దారిలోనే లేరు. స్వేచ్ఛ, సామాజిక సమానత్వ భావాల నుంచి ప్రేరణ పొందిన వ్యక్తులు, నాయకులు కూడా మధ్యతరగతి నుంచే వచ్చారు. సంస్కరణ, ప్రగతిశీల ఉద్యమాలకు వారే నేతృత్వం వహించారు. కానీ వీటితో నేరుగా ప్రభావితమైన మధ్యతరగతి సంఖ్య గణనీయమైందని చెప్పలేం. దీనికి గట్టి కారణాలే ఉన్నాయి. మన మధ్యతరగతి బ్రిటిష పాలకుల అవసరాల కోసం పుట్టింది. అధికారాన్ని చలాయించిన వర్గాలతో సంఘర్షించి ఉనికిలోకి రాలేదు. 1947 వరకూ మధ్యతరగతి అంటే ప్రధానంగా ప్రభుత్వ ఉద్యోగులు, లాయర్లు, వైద్యులు, గుమాస్తాలు, అకౌంటెంట్లు, ఉపాధ్యాయులే. ఈ తరగతి ఎప్పుడూ సమాజంలో సమూల మార్పులు కోరుకోలేదు. పెద్దగా ఇబ్బంది కలిగించని సంస్కరణల కోసమే పట్టుబట్టింది. రాజకీయ అధికారాన్ని కూడా మెట్టుమెట్టుగా సాధించటానికే ప్రాధాన్యం ఇచ్చింది. మధ్యతరగతిలో అత్యధికులు అగ్రకులాల నుంచి రావటం వల్ల తరతరాలుగా తమకు పెద్దపీట వేసిన సామాజిక వ్యవస్థను మార్చటానికి ఇష్టపడలేదు. ఈ పరిమితి వల్లే ఎన్నో ప్రగతిశీల చట్టాలు ఆచరణలో పేలవంగా అమలయ్యాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, లౌకికవాదం, బహుళ సంస్కృతుల పరిరక్షణ, సంక్షేమరాజ్య భావన, రిజర్వేషన్ల కల్పన లాంటి వాటికి మధ్యతరగతి రాజకీయ నాయకత్వం ఆమోదించినా అవన్నీ సవ్యంగా అమలయ్యాయని చెప్పలేం.

ఎన్ని పరిమితులు, పక్షపాతాలు ఉన్నప్పటికీ మంచికైనా చెడుకైనా మధ్యతరగతి ఇప్పుడు మహాచోదక శక్తిగా మారింది. ఆర్థిక రథాన్ని తన వినియోగ శక్తితో పరుగుపెట్టిస్తోంది. ప్రపంచస్థాయి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుకోవటంలో దూసుకుపోతోంది. నవకల్పనలలోనూ ముందుంటోంది. ప్రజాస్వామ్యాన్ని ఏదో విధంగా కాపాడుతూ వస్తోంది. అదే సమయంలో అసహన ధోరణులకు ఆహ్వానం పలుకుతోంది. ఆధిపత్య భావజాలాల ప్రభావాలకు అనుచితంగా లోనవుతోంది. గతమంతా గొప్పదనే అభిజాత్యాన్ని ప్రదర్శిస్తోంది. కుల నిర్దేశిత పెద్దాచిన్నా దృష్టిని పూర్తిగా వదుల్చుకోలేకపోతోంది. వీటిని త్యజించి వివేచనను ప్రదర్శిస్తే దేశాన్ని మేలిమలుపు తిప్పుతుంది. నియంతృత్వాలన్నీ ముందు చూపులేని మధ్యతరగతి మద్దతుతోనే వచ్చాయి. చరిత్ర చెప్పే పాఠం అదే!

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)



జేఈఈ మెయిన్స్‌లో ర్యాంకులు సాధించిన నారాయణ విద్యార్థులు

ఓపెన్ కేటగిరీలో నారాయణ హవా

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్ ఫలితాల్లో తమ విద్యార్థులు ఆలిండియా ర్యాంకులు సాధించి సత్తా చాటారని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఓపెన్ కేటగిరిలో తమ విద్యార్థులు ఆలిండియా 1, 5, 6, 7, 8, 10, 12 ర్యాంకులు సాధించారని వివరించారు. 100లోపు ర్యాంకులను 28 మంది, వెయ్యిలోపు ర్యాంకులను 171 మంది సాధించారని పేర్కొన్నారు. జి.నీల్‌కృష్ణ ఆలిండియా మొదటి ర్యాంకు సాధించారని, హెచ్.విదిత్(5), ఎం.అనూప్(6), ఎం.సాయి తేజ(7), సీహెచ్ .సతీశ్‌కుమార్(8), ఆర్యన్ ప్రకాశ్(10), పి.రోహన్ సాయి(12) ర్యాంకులతో మెరిసారని తెలిపారు. జేఈఈ మెయిన్‌లో తమ ర్యాంకుల ప్రస్థానాన్ని అప్రతిహతంగా కొనసాగిస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 11 లక్షల మంది విద్యార్థులు హాజరైన జేఈఈ మెయిన్ పరీక్షలో నారాయణ విద్యార్థులు అత్యధిక సంఖ్యలో విజయం సాధించారని వివరించారు. అనితర సాధ్యమైన శిక్షణ, రిసెర్చ్ ఓరియంటెడ్ ప్రోగ్రాంలు, పక్కా ప్రణాళిక, స్టడీ మెటీరియల్, వారాంతపు పరీక్షలతోనే ఈ విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. విజయం సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

శ్రీ చైతన్య విద్యాసంస్థల విజయభేరి


జేఈఈ టాపర్లతో శ్రీచైతన్య డైరెక్టర్ సుష్మశ్రీ

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్ ఫలితాల్లో తమ విద్యాసంస్థ సంచలన రికార్డు సృష్టించిందని శ్రీ చైతన్య విద్యాసంస్థల అకాడమిక్ డైరెక్టర్ సుష్మశ్రీ తెలిపారు. జాతీయస్థాయిలో తమ విద్యార్థి కేసీ బసవారెడ్డి మొదటి ర్యాంకు, తోటంశెట్టి నిఖిలేశ్ 3వ ర్యాంకు, హిమాన్షు థలోర్ 6వ ర్యాంకు, రెడ్డి అనిల్ 9వ ర్యాంకు సాధించారని.. టాప్-10లో 4 ర్యాంకులను తమ విద్యార్థులే కైవసం చేసుకున్నారని ఆమె వెల్లడించారు. ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 100లోపు 25 ర్యాంకులు, 200లోపు 46 ర్యాంకులు సాధించారని, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలో 272 మంది తమ విద్యార్థులు 100 పర్సంటైల్ సాధించారని వివరించారు. అనితర సాధ్యమైన ప్రోగ్రాంలు, మైక్రో షెడ్యూల్స్, ఇంటర్నల్ ఎగ్జామ్స్, ర్యాంకింగ్ సిస్టం, ఇన్ఫినిటీ లెర్న్ ఆన్‌లైన్ యాప్, టాప్ ఫ్యాకల్టీ వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని వివరించారు. 2023లో జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్, నీట్ పోటీ పరీక్షల్లో ఓపెన్ కేటగిరిలో తమ విద్యాసంస్థ నంబర్-1 ర్యాంకులు సాధించిందని గుర్తుచేశారు. 39 సంవత్సరాల వ్యవధిలో శ్రీ చైతన్య ఆసియాలోనే అతిపెద్ద విద్యాసంస్థగా ఎదిగిందని, వివిధ రాష్ట్రాల్లో 900 శాఖలతో 9 లక్షల మంది విద్యార్థులకు సేవలను అందిస్తోందని సుష్మశ్రీ వెల్లడించారు.

శ్రీ గౌతమ్ పూర్వ విద్యార్థులకు 3, 8 ర్యాంకులు

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జేఈఈ ఫలితాల్లో తమ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు ఆలిండియా ర్యాంకులు సాధించారని డాక్టర్ కేకేఆర్ గౌతం విద్యాసంస్థల ప్రిన్సిపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. తోటంశెట్టి నిఖిలేశ్ 3వ ర్యాంకు, అరిపికట్ల తేజస్వీ 8వ ర్యాంకు, పి.విద్యప్రవీణ్ 14వ ర్యాంకు, సతివాడ జ్యోతిరాదిత్య 17వ ర్యాంకు సాధించారని పేర్కొన్నారు. 100 లోపు 17 ర్యాంకులను తమ పూర్వ విద్యార్థులు కైవసం చేసుకున్నారన్నారు. విజయం సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు విద్యాసంస్థ తరఫున అభినందనలు తెలిపారు.

ఎస్సార్ విద్యార్థుల జయకేతనం


జి. నవీన్ ఎ.నందిని వై.సాత్విక్‌రెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 25: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఎస్సార్ విద్యార్థులు జయకేతనం ఎగురవేశారని ఆ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి తెలిపారు. జాతీయ స్థాయిలో జి.నవీన్ 5వ ర్యాంకు, ఎ.నందిని 12, వై.సాత్విక్‌రెడ్డి 42, జి.కాలు 55 వ ర్యాంకు సాధించగా, మరో 12 మంది విద్యార్థులు 100 నుంచి 300 లోపు ర్యాంకులు సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. 2024 జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఎస్సార్ విద్యాసంస్థలకు చెందిన 3,256 మంది విద్యార్థులు అర్హత సాధించడం ఎస్సార్ విద్యాసంస్థల పేరు ప్రఖ్యాతులను పెంచిందన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డితో కలిసి వరదారెడ్డి విద్యార్థులను అభినందించారు.



ఉత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థులతో శ్రీకూర్మనాథ్ తదితరులు

జేఈఈ మెయిన్స్‌లో 'విజ్ఞాన్' విజయదుందుభి

గుంటూరు(విద్య), ఏప్రిల్ 25: జేఈఈ మెయిన్ ఫలితాల్లో అఖిల భారతస్థాయిలో విజ్ఞాన్ విద్యార్థులు విజయ దుందుభి మోగించారని విజ్ఞాన్ విద్యాసంస్థల సమన్వయకర్త గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్ తెలిపారు. వడ్లమూడిలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో జరిగిన అభినందన కార్యక్రమంలో మాట్లాడుతూ తమ వద్ద ఐఐటీ మెయిన్స్ కోచింగ్ తీసుకున్న విద్యార్థులలో 50 శాతం మంది విద్యార్థులు 90 శాతం పర్సంటైల్ సాధించారన్నారు. ఐ.హనీత్ (99.67), ఎం.స్నేహ (99.46), బి.యోగ విజయ కుమార్ (99.30), ఎ.రోహన్ (98.69), కె.లీలావతి (98.30), వి.అభిరామ్ (96.87), కె.శివనాగ రాజు (96.47), టి.సంజయ్ తేజ (96.41), పి.గౌతమ్ (96.03), ఎం.వివేక్ హూజిత్ కుమార్ (95.72) ఉత్తమ పర్సంటైల్‌తో రాణించారన్నారు. కార్యక్రమంలో వడ్లమూడి విజ్ఞాన్ జూనియర్ కళాశాల, గుంటూరులోని మహిళా కళాశాల ప్రిన్సిపాల్స్ జె.మోహనరావు, వై.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. విద్యార్థులకు సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య శుభాకాంక్షలు తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌లో 'భాష్యం' ప్రభంజనం

» ఇద్దరు విద్యార్థులకు 100 పర్సంటైల్.. జాతీయస్థాయిలో 18, 36 ర్యాంకులు


విద్యార్థులను అభినందిస్తున్న భాష్యం రామకృష్ణ తదితరులు

గుంటూరు(విద్య), ఏప్రిల్ 25: జేఈఈ మెయిన్-2024 ఫలితాల్లో భాష్యం ఐఐటీ జేఈఈ అకాడమీ విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ చూపారని విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణ వెల్లడించారు. గుంటూరులోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో గురువారం ఆయన వివరాలు తెలిపారు. జేఈఈ మెయిన్ పరీక్షలో భాష్యం విద్యార్థి ఎం.జిష్ణుసాయి ఆలిండియా టాప్ మార్కు 300కి 300 మార్కులు సాధించి 100 పర్సంటైల్‌తో ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 18వ ర్యాంకును సాధించారన్నారు. ఎం.సాయియశ్వంత్‌రెడ్డి 100 పర్సంటైల్‌తో ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 36వ ర్యాంకు, ఈడబ్ల్యూఎస్ విభాగంలో ఆలిండియా 4వ ర్యాంకు కైవసం చేసుకున్నారన్నారు. ఆలిండియా స్థాయిలో డి.భరత్‌చంద్ర 20వ ర్యాంకు, కె.జె.వివేక్ 33, జి.జాన్ 49, కె.హర్షిత 50, పి.శ్యామ్ 62, జె.మణిప్రదీప్ 69, కె.చైతన్య 77, ఎ.గణేషదత్తా 78, కె.శ్రేయ 82 ర్యాంకులు సాధించారన్నారు. 100 లోపు అత్యుత్తమ ర్యాంకులతో పాటు జాతీయ స్థాయిలో 200 లోపు 25 ర్యాంకులు, 500 లోపు 54 ర్యాంకులు, 1000 లోపు 78 ర్యాంకులు కైవసం చేసుకొని 71.68 శాతం ఫలితాలతో భాష్యం విద్యార్థులు సత్తా చాటారన్నారు. ర్యాంకర్లను భాష్యం విద్యాసంస్థల డైరెక్టర్ హనుమంతరావు, భాష్యం ఐఐటీ జేఈఈ కోఆర్డినేటర్ ఆనంద్ తదితరులు అభినందించారు.


ఆంధ్రప్రదేశ్‌లో భూ బకాసురుడు జగన్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు

భూ దోపిడీ కోసమే!

» ల్యాండ్ టైటిలింగ్ చట్టం తెచ్చింది అందుకే

» ఎన్డీయే కూటమి నేతలు శివశంకర్, పట్టాభి, భానుప్రకాశ్ ధ్వజం

అమరావతి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): భూ దోపిడీని ప్రోత్సహించేలా వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టం రూపకల్పన జరిగిందని జనసేన, టీడీపీ, బీజేపీ నేతలు ఆరోపించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను నిరసిస్తూ ఆ పార్టీల నేతలు గురువారం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి టి.శివశంకర్ మాట్లాడుతూ లోపభూయిష్టంగా ఉన్న ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని కేంద్రం వ్యతిరేకించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కొన్ని సవరణలు చేసి అమలు చేసేందుకు ప్రయత్నిస్తోందనననన్నారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టాభిరామ్ మాట్లాడుతూ జగనన్న భూరక్ష పేరుతో సీఎం జగన్ భూ భక్షణకు పాల్పడుతున్నారన్నారు. రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగానికి బదులు జగన్మోహన్ రెడ్డి రాజ్యాంగం అమలవుతోందని ప్రజలు భావిస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాశ్ రెడ్డి ఆరోపించారు.

మంత్రా మజాకా..!

(మొదటి పేజీ తరువాయి)

రూ.4లక్షల నుంచి రూ.5 లక్షలు మంత్రిగారి ఖాతాకు వెళ్లాయి. అందులో 653 మందిని ఎన్నికలకు రెండు నెలల ముందు బదిలీ చేయడం గమనార్హం. తాజాగా చేసిన ఈ అక్రమాల తతంగానికి పాఠశాల విద్యాశాఖ ఇప్పుడు ఆమోద ముద్ర వేసింది. ఇలా అక్రమంగా బదిలీ చేసిన 653 మంది ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల జీతాలకు ఇబ్బంది రాకుండా ట్రెజరీ శాఖతో సమన్వయం చేసుకోవాలంటూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్ కుమార్ తాజాగా రాటిఫికేషన్ ఉత్తర్వులు జారీచేశారు. అయితే వీరిని ఎన్నికల కోడ్ అనంతరం రిలీవ్ చేయాలని ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది. బదిలీ అయిన టీచర్లు ఇంకా కొత్త పాఠశాలలకు వెళ్లకపోయినా సీనియర్ మంత్రికి మాత్రం దాదాపు రూ.50 కోట్ల మేర ముడుపులు అందాయి. ఆ మంత్రిగారి కుటుంబంలో ఎక్కువ మంది ఎన్నికల్లో పోటీ చేస్తున్నందున ఈ ముడుపులు ఎన్నికల ఖర్చులకు సరిపోతాయిలే అనే గుసగుసలు వినిపిస్తున్నాయి. పనిలో పనిగా ఆ మంత్రిలో పేషీలోని అనధికారిక అధికారులు, పాఠశాల విద్యాశాఖలో కొందరు అధికారులు, సచివాలయంలోని అధికారులు భారీగా జేబులు నింపుకొన్నారు.

కౌన్సెలింగ్ విధానానికి తూట్లు..

పాఠశాల విద్యాశాఖలో ప్రస్తుతం 1.7లక్షల మంది టీచర్లు పనిచేస్తున్నారు. ఇంత పెద్ద సంఖ్యలో ఉద్యోగులున్న శాఖ మరొకటి లేదు. అందువల్ల బదిలీల్లో కౌన్సెలింగ్ విధానాన్ని అమలుచేస్తున్నారు. అక్రమాలకు అవకాశం ఉండకూడదని టీచర్లు ఏళ్లపాటు పోరాటం చేసి ఈ కౌన్సెలింగ్ విధానాన్ని సాధించుకున్నారు. అయినా కౌన్సెలింగ్ అనంతరం అడపాదడపా కొంతమంది టీచర్లను ప్రభుత్వం సిఫారసుల పేరిట బదిలీలు చేయడం సర్వసాధారణంగా మారింది. గత ప్రభుత్వాల్లో ఈ తరహా బదిలీలు స్వల్పంగా ఉండేవి. కానీ, వందల సంఖ్యలో అక్రమంగా సిఫారసు బదిలీలు చేసుకోవచ్చనే విధానానికి జగన్ ప్రభుత్వం నాంది పలికింది. సిఫారసు బదిలీలు అవుతాయన్న నమ్మకంతోనే కొందరు టీచర్లు తెలివిగా బదిలీలకు దరఖాస్తు చేసుకోవట్లేదు. బదిలీలన్నీ ముగిశాక కావాల్సిన పాఠశాల కోరుకుని దర్జాగా అక్కడకు వెళ్లిపోతున్నారు. పాఠశాల విద్యాశాఖలో పెద్దఎత్తున ఖాళీలు ఉన్నందున ప్రతి పాఠశాలలోనూ కొన్ని టీచర్ పోస్టులు ఖాళీగా ఉంటాయి. అక్రమ బదిలీలు కోరుకునే వారికి ఇదే వరం అవుతోంది. ఏ పాఠశాలకైనా ఇష్టమొచ్చినట్లు బదిలీ చేయించుకునే వెసులుబాటు దొరుకుతోంది. దీనిపై ఇప్పుడు టీచర్లలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఇలా వందల సంఖ్యలో అక్రమ బదిలీలు చేయడంతో ఇకపై సాధారణ బదిలీలు నామమాత్రంగా మారిపోతాయని భయపడుతున్నారు.

పేషీలోనే వసూళ్ల వ్యవహారం

వసూళ్ల వ్యవహారం మొత్తం సీనియర్ మంత్రి పేషీ కేంద్రంగానే జరిగింది. తొలుత క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధుల నుంచి టీచర్లు సిఫారసు లేఖలు తెచ్చుకున్నారు. వాటిని చూపించి మంత్రి కార్యాలయం దోపిడీకి తెరతీసింది. మొదట అలాంటి అక్రమ బదిలీలు తనకు ఇష్టం లేదన్నట్లు మంత్రి అంటీముట్టనట్లుగా వ్యవహరించారు. దీంతో ఎలాగైనా బదిలీ కావాలని కోరుకునే టీచర్లు కొందరు మంత్రి పేషీలోని వారికి ముడుపులు సమర్పించుకున్నారు. అలా అందరూ ఎంతో కొంత ఇచ్చుకున్న తర్వాత బదిలీలు చేయాలని మౌఖిక ఆదేశాలు వెలువడ్డాయి. తొలుత ఇష్టం లేదన్నట్లు వ్యవహరించడం కూడా వసూళ్ల వ్యవహారంలో భాగమేనని టీచర్లు తర్వాత అర్థం చేసుకున్నారు. సిఫారసు లేఖలు తెచ్చుకున్న వెంటనే బదిలీలు చేసి ఉంటే మంత్రి కార్యాలయానికి ముడుపులు అందవు. అందుకే మొదట ఇష్టం లేదన్నట్లు వ్యవహరించిన మంత్రి, ఆ తర్వాత ముడుపులు చేతికందగానే బదిలీలు చేయాలని ఆదేశించారు. ఇలా పక్కా ప్లాన్‌తో రెండు దశల్లో 1,200 మంది టీచర్లను అడ్డదారిలో బదిలీ చేశారు. కాగా, ముడుపులు ఇవ్వకుండా ఏవైనా కారణాలతో బదిలీలు కావాలని అడిగిన వారి దరఖాస్తులను మాత్రం పక్కనపెట్టేశారు.

స్టీల్ ప్లాంట్ ప్రయోజనాలు పరిరక్షించడం ముఖ్యం

» బొగ్గు నిల్వల ఓడను విశాఖ పోర్టుకు మళ్లించండి

» అదానీ పోర్టు యాజమాన్యానికి హైకోర్టు ఆదేశం

» బొగ్గు సరఫరా లేక ప్లాంట్ మూతపడే పరిస్థితి రావడం దురదృష్టకరం

» నిర్వాసిత కార్మికుల సమ్మె పరిష్కారానికి ఉన్నతాధికారులు చొరవ చూపాల్సింది

» సీఎస్ నుంచి వివరాలు తీసుకుని మా ముందుంచండి

» ప్రభుత్వ న్యాయవాదికి కోర్టు సూచన

» సీఎస్, పోలీసు కమిషనర్‌ను ప్రతివాదులుగా చేర్చాలని రిజిస్ట్రీకి నిర్దేశం

» విచారణ నేటికి వాయిదా

అమరావతి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గంగవరం అదానీ పోర్టులో నిర్వాసిత కార్మికుల సమ్మెతో విశాఖ స్టీల్ ప్లాంట్‌కు బొగ్గు సరఫరా నిలిచిపోయిందని, సమస్యకు పరిష్కారం కనుగొనేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. స్టీల్‌ప్లాంట్ ప్రయోజనాలు పరిరక్షించడం ముఖ్యమని వ్యాఖ్యానించింది. కర్మాగారానికి అవసరమైన బొగ్గు సరఫరా చేసేందుకు వీలుగా గంగవరం పోర్టులో అన్‌లోడ్ చేయకుండా ఉన్న కోకింగ్ కోల్ ఓడను విశాఖ పోర్టుకు మళ్లించాలని అదానీ పోర్టు యాజమాన్యాన్ని ఆదేశించింది. బొగ్గు సరఫరా లేక స్టీల్ ప్లాంట్ మూతపడే పరిస్థితి రావడం దురదృష్టకరమని వ్యాఖ్యానించింది. పోర్టు నిర్వాసిత కార్మికుల సమ్మె నేపథ్యంలో సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులు చొరవ చూపించి ఉండాల్సిందని పేర్కొంది. జిల్లా కలెక్టర్ ఎన్నికల విధుల్లో తీరికలేకుండా ఉన్నానని చెప్పడంపై విస్మయం వ్యక్తం చేసింది. బొగ్గు సరఫరా సమస్యకు పరిష్కారం చూపాలని ప్లాంట్ సీఎండీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖరాశారని గుర్తుచేసింది. ఈ వ్యవహారంపై సీఎస్ నుంచి వివరాలు తీసుకుని తమ ముందుంచాలని ప్రభుత్వ న్యాయవాదికి సూచించింది. ఈ వ్యాజ్యంలో సీఎస్, విశాఖ పోలీసు కమిషనర్‌ను ప్రతివాదులుగా చేర్చిన తర్వాతే వారికి తగిన ఆదేశాలు ఇవ్వగలమని పేర్కొంది. వారిద్దరినీ ప్రతివాదులుగా చేర్చాలని రిజిస్ట్రీని ఆదేశిస్తూ విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.జయసూర్య గురువారం ఆదేశాలిచ్చారు. నిర్వాసిత కార్మికుల సమ్మె కారణంగా గంగవరం పోర్టు నుంచి విశాఖ స్టీల్ ప్లాంట్‌కు బొగ్గు సరఫరాలో ఎలాంటి అవరోధాలు లేకుండా చర్యలు తీసుకునేలా విశాఖపట్నం జిల్లా కలెక్టర్‌ను ఆదేశించాలని కోరుతూ స్టీల్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.వెంకట దుర్గాప్రసాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం గురువారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది అంబటి శ్రీకాంత్‌రెడ్డి వాదనలు వినిపించారు. గంగవరం పోర్టులో కార్మికుల సమ్మెతో స్టీల్ ప్లాంట్‌కు బొగ్గు సరఫరా నిలిచిపోయిందన్నారు. బొగ్గు కొరతతో ప్లాంట్‌లోని మూడు ఫర్నేస్‌లలో ఒకటి మాత్రమే పనిచేస్తోందని.. మిగతా రెండు దెబ్బతిన్నాయని తెలిపారు. తిరిగి వాటిని ప్రారంభించాలంటే రూ.వేల కోట్లు ఖర్చవుతాయని.. ప్రస్తుతం ఉన్న బొగ్గు నిల్వలు కూడా కరిగిపోతే ప్లాంట్ మూతపడుతుందని.. వేల మంది కార్మికులు, ఉద్యోగుల జీవనోపాధి ప్రమాదంలో పడుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ తరఫున ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ... పోర్టు యాజమాన్యం, కార్మికుల మధ్య చర్చలు జరిగాయని.. అక్కడ జరిగిన ఒప్పందం ప్రకారం కార్మికులకు ప్రయోజనాలు కల్పించాలని పోర్టు యాజమాన్యానికి కలెక్టర్ సూచించారని తెలిపారు. కలెక్టర్ ప్రస్తుతం ఎన్నికల విధుల్లో తీరిక లేకుండా ఉన్నారన్నారు.

ఆ 500 మందికి నైపుణ్యం లేదు..

అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం తరఫున సీనియర్ న్యాయవాది వైవీ రవిప్రసాద్ వాదనలు వినిపించారు. పోర్టు నిర్మాణం కోసం దిబ్బపాలెం, గంగవరం గ్రామాల నుంచి 2 వేల ఎకరాలు సేకరించారని.. పునరావాస ప్యాకేజీ కింద ఈ రెండు గ్రామాలకు చెందిన 500 మందికి పోర్టులో ఉద్యోగాలు ఇచ్చారని తెలిపారు. 'వీరికి ఎలాంటి నైపుణ్యం లేదు. పోర్టు ఏర్పాటు చేసినప్పటి నుంచి వీరితో సమస్యగానే ఉంది. ప్రస్తుతం వారికి ప్రతి నెలా జీతం కింద రూ.22 వేల చొప్పున చెల్లిస్తున్నాం. ఈ మొత్తాన్ని రూ.36 వేలకు పెంచాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. వీఆర్‌ఎస్ తీసుకుని వెళ్లేందుకు ఒక్కో కార్మికుడికి రూ.50 లక్షలు చెల్లించాలని కోరుతున్నారు. ఈ డిమాండ్లతో 500 మంది కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా ఆకస్మాత్తుగా పోర్టు గేటు ముందు సమ్మెకు దిగడంతో కార్యకలాపాలు నిలిచిపోయాయి. పోర్టులో కార్యకలాపాలు నిలిచిపోవడం వల్ల యాజమాన్యం రోజూ రూ.5 కోట్లు నష్టపోతోంది. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు చెందిన 2.7 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు పోర్టులో ఉన్నాయి. 80 వేల మెట్రిక్ టన్నుల బొగ్గుతో ఒక ఓడను ఇప్పటికే విశాఖ పోర్టుకు తరలించాం. మరో ఓడ గంగవరం పోర్టులో అన్‌లోడ్ చేయకుండా ఉంది. పోర్టు వద్ద శాంతిభద్రతల సమస్య ఏర్పడింది. పోలీసు రక్షణ కోసం విశాఖ కమిషనర్‌కు లేఖ రాసినా ప్రయోజనం లేదు. పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు' అని వివరించారు. దీంతో సీఎస్‌ను, విశాఖ సీపీని వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చాలని రిజిస్ట్రీని న్యాయమూర్తి ఆదేశించారు.



స్టీల్‌ప్లాంట్ భూములు, ఆస్తులపై యథాతథ స్థితి పాటించండి

» కేంద్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

అమరావతి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారం భూములు, ఇతర ఆస్తుల విషయంలో యథాతథ స్థితి పాటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. కర్మాగారంలో ఉన్న వంద శాతం కేంద్ర ప్రభుత్వ పెట్టుబడులు మాత్రమే ఉపసంహరిస్తున్నామని, స్టీల్ ప్లాంట్‌కు సంబంధించిన భూములు, ఇతర ఆస్తులు విక్రయించబోమని కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) బి.నరసింహ చెప్పిన వివరాలను నమోదు చేసింది. స్టీల్ ప్లాంట్‌లో పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ, ఇతర వివరాలతో అదనపు అఫిడవిట్ వేసేందుకు కేంద్రానికి అనుమతిస్తూ విచారణను జూన్ 19కి వాయిదా వేసింది. ఈ మేరకు జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ ఎన్.విజయ్‌తో కూడిన ధర్మాసనం గురువారం ఆదేశాలిచ్చింది. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ గతంలో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఇదే వ్యవహారంపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్‌తో పాటు సువర్ణరాజు అనే వ్యక్తి వేర్వేరుగా పిల్స్ వేశారు. ఇవి ఇటీవల విచారణకు రాగా.. ఉక్కు కర్మాగారాన్ని ఏ చట్టాన్ని అనుసరించి ప్రైవేటీకరిస్తున్నారు.. ప్రైవేటీకరణ నిర్ణయానికి ముందు కర్మాగారం ఉద్యోగులు, రాష్ట్ర ప్రభుత్వం, ఇతర స్టేక్ హోల్డర్స్‌ను సంప్రదించారా.. ప్రైవేటీకరణకు బదులు ప్రత్యామ్నాయాలు పరిశీలించాలని కోరుతూ ముఖ్యమంత్రి రాసిన లేఖపై ఏం నిర్ణయం తీసుకున్నారంటూ కేంద్రానికి హైకోర్టు పలు ప్రశ్నలు సంధించింది. పూర్తి వివరాలతో అదనపు అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ వాజ్యాలు గురువారం మరోసారి విచారణకు వచ్చాయి.కోర్టు ఆదేశాలకు అనుగుణంగా పూర్తి వివరాలతో అదనపు అఫిడవిట్ వేశామని కేంద్రం తరఫున ఏఎస్‌జీ బి.నరసింహ, సీవీఆర్ రుద్రప్రసాద్ తెలియజేశారు. అయితే అందులో హైకోర్టు వేసిన ఏ ప్రశ్నకూ సమాధానం లేదని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ తెలిపారు. ప్రత్యామ్నాయాలు పరిశీలించాలంటూ ముఖ్యమంత్రి రాసిన లేఖకు కేంద్ర ఆర్థిక మంత్రి సమాధానం రాశారని ఏఎస్‌జీ చెప్పారు. ప్లాంట్ ఆస్తులు విక్రయిస్తున్నామన్న పిటిషనర్ ఆరోపణలో వాస్తవం లేదన్నారు. కర్మాగారంలో వంద శాతం కేంద్ర ప్రభుత్వ పెట్టుబడులు మాత్రమే ఉపసంహరిస్తున్నామని, స్టీల్ ప్లాంట్‌కు చెందిన ఒక్క ఎకరం భూమిని గానీ, ఇతర ఆస్తులను గానీ విక్రయించడం లేదన్నారు. కర్మాగారాన్ని ప్రైవేటీకరిస్తున్నాం తప్ప మూసివేయడం లేదన్నారు. తాను చెప్పిన వివరాలు నమోదు చేయాలని అభ్యర్థించారు. ధర్మాసనం స్పందిస్తూ.. స్టీల్ ప్లాంట్ భూములు, ఇతర ఆస్తులు విషయంలో కోర్టు వేసవి సెలవులు ముగిసేవరకు యథాతథ స్థితి పాటిస్తారా అని ప్రశ్నించింది. అందుకు ఏఎస్‌జీ సమ్మతించడంతో ఆయన చెప్పిన వివరాలను ధర్మాసనం నమోదు చేసింది. యథాతథ స్థితి పాటించాలని కేంద్రాన్ని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది. అంతకుముందు పిటిషనర్ల తరఫున న్యాయవాది వై.బాలాజీ వాదనలు వినిపిస్తూ... కేంద్రం చెప్పిన వివరాలు నమోదు చేసి వ్యాజ్యాలను వాయిదా వేస్తే అభ్యంతరం లేదన్నారు. ఉక్కు కర్మాగారానికి అవసరమైన నిధులను విదేశాల నుంచి తెచ్చేందుకు, విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సీఆర్‌ఏ) కింద ప్రత్యేక ఖాతా తెరిచేందుకు అనుమతించాలని విజ్ఞప్తి చేసినప్పటికీ కేంద్రం నుంచి స్పందన లేదని స్వయంగా వాదనలు వినిపిస్తున్న (పార్టీ ఇన్ పర్సన్) కేఏ పాల్ తెలిపారు.

రారెత్తిస్తున్న ఎండలు.. వడగాడ్పులు

» నందవరంలో 45.6, రాజాంలో 45.5 డిగ్రీల నమోదు

అమరావతి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎండలు రారెత్తిస్తున్నాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటుతున్నాయి. వడగాడ్పులు అంతకంతకూ పెరుగుతున్నాయి. గురువారం రాష్ట్రవ్యాప్తంగా 16 జిల్లాల్లో 43 డిగ్రీల కన్నా అధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వాతావరణ శాఖ అంచనాకు మించి ఎక్కువ మండలాల్లో వడగాడ్పులు వీస్తున్నాయి. నంద్యాల జిల్లా నందవరంలో 45.6, విజయనగరం జిల్లా రాజాంలో 45.5, డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 102 మండలాల్లో వడగాడ్పులు వీచాయి. మరో 72 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీచాయి. శుక్రవారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, జిల్లాల్లోని 56 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అలాగే శ్రీకాకుళం తిరుపతి వరకు, శ్రీ సత్యసాయి జిల్లాతో సహా 174 మండలాల్లో వడగాడ్పులు ఉంటాయని హెచ్చరించింది. మరోవైపు.. రాష్ట్రంలో వేసవి తీవ్రతతో సమానంగా విద్యుత్తు డిమాండ్ కూడా కొనసాగుతోంది. బుధవారం నాడు రాష్ట్రంలో 246.141 మిలియన్ యూనిట్ల విద్యుత్తు వాడకం నమోదైంది. బహిరంగ మార్కెట్లో 40.842 మిలియన్ యూనిట్లను సమీకరించింది. ఇందులో స్వల్పవ్యవధి కింద 36.042 మిలియన్ యూనిట్లను రూ.27.324 కోట్లతో కొనుగోలు చేశారు. రాష్ట్ర థర్మల్ విద్యుత్తు సంస్థలలో బొగ్గు నిల్వలు బొటాబొటీగానే ఉన్నాయి.

'చంద్రగిరి'లో రాళ్లదాడి!

» వైసీపీ, టీడీపీ అభ్యర్థుల నామినేషన్ల సందర్భంగా ఉద్రిక్తత

» తిరుపతిలో నామినేషన్ కేంద్రం వద్ద తోపులాటలు.. పరస్పర కవ్వింపులు

» ఎమ్మెల్యే చెవిరెడ్డి వాహనంపై దాడి


టీడీపీ శ్రేణులపైకి రాళ్లు విసురుతున్న వైసీపీ కార్యకర్తలు

తిరుపతి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి), సూళ్లూరుపేట: తిరుపతి జిల్లా చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో వైసీపీ, టీడీపీ అభ్యర్థుల నామినేషన్ల సందర్భంగా గురువారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. చంద్రగిరి వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థి పులివర్తి వెంకటమణి ప్రసాద్(నాని) గురువారం నామినేషన్లు దాఖలు చేసేందుకు బయలుదేరారు. ఈ నేపథ్యంలో చంద్రగిరిలో వేర్వేరుగా భారీ ర్యాలీలు నిర్వహించారు. పోటాపోటీగా జనసమీకరణ చేయడంతో వేల సంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చారు. మోహిత్, ఆయన తండ్రి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఆర్డీవో కార్యాలయంలోకి వెళ్లిన కాసేపటికి పులివర్తి నానీ కూడా లోనికి వెళ్లారు. వెలుపల టీడీపీ కార్యకర్తలు నినాదాలు చేస్తుండడంతో వైసీపీ కార్యకర్తలు ప్రతిగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో పరస్పరం ఘర్షణ పడ్డారు. రాళ్లు, జెండా కర్రలతో దాడి చేసుకున్నారు. అయితే.. దీనిని ముందుగానే నియంత్రించాల్సిన పోలీసులు.. తాపీగా తేరుకుని.. వెంటనే లాఠీచార్జి చేశారు. అదికూడా టీడీపీ వారినే లక్ష్యంగా చేసుకుని చెదరగొట్టడంతో కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. భాస్కర రెడ్డి వాహనంపై జెండా కర్రలు, రాళ్లతో దాడి చేశారు.

సూళ్లూరుపేటలో వైసీపీ నేతల బాహాబాహీ

తిరుపతి జిల్లా సూళ్లూరుపేట వైసీపీ అభ్యర్థి నామినేషన్ ర్యాలీలో ఆ పార్టీకే చెందిన నెల్లూరు డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, సూళ్లూరుపేట పట్టణ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్‌రెడ్డి బాహాబాహీకి దిగారు. సిట్టింగ్ ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్య ముందే ప్రచార రథంలో పరస్పరం తోపులాటకు దిగారు. నువ్వెంతంటే నువ్వెంతంటూ తొడగొట్టి.. చెప్పులతో కొట్టుకొనే వరకు దిగారు.

'పసుపు' తీసేయండి.. వైసీపీ కండువా కప్పుకోండి

» కర్ణాటక డోలు కళాకారుల పట్ల వైసీపీ కార్యకర్తల అనుచిత ప్రవర్తన


డోలు కళాకారులపై దాడికి యత్నిస్తున్న వైసీపీ కార్యకర్తలు

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 25: కర్ణాటకకు చెందిన డోలు కళాకారుల పట్ల వైసీపీ నాయకులు, కార్యకర్తలు అనుచితంగా వ్యవహరించారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో వైసీపీ అభ్యర్థి, మంత్రి ఉష శ్రీచరణ్ గురువారం నామినేషన్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి కర్ణాటకలోని రాంనగర్‌కు చెందిన ఏడుగురు డోలు కళాకారులను రప్పించారు. ఉష శ్రీచరణ్ ఇంటి సమీపంలోని టీటీడీ కల్యాణ మండపం వద్ద డోలు వాయిస్తున్న కళాకారులపై ఒక్కసారిగా వైసీపీ కార్యకర్తలు విరుచుకుపడి, దాడికి యత్నించారు. ఆ కళాకారులు.. టీడీపీ రంగు అయిన పసుపు రుమాలు, భుజానికి అదే రంగు కుచ్చిళ్లు ధరించడమే ఇందుకు కారణం. వాటిని తీసేసి, వైసీపీ కండువాలు కట్టుకుని డోలు వాయించాలని దౌర్జన్యం చేశారు. కళాకారుల నెత్తిన ఉన్న రుమాళ్లను బలవంతంగా తొలగించారు. దీంతో కళాకారులు మనస్తాపం చెంది, డోలు వాయించకుండా ఓ మూలన కూర్చుండిపోయారు.

ఐ-టీడీపీ కార్యకర్తపై వైసీపీ వర్గీయుల దాడి

రాయదుర్గం, ఏప్రిల్ 25: అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గంలో ఐ-టీడీపీ నాయకుడిపై వైసీపీ వర్గీయులు గురువారం దాడికి పాల్పడారు. మల్లాపురం తండాకు చెందిన కృష్ణానాయక్ వృత్తి రీత్యా టైలర్. ఐ-టీడీపీ రాయదుర్గం మండల అధ్యక్షుడిగా ఉన్నారు. టైలరింగ్ పనుల కోసం గురువారం రాయదుర్గం పట్టణానికి బైక్‌పై బయలుదేరాడు. పట్టణంలో వైసీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి నామినేషన్ ర్యాలీ జరుగుతుండగా, ఎటూ పోలేక మధ్య నుంచి వాహనాన్ని నడిపాడు. కృష్ణానాయక్ చొక్కా జేబులో ఉన్న ఫోన్‌పై 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ' లోగో వైసీపీ వారికి కనిపించింది. టీడీపీ కార్యకర్తగా నిర్ధారించుకుని మూకుమ్మడి దాడికి పాల్పడటంతో కృష్ణా నాయక్‌కు భుజం, కాళ్లుచేతులకు గాయాలయ్యాయి. బాధితుడు వారి నుంచి తప్పించుకుని పరుగులు పెడుతూ టీడీపీ కార్యాలయం వద్దకు చేరుకున్నాడు. టీడీపీ నాయకులు అతన్ని వెంటనే స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స చేయించారు.

చెవిరెడ్డిపై చర్యలు తీసుకోవాలి: టీడీపీ

అమరావతి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులపై బెదిరింపులకు దిగిన ఒంగోలు వైసీపీ ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన ఆంధ్ర వర్సిటీ వీసీ ప్రసాద్‌రెడ్డిపై టీడీపీ నేతలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. పోస్టల్ బ్యాలెట్ గడువును ఈ నెల 30 దాకా పొడిగించాలని కోరారు. గురువారం అమరావతి సచివాలయంలో అదనపు ఎన్నికల అధికారిని టీడీపీ నేతలు దేవినేని ఉమామహేశ్వరరావు, పర్చూరి అశోక్‌బాబు, ఏఎస్ రామకృష్ణ, మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, కోనేరు సురేశ్ కలసి, వినతి పత్రాలు అందజేశారు.

పోస్టల్ బ్యాలెట్ గడువు పొడిగింపునకు బొప్పరాజు వినతి

అమరావతి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు సమర్పించేందుకు 30వ తేదీ వరకూ అవకాశం కల్పించాలని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. గురువారం అమరావతి సచివాలయంలో అడిషనల్ సీఈవో హరేంద్రప్రసాద్‌ను కలిసిన ఆయన ఫామ్ 12 సమర్పించడానికి గడువును 30వ తేదీ వరకూ పొడిగించాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు.

41ఏ నిబంధనలు పాటించండి

» రమణ దీక్షితులు విషయంలో పోలీసులకు హైకోర్టు ఆదేశం

తిరుమల శ్రీవారి ఆలయం, టీటీడీ అధికారుల ప్రతిష్ఠను దిగజార్చేలా వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో నమోదైన కేసులో టీటీడీ గౌరవ మాజీ ప్రధాన అర్చకులు రమణదీక్షితులు విషయంలో సీఆర్పీసీ సెక్షన్ 41(ఏ)నిబంధనలు పాటించాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. అర్నేశ్‌కుమార్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను అనుసరించాలని స్పష్టం చేసింది. దర్యాప్తును కొనసాగించేందుకు పోలీసులకు వెసులుబాటు కల్పిస్తూ వ్యాజ్యాన్ని పరిష్కరించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి గురువారం ఉత్తర్వులిచ్చారు.

రాయ్ బరేలీలో పోటీకి వరుణ్ గాంధీ 'నో'!

బీజేపీ ఎంపీ వరుణ్ గాంధీకి ఆ పార్టీ నాయకత్వం రాయ్ బరేలీ టికెట్ ఆఫర్ చేయగా ఆయన తిరస్కరించినట్లు సమాచారం. ఈ స్థానంలో ప్రియాంకా గాంధీ పోటీ చేసే అవకాశం ఉండడమే ఆయన నిర్ణయానికి కారణం. ఆయన ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లోని పిలిభీత్ లోక్‌సభ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

పోటీలో కల్పనా సోరెన్

ఝార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్ భార్య కల్పన.. గాండేయ్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నారు. ఈ విషయాన్ని జేఎంఎం పార్టీ గురువారం ప్రకటించింది. ఈ స్థానానికి మే 20న ఉప ఎన్నిక జరగనుంది.

మతచిచ్చు రగల్చటం మీకు అలవాటుగా మారింది

» ప్రధాని పదవికున్న ప్రతిష్ఠను మీరు దిగజారుస్తున్నారు

» మోదీపై ఖర్గే నిప్పులు.. లేఖ రాసిన కాంగ్రెస్ అధ్యక్షుడు



న్యూఢిల్లీ, ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): 'మాటలను వక్రీకరించటం, ప్రజల మధ్య మతచిచ్చు రగల్చటం మీకు అలవాటుగా మారింది. ఈ విధమైన మాటలతో మీరు ప్రధాని పదవికున్న ప్రతిష్ఠను దిగజారుస్తున్నారు' అంటూ ప్రధాని మోదీపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. దేశంలో పెరుగుతున్న ఆర్థిక అంతరాలు, ధనికులు-పేదల మధ్య వ్యత్యాసాల గురించి తాము మాట్లాడుతుంటే.. ప్రజలను హిందువులు, ముస్లింలుగా ఎందుకు విడదీస్తున్నారని మోదీని ప్రశ్నించారు. 'మా పార్టీ మేనిఫెస్టోలో చెప్పని వాటి గురించి మీ సలహాదారులు మీకు తప్పుడు సమాచారం ఇస్తున్నట్లు అర్థమవుతోంది. దేశ ప్రధాని హోదాలో మీరు అబద్ధాలు మాట్లాడకుండా.. మీ వద్దకు నేనే వచ్చి మా మేనిఫెస్టో గురించి స్వయంగా వివరిస్తా. నాకు సమయం ఇవ్వండి' అని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజల సంపదను ముస్లింలకు పంచుతుందని, సంపదను, బంగారాన్ని, చివరికి మంగళసూత్రాలను కూడా లాక్కొని పునఃపంపిణీ చేస్తుందని మోదీ ఆరోపిస్తున్న నేపథ్యంలో ఆయనకు ఖర్గే గురువారం లేఖ రాశారు. ఆ లేఖను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. మోదీ, బీజేపీ నేతల వ్యాఖ్యలు చూసి తాము ఆశ్చర్యపోవటమో, దిగ్భ్రాంతికి గురికావటమో జరగలేదని, తొలిదశ ఎన్నికల్లో బీజేపీ పరిస్థితి చూశాక వారిలా మాట్లాడుతారని ఊహించిందేనని ఖర్గే పేర్కొన్నారు. 'మీరు పని చేసేదే కార్పొరేట్ కంపెనీల కోసం. వారికి లక్షల కోట్ల పన్ను రాయితీలు ఇచ్చే మీరు పేదలు తినే ఆహారం, చివరికి ఉప్పు మీదా జీఎస్టీ వేస్తారు. పేదల సంక్షేమం, ఆర్థిక అంతరాల గురించి మేం మా మేనిఫెస్టోలో మాట్లాడుతుంటే మీరు హిందూ-ముస్లిం అని విబేధాలు సృష్టిస్తున్నారు' అని ఖర్గే నిప్పులు చెరిగారు. పేదలు బ్యాంకుల్లో దాచుకున్న డబ్బును రుణాల రూపంలో ధనికులకు కట్టబెట్టేందుకే పెద్దనోట్లను రద్దు చేశారని, తర్వాత ఆ రుణాలనూ రద్దు చేశారన్నారు. 2014 నుంచి ఇప్పటివరకు 3లక్షల కోట్ల కార్పొరేట్ల రుణాలను రద్దుచేసి ఆ సంపదను పేదల నుంచి ధనికులకు మళ్లించారన్నారు. ఈ పదేళ్లలో ఒక్క రైతు రుణాన్ని మోదీ రద్దు చేయలేదన్నారు. మణిపూర్‌లో మహిళలపై జరిగిన దారుణ అత్యాచారాలకు, రేపిస్టుల మెడ లో దండలు వేసి సత్కరించిన ఘటనలకు మోదీ ప్రభుత్వం బాధ్యత వహించదా?అని ప్రశ్నించారు. అటువంటి మీరు మహిళల మంగళసూత్రాల గురించి మాట్లాడటమేమిటని మోదీని నిలదీశారు.

మా పార్టీ మేనిఫెస్టోలో వారసత్వ పన్ను ప్రస్తావన లేదు: జైరాం రమేష్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వారసత్వ పన్నుపై కాంగ్రెస్ నేత శామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యల పట్ల దుమారం రేగుతున్న నేపథ్యంలో ఆ పార్టీ ఎంపీ జైరాంరమేష్ స్పందించారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో వారసత్వ పన్ను ప్రస్తావనేలేదన్నారు. ఆ అంశం గురించి తామెప్పుడూ మాట్లాడలేదని, అది తమ ఎజెండాలోలేదని పేర్కొన్నారు. 1985లో ప్రధానిగా ఉన్న రాజీవ్‌గాంధీ వారసత్వ పన్నును రద్దు చేశారన్నారు. ఏఐసీసీ కేంద్ర కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో జైరాం మాట్లాడుతూ తమ పార్టీ మేనిఫెస్టోలో సంపద పునఃపంపిణీ గురించి లేదన్నారు.

కేరళ తీర్పు.. వయా వయనాడ్

జాతీయ స్థాయిలో కాంగ్రెస్, లెఫ్ట్ దోస్తీ.. ఇక్కడ కుస్తీ.. వయనాడ్ నుంచి పోటీలో రాహుల్

» ఆయనకు సీపీఐ జాతీయ కార్యదర్శి రాజా భార్య అన్నీ రాజా సవాల్

(సెంట్రల్ డెస్క్)

దేవుడి సొంత నేల.. కొబ్బరి నేల.. చైతన్యానికి నెలవైన కేరళ ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో ఎలాంటి తీర్పు ఇవ్వనుందోననే ఆసక్తి నెలకొంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పదిహేను సీట్లతో పట్టం కట్టిన మలయాళీలు.. అధికార లెఫ్ట్ ఫ్రంట్‌ను ఒక్క స్థానానికే పరిమితం చేశారు. అసెంబ్లీ సమరంలో మాత్రం హస్తాన్ని పక్కనపెట్టి వామపక్ష ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించారు. ఇప్పటి విషయానికి వస్తే.. బీజేపీని ఓడించడమే లక్ష్యంగా ఏర్పడిన ఇండి యా కూటమిలో లెఫ్ట్, కాంగ్రెస్ ప్రధాన పార్టీలు. కేరళలో మాత్రం ఈ రెండింటి మధ్య తీవ్ర పోటీ నెలకొంది. వయనాడ్‌లో కాంగ్రెస్ అగ్ర నేత, సిటింగ్ ఎంపీ రాహుల్ గాంధీని సాక్షాత్తు సీపీఐ జాతీయ కార్యదర్శి ఎ.రాజా భార్య అన్నీ రాజా సవాల్ చేస్తుండడమే దీనికి నిదర్శనం. పరస్పరం ఢీకొంటే దిగితే తప్పుడు సంకేతాలు వెళ్తాయని లెఫ్ట్ వారించినా.. కాంగ్రెస్ రాహుల్‌నే అభ్యర్థిగా ప్రకటించింది. ఈ ఘర్షణ జాతీయ స్థాయిలో ఆసక్తితో పాటు ఇండియా కూటమిలో అపనమ్మకాన్నీ కలిగించింది. కూటమిలో లుకలుకలను బయటపెడుతూ కేరళ రాజకీయాల్లో పాగాకు బీజేపీ చేస్తున్న పోరాటానికి మార్గం సుగమం చేస్తుందన్న అభిప్రాయం వ్యక్తమైంది. దీనికితగ్గట్టే లెఫ్ట్, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ప్రధాని మోదీ ఎప్పటికప్పుడు 'ఢిల్లీ మే దోస్తీ.. కేరళ మే కుస్తీ' నినాదాన్ని ప్రస్తావించారు. కాగా, కేరళలో కాంగ్రెస్, వామపక్షాలు పరస్పర పోటీ, బయట పొత్తు పెట్టుకోవడంపై రాష్ట్ర ఓటర్లలో ఎలాంటి అయోమయం లేదని.. ఇండియా నేతలు పేర్కొంటున్నారు. రాష్ట్ర, జాతీయ ఎన్నికల మధ్య తేడాను గుర్తించే పరిపక్వత వారికి ఉందని అంటున్నారు.

రాహుల్, కేసీ, థరూర్..


2019లోనే వయనాడ్ నుంచి రాహుల్ పోటీపై అభ్యంతరాలు వ్యక్తం చేసిన వామపక్షాలు ఈసారి కూడా అదే ధోరణి కనబరిచాయి. సురక్షిత స్థానం కావాలనుకుంటే మరో దక్షిణాది రాష్ట్రాన్ని ఎందుకు ఎంచుకోలేదని ప్రశ్నించాయి. దూరదృష్టి లేని కేరళ కాంగ్రెస్ నేతలు రాహుల్‌ను పోటీ చేయాలంటూ బలవంతం చేశారని సీపీఐ ఆరోపించింది. మిత్రపక్షాల అభ్యర్థిగా రాహుల్ ఒక్కరే బరిలో నిలవాల్సి ఉండగా.. అన్నీ రాజా పట్టుబట్టడంతో కాదనలేని పరిస్థితి ఏర్పడింది. కాగా, వయనాడ్‌లో బీజేపీ తరఫున ఆ పార్టీ కేరళ అధ్యక్షుడు కె.సురేంద్రన్ బరిలో ఉన్నారు. ఈ స్థానంలోనే కాక.. అలప్పుళ కూడా లెఫ్ట్, కాంగ్రెస్ మధ్య మంటలు రేపుతోంది. ఇక్కడ సీపీఎం ఎంపీ ఏఎం ఆరిఫ్‌తో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడైన కేసీ వేణుగోపాల్ తలపడుతున్నారు. అలప్పుళ నుంచి కేసీ రెండుసార్లు (2009, 2014) గెలిచారు. తిరువనంతపురంలో కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖరన్‌తో కేంద్ర మాజీ మంత్రి శశి థరూర్ తలపడుతున్నారు. కాగా, ఎన్నికల్లో పోటీపరంగానే కాక.. కాంగ్రెస్-లెఫ్ట్ సైద్ధాంతికంగానూ తలపడ్డాయి. ముస్లింలకు సంబంధించిన విషయాల్లో కాంగ్రెస్ మొండి వైఖరిపై వామపక్షాలు ప్రధానంగా ఆరోపణలు చేశాయి. అయోధ్య, ఆర్టికల్-370 రద్దు అంశాల్లో కాంగ్రెస్ సాఫ్ట్ హిందుత్వ వైఖరిని అవలంబించిందని సీపీఎం ఆరోపిస్తోంది. దీనికి ప్రతిగా.. కేరళ బయట తాము సాఫ్ట్ హిందుత్వతో ఉంటే.. రాజస్థాన్‌లో సీపీఎం తమ మద్దతు ఎందుకు తీసుకుంటోందని కాంగ్రెస్ నిలదీసింది.





త్రిముఖ పోరులో రాహుల్ వైపే మొగ్గు

గత ఎన్నికల్లో తొలిసారి దేశవ్యాప్తంగా మార్మోగిన వయనాడ్‌లో రాహుల్ 4.37 లక్షల ఓట్ల ఆధిక్యంతో ఘనవిజయం సాధించారు. వయనాడ్ 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నాలుగు చోట్ల ముస్లింలదే ఆధిపత్యం. వీరిలో అత్యధికం కాంగ్రెస్‌కు మద్దతుగా నిలుస్తున్నారు. ఇప్పుడు రాహుల్, అన్నీ, సురేంద్రన్ మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. అయితే, గెలవడం అంత సులువు కాదని తెలిసిన వామపక్షాలు.. రాహుల్ ఆధిక్యాన్ని వీలైనంత తగ్గించేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. కాగా, సురేంద్రన్ కూడా పెద్దఎత్తున ప్రచారం చేశారు.



అందరి కన్నూ మైనారిటీలపైనే!

కేరళలో మైనారిటీల ఓట్లే కీలకం. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో ముస్లింలు, క్రైస్తవులు కలిపి 44.9% వరకు ఉన్నారు. ఇప్పుడు ఈ సంఖ్య మరింత పెరిగి ఉండొచ్చు కూడా. లోక్‌సభ ఎన్నికల్లో వీరి ఓట్ల కోసం పాలక లెఫ్ట్ డెమోక్రాటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్), విపక్ష యునైటెడ్ డెమోక్రాటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) విస్తృత ప్రయత్నాలు చేస్తున్నాయి. రాష్ట్రంలో 20 లోక్‌సభ స్థానాలు ఉండగా.. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ ఏకంగా 19 స్థానాలను కైవసం చేసుకుంది. లెఫ్ట్‌కు ఒక్కటే దక్కింది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో రివర్స్ అయింది. ప్రజలు అనూహ్యంగా పినరయి విజయన్ సారథ్యంలోని ఎల్‌డీఎఫ్‌కు రెండోసారి అధికారం కట్టబెట్టారు. కేరళలో ప్రతి ఐదేళ్లకు ప్రభుత్వం మారిపోవడం రివాజుగా వస్తోంది. విజయన్ దానిని బద్దలు కొట్టారు. ముస్లింలు, క్రైస్తవులు ఆయన నాయకత్వం వైపు మొగ్గుచూపారు. ఇప్పుడు 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ ఈ విజయపరంపర కొనసాగించాలని ఎల్‌డీఎఫ్ భావిస్తోంది. అటు యూడీఎఫ్ కూడా రాహుల్ సారథ్యంలో మళ్లీ అత్యధిక సీట్లు గెలుచుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది.

అమేఠీలో రాహుల్ రాయ్ బరేలీలో ప్రియాంక!

» లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి నిర్ణయం!

» నాలుగైదు రోజుల్లో ప్రకటించే చాన్స్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. దేశంలోనే అత్యధిక లోక్‌సభ స్థానాలు కలిగిన ఉత్తరప్రదేశ్‌లో బీజేపీని నియంత్రించేందుకు ప్రయత్నిస్తోంది. అందులో భాగంగా అమేఠీ, రాయ్ బరేలీ లోక్‌సభ స్థానాల్లో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ బరిలో నిలవాలని నిర్ణయించుకున్నట్టు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ విషయమై ఇప్పటికే కాంగ్రెస్ కీలక నేతల మధ్య చర్చ జరిగినట్టు తెలిసింది. బీజేపీ తనకు అత్యంత బలమైన రాష్ట్రంగా భావిస్తున్న ఉత్తరప్రదేశ్‌లో గాంధీ కుటుంబం నుంచి ఇద్దరు బరిలో నిలవడం ద్వారా కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం వస్తుందని ఆ పార్టీ భావిస్తున్నట్టు సమాచారం. ఈ విషయమై సోనియాగాంధీ సైతం సుముఖత వ్యక్తం చేసినట్టు తెలిసింది. నాలుగైదు రోజుల్లో దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

బాల రాముడి దర్శనం తర్వాత నామినేషన్!

బీజేపీ దేశవ్యాప్తంగా అయోధ్య రాముడి పేరును ప్రచారంలో కీలక అస్త్రంగా మలుచుకుంటోంది. అయితే, ఇప్పటి వరకు రాహుల్, ప్రియాంక అయోధ్య రాముడిని దర్శించుకోలేదు. అందుకే అమేఠీ, రాయ్ బరేలీ స్థానాల్లో నామినేషన్ వేయడానికి ముందే అయోధ్య బాలరాముడిని ఇద్దరూ దర్శించుకోనున్నట్టు తెలిసింది. మే 20న అమేఠీ, రాయ్ బరేలీ స్థానాల్లో పోలింగ్ జరగనుంది. కాగా, అమేఠీ, రాయ్ బరేలీ లోక్‌సభ నియోజకవర్గాలు కాంగ్రెస్‌కు కంచుకోటలుగా ఉన్నాయి. అమేఠీలో ఇప్పటి వరకు మూడుసార్లు మాత్రమే కాంగ్రెస్ ఓటమి పాలైంది. రాహుల్ గాంధీ 2004 నుంచి వరుసగా మూడుసార్లు అమేఠీ నుంచి ప్రాతినిధ్యం వహించారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నాయకురాలు స్మృతి ఇరానీ చేతిలో ఓటమి పాలయ్యారు. అప్పుడు అమేఠీతో పాటు వయనాడ్ నుంచి రాహుల్ పోటీ చేశారు. అక్కడ విజయం సాధించారు.

రాజ్యాంగాన్ని కాపాడేందుకే ఎన్నికలు: రాహుల్

ఈ ఎన్నికలు ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవడం కోసమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. దీని కోసం కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని ఓ వీడియో సందేశంలో ప్రజలను అభ్యర్థించారు. 'ఒకవైపు ప్రజాస్వామ్యాన్ని అంతం చేయాలని, రాజ్యాంగాన్ని ధ్వంసం చేయాలని ప్రయత్నిస్తున్న బీజేపీ-ఆరెస్సెస్, మరోవైపు ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుతున్న కాంగ్రెస్, ఇండియా కూటమి ఉన్నాయ'ని పేర్కొన్నారు. దేశప్రజల సమస్యలు విని విప్లవాత్మకమైన మేనిఫెస్టో రూపొందించామని చెప్పారు.

మలి దశ మలుపు ఎవరికో?

» 13 రాష్ట్రాల్లోని 89 లోక్‌సభ స్థానాలకు నేడు పోలింగ్

» కేరళలోని మొత్తం 20 సీట్లకూ ఓటింగ్



పశ్చిమబెంగాల్‌లో ఎన్నికల విధులకు వెళ్తున్న సిబ్బంది

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల రెండో దశ పోలింగ్ శుక్రవారం జరగనుంది. ఓవైపు ఎండలు మండుతున్నప్పటికీ.. ఓటింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లను కేంద్ర ఎన్నికల సంఘం పూర్తి చేసింది. కేరళలోని మొత్తం 20 సీట్లు సహా ఈ విడతలో 13 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 89 స్థానాలకు పోలింగ్ నిర్వహించనున్నారు. తమిళనాడులో తొలి దశలోనే ఎన్నికల ఘట్టం ముగిసింది. ఈసారి కేరళ, రాజస్థాన్, త్రిపురలో కూడా పూర్తవనుంది. కర్ణాటక (14), రాజస్థాన్ (13), యూపీ, మహారాష్ట్ర (8), మధ్యప్రదేశ్ (7), అస్సాం, బిహార్ (5), ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్ (3) స్థానాలకు, మణిపూర్, త్రిపుర, జమ్మూకశ్మీర్‌లలోని ఒక్కో సీటుకు మలి దశలో ఎన్నికలు జరుగనున్నాయి. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ (వయనాడ్), ఆ పార్టీ కీలక నాయకులు, కేంద్ర మాజీ మంత్రి శశిథరూర్ (తిరువనంతపురం), కేసీ వేణుగోపాల్ (అలప్పుళ), బీజేపీ తరఫున లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా (గుంజాల్), కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ (జోధ్‌పూర్) పోటీలో ఉన్నారు. కర్ణాటక మాజీ సీఎం, జేడీఎస్ చీఫ్ కుమారస్వామి (మాండ్య), ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సోదరుడు డీకే సురేశ్ (బెంగళూరు రూరల్), ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేశ్ భగేల్ (రాజ్‌నంద్‌గావ్) ప్రజల తీర్పు కోరుతున్నారు. కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ (తిరువనంతపురం), ప్రముఖ సినీ నటి, బీజేపీ నేత హేమమాలిని (మథుర), విశేష ఆదరణ పొందిన దూరదర్శన్ రామాయణ సీరియల్ రాముడు పాత్రధారి అరుణ్ గోవిల్ (మీరట్), బీజేపీ యువ నేత తేజస్వీ సూర్య (బెంగళూరు దక్షిణ)లు రెండో విడతలో ఉన్న ప్రముఖులు. కాగా, 34.80 లక్షల మంది కొత్తవారు సహా 15.88 కోట్ల మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 8.08 కోట్ల మంది పురుషులు, 7.8 కోట్ల మంది మహిళలు ఉన్నారు. ఏడు విడతలకు గాను 21 రాష్ట్రాల్లోని 102 సీట్లకు తొలి దశలో భాగంగా ఈ నెల 19న పోలింగ్ నిర్వహించారు.

బీజేపీకి గట్టి పోటీ తప్పదా?

రాహుల్ గాంధీతో పాటు అసెంబ్లీ, లోక్‌సభ బరిలో ఓటమి ఎరుగని కేసీ వేణుగోపాల్, నాలుగో సారి గెలుపును ఆశిస్తున్న శశిథరూర్ వంటి వారి పోటీతో మలి విడతలో కళ్లన్నీ కేరళపైనే ఉన్నాయి. 2.77 కోట్ల మందిపైగా ఓటర్లున్న ఈ రాష్ట్రంలో ఇండియా కూటమిలోని ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, వామపక్షాలు నేరుగా తలపడుతున్నాయి. కాగా, రెండో దశలో కూడా ఇండియా కూటమి నుంచి బీజేపీకి గట్టి పోటీ తప్పదని, ముఖ్యంగా కేరళ, కర్ణాటక, మహారాష్ట్రలో ఎన్నికలు జరిగే 42 స్థానాలలో అత్యధిక స్థానాలు 'ఇండియా'కే వస్తాయని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. బిహార్‌లోని కిషన్‌గంజ్, పూర్ణియా, భగల్పూర్, కతిహార్‌లో ఎన్డీఏకు గట్టి పోటీ నెలకొంది. యూపీలోని 8 సీట్లలో ఎన్డీఏ, ఇండియా కూటములతో పాటు బీఎస్పీ కూడా రంగంలోకి దిగడంతో ముక్కోణపు పోటీ ఏర్పడింది. కేరళలో బీజేపీకి ఒక్క సీటు కూడా వచ్చే అవకాశాలు లేవని, రాజస్థాన్‌లో కూడా గతంలోలా 25కు 24 సీట్లు గెలుచుకునే అవకాశాల్లేవని అంచనాలు వెలువడుతున్నాయి.

కొలువులకు కాంగ్రెస్ ఎసరు

» ఇంట్లో ఇద్దరు ఉద్యోగులుంటే ఒకరి కొలువును లాగేసుకుంటుంది: మోదీ

బరేలీ/భోపాల్, ఏప్రిల్ 25: కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్ర మోదీ తన వాగ్యుద్ధాన్ని మరింతగా పెంచారు. సంపద దోపిడీ, వారసత్వ పన్ను, ముస్లిం రిజర్వేషన్ల పేరిట ఎస్సీ, ఎస్టీ, బీసీల రాజ్యాంగ హక్కుల హననానికి కాంగ్రెస్ యత్నిస్తోందంటూ నిన్నమొన్న ఎన్నికల ర్యాలీల్లో విరుచుకుపడ్డ మోదీ.. తాజాగా ఉద్యోగాలపైనా పంజా(హస్తం గుర్తు) విసిరే కుతంత్రాలు జరుగుతున్నాయని ఆరోపించారు. "మీరు బీసీ లేదా ఎస్సీ/ఎస్టీ వర్గానికి చెందినవారై ఉండి.. మీ ఇంట్లో ఇద్దరికి ఉద్యోగాలు ఉంటే.. ఒక కొలువును కాంగ్రెస్ లాక్కొంటుంది. దేశ సంపదపై ప్రథమ హక్కుదారులకు(ముస్లింలు) ఆ ఉద్యోగాన్ని పంచిపెడుతుంది" అని వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఉత్తరప్రదేశ్‌లోని బరేలీలో జరిగిన రోడ్‌షోలో మోదీ ప్రసంగించారు. ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ కలిసి.. ఓబీసీల హక్కులకు ఎసరుపెట్టే ప్రయత్నాలు చేస్తున్నాయని మోదీ హెచ్చరించారు. "ఓబీసీల హక్కులను ముస్లింలకు అందజేయాలని చూస్తున్నారు. సమాజ్‌వాదీ దృష్టిలో బీసీలంటే యాదవులేనా? యాదవులంటే వారి(అఖిలేశ్) కుటుంబం సభ్యులేనా? బుదౌన్, మణిపురి, ఫిరోజాబాద్, ఆజంగఢ్, కన్నౌజ్‌లలో వారి కుటుంబ సభ్యులకే టికెట్లు ఇచ్చుకున్నారు" అంటూ ప్రధాని మండిపడ్డారు. "నేను సముద్రగర్భంలో ద్వారకను సందర్శించినప్పుడు రాకుమారుడు(రాహుల్‌గాంధీని ఉద్దేశించి) ఆటపట్టించేలా మాట్లాడారు. ఇప్పుడు ఆ రాకుమారుడికి అఖిలేశ్ హారతిపడుతున్నారు" అంటూ విరుచుకుపడ్డారు. ఆగ్రాలో జరిగిన ర్యాలీలోనూ కాంగ్రెస్-సమాజ్‌వాదీ పార్టీలపై ప్రధాని మోదీ నిప్పులు చెరిగారు. "ఆ రెండు పార్టీలు ఉత్తరప్రదేశ్‌లో తమ ఓటుబ్యాంకు కోసం బుజ్జగింపు రాజకీయాలు చేస్తున్నాయి" అని విమర్శించారు. అంతకు ముందు మధ్యప్రదేశ్‌లోని సాగర్‌లో జరిగిన ర్యాలీలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని ద్వేషిస్తోందని.. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు చెందిన కోటాను ముస్లింలకు కట్టబెట్టాలని కుట్రలు చేస్తోందని దుయ్యబట్టారు. 2009, 2014 ఎన్నికల మేనిఫెస్టోల్లోనూ కాంగ్రెస్ మతపరమైన రాజకీయాలను గురించి ప్రస్తావించిన విషయాన్ని గుర్తుచేశారు. కాంగ్రెస్ చర్యలను చౌకీదార్ అడ్డుకుంటారని, ఆ పార్టీని నిలువరించడానికి 400 సీట్లు కావాలని ప్రజలను కోరారు.

ఇస్లామీకరణే కాంగ్రెస్ ఎజెండా: యోగి

యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కూడా కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. లఖ్‌నవూలో జరిగిన ప్రచారంలో పాల్గొన్న యోగి.. కాంగ్రెస్ వస్తే దేశంలో ఇస్లామీకరణ జరుగుతుందని అన్నారు. "రంగనాథ్‌మిశ్రా కమిటీ సిఫారసులను అమలుకు కాంగ్రెస్ పని చేస్తోంది. 27 శాతం బీసీ రిజర్వేషన్లలో ఆరు శాతాన్ని ముస్లింలకు ఇవ్వాలని ఆ కమిటీ సిఫారసు చేసింది. ఇప్పుడు కర్ణాటకలో కాంగ్రెస్ దాన్ని అమలు చేస్తోంది. సచార్ కమిటీ ముస్లింల ఆర్థిక స్థితిగతులపై అధ్యయనం చేసింది. ఆ కమిటీ సిఫారసులనూ అమలుకు యత్నిస్తోంది" అని విమర్శించారు.

మోదీ, రాహుల్ పేర్లు లేకుండా బీజేపీ, కాంగ్రెస్‌కు ఈసీ నోటీసులు

స్టార్ క్యాంపెయినర్లంటూ పేర్కొన్న ఈసీ


కాంగ్రెస్‌పై మోదీ వ్యాఖ్యలు.. స్పందించడానికి నిరాకరించిన ఈసీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): "కాంగ్రెస్ వస్తే.. సంపదను దోచుకుని ముస్లింలకు పంచుతుంది. మహిళల మెడల్లోని మంగళ సూత్రాలను కూడా వదలరు" అంటూ ప్రధాని మోదీ.. "తమిళులు తమిళం మాట్లాడొద్దు.. కేరళీయులు మళయాలం మాట్లాడొద్దు.. ఇదే బీజేపీ నైజం" అంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలపై అందిన ఫిర్యాదులపై కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీఐ) గురువారం స్పందించింది. ఈ మేరకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అధ్యక్షుడు జేపీ నడ్డా, మల్లికార్జున ఖర్గేలకు నోటీసులు జారీ చేసింది. అయితే.. నోటీసుల్లో ఎక్కడా మోదీ, రాహుల్ పేర్లను ప్రస్తావించలేదు. రాజస్థాన్‌లో మోదీ వ్యాఖ్యలపై ఈ నెల 21న కాంగ్రెస్ నేత రణ్‌దీప్ సూర్జేవాలా.. ఆ తర్వాత సీపీఎం, సీపీఐ నేతలు ఈసీకి ఫిర్యాదు చేశారు. అదేవిధంగా కేరళలోని కోటాయంలో రాహుల్ చేసిన వ్యాఖ్యలపై ఈ నెల 19న బీజేపీ నేత ఓం పాఠక్ ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులను పరిశీలించిన ఈసీఐ.. ఇరు పార్టీల చీఫ్‌లకు నోటీసులు ఇచ్చింది. ప్రజాప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్ 77 ప్రకారం నోటీసులను జారీ చేసినట్లు పేర్కొన్న ఈసీఐ.. ఈ నెల 29వ తేదీన ఉదయం 11 గంటల లోపు సమాధానాలివ్వాలని ఆదేశించింది. నోటీసుల్లో మోదీ, రాహుల్ పేర్లను ఎక్కడా ప్రస్తావించకుండా.. 'స్టార్ క్యాంపెయినర్లు' నియమావళిని ఉల్లంఘించారని పేర్కొంది. హుందాగా ప్రచారం చేయాల్సిన స్టార్ క్యాంపెయినర్లు తీవ్ర వ్యాఖ్యలు చేస్తే.. పరిస్థితి జటిలంగా మారుతోందని తెలిపింది. మోదీ, రాహుల్ పేర్లతో కాకుండా.. పార్టీ అధ్యక్షులకు నోటీసులు ఇవ్వడంపై ఈసీఐ విమర్శలను ఎదుర్కొంటోంది. ఈ చర్యపై పరిశీలకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈసీఐ వైఖరి అనుమానాలను లేవనెత్తుతున్నాయని చెబుతున్నారు. విద్వేష వ్యాఖ్యలు చేసిన ప్రధాని మోదీకి నేరుగా నోటీసులు ఎందుకివ్వలేదని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు రాహుల్ తన ఎన్నికల ప్రచారంలో బీజేపీ పాలనపై తప్పుడు ప్రచారం, దళితుడైనందునే తనను అయోధ్య ప్రారంభోత్సవానికి ఆహ్వానించలేదని ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ ఫిర్యాదులను ఒకే విధంగా పరిగణిస్తూ నోటీసులు ఇవ్వడమేంటని విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

వారికి అలా.. వీరికి ఇలా..!

నిజానికి ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్-77 స్టార్ క్యాంపెయినర్లకు ఉండే వెసులుబాట్లను గురించి వివరిస్తోంది. ఇటీవల తెలంగాణ మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు విషయంలో ఆయనకు ఇదే సెక్షన్ కింద నేరుగా నోటీసులు జారీ చేసింది. కాంగ్రెస్ నాయకురాలు సుప్రియా శ్రీనాటె, పశ్చిమ బెంగాల్ బీజేపీ ఎంపీ దిలీప్ ఘోష్, ఆఆప్ మంత్రి ఆతిశి, కాంగ్రెస్ నేత రణ్‌దీప్ సూర్జేవాలా విషయంలోనూ వారికే నేరుగా నోటీసులు ఇచ్చింది. ఈ నేపథ్యంలో మోదీ, రాహుల్ విషయంలో ఆ పార్టీల అధ్యక్షులకు నోటీసులు ఇవ్వడంపై రాజకీయ విశ్లేషకుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాగా.. సంపదను దోచిపెడతారంటూ మోదీ చేసిన వ్యాఖ్యలపై విలేకరులు ఈసీని పదేపదే ప్రశ్నించినా.. సమాధానాన్ని దాటవేయడాన్ని విశ్లేషకులు తప్పుబడుతున్నారు.

వీవీప్యాట్ స్లిప్పుల లెక్కింపుపై నేడు సుప్రీంకోర్టు తీర్పు




న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: ఎలక్ట్రానిక్ వోటింగ్ మిషన్ (ఈవీఎం)లో నమోదైన ఓట్లతో సరిపోయేలా వీవీప్యాట్‌లోని నూరు శాతం స్లిప్‌లను కూడా లెక్కించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాలపై శుక్రవారం సుప్రీంకోర్టు తీర్పు చెప్పనుంది. ఉదయం 10.30 గంటలకు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం నిర్ణయాన్ని వెలువరించనుంది. శుక్రవారమే రెండో దశ ఎన్నికల్లో భాగంగా 88 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుండడం గమనార్హం. అసోసియేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్)తో పాటు మరికొందరు ఈ పిటిషన్లు దాఖలు చేశారు. ఎన్నికలను నియంత్రించలేమని బుధవారం విచారణ సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యానించడం గమనార్హం. ఈవీఎంల సామర్థ్యంపై అనుమానాలు ఉన్నంత మాత్రాన ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని తెలిపింది.

కోర్టుల సమాచారం ఇక వాట్సాప్‌కు..

» కేసుల లిస్టింగ్, తీర్పులు, మొత్తం వివరాలన్నీ సెల్‌ఫోన్లకే

» సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ ప్రకటన



న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: కోర్టు కార్యకలాపాల డిజిటలైజేషన్ దిశగా మరో ముందడుగు వేసినట్టు గురువారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ప్రకటించారు. ఇక నుంచి కేసుల లిస్టింగ్, ప్రతి రోజూ ధర్మాసనం ముందుకు వచ్చే కేసుల జాబితా అయిన కాజ్ లిస్ట్, తీర్పులు ఇతర సమాచారాన్ని వాట్సాప్ ద్వారా న్యాయవాదులకు, కక్షిదారులకు పంపించనున్నట్లు వెల్లడించారు. సర్వోన్నత న్యాయస్థానం వినియోగిస్తున్న ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసీటీ)తో వాట్సాప్‌ను అనుసంధానం చేసినట్లు తెలిపారు. ప్రయివేటు ఆస్తులను కూడా సమాజ వనరులుగా పరిగణించవచ్చా? అన్న కేసును చేపట్టిన తొమ్మిది మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి అధ్వర్యం వహించిన ఆయన.. విచారణను ప్రారంభించేందుకు ముందు ఈ విషయాన్ని ప్రకటించారు. న్యాయాన్ని పొందే హక్కును బలోపేతం చేసేందుకు, న్యాయ వ్యవస్థలో పారదర్శకత పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సమాచారం పంపించే సుప్రీంకోర్టు వాట్సాప్ నెంబరును కూడా ఆయన వెల్లడించారు. 8767687676 నుంచి సమాచారం వస్తుందని, కానీ ఈ నెంబరుకు ఫోన్ చేయడానికి గానీ, మెసేజ్‌లు పంపడానికిగానీ వీలుపడదని తెలిపారు. దీంతో కోర్టు వ్యవహారాల శైలిలోనే చెప్పుకోదగ్గ మార్పులు వస్తాయని, 'బిగ్ బ్యాంగ్' తరహాలో ప్రభావం చూపిస్తుందని వ్యాఖ్యానించారు. దీర్ఘకాలంలో కాగితాలను ఆదా చేసి తద్వారా భూమిని సంరక్షించగలుగుతామని ఆయన అభిప్రాయపడ్డారు. చిన్న కేసుల విషయంలో మారుమూల ప్రాంతాల వారు కూడా కోర్టు కార్యకలాపాల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని చెప్పారు. దీని నిర్వహణ బాధ్యతను నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) పరిధిలోని మేఘరాజ్ క్లౌడ్ 2.0కు అప్పగించినట్టు వివరించారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీసుకున్న ఈ నిర్ణయం విప్లవాత్మకమని అభివర్ణించారు.

ప్లేస్‌మెంట్ల కోసం ప్రత్యేక పోర్టల్


» 30న ప్రారంభం.. ఏఐసీటీఈ, అప్నాకో సంయుక్తంగా రూపకల్పన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: విద్యార్థులకు ఉద్యోగాల విషయమై మార్గదర్శనం చేసేందుకు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుయేషన్-ఏఐసీటీఈ) ప్రత్యేకంగా పోర్టల్‌ను రూపొందించింది. ఏఐసీటీఈ కేరీర్ పోర్టల్ పేరుతో రూపొందించిన ఈ సాంకేతిక వేదికను ఈ నెల 30న ఆవిష్కరించనుంది. ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ ప్లాట్‌ఫారం అయిన అప్నాకో భాగస్వామ్యంతో దీన్ని రూపొందించింది. సుమారు 30 లక్షల మంది విద్యార్థులు ఉద్యోగ, ఇంటర్న్‌షిప్ సదుపాయాలను చూపించడం ఈ పోర్టల్ లక్ష్యం. ప్లేస్‌మెంట్‌ల విషయంలో 12వేల కళాశాలలకు మార్గదర్శనం చేయనుంది. ప్రధాన కంపెనీలతో సంబంధాలు పెంచుకోవడానికి కూడా ఈ పోర్టల్ ఉపకరిస్తుందని ఏఐసీటీఈ ఛైర్మన్ టి.జి.సీతారాం చెప్పారు. విద్యార్థులు సిలికాన్ వ్యాలీ ఇమ్మెర్షన్ ప్రోగ్రాంలో పాల్గొనేందుకు కూడా అవకాశం ఉంటుంది. ఈ ప్రోగ్రాం కింద విద్యార్థులు అమెరికాలోని సిలికాన్ వ్యాలీకి వెళ్లి గూగుల్, మైక్రోసాఫ్ట్, యాపిల్ వంటి కంపెనీల ప్రముఖులను కలిసే అవకాశం ఉంటుంది.


లోకం తీరు



నర్మదానదిని 'రేవా నది' అని కూడా వ్యవహరిస్తారు. పుష్కర నదుల్లో నర్మద ప్రత్యేకమైనది. ఇది రుద్రసంభవ... అంటే సాక్షాత్తూ శివుని శరీరం నుంచి ఆవిర్భవించింది. 'నామృతా నర్మదా' అంటారు. అంటే మృతము లేనిది, శాశ్వతమైనది అని అర్థం.



విశేషం



నమామి దేవి నర్మదే!

సృష్టిలోని ప్రతి జీవికి నీరే ఆధారం. అందుకే 'ఆపోమయః ప్రాణః' అన్నారు పూర్వులు. 'ప్రాణం జలమయం' అన్నది ఛాందగ్యోపనిషత్తు. అటువంటి ప్రాణదాయకమైన నీటితో ప్రవహించేవి నదులు. అందుకే భారతీయ సంస్కృతిలో నదులను మాతృస్వరూపాలుగా భావిస్తారు. మనిషి మనుగడ కూడా నదీతీరాల్లోనే మొదలయింది. ఎన్నో నదులు మన దేశానికి జీవనరేఖలుగా... నిరంతరం ప్రవహిస్తున్నాయి. పాడి పంటలకు దోహదం చేస్తూ ఆహారాన్నీ, ఆరోగ్యాన్నీ, దేహశుద్ధినీ, ఆధ్యాత్మికంగా అంతిమ ఆకాంక్ష అయిన ముక్తినీ ప్రసాదిస్తున్నాయి. అటువంటి వాటిలో కొన్ని నదులు పుష్కర సమయంలో మరింత పవిత్రమవుతాయనీ, పాపాలను హరిస్తాయనీ, ఓషధీ గుణాలతో నిండి రోగ నివారకాలు అవుతాయనీ తరతరాలుగా విశ్వాసం ఉంది.

పుష్కరం అంటే పవిత్ర సమయం. ఒక్కో నదికి ఇది పన్నెండు సంవత్సరాలకు ఒకసారి వస్తుంది. ఆ సమయంలో చేసే నిత్య నైమిత్తిక కర్మలు, స్నానాలు, దానాలు, పితృకర్మలు విశేష ఫలితాలు ఇస్తాయనీ పురాణాలు చెబుతున్నాయి. ప్రత్యేకించి పన్నెండు పవిత్రమైన నదులకు పుష్కరాలు జరుగుతాయి. వాటిని స్మరించినంత మాత్రానే పాపాలు తొలగుతాయనేది అనాది నమ్మకం. అందుకే స్నానం చేసే సమయంలో సంకల్పం చెప్పుకొంటూ... ఆ నదీమతల్లులను స్మరించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అవే గంగ, యమున, సరస్వతి, సింధు, నర్మద, గోదావరి, కృష్ణ, తుంగభద్ర మొదలైనవి. ఆ నదుల కోరిక మేరకు... ఏడాదికి ఒక నదిలో నివసించడానికి పుష్కరుడు (వరుణుడు) అంగీకరించాడని, నవగ్రహాల్లో శుభుడైన గురుడు (బృహస్పతి) ఒక రాశి నుంచి మరొకరాశికి మారుతున్నప్పుడు... అతనితో పాటు సంబంధిత నదిలోకి పుష్కరుడితో పాటు, బ్రహ్మాది దేవతలు ఆ నదిలో కొలువవుతారనీ కథ ఉంది. ఈ ఏడాది చైత్ర బహుళ అష్టమి నాడు (మే ఒకటిన) గురువు మేష రాశి నుంచి వృషభ రాశిలోకి ప్రవేశిస్తాడు. అప్పుడు నర్మదానదికి పుష్కరాలు ఆరంభమవుతాయి. గురు ప్రవేశం తరువాత... ఆ నదిలో తొలి పన్నెండు రోజులు చేసే స్నానాలు, నదీతీరాల్లో చేసే దానాలు, పితృకర్మలకు విశేష ఫలితాలు లభిస్తాయి.

నర్మదానదిని 'రేవా నది' అని కూడా వ్యవహరిస్తారు. పుష్కర నదుల్లో నర్మద ప్రత్యేకమైనది. ఇది రుద్రసంభవ... అంటే సాక్షాత్తూ శివుని శరీరం నుంచి ఆవిర్భవించింది. 'నామృతా నర్మదా' అంటారు. అంటే మృతము లేనిది, శాశ్వతమైనది అని అర్థం. వింధ్య పర్వత శ్రేణిలో... తూర్పున అమర్‌కంటక్‌లో ఆవిర్భవించి, పశ్చిమ దిశగా... మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, గుజరాత్‌లలో వేలాది మైళ్ళు ప్రవహించి... పారిశ్రామిక నగరమైన సూరత్‌ను అక్కున చేర్చుకొని, అరేబియా సముద్రంలో సంగమించే నర్మదా నదీ తీరంలో ఎన్నో పుణ్యక్షేత్రాలు, పారిశ్రామికవాడలు, పాడిపంటలకు




నెలవైన ఊళ్ళు ఉన్నాయి. స్వయంసిద్ధమైన, శివ స్వరూపాలుగా భావించే బాణలింగాలకు కాణాచి నర్మదా నది.

మే ఒకటి నుంచి నర్మదా పుష్కరాలు

సుప్రసిద్ధమైన ఓంకార క్షేత్రం కూడా నర్మదా తీరంలోనే ఉంది. వింధ్యపర్వత రాజు (వింధ్యుడు) శివుడి కోసం ఘోరమైన తపస్సు చేశాడు. శివుడు అతనికి సాక్షాత్కరించగా... తనపై కొలువు ఉండాలని కోరాడు. వింధ్యుడి కోరికను మన్నించిన శివుడు... ఓంకారేశ్వరుడిగా వెలిశాడు. ఓంకారేశ్వర లింగం ద్వాదశ జ్యోతిర్లింగాలలో ప్రసిద్ధమైనది. ఇక... వింధ్యుడు ఆరాధించిన పార్థివ లింగం... అమరేశ్వరుడిగా పూజలందుకుంటున్న క్షేత్రం... అమరేశ్వరంగా ప్రసిద్ధమయింది. ఇవి రెండూ నర్మదకు ఇరువైపులా ఉంటాయి.


ఆది శంకరులు తన గురువైన గోవింద భగవత్పాదులను కలిసి, సన్యాస దీక్ష స్వీకరించిన ప్రదేశంగా ఓంకారేశ్వర్ ప్రసిద్ధి. అక్కడ గోవింద భగవత్పాదుల గుహ ఉంది. అలాగే అహల్యాబాయి రాజధాని మాహిష్మతి (మహేశ్వరం) లాంటి ఎన్నో ప్రదేశాలు నర్మదా పరీవాహక ప్రాంతంలో ఉన్నాయి. అంతటి ప్రసిద్ధమైన నర్మదానదిని పుష్కర సమయంలో సందర్శించి, భక్తి శ్రద్ధలతో స్నానాలు, దానాలు, ధ్యానాలు, పితృకర్మలు ఆచరిస్తే అనంతమైన ప్రయోజనాలు సిద్ధిస్తాయనేది పెద్దలమాట.

● ఆయపిళ్ళ రాజపాప



చింతన

సాధన ఫలించాలంటే..



ఏదైనా సాధించాలంటే గట్టి ప్రయత్నం, ఏకాగ్రత, ఓర్పు అవసరం. 'సతు దీర్ఘకాల నైరంతర్య సత్కారాసేవితో దృఢభూమిః' అంటాడు పతంజలి మహర్షి తన యోగశాస్త్రంలో. చేసే అభ్యాసం దీర్ఘకాలం, నిరంతరం కొనసాగాలి. అలా శ్రద్ధతో చేసే కృషి మాత్రమే సత్ఫలితాలను ఇస్తుంది. చక్కగా, చాలాకాలం, విరామం లేకుండా ఆచరించే సాధన స్థిరంగా ఉంటుంది. దానికోసం మొదట కావలసిన యోగ్యత... చాలాకాలం కొనసాగించడం.. దురదృష్టవశాత్తూ మనం అందరం సత్వర ఫలితాలు కలగాలని ఆశిస్తాం. ఏదైనా మంత్రాన్ని జపించమని సలహా ఇస్తే... ఇంటికి వెళ్ళి, దాన్ని మూడు రోజులు జపించి, ఏ ఫలితాలూ రాలేదని చింతిస్తాం. "ఆ మంత్రం నాకు తగినది కాదేమో, మరొకటి ఉపదేశిస్తారా?" అని అడుగుతాం. పదేళ్ళుగా అప్పుడప్పుడు యోగాభ్యాసం చేస్తున్నా... ఏ ప్రయోజనం లభించలేదని చింతిస్తాం. 'నిరంతరం' అనే మాట మరచిపోయి, కావలసినన్ని విరామాలు తీసుకుంటాం. మరో అతి ముఖ్యమైన అంశం సహనం. మనఃపూర్వకంగా, శ్రద్ధతో, ఏకాగ్రతతో, పట్టుదలతో సాధన కొనసాగించాలి. దాని కోసం చేసే కృషి పట్ల విశ్వాసం ఉండాలి. మనకు ఏదైనా కావాలనుకున్నప్పుడు ఏం చేస్తాం? నిద్రాహారాలు సైతం మానేసి, అహోరాత్రులూ దానికోసం శ్రమిస్తాం. ప్రాపంచికమైన వాటికోసమే ఇంత తపన పడితే... మరి ఆధ్యాత్మిక సాధన కోసం ఇంకెంత కష్టపడాలి?

దీనికి సంబంధించిన పూర్వకాలం కథ ఒకటి ఉంది. దేవర్షి అయిన నారదుడు ఒకనాడు అడవిలోంచి ప్రయాణం చేస్తున్నాడు. ఈ భూమి మీద జరిగే విశేషాలు గమనించాలనేది ఆయన ఉద్దేశం. మార్గమధ్యంలో ఆయనకు తపస్సు చేసుకుంటున్న వ్యక్తి కనిపించాడు. అతని చుట్టూ చీమల పుట్టలు పెరిగాయి. ఆ యోగి నారదుణ్ణి గుర్తుపట్టి, నమస్కరించాడు. "స్వామీ! ఎక్కడికి మీ ప్రయాణం?" అని అడిగాడు.

"వైకుంఠానికి. విష్ణు దర్శనానికి" అని బదులిచ్చాడు నారదుడు.

"అయితే మీరు నాకొక ఉపకారం చేస్తారా?" అని అడిగాడు యోగి.

"తప్పకుండా! నీకేం కావాలి?" అని ప్రశ్నించాడు నారదుడు.

"నేను చాలాకాలంగా ఈ అరణ్యంలో కూర్చొని తపస్సు చేస్తున్నాను. నేను ఇంకా ఎన్నాళ్ళు ఇలా తపస్సు చెయ్యాలి? మహా విష్ణువును అడిగి... నాకు ఎప్పుడు ఆయన లోకంలో స్థానం లభిస్తుందో కనుక్కోగలరా?"

"అలాగే. తప్పకుండా కనుక్కుంటాను" అని నారదుడు భరోసా ఇచ్చి, ముందుకు సాగిపోయాడు.

కొన్ని యోజనాలు నడిచిన తరువాత... మరొక వ్యక్తి ఆయనకు కనిపించాడు. అతను ఎంతో పారవశ్యంతో విష్ణు సహస్రనామ సంకీర్తన చేస్తూ... తనలో తానే ఆనందిస్తున్నాడు. అతను నారదుణ్ణి చూసి "మహర్షీ! ఎక్కడిదాకా మీ పయనం?" అని అడిగాడు.

"వైకుంఠానికి. శ్రీమహావిష్ణువు దర్శనం నిమిత్తం" అన్నాడు నారదుడు.

"ఓహో! ప్రశస్తంగా ఉంది. నేనింకా ఎంతకాలం ఈ ధ్యానం కొనసాగించాలి? ఈ జనన మరణ చక్రం నుంచి నాకు విముక్తి ఎప్పుడో విష్ణులోకంలో అడుగుతారా? ఈ సహాయం చెయ్యగలరా?"

"సరే! తప్పకుండా అడుగుతాను. నా తిరుగు ప్రయాణంలో చెబుతాను" అని నారదుడు వెళ్ళిపోయాడు.

కొన్ని సంవత్సరాల తరువాత దేవర్షి అదే అరణ్యానికి మళ్ళీ వచ్చాడు. మొదటి వ్యక్తిని కలిశాడు. అతను నారదుడితో "మహాత్మా! పూర్వం నేను అడిగిన ప్రశ్నకు సమాధానం కనుక్కున్నారా? పరమాత్మ ఏమన్నారు?" అని అడిగాడు.

"ముక్తికోసం నీవు ఇంకా నాలుగు జన్మలు ఎత్తాలని మహా విష్ణువు చెప్పాడు" అన్నాడు నారదుడు.

"ఇంకా నాలుగు జన్మలు ఎత్తాలా? నేను తగినంత కాలం ధ్యానం చేశాను కదా! ఇంకా నాలుగు జన్మలేవిటి?" అని అతను గట్టిగా రోదిస్తూ... తపస్సునూ, అడవినీ వదిలేసి... తన పూర్వ సంసార ప్రపంచానికి విసుగ్గా వెళ్ళిపోయాడు.

నారదుడు ముందుకు ప్రయాణించి... రెండో వ్యక్తిని కలిశాడు. అతను ఇంకా విష్ణు నామ సంకీర్తనలో మునిగి ఆనందిస్తూనే ఉన్నాడు. నారదుణ్ణి చూడగానే "దేవర్షీ! నా విషయం అడిగారా?" అని ప్రశ్నించాడు.

"ఓ! అడగకేం? ఇక్కడ కనిపిస్తున్న చెట్టును చూడు. వాటికి ఆకులు ఎన్నున్నాయో లెక్కించగలవా?"

"తప్పకుండా. నాకు ఆ ఓపిక ఉంది. ఇప్పుడే లెక్కించమంటారా?"

"ఇప్పుడే అక్కర్లేదు. నింపాదిగా ప్రయత్నించు."

"ఆ చెట్టు ఆకులకూ, నా ప్రశ్నకూ సంబంధం ఏవిటి?"

"ఉంది. నీవు వైకుంఠం చేరాలంటే... ఆ చెట్టుకు ఎన్ని ఆకులు ఉన్నాయో... ఇంకా అన్ని జన్మలు ఎత్తాల్సి ఉంటుందని విష్ణువు నాతో చెప్పాడు."

"అంతేనా? ఆ చెట్టు ఆకులకు ఒక పరిమితి ఉంటుంది. నేను ఇంకా ఈ అడవిలో ఉన్న చెట్ల ఆకుల మొత్తం సంఖ్య ఎంతో అన్ని జన్మలని అనుకున్నాను. ఇప్పుడే ఈ చెట్టు ఆకులను లెక్కిస్తాను" అన్నాడు ఆ యోగి.

ఇంతలో... ఒక అందమైన పల్లకీ దివి నుంచి భువికి దిగింది. అందులో ఉన్న విష్ణుదూత "పరమాత్మ విష్ణువు మిమ్మల్ని ఈ పల్లకిలో వైకుంఠానికి తీసుకురమ్మన్నారు" అని ఆ యోగికి చెప్పాడు.

"నేను ఇప్పుడే విష్ణులోకానికి వెళుతున్నానా?" అన్నాడు యోగి ఆశ్చర్యంగా.

"అవును అన్నాడు విష్ణుదూత .

"కానీ నేను ఇంకా ఎన్నో జన్మలు ఎత్తాలని నారదులవారు ఇప్పుడే చెప్పారే?"

"ఇప్పుడు ఆ అవసరం లేదు. వచ్చి పల్లకి ఎక్కండి" అన్నాడు విష్ణుదూత.

"మరి ఆ మొదటి వ్యక్తి సంగతో?" అని అడిగాడు నారదుడు.

"అతనికి మరో నాలుగు జన్మలు ఎత్తే ఓపిక కూడా లేదు. అతను ఇంకా నిరీక్షిస్తూ, కృషి చేయవలసి ఉంటుంది" అని చెప్పాడు విష్ణుదూత.

కేవలం కథగా కాకుండా దీని వెనుక ఉన్న పరమార్థాన్ని అర్థం చేసుకోవాలి. నిశ్చలమైన మనస్సుతో, ఎంతో దీర్ఘకాలం, చాలా సహనంగా సాధన చేయాలనీ, సత్వర ఫలితాలను ఆశిస్తూ నిరీక్షించకూడదనీ, తొందరతో కలత పడకూడదనీ ఈ కథ బోధిస్తుంది.

● అప్పరుసు విజయరామారావు
9177086363

గీతాసారం


విశ్వానికి మూలాధారం

"నేను నీకు జ్ఞానవిజ్ఞానాన్ని వివరిస్తాను. నువ్వు వాటిని గ్రహించిన తరువాత, నీకు తెలుసుకోవలసినవేవీ ఇక మిగిలి ఉండవు" అని అర్జునుడికి శ్రీకృష్ణుడు చెప్పాడు. మేధస్సు మీద ఆధారపడినవారికి జ్ఞాన, విజ్ఞానాల ద్వారా సాగే మార్గం ఇది. అంతకుముందు మనస్సు ఆధారంగా ఉన్నవారి కోసం (భక్తిలో ఉన్న వ్యక్తుల కోసం) అన్ని జీవులు ఆత్మలో ఉన్నాయని, ఆత్మ అన్ని జీవులలోనూ ఉందనీ గ్రహించడం గురించి, అతణ్ణి (భగవంతుణ్ణి) అన్నిచోట్లా చూడడం గురించి శ్రీకృష్ణుడు చెప్పాడు. ఇది తెలిసిన తరువాత తెలియనిదేదీ ఉండదని తెలిపాడు.

'ఏదీ లేకపోవడం నుంచి విశ్వం ఉద్భవించవచ్చు' అని ఇటీవలి శాస్త్రీయ నిర్ధారణ చెబుతోంది. విస్తరిస్తున్న మన విశ్వం సృష్టి 13.8 బిలియన్ సంవత్సరాల కిందట ఒక 'బిగ్ బ్యాంగ్' ద్వారా జరిగిందంటోంది సైన్స్. కాస్మిక్ మైక్రోవేవ్ బ్యాక్‌గ్రౌండ్ రేడియేషన్ (సిఎంబిఆర్) దృక్పథం ఆధారంగా చూసినప్పుడు, ప్రస్తుతం ఉన్నదానికి ముందు ఒక విశ్వం ఉందనే వాదన ఉంది. విశ్వం విస్తరణ చాలా తక్కువ అనీ, కానీ ఖాళీ స్థలం (శూన్యం) తాలూకు శక్తి మరో విశ్వాన్ని సృష్టించగలదనీ దాని అంచనా. ఇదంతా సృష్టి, ఆ సృష్టి నాశనం కావడం తాలూకు 'చక్రీయ ప్రక్రియ' (సైక్లిక్ ప్రాసెస్) అని అది సూచిస్తుంది.

"మొత్తం విశ్వానికి మూలం నేనే, ప్రళయం నేనే" అనే కృష్ణుడి మాటలను అర్థం చేసుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది.. మొదట, ఇది ఒక చక్రీయ ప్రక్రియకు సూచిక. రెండోది, సృష్టి, వినాశనం... ఈ రెండిటినీ ఏకత్వం ఆవరించడం. గుర్తుంచుకోవాల్సిన విషయమేంటంటే, ప్రతి సంస్కృతి భగవంతుణ్ణి సృష్టికర్తగా కీర్తించింది. కానీ, పరమాత్మగా... తాను సృష్టికర్తననీ, అలాగే నాశనకర్తననీ కూడా శ్రీకృష్ణుడు ప్రకటించాడు.

"నాకన్నా అత్యున్నతమైనది మరేదీ లేదు. మొత్తం విశ్వమంతా ఒక దారానికి గుచ్చిన రత్నాల్లా నాలో కూర్చి ఉంది" అని చెప్పాడు. వ్యక్తమైన (రత్నాలు), అవ్యక్తమైన (దారం) వాటిని వివరించడానికి రత్నాల హారం అనే ఉదాహరణను తరచూ ఉపయోగిస్తూ ఉంటారు. దారం కనిపించదు, దారం ఆధారం లేనిదే రత్నాలు అందమైన ఆభరణంగా ఉండలేవు. కనిపించని వేర్లు లేకపోతే చెట్టు మనుగడ సాగించలేదు కదా! అలాగే పరమాత్మ లేనిదే విశ్వం ఉనికి లేదు. విశ్వం ఉనికికి మూలాధారం ఆ పరమాత్మే.





కె. శివప్రసాద్
ఐఏఎస్

'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/uBrQeZKలో చదవండి.

3న రాష్ట్రానికి మోదీ

వరుసగా రెండు రోజుల పర్యటన

అమరావతి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాష్ట్ర పర్యటనకు రానున్నారు. మే 3, 4 తేదీల్లో మోదీ రాష్ట్రానికి రాబోతున్నట్టు బీజేపీ వర్గాలు తెలిపాయి. మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి పోటీ చేస్తున్న రాజంపేట లోక్‌సభ నియోజకవర్గంలోని పీలేరులో మే 3న మధ్యాహ్నం 2 గంటలకు బహిరంగ సభలో ప్రధాని పాల్గొంటారు. సాయంత్రం ఐదున్నర నుంచి విజయవాడలో భారీ రోడ్ షో నిర్వహిస్తారు. మిత్రపక్షాలైన టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ప్రధానితోపాటు ప్రచారంలో పాల్గొంటారు. నాలుగో తేదీన పురందేశ్వరి పోటీ చేస్తున్న రాజమహేంద్రవరం సభలో ప్రధాని పాల్గొని ఎన్డీయే అభ్యర్థుల్ని గెలిపించాల్సిందిగా ఓటర్లను అభ్యర్థిస్తారు. అదేరోజు సాయంత్రం అనకాపల్లిలో ఎన్నికల ప్రచార సభలో పాల్గొని ఢిల్లీకి వెళతారు. కాగా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ నెలాఖరున వరుసగా రెండు రోజులు రాష్ట్రంలో పర్యటించనున్నట్టు రాష్ట్ర బీజేపీ వర్గాలకు సమాచారం అందింది. ఆయన తిరుపతి, విశాఖపట్నంలలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి.

టీడీపీ ప్రధాన కార్యదర్శిగా పనబాక

అమరావతి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు పార్టీలో పలువురికి వివిధ పదవీ బాధ్యతలు అప్పగిస్తూ, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు గురువారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా బాపట్ల పార్లమెంట్ పార్టీ అధ్యక్షుడిగా సలగల రాజశేఖర్‌బాబు, టీడీపీ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధులుగా కోడూరు బాలసుబ్రహ్మణ్యం(తిరుపతి), ఉన్నం మారుతిచౌదరి(కళ్యాణదుర్గం), రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులుగా పుట్టం బ్రహ్మానందరెడ్డి(ఆత్మకూరు), కేఎం జకీవుల్లా(అనంతపురం అర్బన్), ఇందుకూరి సుబ్బలక్ష్మి(శృంగవరపుకోట), కనపర్తి శ్రీనివాసరావు(గుంటూరు), మాన్వి దేవేంద్రప్ప, గుడిసె ఆది కృష్ణమ్మ(ఆదోని), జంపాల సీతారామయ్య, కేవీవీ సత్యనారాయణరావు(మైలవరం), రాష్ట్ర కార్యదర్శులుగా కే జయరామ్ నాయుడు(అనంతపురం), బూరగడ్డ కిషన్‌తేజ(పెడన), కోటగుల్లి సుబ్బారావు, కిల్లో వెంకట రమేశ్ నాయుడు(పాడేరు), కల్లపరి బుడ్డారెడ్డి(ఆదోని), కే తిమ్మయ్యచౌదరి(పత్తికొండ), చప్పిడి మహేశ్‌నాయుడు(రాజంపేట), దొడ్డా వెంకట సుబ్బారెడ్డి(కనిగిరి), డాక్టర్ అయితాబత్తుల సత్యశ్రీ(అమలాపురం), గేదెల శ్రీనుబాబు(విజయనగరం), మోజూరు తేజోవతి(బొబ్బిలి) నియమితులయ్యారు.

మీడియా కోఆర్డినేటర్‌గా రాముడు



అమరావతి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి):టీడీపీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్‌గా బీవీ వెంకట రాముడు(హిందూపురం) నియమితులయ్యారు. ఇటీవల వరకు ఆయన యువగళం మీడియా కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. కాగా తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధిగా సాకే వెంకట నరసింహులు(అనంతపురం అర్బన్), తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలిగా మల్లెల శ్రీవాణి(రాజంపేట), కార్యనిర్వాహక కార్యదర్శిగా బిడ్డిక పద్మావతి(కురుపాం) నియమించారు.



ఒకరు ఉమ్మడి రాష్ట్ర మాజీ సీఎం... మరొకరు విభజిత ఆంధ్రప్రదేశ్ తొలి సీఎం.. పక్కన జనసేనాని. రాజంపేట ప్రజాగళం సభ ముగిసిన తర్వాత కిరణ్ కుమార్ రెడ్డి, చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇలా ఒకే హెలికాప్టర్‌లో రైల్వే కోడూరు సభకు బయల్దేరారు.



రాజంపేటలో జరిగిన ప్రజాగళం సభకు హాజరైన జనం

తిరుగుబాటు మొదలైంది!

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రజలందరి ఆస్తులను దోచేస్తాడని చంద్రబాబు ఈ సందర్భంగా హెచ్చరించారు. టీడీపీ హయాంలో మద్యం క్వార్టర్ బాటిల్ ధర రూ.60 ఉండేదని.. అది ఇప్పుడు రూ.200 అయిందని.. పెరిగిన రూ.140 మంత్రి పాపాల పెద్దిరెడ్డి ద్వారా తాడేపల్లి ప్యాలెస్‌కు చేరుతున్నాయని ధ్వజమెత్తారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో నిత్యవసర వస్తువుల ధరలు, కరెంట్ చార్జీలు, ఆర్టీసీ చార్జీలు విపరీతంగా పెరిగాయన్నారు. గాడితప్పిన రాష్ట్రాన్ని బాగుచేయాలనే జనసేన, బీజేపీ, టీడీపీ కలిసి కూటమిగా ఏర్పడ్డాయని చెప్పారు. 'నేను జైలులో ఉన్నప్పుడు పవన్ కల్యాణ్ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి.. పొత్తులవల్ల లాభనష్టాలు బేరీజు చేసుకోకుండా రాష్ట్రంలో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా చూడాలన్నారు. కూటమి పొత్తుకు అదే నాంది' అని చెప్పారు. ముఖ్యమంత్రిగా తాను ఉన్నప్పుడు గానీ, కిరణ్‌కుమార్‌రెడ్డి ఉన్నప్పుడు గానీ ముస్లింలకు అన్యాయం జరిగిందా అని ప్రశ్నించారు. వారిలో అపోహలు సృష్టించి రాజకీయ లబ్ధిపొందాలని వైసీపీ చూస్తోందన్నారు. ఇంకా ఏమన్నారంటే..

విధ్వంసకారుడిని ఇంటికి పంపే బాధ్యత మీదే

ఒక అహంకారి, ఒక విధ్వంసకారుడిని ఇంటికి పంపించాల్సిన బాధ్యత ప్రజలపై ఉంది. జగన్ ఐదేళ్ల పరదాలు కట్టుకుని తిరిగాడు. నేను గానీ, కిరణ్‌కుమార్‌రెడ్డి గానీ సీఎంలుగా ఉన్నప్పుడు పరదాలు కట్టుకున్నామా? ప్రజల జీవితాల్లో వెలుగు రావాలన్నా.. మార్పు రావాలన్నా.. సైకో జగన్‌రెడ్డిని తరిమికొట్టాలి. గత ఐదేళ్లలో జగన్‌రెడ్డి కట్టించింది ఊర్లు కాదని గూళ్లు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన పేదలందరికీ మూడు సెంట్ల స్థలమిచ్చి ఇల్లు కట్టిస్తాం. నెలకు రూ.4 వేల పెన్షన్ ఏప్రిల్ నుంచి అమలు చేసి ప్రతి నెలా మొదటి తారీఖునే ఇంటి వద్దకు వచ్చి ఇస్తాం. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తాం. సూపర్ సిక్స్‌తో ముందుకు వస్తున్నాం. తల్లికి వందనం కింద ప్రతి బిడ్డకు ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఇంటిలో ఎంత మంది ఉంటే అందరికీ ఇస్తాం. డ్వాక్రా సంఘాలకు రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తాం.

ఇలాంటివి జరిగే చాన్సు

ఒంటిమిట్టకు చెందిన చేనేత కార్మికుడు పాల సుబ్బారావు పొలాన్ని వైసీపీ నాయకులు ఆక్రమించుకుని వారి పేరు మీద ఆన్‌లైన్ చేయించుకున్నారు. తహశీల్దార్ దగ్గరికి వెళ్లినా న్యాయం జరగకపోవడంతో సుబ్బారావు తన భార్య, కూతురితోపాటు ఆత్మహత్య చేసుకున్నాడు. హైదరాబాద్‌లో ఉన్న మరో కుమార్తె లక్ష్మీప్రసన్న ప్రాణాలతో మిగిలిపోయింది. ఆవులపల్లె రిజర్వాయర్ పనులు చేయకుండానే.. రూ.600 కోట్లు పెద్దిరెడ్డి దోచేశాడు.. ఎన్జీటీ రూ.100 కోట్లు జరిమానా విధిస్తే.. ప్రజల సొమ్మును జరిమానాగా చెల్లించారు. హంద్రీ-నీవా పనులు కూడా పూర్తి చేయలేదు. గాలేరు-నగిరికి నీళ్లు ఇవ్వలేని సిగ్గులేని ప్రభుత్వమిది. హంద్రీ-నీవాపై గండికోట నుంచి మరో ప్రాజెక్టును మంజూరు చేయించుకుని.. రూ.1,500 కోట్ల బిల్లులు తెచ్చుకున్నారు. ఇవన్నీ బయటకు తెచ్చినందుకు.. అంగళ్లలో నాపై దాడికి యత్నించి.. నాతో సహా 600 మందిపై కేసులు పెట్టారు. పాపాల పెద్దిరెడ్డీ.. నీ పనై పోయింది.

> ● 2019 ఎన్నికల్లో బాబాయి వివేకానందరెడ్డిని గొడ్డలిపోటుతో చంపించి జగన్ రాజకీయం చేశాడు. అప్పుడు కోడికత్తి డ్రామా ఆడాడు. ఇప్పుడు గులకరాయి డ్రామా ఆడుతున్నాడు. గులకరాయి గాయం రోజు రోజుకూ పెద్దదవుతోంది. వైసీపీని ఓడించి ఆ గాయానికి ప్రజలే చికిత్స చేయాలి. **- చంద్రబాబు**

> ● పిఠాపురంలో నన్ను ఓడించడానికి వందల కోట్లు ఖర్చు చేస్తున్న మిథున్‌రెడ్డి ముందు రాజంపేటలో గెలవాలి. పెద్దిరెడ్డి కుటుంబ అరాచకాలకు రాజంపేట లోక్‌సభ నియోజకవర్గ ప్రజలు అంతం పలకాలి. **- పవన్ కల్యాణ్**

ఇంత దరిద్రపు సీఎంను ఎన్నడూ చూడలేదు: కిరణ్

4 దశాబ్దాల రాజకీయ జీవితంలో ఎందరో ముఖ్యమంత్రులను చూశానని.. జగన్‌రెడ్డి అంత దరిద్రపు ముఖ్యమంత్రిని ఎన్నడూ చూడలేదని మాజీ సీఎం, రాజంపేట ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అన్ని వ్యవస్థలు నిర్వీర్యమైపోయాయని ఆవేదన వ్యక్తంచేశారు.

ఎర్రచందనం స్మగ్లర్లకు టికెట్లా?

పెద్దిరెడ్డి జైలుకు పోవడం ఖాయం: పవన్

రాష్ట్రంలో ఏ మూలకి వెళ్లిన ఈ సారి ఎన్నికల్లో మార్పు తథ్యంగా కనిపిస్తోందని పవన్ కల్యాణ్ అన్నారు. ప్రజలు వైసీపీని ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. 'అన్ని ప్రాంతాల యువత మార్పు కోరుకుంటున్నారు. ఎర్రచందనం స్మగ్లర్లకు వైసీపీ సీటు ఇవ్వడం నీచాతినీచం. మంగంపేట గనులను అమాంతం మింగిన పెద్దిరెడ్డి జైలుకు పోక తప్పదు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో రౌడీయిజం పెరిగిపోయింది. ఇది మారాలంటే టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం రావాలి. మేమొచ్చాక పోలీసులకు టీఏ, డీఏలు ఇచ్చి వారాంతపు సెలవులు అమలు చేస్తాం. ఉద్యోగుల సీపీఎస్ రద్దుపై కమిటీ వేసి న్యా యం చేస్తాం. రాష్ట్రంలో గత ఐదేళ్లలో 33 వేల మంది బాలికలు అదృశ్యమయ్యారు. ఇప్పటి వరకు వారి ఆచూకీ కోసం ఈ ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదు. జగన్ బటన్ నొక్కినా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పడలేదు. మేం రాగానే ఇస్తాం' అని తెలిపారు.

ఇసుక దాహానికి అన్నమయ్య ప్రాజెక్టు బలి

జగన్ సర్కారు రాజంపేటకు తీవ్ర అన్యాయం చేసిందని పవన్ అన్నారు. 'ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ఇసుక దాహానికే అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయి 30 మంది చనిపోయి అనేక గ్రామాలు మునిగిపోయాయి. లష్కర్ రామయ్య వల్లే ఈ ఘటనలో వందలాది మంది ప్రాణాలతో బయటపడ్డారు. ఆ రామయ్యను గుర్తించి నేను రూ.2 లక్షలు ఇచ్చా' అన్నారు. మిథున్‌రెడ్డి అధికారంలో ఉండి అధికారమదంతో కొట్టడాలు, చంపడాలు చేయడం వల్లే అనేక మంది ఆత్మహత్యలు చేసుకున్నారని చెప్పారు.



ఫ్లయింగ్ స్క్వాడ్ స్వాధీనం చేసుకున్న మద్యం నిల్వలు

వైసీపీ నేత బార్‌లో 1.3 కోట్ల మద్యం సీజ్

నెల్లూరు జిల్లా అల్లూరులో గుర్తింపు

అల్లూరు, ఏప్రిల్ 25 : నెల్లూరు జిల్లాలో అధికార పార్టీ నాయకుల మద్యం డంపుల పుట్ట పగులుతోంది. రెండ్రోజుల క్రితం ముత్తుకూరు, పొదలకూరు మండలాల్లో భారీగా మద్యం స్వాధీనం చేసుకున్న ఫ్లయింగ్ స్క్వాడ్, ఎక్సైజ్ అధికారులు శుక్రవారం తెల్లవారుజామున అల్లూరులోని ఓ బార్‌పై దాడులు నిర్వహించి రూ.1.3 కోట్ల విలువైన మద్యాన్ని సీజ్ చేశారు. ఈ బార్ అధికార పార్టీకి చెందిన నాయకుడిది కావడంతో కలకలం రేగుతోంది. ముందుగా బుధవారం రాత్రి ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల్లో ఈ బారుకు సమీపంలో 272 మద్యం సీసాలను పట్టుకున్నారు. వీటిని తరలిస్తున్న ఇస్కపల్లికి చెందిన కొండూరు శ్రీనివాసులు, యల్లంగారి పార్వతయ్యలను అదుపులోకి తీసుకొని విచారించగా 'లవీడవీ' బార్ నుంచి వాటిని తీసుకున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందానికి సమాచారం అందించడంతో ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లీశ్వర్‌రెడ్డి, సెబ్ సూపరింటెండెంట్ బాబు శ్రీధర్ తమ సిబ్బందితో గురువారం వేకువజామున ఆ బార్‌పై దాడులు చేశారు. దాదాపు ఐదు గంటలపాటు సోదాలు నిర్వహించి, రూ1.3 కోట్లు విలువ చేసే 78 వేల పైచిలుకు మద్యం సీసాలు, పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నారు.

'ప్రలోభాల' పట్టివేత!

రూ.165కోట్ల విలువైన 5228 కిలోల డ్రగ్స్,1473 కిలోల ఆభరణాలు



అమరావతి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నామినేషన్ల పర్వం పూర్తయిన నేపథ్యంలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే వారిపై గట్టి నిఘా కొనసాగుతున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో) ముఖేశ్ కుమార్ మీనా వెల్లడించారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి గురువారం వరకు రాష్ట్ర వ్యాప్తంగా రూ.165.91 కోట్లకు పైగా విలువైన నగదు, లిక్కర్, డ్రగ్స్, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటిలో 5,228 కిలోల డ్రగ్స్, 1,473 కిలోల బంగారు, వెండి ఆభరణాలు, 6.62 లక్షల లీటర్ల మద్యం ఉన్నట్టు చెప్పారు. కేవలం గత 24(బుధవారం-గురువారం) గంటల్లో రూ.8.65 కోట్ల విలువైన వస్తులను స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఇప్పటి వరకు స్వాధీనం చేసుకున్నవి!

నగదు	రూ.36.89 కోట్లు
మద్యం	6.62 లక్షల లీటర్లు(రూ.20.32 కోట్లు)
డ్రగ్స్	5,228 కిలోలు(రూ.2.78 కోట్లు)
బంగారం, వెండి	1473 కిలోలు(రూ.91.26 కోట్లు)
గృహోపకరణాలు	4,88,557(రూ.2.90 కోట్లు)
ఇతర వస్తువులు	11,27,451(రూ.11.74 కోట్లు)

వైసీపీకి అనుకూలంగా నెల్లూరు రూరల్ డీఎస్పీ

బదిలీ చేయాలని సీఈవోకు టీడీపీ నేత వర్ల ఫిర్యాదు

అమరావతి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి అనుకూలంగా పని చేస్తున్న నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డిని వెంటనే బదిలీ చేయాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కోరారు. ఈ మేరకు గురువారం సీఈవోకు ఆయన లేఖ రాశారు. 'ముఖ్యమంత్రి జగన్ ఓఎస్డీగా పని చేస్తున్న నీలకంఠరెడ్డికి డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి దగ్గర బంధువు. ఓఎస్డీ ప్రభావంతో డీఎస్పీ వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తూ, టీడీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడుతున్నారు. శ్రీనివాస్‌రెడ్డిని తక్షణం బదిలీ చేసి, ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలి' అని వర్ల రామయ్య సీఈవోను కోరారు.

డీజీపీని ఎన్నికల విధుల నుంచి తప్పించండి

సీఈవోకు బీజేపీ ఫిర్యాదు

అమరావతి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ పార్టీ నేతలపై దాడులు జరుగుతున్నా, శాంతిభద్రతల్లో వైఫల్యం ఉన్నా పట్టించుకోని డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డిని ఎన్నికల విధుల నుంచి తప్పించాలని బీజేపీ నేత భానుప్రకాశ్ రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం అమరావతి సచివాలయంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేష్ కుమార్ మీనాకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం భానుప్రకాష్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించాలని, ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు నిష్పక్షపాతంగా ఉండేలా చూడాలని, కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన విధివిధానాలను నిష్పక్షపాతంగా అమలు చేయాలని సీఈవోను కోరామన్నారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

175 అసెంబ్లీ స్థానాలకు 5,751 నామినేషన్లు

25 ఎంపీ స్థానాలకు 1,070 దాఖలు

అమరావతి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల దాఖలు ప్రక్రియ ముగిసింది. 175 అసెంబ్లీ, 25 పార్లమెంటు స్థానాలకు ఈ నెల 18వ తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. గురువారం మధ్యాహ్నం 3 గంటలతో రాష్ట్ర వ్యాప్తంగా ఈ ప్రక్రియ ముగిసింది. టీడీపీ-బీజేపీ-జనసేన కూటమి, వైసీపీ సహా రిజిస్టర్, రికగ్నైజ్ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలు చేశారు. అసెంబ్లీ స్థానాలకు మొత్తం 5,751 నామినేషన్లు, లోక్‌సభ స్థానాలకు మొత్తం 1,070 నామినేషన్లు దాఖలయ్యాయి. అయితే..వీటిలో కొన్ని మార్పులు,చేర్పులు ఉండే అవకాశముందని సీఈవో కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఇదిలావుంటే, నామినేషన్ల పర్వం ప్రారంభమైన తొలి రోజు నుంచి అభ్యర్థుల నుంచి అనూహ్యమైన స్పందన లభించింది. తొలిరోజు మంచి ముహూర్తం కావడంతో భారీ సంఖ్యలో నామినేషన్లు వేశారు. తర్వాత రోజు ఇండిపెండెంట్ అభ్యర్థులు ఎక్కువ సంఖ్యలో దాఖలు చేయగా.. చివరి రోజైన గురువారం ప్రధాన పార్టీల అభ్యర్థులు సహా స్వతంత్రులు కూడా పోటాపోటీగా నామినేషన్లు సమర్పించారు. మరోవైపునామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 29వ తేదీ వరకు అవకాశం ఉంది.

పేర్లతో పరేషాన్!

పిఠాపురంలో పవన్ కల్యాణ్.. పేరుతో మరో ఇద్దరు నామినేషన్లు

పలు నియోజకవర్గాల్లో కూడా

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఎన్నికల నామినేషన్ల ఘట్టంలో చిత్రమైన ఘటనలు చోటు చేసుకున్నాయి. ప్రధాన పార్టీలకు చెందిన కీలక అభ్యర్థులు పోటీ చేస్తున్న నియోజకవర్గాల్లో దాదాపు ఆయా అభ్యర్థుల పేర్లే ఉన్న స్వతంత్ర అభ్యర్థులు కూడా నామినేషన్లు వేశారు. దీంతో ప్రధాన పార్టీల అభ్యర్థులకు ఒకింత ఇబ్బందిగా మారింది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పిఠాపురం నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. అయితే.. ఇదేస్థానం నుంచి కోనేటి పవన్ కల్యాణ్, కనుమూరి పవన్ కల్యాణ్ నామినేషన్లు వేశారు. దీంతో ఓటర్లు తికమకపడే అవకాశం ఉంది.

- తాడేపల్లిగూడెంలో జనసేన అభ్యర్థిగా పోటీలో ఉన్న బొలిశెట్టి శ్రీనివాస్ పేరును పోలిన అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరఫున నామినేషన్ వేశారు.
- గన్నవరం నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థిగా వల్లభనేని వంశీ మోహన్ నామినేషన్ వేయగా, దాదాపు అదే పేరుతో ఉన్న మరో వ్యక్తి వల్లభనేని మోహన్ శ్రీకృష్ణ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు.
- తిరువూరు(ఎస్సీ)లో టీడీపీ అభ్యర్థిగా కొలికపూడి శ్రీనివాస్ నామినేషన్ వేశారు. దాదాపు ఇదే పేరుతో ఉన్న కొలికపోగు శ్రీను అనే వ్యక్తి జాతీయ జనసేన పార్టీ తరఫున నామినేషన్ వేశారు.
- అవనిగడ్డ నియోజకవర్గంలో జనసేన అభ్యర్థిగా మండలి బుద్ధ ప్రసాద్ నామినేషన్ వేశారు. నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరఫున అదే పేరుతో ఉన్న బోయిన బుద్ధ ప్రసాద్ నామినేషన్ దాఖలు చేశారు.
- గుడివాడ నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థిగా కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) నామినేషన్ వేశారు. అదే పేరుతో ఉన్న కొడాలి వెంకటేశ్వరరావు అనే వ్యక్తి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు.

నాడు నేడు.. మారిన సీను

- 2019లో అమ్మ ముద్దు...వెంట వివేకా బామ్మర్ది
- ఈసారి జగన్ నామినేషన్‌లో కనిపించని ఆ దృశ్యాలు
- నామినేషన్‌కు ముందు అప్పుడూ ఇప్పుడూ సభ
- అప్పట్లో భారీగా తరలొచ్చిన వివేకా అభిమానులు
- వివేకా హత్యలో నిజాలు బయటకు వచ్చిన నేపథ్యంలో గురువారం సభలో కనిపించని అప్పటి ఊపు
- ఇప్పటికే అమెరికా వెళ్లిపోయిన తల్లి విజయలక్ష్మి
- అవినాశ్ ఇచ్చిన పెన్నుతో పత్రాలపై సంతకం



2019 మార్చి 22న జగన్ నామినేషన్ వేయడానికి ముందు కొడుక్కు ముద్దు పెడుతున్న తల్లి విజయలక్ష్మి

అమరావతి, పులివెందుల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పులివెందుల అసెంబ్లీకి ఎమ్మెల్యే అభ్యర్థిగా వైఎస్ జగన్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఆయన 2019లో ఇక్కడకు నామినేషన్ వేయడానికి వచ్చారు. అయితే, అప్పటికీ, ఇప్పటికీ పరిస్థితిలో చాలా తేడా కనిపించింది. గత ఐదేళ్ల కాలంలో జగన్ వైఖరిలో, ఆయన కుటుంబ సభ్యుల తీరులో వచ్చిన మార్పు ఆయన పులివెందుల పర్యటనలో స్పష్టంగా కనిపించింది. జగన్ 2019 ఎన్నికల్లో నామినేషన్ సందర్భంగా పులివెందులలోని సీఎస్ఐ వద్ద నిర్వహించిన బహిరంగసభకు జనం పోటెత్తారు. ఆ రోడ్డంతా ఎటు చూసినా జనం కనిపించారు. వైసీపీ కార్యకర్తలు, జనం భారీగా వచ్చారు. అప్పటికి కొద్ది రోజుల ముందే వివేకా హత్య జరగడంతో వివేకా అభిమానులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అయితే ఐదేళ్ల తరువాత గురువారం జగన్ నామినేషన్ వేసిన సందర్భంగా పులివెందులలో నిర్వహించిన బహిరంగసభ చూస్తే.. గతానికి ఇప్పటికీ చాలా తేడా కనిపించింది. గురువారం బహిరంగసభను అదే సీఎస్ఐ స్కూలులో నిర్వహించారు. బహిరంగసభ కోసం భారీగా వైసీపీ నేతలు జన సమీకరణ చేపట్టారు. ఇంత చేసినా బహిరంగసభకు 2వేలనుంచి 3వేల మధ్య జనం హాజరయ్యారని చెబుతున్నారు. 2019లో నామినేషన్ సమయానికి ఇప్పటికి చూస్తే చాలా తేడా ఉంది. అప్పట్లో వివేకా హత్య అంశం ప్రధానం కావడంతో వైసీపీకి కలిసి వచ్చింది. ఇప్పుడు వివేకా హత్య కేసు గుట్టురట్టు కావడం.. సీబీఐ ఎంపీ అవినాశ్, ఆయన తండ్రి భాస్కర్ రెడ్డిలను నిందితులుగా చేర్చడం, వారిని జగన్ వెనకేసుకుని రావడం కూడా.. జనం పెద్దగా రాకపోవడానికి కారణమని అంటున్నారు.

2019లో అలా... 2019 ఎన్నికల సమయంలో జగన్ నామినేషన్ వేసిన రోజున ఆయన వెంట తల్లి విజయలక్ష్మి పులివెందులకు వచ్చారు. నామినేషన్ వేయడానికి వెళ్లేముందు ఆమె జగన్‌కు ముద్దు పెట్టి ఆశీర్వదించారు. నామినేషన్ సమయంలో ఎంపీ అవినాశ్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, వివేకా బావమరిది శివప్రకాశ్‌రెడ్డి ఉన్నారు.

గురువారం ఇలా... గురువారం పులివెందులలో జగన్ నామినేషన్ వేశారు. అయితే, ఈ కార్యక్రమానికి తల్లి విజయలక్ష్మి హాజరుకాలేదు. ఆమె ఇప్పటికే అమెరికా వెళ్లిపోయారు. అప్పట్లో నామినేషన్ వేసినప్పుడు ఉన్నవారిలో వివేకా బావమరిది శివప్రకాశ్‌రెడ్డి ఈసారి దూరంగా ఉన్నారు. జగన్ వెంట ఎంపీ అవినాశ్‌రెడ్డి, వైఎస్ మనోహర్ రెడ్డి మాత్రమే కనిపించారు. అవినాశ్‌రెడ్డి పెన్ను తీసి ఇవ్వగా, నామినేషన్ పత్రాలపై జగన్ సంతకాలు చేశారు.

జేఈఈలో తెలుగు విద్యార్థుల సత్తా



ముత్తవరపు అనూప్



చింతు సతీశ్‌కుమార్

(మొదటి పేజీ తరువాయి)

సాధించగా వీరిలో తెలంగాణ నుంచి ఇద్దరు, ఏపీ నుంచి ఇద్దరు ఉన్నారు. దివ్యాంగుల విభాగంలో(పీడబ్ల్యూడీ) 3,369 మంది పరీక్ష రాయగా తెలంగాణ విద్యార్థి చుంచికల శ్రీచరణ్ టాపర్‌గా నిలిచాడు. ఎస్టీ విభాగంలో తెలంగాణ విద్యార్థి జగన్నాథం మోహిత్ ప్రథమ స్థానం సాధించాడు.

అనూప్‌కు ఆరో ర్యాంకు

జేఈఈ మెయిన్స్ ఫలితాలలో పల్నాడు జిల్లా యడ్లపాడు గ్రామానికి చెందిన ముత్తవరపు అనూప్ ఓపెన్ కేటగిరిలో ఆల్ ఇండియా ఆరో ర్యాంకు సాధించాడు. జేఈఈ మెయిన్స్ రెండు విడతల ఫలితాల్లో 300/300 మార్కులు సాధించి సత్తా చాటాడు. తండ్రి రాజ్ కుమార్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కాగా, తల్లి గృహిణి. అనూప్ సోదరి హర్షిత చెన్నై ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ తృతీయ సంవత్సరం చదువుతోంది.

సిక్కోలు సతీశ్‌కు 8వ ర్యాంకు

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో సిక్కోలు కుర్రోడు సత్తా చాటాడు. శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం కరవంజ గ్రామానికి చెందిన చింతు సతీశ్‌కుమార్ జాతీయ స్థాయిలో 8వ ర్యాంకు సాధించాడు. ఓబీసీలో రెండో ర్యాంకు పొందాడు. సతీశ్ తల్లిదండ్రులు చింతు బుచ్చెన్న, రమాదేవి ఇద్దరూ ఉపాధ్యాయులే. సాఫ్ట్‌వేర్ ఇంజనీరు కావడమే తన లక్ష్యమని సతీశ్ కుమార్ తెలిపాడు.

100 పర్సంటైల్(300/300) సాధించిన ఏపీ విద్యార్థులు


చింతు సతీష్ కుమార్, షేక్ సూరజ్, మాకినేని జిష్ణు సాయి, తోటంశెట్టి నిఖిలేష్, అన్నరెడ్డి వెంకట తనీష్ రెడ్డి, తోట సాయి కార్తీక్, మురసాని సాయి యశ్వంత్ రెడ్డి

మే 26న జేఈఈ అడ్వాన్స్‌డ్

జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష మే 26న జరగనుంది. దీన్ని ఈసారి ఐఐటీ మద్రాస్ నిర్వహించనుంది. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు పేపర్-2 పరీక్ష నిర్వహించనున్నారు. జేఈఈ మెయిన్‌లో కటాఫ్ మార్కులు సాధించిన దాదాపు రెండున్నర లక్షల మంది అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత సాధించారు. ఈ నెల 27 నుంచి మే 7వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. జూన్ 9న ఫలితాలు ప్రకటిస్తారు.

కాసుల రాజకీయం

- లోక్‌సభ ఎన్నికల ఖర్చు రూ.1.2 లక్షలకోట్ల నుంచి 1.35 లక్షల కోట్లు
- అమెరికా అధ్యక్ష ఎన్నికలకు మించి ఖర్చు.. ప్రపంచంలోనే అత్యధికం
- పీటీఐ ఇంటర్వ్యూలో సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ చీఫ్ భాస్కర్ రావు



ఎన్. భాస్కర్‌రావు

హైదరాబాద్, ఏప్రిల్ 25: రూ.1.35 లక్షల కోట్లు.. అక్షరాలా లక్షా ముప్పై ఐదు వేల కోట్ల రూపాయలు! ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ఎన్నికల తతంగంగా.. దేశవ్యాప్తంగా ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల ఖర్చు ఇది! గెలవడానికి అభ్యర్థులు వెదజల్లుతున్న డబ్బు.. అధికారం కోసం పార్టీలు కుమ్మరిస్తున్న డబ్బు.. ప్రభుత్వం, ఈసీ ఎన్నికల నిర్వహణకు ఖజానా నుంచి తీసి ఖర్చుచేస్తున్న డబ్బు.. ఇది! ప్రభుత్వం, పార్టీలు, అభ్యర్థులు, ఎన్నికల కమిషన్.. అందరూ కలిసి ప్రత్యక్షంగా, పరోక్షంగా చేస్తున్న వ్యయం!! మూడున్నర దశాబ్దాలుగా దేశంలో జరుగుతున్న ఎన్నికల ఖర్చును ఎప్పటికప్పుడు లెక్కగడుతున్న సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ (సీఎంఎస్-ఢిల్లీ) అధినేత ఎన్.భాస్కర్‌రావు పీటీఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వివరాలు వెల్లడించారు. "ఈసారి ఎన్నికల ఖర్చు రూ.1.2 లక్షల కోట్లు ఉంటుందని మేం ప్రాథమికంగా అంచనా వేశాం. కానీ.. ఎలక్టోరల్ బాండ్ల వివరాలు బహిర్గతమయ్యాక మా అంచనాలను రూ.1.35 లక్షల కోట్లకు పెంచాం" అని ఆయన వివరించారు. ఎన్నికల షెడ్యూలు ప్రకటించడానికి 3-4 నెలల ముందరి ఖర్చులను (పొలిటికల్ ర్యాలీలు, రవాణా, కార్యకర్తల ఖర్చు, సోషల్ ఇన్‌ఫ్లూయెన్సర్లకు ఇచ్చిన సొమ్ము, ఇతర పార్టీల నాయకులను కొనుగోలు చేయడానికి చేసిన ఖర్చు) కూడా పరిగణనలోకి తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు. పార్టీలు, అభ్యర్థులు రకరకాల మీడియాల్లో ప్రచారానికే తమ మొత్తం వ్యయంలో 30% కేటాయిస్తున్నట్టు వివరించారు. ఒకప్పుడు భారతదేశంలో రాజకీయాలు సిద్ధాంతాలు, భావజాలాల ఆధారంగా జరిగేవని.. కానీ దాని స్థానంలో డబ్బు శక్తి పెరుగుతోందని భాస్కర్‌రావు తాను రాసిన 'నెక్స్ట్ బిగ్ గేమ్ చేంజర్ ఆఫ్ ఎలక్షన్స్' పుస్తకంలో పేర్కొన్నారు. చట్ట ప్రకారం అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై పరిమితి ఉన్నప్పటికీ ఆ నిబంధనలు ప్రభావవంతంగా అమలు కాకపోవడంతో దేశంలో కాసుల రాజకీయానికి అడ్డుకట్ట వేసే పరిస్థితి లేకుండా పోయింది. పార్టీలు, అభ్యర్థులు.. ఖర్చు పరిమితిని అధిగమించినా దొరక్కుండా తప్పించుకోవడానికి రకరకాల మార్గాలను అనుసరిస్తున్నట్టు భాస్కర్ రావు వివరించారు. సీఎంఎస్ లెక్కల ప్రకారమే.. 2019 ఎన్నికల్లో అయిన మొత్తం ఎన్నికల ఖర్చు రూ.60 వేల కోట్లలో దాదాపు 45% బీజేపీ చేసిన వ్యయమే! 2024లో బీజేపీ ఖర్చు ఇంకా పెరిగే అవకాశం ఉందని ఆయన అంచనా వేశారు.

రెండు దశాబ్దాల్లో ఆరు రెట్లు..

2019లో మనదేశంలో ఒక్కో ఓటుకూ అందరూ కలిసి చేసిన ఖర్చు రూ.700. ఇప్పుడు అది ఏకంగా రూ.1240 నుంచి రూ.1400కు చేరడం గమనార్హం. 1998లో లోక్‌సభ ఎన్నికల ఖర్చు రూ.9 వేల కోట్లు కాగా.. 2019 ఎన్నికల నాటికి ఆరు రెట్లు కావడం, ఆ తర్వాత ఐదేళ్లలో రెట్టింపు కావడం.. ఎన్నికల్లో పెరుగుతున్న ధనస్వామ్యానికి గుర్తని రాజకీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ఖర్చులో ఓటరుకు ఎంత?

అభ్యర్థులు, పార్టీలు, ఈసీ అందరూ కలిసి చేస్తున్న/చేసిన ఎన్నికల ఖర్చు భారీగా కనిపిస్తున్నా.. అందులో ఓటరుకు అందే వాటా కొంచెమే.

ఉదాహరణకు.. 2019 ఎన్నికలనే తీసుకుంటే మొత్తం రూ.60 వేల కోట్ల ఖర్చులో ఓటర్లకు చేరింది రూ.12-15 వేల కోట్లు. ప్రచారానికి చేసిన ఖర్చు రూ.20-25 వేల కోట్లు. రవాణా ఖర్చులు రూ.5-6 వేల కోట్లు కాగా.. మిగిలినవి ఇతరత్రా చిల్లరమల్లర ఖర్చులు.

రూ.2,994 కోట్లు

దేశంలోని 32 ప్రధాన జాతీయ, ప్రాంతీయ పార్టీలు 2019లో అధికారికంగానే చేసిన ఎన్నికల ఖర్చు రూ.2,994 కోట్లు. అందులో రూ.529 కోట్లను ఆయా పార్టీలు తమ అభ్యర్థులకు ప్రచారఖర్చుగా ఇచ్చాయి.

కార్పొరేట్ శక్తుల ప్రభావం

ఎన్నికల్లో కార్పొరేట్ శక్తుల ప్రభావం అంతకంతకూ పెరుగుతూ వస్తోంది. 2019 ఎన్నికల్లో 70 శాతం మంది అభ్యర్థులు కార్పొరేట్ ఆర్థిక సాయం ద్వారా ఎన్నికల్లో పోటీపడ్డవారే. 2014 ఎన్నికల్లో ఆ సంఖ్య 30 శాతం ఉండేది. కార్పొరేట్ శక్తుల నుంచి నిధులు సమకూరడంతో ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు వ్యక్తిగత రుణాల కోసం ఆధారపడే పరిస్థితి తగ్గిపోయింది. సొంత నిధులతో ఎన్నికల్లో పోటీ చేసేవారు 2014లో 25 శాతం ఉంటే 2019 ఎన్నికల్లో వీరి సంఖ్య 13 శాతానికి పడిపోయింది.



పులివెందులలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతున్న వైఎస్ జగన్, పక్కన అవినాశ్

అవినాశ్ చిన్న పిల్లోడు

(మొదటి పేజీ తరువాయి)

వచ్చారు. ఈ సందర్భంగా పులివెందులలో నిర్వహించిన బహిరంగసభలో జగన్ మాట్లాడారు. "జగన్ అధికారంలోకి వచ్చాక మమ్మల్ని పక్కనబెట్టాడని మాట్లాడుతున్న నా బంధువులకు ఈ సందర్భంగా తెలియజేస్తున్నా"నంటూ వివేకా హత్యకేసును ప్రస్తావించారు. ఈ కేసులో నిందితుడుగా ఉన్న అవినాశ్‌ను అమాయకుడని చెప్పే ప్రయత్నం చేశారు. "వివేకా హత్య కేసు విషయంలో అవినాశ్ అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పలేని వీరంతా.. ఈ చిన్నపిల్లాడిని దూషించడం, తెరమరుగు చేయాలనుకోవడం దారుణం. వీరందరూ మనుషులేనా?" అని వ్యాఖ్యానించారు. వివేకా చిన్నాన్నను ఎవరు చంపారో, ఎవరు చంపించారో ఆయనకు, ఆ దేవుడికి, ఈ జిల్లా ప్రజలకూ తెలుసునన్నారు. "బురద చల్లేందుకు ఇద్దరు చెల్లెమ్మలను ఎవరు పంపించారో, వారి వెనకాల ఎవరున్నారో మీకు తెలుసు. చిన్నాన్నకు రెండోభార్య ఉన్నమాట వాస్తవమా కాదా? ఆ రెండో భార్యతో తనకు సంతానం ఉందన్న మాట వాస్తవమా కాదా? (జగన్ ప్రశ్నించినప్పుడు జనంనుంచి ఎలాంటి స్పందనా లేదు) హత్య జరిగిన రోజున ఎవరో ఫోను చేస్తే అవినాశ్ అక్కడికి వెళ్లాడు. ఇదే విషయాన్ని అవినాశ్ తన ఇంటర్వ్యూలు, ప్రెస్ కాన్ఫరెన్స్‌లో చెప్పాడు. ఆ సమాధానాలను బలపరుస్తూ మాట్లాడుతున్న వారినీ వీరంతా విమర్శిస్తున్నారు. ఇది ధర్మమేనా?" అని జగన్ వ్యాఖ్యానించారు. వివేకాను ఓడించిన వారిని గెలిపించాలని తిరగడం కంటే దిగజారుడు రాజకీయాలు ఉంటాయా? అని విమర్శించారు. "గత ఎన్నికల్లో నోటాకు వచ్చిన ఓట్లు కూడా రాని పార్టీలో (షర్మిల) చేరారు. వైఎస్ పేరును తుడిచేయాలని, కనపడకుండా చేయాలని చూసిన ఆ పార్టీ నాయకులకు ఓట్లు వేయడమంటే ఎవరికి లాభం? వైఎస్ శత్రువుల ఇంటికి పసుపు చీర (కుమారుడి పెళ్లి కార్డు ఇవ్వడానికి చంద్రబాబు ఇంటికి షర్మిల వెళ్లిన సందర్భం) కట్టుకుని వెళ్లారు. వారి స్క్రిప్ట్‌లను మక్కీకి మక్కీ చదివి వినిపిస్తూ, వారి కుట్రలో భాగమవుతున్నారు. వీళ్లా వైఎస్సార్ వారసులు?" అని విమర్శించారు.

28 నుంచి జగన్ ప్రచారం

అమరావతి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఈ నెల 28 నుంచి వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఎన్నికల ప్రచారాన్ని చేపడతారు. ఈ సభలను తాడిపత్రి నుంచి ప్రారంభిస్తారు. రాయలసీమ, కోస్తా, ఉత్తర కోస్తా జిల్లాల్లో 15 రోజుల పాటు... 45 సభలు నిర్వహించేందుకు ప్రణాళికలను ఆ పార్టీ సిద్ధం చేసింది. ఈ నెల 28న తాడిపత్రి, వెంకటగిరి, కందుకూరులోనూ, 29న చోడవరం, పీ గన్నవరం, పొన్నూరులో సభలు నిర్వహిస్తారు. మిగిలిన సభలను, తేదీలను కూడా శుక్రవారం నాటికి వైసీపీ ఖరారు చేయనుంది.



చిన్న పిల్లాడైతే స్కూలుకు పంపాలి

అవినాశ్‌ని నిర్దోషి అంటున్న జగన్ మీకు వ్యవస్థలపై నమ్మకముందా?

- వివేకానందరెడ్డి హత్యపై లైవ్ డిబేట్‌కు సిద్ధం
- సీఎం జగన్‌కు డాక్టరు సునీత సవాల్

పులివెందుల రూరల్, ఏప్రిల్ 25: "వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడు అవినాశ్‌రెడ్డి నిర్దోషి అని మీరు అంటున్నారు. ఇక ఏ వ్యవస్థపై మీకు నమ్మకముంది సార్?" అని సీఎం జగన్‌ను ఆయన చెల్లెలు, వివేకా కుమార్తె డాక్టరు సునీత సూటిగా ప్రశ్నించారు. పులివెందుల సభలో అవినాశ్‌రెడ్డిను జగన్ చిన్నపిల్లాడని సంబోధించారు. దీనిపై సునీత స్పందిస్తూ.. "చిన్నపిల్లలకు పదవులు ఇవ్వరు. పిల్లలు అయితే స్కూల్‌కు వెళ్లాలి. ఎంపీ అంటే బాధ్యత.. పిల్లలకు టికెట్లు ఇవ్వరు. నిందితులను మూడోసారి ఎంపీగా పోటీ చేయిస్తున్నారు. సీబీఐ నిందితులుగా తేల్చిన వారిని ప్రోత్సహిస్తున్నారు. దయచేసి ఇలా చేయకండి" అని కోరారు. గురువారం సునీత పులివెందులలోని స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. "మీకోసం వివేకానందరెడ్డి ఎన్నో త్యాగాలు చేశారు. కానీ మీరేం చేశారు? ఆయన గురించి మంచిగా ఒక్కమాట కూడా మాట్లాడరు. ఆయన హత్యపై మీ చానల్‌లో లైవ్ డిబేట్ ఏర్పాటు చేయండి. నేను సిద్ధం. మీరు సిద్ధమా..?" అని సీఎం జగన్‌కు సునీత సవాల్ విసిరారు. ఇంకా ఆమె ఏమన్నారంటే..

చంపేంత ద్వేషం చిన్నాన్నపై ఎందుకు?

"పులివెందుల అంటే నమ్మకం, ధైర్యం, అభివృద్ధి అంటున్న జగన్.. ఆ పేరు ఈ ప్రాంతానికి రావడానికి కారణం ఎవరనేది మరిచారా అని ప్రశ్నించారు. "1978 నుంచి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వివేకానందరెడ్డి పడిన కష్టం, శ్రమ పులివెందులను ఈ స్థాయిలో నిలిపాయి. వారిద్దరు జతగా పనిచేశారు. రాజశేఖర్‌రెడ్డి రాష్ట్రస్థాయిలోను, వివేకానందరెడ్డి పులివెందుల, కడప స్థాయిలో కొన్ని దశాబ్దాలు కష్టపడి పనిచేశారు. దానివల్ల పులివెందుల తొలుత కాంగ్రెస్ పార్టీకి, ఇప్పుడు వైసీపీకి కంచుకోటగా తయారైంది. వివేకానందరెడ్డి ఒకానొక సమయంలో రాజశేఖర్‌రెడ్డి కోసం ఎమ్మెల్యే పదవిని, జగన్ కోసం ఎంపీ పదవిని త్యాగం చేశారు. అయినా.. ఎందుకు మీకు (జగన్‌ను ఉద్దేశించి) వివేకానందరెడ్డి పట్ల ద్వేషం, అసూయ, చంపేంతవరకూ వచ్చిందో అర్థం కావడం లేదు. అనునిత్యం పులివెందుల ప్రజల కోసం పనిచేసిన వ్యక్తి అనేనా ఈ ఈర్ష్య? మీకోసం పనిచేసిన వ్యక్తి గురించి ఒక్క మంచి మాట కూడా మాట్లాడరేం?"

"2019 మే 30న సీఎంగా జగన్ ప్రమాణస్వీకారం చేశారు. సెప్టెంబరు 2, 2019లో వైఎస్ వర్ధంతి కార్యక్రమం పూర్తిచేసుకుని ఇక్కడకు వివేకా విగ్రహావిష్కరణకు వచ్చారు. ఆ రోజు నా భర్త రాజశేఖర్‌రెడ్డి మీద అనుమానాలు ఉన్నాయన్నారు. 'ఎవరైనా సరే.. విచారణ జరపాల్సిందే. నేరస్థులకు శిక్ష పడాల్సిందే' అని ఆ రోజు మా అమ్మ అన్నారు. అదంతా వదిలేసి... దేవుడికి తెలుసు, కడప ప్రజలకు తెలుసు అంటే అర్థమేమిటి? మా

అవసరమైతే నా భర్తను అరెస్టు చేయించండి

అమ్మ ఆనాడు అన్నారు కదా! చేసింది రాజశేఖర్‌రెడ్డి అయినాగానీ, ఆయన అన్న అయినా గానీ శిక్షించాల్సిందేనని! నాలుగున్నరేళ్ల తర్వాత కూడా మా మాట అదే. ఇంకా మీకు రెండు నెలలు టైమ్ ఉంది. నా భర్త అయినా సరే, ఆయన అన్న శివప్రకాశ్‌రెడ్డి అయినా సరే అరెస్టు చేయండి. ఈ దాగుడుమూతలేంటి? తప్పు చేసి ఉంటే శిక్ష పడాల్సిందే"

వ్యవస్థలంటే గౌరవం లేదా?

"కోర్టులు, సీబీఐ, పోలీసులు, వ్యవస్థలు అంటే మీకు (జగన్‌ను ఉద్దేశించి) గౌరవం ఉందా? లేదా? 2019లో వివేకా చనిపోయినపుడు సీబీఐ విచారణ జరిపించాలని హైకోర్టులో జగన్ కేసు వేశారు. మళ్లీ ఆ కేసు విత్‌డ్రా చేసుకున్నారు. మళ్లీ మీ (జగన్‌ను ఉద్దేశించి) వాళ్లు కడపలో గ్యాగ్ ఆర్డర్ పెడతారు. ఆర్డర్ తెప్పించుకుంటారు. మళ్లీ మీరే మాట్లాడతారు. 'వీళ్లు చేశారు.. వీళ్లు చేయించా'రని సీబీఐ వాళ్లు చెబుతున్నా, 'నిందితులు వీళ్లు' అని చెబుతున్నా అవినాశ్‌రెడ్డి నిర్దోషి అని అంటున్నారు. ఏవ్యవస్థపై మీకు నమ్మకముంది సార్? ప్రతిపక్షాలతో చేతులు కలిపామట! వివేకానందరెడ్డిని అతిదారుణంగా, కిరాతకంగా గొడ్డలితో నరికి నరికి చంపారు. దీనిగురించి ఐదేళ్లుగా పోరాడుతుంటే.. మీకు రాజకీయాలు కనిపిస్తున్నాయా? ఈ ఐదేళ్లు ఆయన గురించి ఎప్పుడైనా మంచిగా మాట్లాడారా? సీబీఐ నిందితులుగా పేర్కొన్న వారితో పోటీ చేయించొద్దు, వారికి ఓట్లు వేయొద్దని ప్రజలను వేడుకుంటున్నా. మిమ్మల్ని(జగన్‌ను ఉద్దేశించి) కూడా వేడుకుంటున్నా.. నిందితులకు స్థానం కల్పించకండి "వైఎస్ కుమార్తె షర్మిలకు సపోర్టు చేస్తున్నా. ఎందుకంటే నా పోరాటానికి ఆమె సహకరించారు, ఆమె గెలిస్తే వివేకానందరెడ్డి కోరిక తీరుతుంది. మీ కోసం వివేకానందరెడ్డి ఎన్నో త్యాగాలు చేశారు కదా? షర్మిలకు సపోర్టు చేసి మీరూ త్యాగం చేయాలి. షర్మిల మీ చెల్లిలే కదా? నా చెల్లెలుకు సపోర్టు చేయాలని మీ కార్యకర్తలకు కూడా చెప్పండి. వివేకా హత్యపై మీ చానల్‌లో లైవ్ డిబేట్ ఏర్పాటు చేయండి. నేను సిద్ధం...మీరు సిద్ధమా?"

బ్యాండ్ ఎయిడ్ తీయండి.. చీము పడుతుంది

జగన్‌కు డాక్టర్ సునీత సలహా

'గులకరాయి' ఘటన తర్వాత నుంచి సీఎం జగన్ నుదిటికి బ్యాండేజ్ పెట్టుకుని తిరుగుతున్నారు. జగన్ బస్సు యాత్రలో ఉండగా విజయవాడలో ఈ నెల 13వ తేదీన ఈ ఘటన జరిగింది. ఆయన తన యాత్రలో ఆ బ్యాండేజీని చూపిస్తూ మాట్లాడుతున్నారు. ఈ ఘటన జరిగి చాలా రోజులయిపోయినా, ఇప్పటికీ ఆ బ్యాండేజీతోనే సభల్లో పాల్గొంటున్నారు. డాక్టర్ కూడా అయిన వివేకాకుమార్తె సునీత.. దీనిపై జగన్‌కు ఒక సూచన చేశారు. "ముఖ్యమంత్రికి డాక్టర్‌గా ఒక సలహా. దెబ్బతగిలిన చోట బ్యాండ్ ఎయిడ్ పెట్టుకోకండి. అలా పెట్టుకుంటే లోపల చీము పట్టి, సెప్టిక్ అయ్యే చాన్స్ ఉంది. బ్యాండ్ ఎయిడ్ తీసేస్తే గాయం త్వరగా మానిపోతుంది" అని తెలిపారు.

పాపం... పిల్లోడు!

- వివేకా కేసులో ఈ పిల్లోడిదే కీలక పాత్ర
- సాక్ష్యాధారాలతో నిరూపించిన సీబీఐ
- అయినా... జగన్ దృష్టిలో అవినాశ్ పసివాడే

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'అవినాశ్ రెడ్డి చిన్న పిల్లోడు. నోట్లో వేలు పెట్టినా కొరకలేడు' అని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సర్టిఫికెట్ ఇచ్చేశారు. 39 ఏళ్ల వయసు.. దాదాపు ఆరడుగుల ఎత్తున్న కడప వైసీపీ అభ్యర్థిని 'చిన్న పిల్లోడిని' చేసేశారు. ఆయన జీవితాన్ని నాశనం చేస్తున్నారని కూడా వాపోయారు. వివేకా హత్య కేసులో ఈ 'చిన్న పిల్లోడి' పాత్రను సీబీఐ పూసగుచ్చినట్లు వివరించింది. దీని ప్రకారం..

ఈ చిన్న పిల్లోడు...

వివేకా హత్యకు ముందు రోజు రాత్రి నిందితులు ఈ చిన్న పిల్లోడి ఇంట్లో ఉన్నారని... రాత్రంతా ఈ 'పిల్లోడి' ఫోన్ యాక్టివ్‌గా ఉందని సీబీఐ సాంకేతిక ఆధారాలు సేకరించింది.

ఈ చిన్న పిల్లోడు...

వివేకాపై పడిన గొడ్డలివేటును గుండెపోటుగా మార్చడంలో ఈ చిన్న పిల్లోడి పాత్ర కీలకమని సీబీఐ నిర్ధారించింది. రక్తపు మరకలను చెరిపివేయించడం నుంచి వివేకా శరీరంపై గాయాలు కనపడకుండా 'కవర్' చేయించడం వరకూ.. సాక్ష్యాధారాలు చెరిపే ప్రక్రియలో ఈ చిన్న పిల్లోడి పాత్ర ప్రధానమని గుర్తించింది.

ఈ చిన్న పిల్లోడు...

దేశమంతా అనేక మంది నేతలను సీబీఐ వణికిస్తుండగా... కడప గడపలో సీబీఐనే ఈ చిన్న పిల్లోడు వణికించారు. వివేకా కేసు దర్యాప్తు అధికారిపైనే కడప పోలీసులు కేసు పెట్టేశారు.

ఈ చిన్న పిల్లోడు...

తనను అరెస్టు చేసేందుకు వచ్చిన సీబీఐని ఈ చిన్న పిల్లోడు ముప్పు తిప్పలు పెట్టారు. తల్లిని కర్నూలు ఆస్పత్రిలో చేర్పించి... ఆస్పత్రి ముందు అనుచరులను మోహరించి... సీబీఐ అధికారులు అటువైపు రాకుండా చేశారు. వివేకా హత్య కేసులో ఈ చిన్న పిల్లోడిని అరెస్టు చేయలేక చేతులెత్తేసింది. కాగితాలపై ఉత్తుత్తి అరెస్టు చూపించి, బెయిలుపై పంపించేసింది. ఎందుకంటే... చిన్న పిల్లోడు కదా!

జగన్... నీకిది తగునా?

- నీ సొంత మీడియాలోనే మీ చిన్నాన్న వ్యక్తిత్వ హననమా?
- కుటుంబ సభ్యుడిగా కాకపోయినా.. సీఎంగా ఇదేనా నీ కర్తవ్యం?
- నీ చెల్లెళ్లను టార్గెట్ చేస్తుంటే... నిమ్మకు నీరెత్తినట్లు ఉండటమేంటి?
- హత్యకు కారకుడైన నిందితుడికి మళ్లీ పోటీకి అవకాశమివ్వడం సముచితమా?
- సీఎం జగన్‌కు వివేకా సతీమణి సౌభాగ్యమ్మ లేఖ



జగన్‌కు లేఖ రాస్తున్న వైఎస్ వివేకా భార్య సౌభాగ్యమ్మ

పులివెందుల, ఏప్రిల్ 25: "నిన్ను సీఎంగా చూడాలని తపించిన మీ చిన్నాన్న వ్యక్తిత్వాన్ని మీ పత్రికల్లో, టీవీల్లో, సోషల్ మీడియాలో హననం చేయడం తగునా? న్యాయం కోసం పోరాడుతున్న నీ చెల్లి సునీత.. ఆమెకు మద్దతు ఇస్తున్న షర్మిలపై నిందలు మోపుతుంటే.. కుటుంబ సభ్యునిగా కాకపోయినా.. ముఖ్యమంత్రిగా అయినా ఇదేనా నీ కర్తవ్యం?" అని సీఎం జగన్‌ను వివేకా భార్య వైఎస్ సౌభాగ్యమ్మ ప్రశ్నించారు. ఈ మేరకు ఆమె సీఎంకు రాసిన బహిరంగ లేఖను గురువారం సోషల్ మీడియాలో పోస్టు చేశారు. "2009లో తండ్రి చనిపోయినపుడు నువ్వు ఎంత వేదనను అనుభవించావో 2019లో నీ చెల్లి సునీత కూడా అంతే వేదన అనుభవించింది. అప్పటినుంచి జరిగిన పరిణామాల్లో మమ్మల్ని ఎక్కువ బాధించిన విషయం.. మన కుటుంబంలోని వారే ఈ హత్యకు కారకులు కావడం... వాళ్లకు నువ్వు రక్షణగా ఉండటం. నిన్ను సీఎంగా చూడాలని తపించిన చిన్నాన్నపై మీ సొంత మీడియా, పార్టీ వర్గాలు తీవ్ర విమర్శలు చేశాయి. మాటల్లో చెప్పలేనంత విధంగా వ్యక్తిత్వ హననం చేయడం, చేయించడం నీకు తగునా? న్యాయం కోసం పోరాడుతున్న నీ చెల్లెలు సునీతను హేళన చేస్తూ, నిందలు మోపుతూ, దాడులకు కూడా తెగబడే స్థాయికి కొంతమంది దిగజారుతుంటే నీకు పట్టడం లేదా? సునీతకు మద్దతుగా పోరాడుతున్న షర్మిలను కూడా టార్గెట్ చేస్తుంటే నువ్వు నిమ్మకు నీరెత్తినట్లు ఉండటం ఏవిటి? కుటుంబ సభ్యునిగా కాకపోయినా ముఖ్యమంత్రిగా ఇదేనా నీ కర్తవ్యం? ఇంకా బాధించే విషయం.. హత్యకు కారకులైన వారికి మళ్లీ పోటీచేసే అవకాశాన్ని కల్పించడం. ఇది సముచితమా? ఇటువంటి చర్యలు నీకు మంచిది కాదు. హత్యకు కారకుడైన నిందితుడు నామినేషన్ దాఖలు చేశాడు. చివరి ప్రయత్నంగా న్యాయం, ధర్మం గురించి ఆలోచించమని నిన్ను అర్థిస్తున్నా. రాగద్వేషాలకు అతీతంగా పరిపాలన చేస్తానని ప్రమాణం చేసిన ముఖ్యమంత్రిగా న్యాయం, ధర్మం, నిజంవైపు నిలబడమని వేడుకుంటున్నా" అని సౌభాగ్యమ్మ తన లేఖలో పేర్కొన్నారు.

సభ్యత, సంస్కారం ఉన్నాయా?



విజయవాడలో మాట్లాడుతున్న షర్మిల

- జగన్‌పై షర్మిలారెడ్డి ఫైర్

> అసెంబ్లీ సాక్షిగా నానా తిట్లు తిట్టిన బొత్స సత్యనారాయణ జగన్‌కు తండ్రితో సమానమట. ఆ రోజున వైఎస్ విజయలక్ష్మి కంటతడి పెట్టుకున్నారు. అది కూడా గుర్తుకు రావడంలేదా? విడదల రజని, రోజా ఈయనకు చెల్లెళ్లతో సమానమంట!
>
> వీళ్లేమో వివేకా హత్య గురించి మాట్లాడొచ్చంట.. మేం మాత్రం మాట్లాడకూడదని కోర్టు నుంచి ఆర్డర్ తీసుకొచ్చారు. ఇది న్యాయమా... ధర్మమా?
>
> - షర్మిల

గుంటూరు/విజయవాడ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): 'సీఎం స్థాయిలో ఉన్న జగన్ బహిరంగ సభ పెట్టి.. వేల మంది మగవాళ్లు ఉంటే.. నేను కట్టుకున్న చీర గురించి మాట్లాడాడు' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ధ్వజమెత్తారు. మాట్లాడుతున్నది సొంత చెల్లెలి గురించి అన్న ఇంగితం కూడా లేకుండా తన వంటిపై ఉన్న బట్టల గురించి ప్రస్తావించారంటే ఎంత దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారో ఆలోచించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం గుంటూరు, విజయవాడల్లో జరిగిన ప్రచార సభల్లో ఆమె ప్రసంగించారు. పులివెందులలో తనపై జగన్ చేసిన వ్యాఖ్యలకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. 'నేను పసుపు చీర కట్టుకొన్నానని అవహేళనగా మాట్లాడారు. ఏం.. పసుపు చీర కట్టుకోకూడదా? చంద్రబాబు ఏమైనా పసుపు రంగు కొన్నారా? జగన్ పత్రికలో పసుపు రంగు ఉంటుంది. దానికి వైఎస్ ఆనాడు చెప్పిన మాట.. పసుపు అంటే మంగళకరమైన రంగు. అది టీడీపీది కాదని పెట్టించారు' అని తెలిపారు. సొంత చెల్లి చీర గురించి మాట్లాడుతున్న వీరికి సభ్యత, సంస్కారం ఉన్నాయా అని విరుచుకుపడ్డారు.. 'నేను చంద్రబాబు ముందు మోకరిల్లానని, ఆయన ఇచ్చిన స్క్రిప్టును చదువుతున్నానన్నారు. మక్కీకి మక్కీ స్క్రిప్టు చదువుతున్నది జగన్ కాదా? నాకేం అవసరం చంద్రబాబుకు మోకరిల్లడానికి! నాది రాజశేఖర్‌రెడ్డి రక్తం. అందుకే నా గురించి ఏమి మాట్లాడుతున్నా.. సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నా మొండిగా కొట్లాడుతున్నా. ఈ రోజున బీజేపీ, మోదీ ముందు మోకరిల్లింది జగన్ కాదా? పోలవరం, ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టారు. ఢిల్లీ వెళ్లినప్పుడు సమస్యల గురించి కాకుండా అవినాశ్‌రెడ్డి గురించి మాట్లాడుతున్నారు. ఆయన్ను ఎక్కడ అరెస్టు చేస్తారో, బెయిల్ రాదోనని ఆదుర్దాపడుతున్నారు. జగన్ మోదీకి దత్త పుత్రుడని బీజేపీ నేతలే చెబుతున్నారు. ముమ్మాటికీ మోదీకి జగన్ వారసుడే. బీజేపీని వ్యతిరేకించిన నాయకుడు వైఎస్. అలాంటిది బీజేపీకి మోకరిల్లుతున్నారంటే ఈయన మోదీకి వారసుడు. రాజశేఖర్‌రెడ్డికి కాదు. మణిపూర్‌లో తన సొంత మతస్థులైన క్రైస్తవులను చంపుతుంటే పార్లమెంటులో బీజేపీకి అండగా నిలిచారు. అని మండిపడ్డారు.

దేవుడు మీకు ఇంగితం ఇవ్వలేదా?

సీఎం జగన్ ఈ రోజున పులివెందుల సభలో వివేకానందరెడ్డి ప్రస్తావన చేశారు. ఆయన గురించి ఒక్క మంచి మాట కూడా నోటి వెంట రాలేదు. వివేకానందరెడ్డికి రెండో పెళ్లి అయిందట. ఇంకో సంతానం ఉందట! అంతేతప్ప.. వివేకానందరెడ్డి ఒక ప్రజానాయకుడని గానీ.. ఎవరైనా సమస్యతో వస్తే ఉత్త చేతులతో పంపడని గానీ.. రాజశేఖర్‌రెడ్డి తమ్ముడని గానీ.. ఆఖరి నిమిషం వరకు వైసీపీ కోసమే పని చేశారని గానీ ఒక్క మాటయినా జగన్ నోట్లో నుంచి రాలేదంటే ఎంత ఆశ్చర్యం! అవినాశ్‌రెడ్డి అమాయకుడు, చిన్నవాడంట! ఆయన భవిష్యత్‌ను మేం నాశనం చేస్తున్నామని జగన్ మాట్లాడుతున్నారు. అతడి భవిష్యత్‌ను పాడు చేసేవాళ్లమే అయితే మీరు ఎంపీగా నిలబెట్టినప్పుడు.. వివేకా వద్దని చెప్పినా మేమెవరం కాదనలేదే! వివేకాను చంపిన రోజునే అవినాశ్ చంపాడని చెప్పలేదే! అవినాశ్ మంచివాడని నమ్ముతున్నాను.. అందుకే ఎంపీ టికెట్ ఇచ్చానని జగన్ అంటున్నారు. ఎందుకు గుడ్డిగా నమ్ముతున్నారు? మీకు దేవుడు ఇంగితం ఇవ్వలేదా? మీకు ఆలోచించే శక్తి లేదా? సీబీఐ అన్ని ఆధారాలు చూపిస్తోంది కదా! చంపించిన వారు, చంపినవారి గూగుల్ టేక్ అవుట్స్ మ్యాచ్ అవుతున్నాయి. లావాదేవీలు జరిగాయి. అడ్వాన్సులు తీసుకున్నారని సీబీఐ చెబుతున్నా ఎందుకు అవినాశ్‌ను ఇంకా నమ్ముతున్నారు? అన్నీ తెలిసి కూడా కాపాడుతున్నారంటే మీకు ఏమి అవసరం ఉందో చెప్పాలి. అవినాశ్‌ను నిందితుడి గా సీబీఐ చేర్చినా ఇన్ని రోజులు ఎందుకు కాపాడారు.. మళ్లీ ఎందుకు టికెట్ ఇచ్చారో చెప్పాలి. వివేకాను గొడ్డలితో నరికి నరికి చంపితే మెదడు, ఎముకలు బయటకు వచ్చి ఇల్లంతా రక్తం ఉంటే జగన్ చానల్‌లో గుండెపోటుతో చనిపోయారని ఎందుకు ప్రసారం చేశారో చెప్పాలి. అధికారంలో లేనప్పుడు సీబీఐ ఎంక్వయిరీ కోరి.. అధికారంలోకి వచ్చాక ఎందుకు వద్దన్నారో చెప్పాలి. ఈరోజు సౌభాగ్యమ్మ సైతం ఆవేదన వ్యక్తం చేస్తూ లేఖ రాశారు. అది చూసి కూడా మీ మనస్సు చలించలేదంటే మీ ఛాతీలో ఉంది గుండే.. బండా?

వైఎస్ పేరు చేర్చింది జగన్ లాయరే

జగన్ కేసుల చార్జిషీటులో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేరును చేర్చింది సీబీఐ, కాంగ్రెస్ కాదు. ఆ పనిచేసింది ఆయన లాయరే. వైఎస్ పేరు లేకుంటే ఆ కేసుల్లో నుంచి జగన్ బయటపడరని వైఎస్ పేరును స్వయంగా సుధాకర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేసి చేర్పించారు. అందుకు ప్రతిఫలంగా వైసీపీ అధికారంలోకి రాగానే అదనపు అడ్వొకేట్ జనరల్ పదవి ఇచ్చారు. ఇది వాస్తవం కాదా? మమ్మల్ని తిట్టిపోయడం కాదు. మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి.

జగన్‌కు ఓటేస్తే డ్రెయినేజీలో వేసినట్లే..

జగన్‌కు ఓటు వేస్తే అది డ్రెయినేజీలో వేసినట్లే. పోలవరం, ప్రత్యేక హోదా, రాజధాని కోసం కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలి. అధికారంలోకి వచ్చాక మూడు రాజధానులు నిర్మిస్తానన్నాడు. కనీసం ఒక్కదాన్ని అయినా నిర్మించా డా? ఏమీ లేకుండా ఆంధ్రా చేతిలో చిప్ప మాత్రం పెట్టాడు. తెలంగాణకు హైదరాబాద్ ఉంటే, కర్ణాటకకు బెంగళూరు ఉంది. మన రాష్ట్రానికి రాజధాని ఎక్కడుంది? అన్నారు.

40 మంది స్టార్ క్యాంపెయినర్లు

రాష్ట్రంలో కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున ప్రచారం చేసేందుకు ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతో సహా 40 మంది స్టార్ క్యాంపెయినర్లను ఏఐసీసీ జనరల్ సెక్రటరీ ముకుల్ వాస్నిక్ గురువారం ప్రకటించారు. వీరిలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, మాణిక్యం ఠాగూర్, వైఎస్ షర్మిల, సిద్దరామయ్య, రేవంత్‌రెడ్డి, మల్లు భట్టివిక్రమార్క, ఉత్తమకుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండా సురేఖ, సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

ఒక్క చాన్స్‌తో వందేళ్లకు షాక్!

- పాదయాత్ర, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు 730
- 85% అమలే చేయలేదు... టీడీపీ-జనసేన-బీజేపీ ధ్వజం

మద్యం వ్యాపారంలో లక్ష కోట్ల దోపిడీ
ఇసుక, గనుల్లో అక్రమాలతో మరో లక్ష కోట్లు
పది సార్లు విద్యుత్ చార్జీల బాదుడు
జనంపై రూ.75 వేల కోట్ల భారం
జగన్ ఐదేళ్ల పాలనపై ఎన్డీయే చార్జిషీటు

అమరావతి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఒక్క చాన్సు పేరుతో అధికారం పొందిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి.. రాష్ట్ర ప్రజలకు వందేళ్లకు సరిపోను షాక్ మిగిల్చారని ఎన్డీయే భాగస్వామ్య పార్టీలు టీడీపీ, జనసేన, బీజేపీ ధ్వజమెత్తాయి. ఆయన ఐదేళ్ల పాలనపై గురువారమిక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీలు సంయుక్తంగా 38 పేజీల చార్జిషీటు విడుదల చేశాయి. పాలనా వైఫల్యాలపై తీవ్రస్థాయిలో దాడి చేశాయి. పాదయాత్ర, మేనిఫెస్టోలో 730 హామీలు ఇచ్చి అందులో 85 శాతం అమలు చేయలేదని మండిపడ్డాయి. అధికార పీఠంపై కూర్చుని అవినీతి, అరాచకం, విధ్వంసం, కబ్జాలు, దోపిడీలు, పన్నుల భారాలతో వారి జీవితాలను భ్రష్టు పట్టించాడని ధ్వజమెత్తాయి. ధరలు, పన్నులు, చార్జీలు, అప్పుల బాదుడుతో ఒక్కో కుటుంబంపై రూ.పదేసి లక్షల భారం పడిందని తెలిపాయి.

చార్జిషీటులో ముఖ్యాంశాలు..

- అమ్మ ఒడికి జగన్ రూ.13 వేలు ఇచ్చి నాన్న బుడ్డితో రూ.లక్ష కొట్టేస్తున్నాడు. విషపూరిత మద్యం పోసి 35 లక్షల మందిని అనారోగ్యం పాల్జేశాడు. అందులో 30 వేల మంది ప్రాణాలు తీశాడు.
- అన్న క్యాంటీన్లు, పండగ కానుకలు, చంద్రన్న బీమా, నిరుద్యోగ భృతి, రైతు రుణ మాఫీ, విదేశీ విద్య, ఆదరణ వంటి వందకుపైగా గత ప్రభుత్వ పథకాలను రద్దు చేశాడు.
- ఎస్సీఎస్టీబీసీ, మైనారిటీ వర్గాలకు వెచ్చించాల్సిన సబ్ ప్లాన్ నిధులు రూ.లక్ష కోట్లు దారి మళ్లించాడు. నవ రత్నాలు నవ మోసాలయ్యాయి.
- మద్య నిషేధం, కరెంటు చార్జీల తగ్గింపు, పాతిక లక్షల ఇళ్ల నిర్మాణం, టిడ్కో ఇళ్లకు బ్యాంక్ రుణాల రద్దు, సిపిఎస్ రద్దు, ఉద్యోగులకు పీఆర్సీ, డీఏ అమలు, రెండున్నర లక్షల ఉద్యోగాల భర్తీ వంటి హామీలపై మడమ తిప్పాడు.
- టీడీపీ పాలనలో నాలుగు శాతం ఉన్న నిరుద్యోగాన్ని ఏకంగా పాతిక శాతానికి పెంచాడు.
- నమ్మక ద్రోహానికి జగన్ ట్రేడ్ మార్క్. అమరావతే రాజధాని అని నమ్మబలికి అధికారంలోకి రాగానే మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడి దేశవ్యాప్తంగా రాష్ట్రాన్ని నవ్వుల పాల్జేశాడు.

చార్జిషీటు ఎందుకు?

ఈ చార్జిషీటు ఎందుకు వేయాల్సి వచ్చిందో మరికొన్ని వైఫల్యాలను ఒక అధ్యాయంలో ఎన్డీయే పార్టీలు వివరించాయి. 'పదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై రూ.75 వేల కోట్ల భారం మోపారు. ఇసుక ధరలు 400 శాతం పెంచి భవన నిర్మాణ రంగంలో ఉన్న 40 లక్షల మంది కార్మికుల ఉపాధిని దెబ్బ తీశారు. లాండ్, శాండ్, మైన్, వైన్, గంజాయి, డ్రగ్స్, ఎర్ర చందనం, రేషన్ బియ్యంలో భయంకరమైన అవినీతి, అక్రమాలకు పాల్పడి లక్షల కోట్లు దోచుకున్నారు. 85 శాతం హామీలను తుంగలో తొక్కి మోసం చేసింది చాలక 99 శాతం హామీలు అమలు చేశామని బూటకపు ప్రచారం చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన 600 మందిని కిరాతకంగా పొట్టన పెట్టుకున్నారు. బాబాయిని గొడ్డలి వేటుతో నరికి చంపిన కిరాతకులను వెనకేసుకువచ్చి కాపాడుతున్నారు. విశాఖలో రుషికొండను బోడిగుండు చేయడమే కాకుండా ఆ నగరం చుట్టుపక్కల రూ.40 వేల కోట్ల విలువైన భూములు కబ్జా చేశారు. ఇసుక మాఫియా అక్రమాలకు అన్నమయ్య డ్యాం కొట్టుకుపోయి 42 మంది ప్రాణాలు కోల్పోయినా కనీస చలనం లేకుండా వ్యవహరించారు. పోలవరం ప్రాజెక్టును సర్వనాశనం చేశారు. 14 లక్షల ఎకరాల అసైన్‌మెంట్ భూములు స్వాహా చేశారు. లాండ్ టైటిలింగ్ చట్టం తెచ్చి రైతుల్లో తీవ్ర ఆందోళన కలిగించారు. పరిశ్రమలపై దాడులు చేసి.. పెట్టుబడులు తరిమేసి నిరుద్యోగుల ఆశలను చిదిమేశారు. రూ.12 వేల కోట్ల మేర పంచాయతీ, పురపాలక నిధులు దారి మళ్లించారు. కోడి కత్తి డ్రామా ఆడి దళిత యువకుడిని జైలు పాల్జేశారు. గులకరాయి డ్రామా ఆడి బీసీ మైనర్ బాలుడిని జైల్లో పడేశారు. గ్రూప్-1 పరీక్షల ఫలితాలు తారుమారు చేసి యువత గొంతుకోశారు. రాష్ట్రాన్ని గంజాయి రాజధానిగా తయారు చేశారు. మహిళల వ్యక్తిత్వాలను కించపరచి గౌరవ సభను కౌరవ సభగా మార్చారు' అని విమర్శించింది. మద్యం వ్యాపారాన్ని మొత్తం గుప్పిట్లో పెట్టుకున్న జగన్ ఈ ఐదేళ్లలో ఈ వ్యాపారంలో రూ.లక్ష కోట్లు అక్రమంగా దోచారని దుయ్యబట్టింది. 'నాసి రకం మద్యం తయారీ మొదలుకొని అమ్మకాల వరకూ మొత్తం జగన్ కనుసన్నల్లోనే జరుగుతోంది. ఇసుక అక్రమ తవ్వకాలు, అధిక ధరలకు విక్రయాలతోపాటు ఖనిజాల అక్రమ తవ్వకాలతో జగన్, వైసీపీ నేతలు మరో లక్ష కోట్లు దోచేశారు' అని విరుచుకుపడింది.

అరాచక పాలన అంతం... కూటమి పంతం

రాష్ట్రంలో జగన్ అరాచక పాలనను అంతం చేయడమే ఎన్డీయే పంతమని టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పేర్కొన్నారు. చార్జిషీటు విడుదల సందర్భంగా వర్ల రామయ్య, అశోక్ బాబు(టీడీపీ), శివశంకర్, పి.గౌతమ్(జనసేన), పేరాల శేఖర్‌రావు, లంకా దినకర్(బీజేపీ) మాట్లాడారు. 'అబద్ధాలు, అసాధ్యపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన జగన్.. మరో అబద్ధపు మేనిఫెస్టో విడుదల చేయబోతున్నారు. జగన్‌రెడ్డి అంటేనే అబద్ధాలకోరు. ముందు ఆయన పుట్టి తర్వాత అబద్ధం పుట్టింది. అలవోకగా అబద్ధాలు చెప్పడంలో దిట్ట. మద్య నిషేధం చేసిన తర్వాతే ఓటు అడుగుతానన్న పెద్ద మనిషి రాష్ట్రంలో మద్యం పారిస్తున్నారు. వారంలో సీపీఎస్ రద్దు చేస్తానని ఉద్యోగులను మభ్యపెట్టారు. ఏటా ఐదు లక్షల ఇళ్లు నిర్మిస్తానని భ్రమలు కల్పించారు. రాష్ట్రంలో అధికారిక టెర్రరిజాన్ని ప్రోత్సహించారు' అని వర్ల రామయ్య విమర్శించారు. 'జగన్ అమరావతే రాజధాని అని చెప్పి.. తర్వాత మాట మార్చి మూడు ముక్కలాట చేశాడు. కేంద్రం ఇచ్చిన ప్రతి పథకం నిధులను ఇతర పనులకు తరలించి ఒక్కటీ పూర్తి చేయలేదు' అని దినకర్ విమర్శించారు.

'వైఎస్‌ఆర్'ను ముంచిన జగన్

ఐదేళ్ల అవినీతితో రాష్ట్రం ధ్వంసం
కేంద్ర పథకాలకు స్టిక్కర్లు వేసి మోసం
ఇసుక, ల్యాండ్, మైన్, లిక్కర్ మాఫియాకు అడ్డా
ఎన్డీయే ప్రభంజనంతో చంద్రబాబు సీఎం అవుతారు
కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్

అమరావతి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జగన్ రెడ్డి పాలనలో రాష్ట్రంలోని మూడు వర్గాలు తీవ్రంగా నష్టపోయాయని కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ ఆక్షేపించారు. విజయవాడలో గురువారం కేంద్ర మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అని పేరు పెట్టుకున్న జగన్ రెడ్డి ఆ యువత(వై)కు ఉద్యోగాలివ్వకుండా.. శ్రామిక(ఎస్) వర్గాలకు పనిలేకుండా.. రైతు(ఆర్)లను అన్నివిధాలా మోసం చేశారని వివరించారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ పథకాలకు జగన్ స్టిక్కర్ వేసుకుని రాష్ట్ర ప్రజల్ని ఐదేళ్లుగా మోసం చేశారని విమర్శించారు. ప్రధాన మంత్రి పోషణ్ అభియాన్(జగనన్న గోరుముద్ద), పీఎం స్వానిధి(జగనన్న తోడు), పీఎం ఆవాస్ యోజన(జగనన్న కాలనీ), వైఎస్‌ఆర్ ఆరోగ్య శ్రీ(ఆయుష్మాన్ భారత్).. ఇలా చెబుతూ పోతే జగన్ పేరుతో అందిస్తోన్న సంక్షేమ పథకాల్లో కేంద్రానివే ఎక్కువగా ఉన్నాయని వివరించారు. విశాఖ రైల్వేజోన్ కోసం ఎన్నిసార్లు అడిగినా భూమి ఇవ్వకుండా ఇప్పుడు రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వం నుంచి సరైన సహకారం లేనందున గడిచిన ఐదేళ్లు రాష్ట్రం ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదని తెలిపారు. ఏపీ అన్నివిధాలా వెనుకబడిందన్నారు. ఇసుక, ల్యాండ్, మైన్, లిక్కర్ మాఫియాకు అడ్డాగా మారిందని చెప్పారు. కేంద్రం ఇళ్లు మంజూరు చేసినా.. పేదలకు నిర్మించి ఇవ్వలేదని, నిధులిచ్చినా పోలవరాన్ని పూర్తి చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్డీయే ప్రభంజనంతో చంద్రబాబు సీఎం అవుతారని, డబులింజన్ సర్కార్‌తో రాష్ట్ర ప్రగతి పరుగులు పెడుతుందని తెలిపారు. ప్రత్యేక హోదా అంశంపై ఇప్పటికే పలుమార్లు స్పష్టత ఇచ్చామని, ప్యాకేజీ ఇతరత్రా మార్గాల్లో రాష్ట్రానికి ఇవ్వాల్సినంత ఇచ్చామని తెలిపారు. రాష్ట్రం కోసం, ప్రజల కోసం మోదీ, బాబు, పవన్ కూటమిగా ఏర్పడ్డారని, వచ్చే ఐదేళ్లు ప్రగతి పథమేనని వ్యాఖ్యానించారు. రాజ్యాంగాన్ని గాంధీ కుటుంబం తమకు అనుకూలంగా పలు మార్లు మార్చుకుందని, తాము మార్చాలనుకుంటే ఇప్పుడైనా మెజారిటీ ఉందని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. రిజర్వేషన్ల విషయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకే ముందుకెళతామని, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ తప్ప మతం ఆధారంగా పరిగణనలోకి తీసుకోబోమని తేల్చిచెప్పారు.

జన చేతనం




• ఇదేనా ఎస్సీల ఉన్నతి?

జగన్ సర్కారు వచ్చాక దళిత బిడ్డలకు ఉచిత కార్పొరేట్ విద్యను దూరం చేశారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కట్ చేశారు. రకరకాల నిబంధనలతో విదేశీ విద్యను దూరం చేసి పేద పిల్లలను విమానం ఎక్కకుండా చేశారు. ఎస్సీలకు సంబంధించి 10 రకాల విద్యా పథకాలను నిర్వీర్యం చేశారు. 'నా ఎస్సీలు' అని చెప్పుకొనే జగన్.. నిజంగా వారి ఉన్నతిని కోరుకుంటే నాణ్యమైన విద్యను దూరం చేస్తారా? ఉన్నత ఉద్యోగాలు పొందే అవకాశాలను కాలరాస్తారా? విద్యకు ఆర్థిక సాయాన్ని బంద్ చేస్తారా?

• దళితుల అభివృద్ధి ఇలాగేనా?

ఎస్సీ యువతకు స్వయం ఉపాధి అవకాశాలకు గండికొట్టారు. రుణాలు, సబ్సిడీలకు మంగళం పాడారు. ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారు. జగన్ సర్కారు దళితులకు సంబంధించి విద్యతో సహా మొత్తం 23 పథకాలను అటకెక్కించింది. 'నా పేదలు' అని చెప్పే జగన్‌కు నిజంగానే చిత్తశుద్ధి ఉంటే ఎస్సీల ఆర్థికాభివృద్ధికి దోహదపడే పథకాలను రద్దు చేస్తారా? సొంత కాళ్లపై నిలబడే అవకాశాలను దూరం చేస్తారా?



పథకాలు పీకేసి..

దళితులకు దగా చేసి..

- నిధుల్లేక గురుకులాలు అధ్వానం
- బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ రద్దు
- కఠిన నిబంధనలతో విదేశీ విద్య దూరం
- పోటీ పరీక్షలకు కోచింగ్ కరువు
- ఎస్సీ కార్పొరేషన్ పూర్తిగా నిర్వీర్యం
- ముక్కలుగా చేసి నిధులివ్వని వైనం
- స్వయం ఉపాధి సాయం నిలిపివేత

జగన్ పాలనలో 23 పథకాలు దూరం

విద్యకు సంబంధించే 10 నిర్వీర్యం

ఎస్సీ, ఎస్టీలపై ఉత్తుత్తి ప్రేమే

అంబేడ్కర్ ఆశయాలకు తూట్లు



నాడు.. కళ కళ టీడీపీ హయాంలో విదేశీ విద్య సర్టిఫికెట్ల వెరిఫికేషన్ (ఫైల్)

పేదల సంక్షేమానికి వేలు, లక్షల కోట్లు ఖర్చు చేశామని ముఖ్యమంత్రి జగన్ పదే పదే చెబుతుంటారు. తమ హయాంలో చేసినంత సాయం గతంలో ఏ ప్రభుత్వం కూడా చేయలేదని గొప్పలకు పోతుంటారు. అయితే దళిత విద్యార్థులకు నాణ్యమైన, ఉన్నత విద్యకు ఉపయోగపడే పథకాలను, మంచి ఉద్యోగాలు సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవడానికి దోహదపడే పథకాలను నిర్వీర్యం చేశారు. స్వయం ఉపాధి పొందే పథకాలను రద్దు చేశారు. ఒకటా.. రెండా... దళితులకు సంబంధించి 23 పథకాలను జగన్ సర్కారు నిర్వీర్యం చేసింది. గత ఐదేళ్లుగా ఎస్సీలకు ప్రత్యేకించి ఒక్క పథకం కూడా అమలు చేయడం లేదు. ఒకప్పుడు దళిత విద్యార్థులకు దేవాలయాలుగా ఉన్న గురుకులాలను అధ్వాన్నంగా మార్చేసింది. పేద పిల్లల భోజనానికి సంబంధించి బిల్లులు కూడా సకాలంలో చెల్లించని దుస్థితి. కేంద్రప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా అందిస్తున్న పథకాలను సైతం కాలరాసింది. దళితులకు సంబంధించి ప్రధానమైన భూమి, ఉపాధి, సంక్షేమం, విద్య లాంటి వాటికి ఈ ప్రభుత్వం నిధులు కేటాయించడం లేదు. ఎస్సీలను అన్ని రకాలుగా అణగదొక్కింది. రాష్ట్రంలో దళితుల జనాభా 16.41 శాతం ఉంది. దళితుల సంక్షేమానికి జనాభా ప్రాతిపదికన రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించి వారికే ఖర్చు చేయాలని చట్టం చెబుతోంది. అయితే అంబేడ్కర్ ఆశయాలకు అడుగడుగునా తూట్లు పొడుస్తోంది. ఎస్సీలకు కేటాయించిన నిధులను ఖర్చు చేయకపోవడమే కాకుండా సబ్‌ప్లాన్ నిధులను ఈ సర్కార్ నవరత్నాల కోసం వాడేసుకుంది. నవరత్నాలను అందరితో పాటే ఎస్సీలకు పంచుతున్నా.. ఎస్సీలకు వేలకోట్లు ఖర్చు చేస్తున్నట్లు కాకి లెక్కలు చెబుతోంది.

కూలీలుగానే దళితులు

ఎస్సీలకు గతంలో ఉన్న పథకాలన్నింటినీ వైసీపీ సర్కారు అటకెక్కించింది. ఆయా పథకాలకు నిధులు నిలిపేయడంతో నిర్వీర్యమయ్యాయి. గత చంద్రబాబు ప్రభుత్వం 1,606 మంది భూమి లేని ఎస్సీ మహిళలకు 2,386 ఎకరాల భూమి కొనుగోలు చేసి ఇచ్చింది. ఒక్కో ఎకరానికి రూ.15 లక్షల ధరతో భూమి కొనుగోలు చేసిన సందర్భాలున్నాయి. ఈ సర్కార్ వచ్చినప్పటి నుంచి ఈ పథకానికి ఒక్క పైసా కూడా కేటాయించలేదు. దీంతో భూమి లేని దళితులు వ్యవసాయ కూలీలుగానే మిగిలిపోయారు.

ఎస్సీ కార్పొరేషన్ నిర్వీర్యం

గతంలో ఎస్సీలకు ఎస్సీ కార్పొరేషన్ కల్పతరువుగా ఉండేది. పలు పథకాలను ఈ కార్పొరేషన్ ద్వారా అందించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆర్థికాభివృద్ధి పథకాలతో పాటు చిన్నతరహా వ్యవసాయానికి సంబంధించి ఎస్సీ రైతులకు సహాయ సహకారాలందించారు. ముర్రా గేదెలు, మేలు రకపు ఆవులు, గొర్రెలు, మినీ డైరీ తదితర ప్రయోజనాలు కల్పించారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వెట్టి, జోగినులకు పునరావాస కార్యక్రమాలు, పేద రైతుల పొలాల్లో బోర్లు, పంపుసెట్లు, విద్యుత్ సౌకర్యం, భూమి అభివృద్ధి, భూమి లేని పేదలకు భూముల కొనుగోలు, ఇంటి స్థలాలను కొనుగోలు చేసి ఇవ్వడం వంటి పథకాలు అమలు చేశారు. అలాగే ఎస్సీలకు వడ్డీ లేని రుణాలు, ఎన్ఎస్ఎఫ్‌డీఎస్, ఎన్ఎస్‌కేఎఫ్‌డీఎస్ లాంటి పథకాల ద్వారా స్వయం ఉపాధి యూనిట్లకు రుణాలివ్వడం తదితర ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఎస్సీ కార్పొరేషన్‌ను మూడు ముక్కలు చేసి మాదిగ, మాల, రెల్లి కార్పొరేషన్లను ఏర్పాటు చేసింది. ఏ కార్పొరేషన్‌కు కూడా నిధులు కేటాయించలేదు. గతంలో ఎస్సీ కార్పొరేషన్‌కు 2018-19లో రూ.900 కోట్లు కేటాయిస్తే.. వైసీపీ సర్కార్ వచ్చిన తర్వాత ఒక్కపైసా కూడా ఖర్చు చేయలేదు.

- అమరావతి, ఆంధ్రజ్యోతి

టీడీపీ, వైసీపీ ప్రభుత్వాల్లో ఎస్సీల సంక్షేమం ఎంత?

టీడీపీ ప్రభుత్వంలో		వైసీపీ ప్రభుత్వంలో	
పథకం	మొత్తం లబ్ధి(రూ.)	పథకం	మొత్తం లబ్ధి(రూ.)
అన్నదాత సుఖీభవ	15,000	రైతు భరోసా	7,500
కౌలు రైతులు	15,000	కౌలు రైతులు	13,500
సున్నావడ్డీ	24,000	సున్నావడ్డీ	8,000
బెస్ట్ అవైలబుల్ స్కూల్	40,000	అమ్మఒడి	13,000
విదేశీవిద్య	15,00,000	నిబంధనలతో అనర్హులుగా చేశారు	
విద్యోన్నతి	1,20,000		రద్దు
సంక్రాంతి కానుక	1,100		రద్దు
ఇంటి నిర్మాణానికి (గ్రామాల్లో)	50,000	కట్టిన ఇళ్లకు పేదల నుంచే ఓటీఎస్ వసూలు	
ఇటుకలు	25,000		రద్దు
పట్టణ ప్రాంతాల్లో స్థలాలతో పాటు	5,00,000		
డే స్కాలర్స్/ మేనేజ్‌మెంట్ హాస్టల్	12,000	జగనన్న వసతి దీవెన	10,000
అందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్		4 విడతల్లో జగనన్న విద్యా దీవెన. ఇప్పటికే ఒక విడత ఎగవేత	
డ్వాక్రా సున్నావడ్డీ రుణాలు రూ.5 లక్షల వరకు 8%తో	40,000	డ్వాక్రా సున్నా వడ్డీ రుణాలు రూ.3 లక్షలకే పరిమితం	
పెళ్లికానుక	75,000	నాలుగేళ్లు నిలిపేసి ఇటీవల పలు నిబంధనలతో ప్రారంభం	
బాలికలకు సైకిళ్లు	3,750		రద్దు
చంద్రన్న బీమా	5,00,000/2,00,000	వైఎస్ఆర్ బీమా	5,00,000/1,00,000
కార్పొరేషన్ల ద్వారా రుణాలపై సబ్సిడీ	1,00,000		రద్దు
మధ్యాహ్న భోజన పథకం(ఇంటర్)	3,500		రద్దు
రైతు రథం(ట్రాక్టర్లు) సబ్సిడీ	1,00,000		రద్దు
భూమి కొనుగోలు పథకం	5,00,000		రద్దు
ఎన్ఎస్ఎఫ్‌డీసీ/ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ రుణాలతో ఆటో నుంచి ఇన్నోవా కారు వరకు	2,00,000/12,00,000	సివిల్ సప్లయిస్ వాహనాలు	3,48,000
పారిశ్రామిక విధానం సబ్సిడీ మొదటి సంవత్సరం నుంచి	75,00,000	మూడో సంవత్సరం నుంచి అమలు	75,00,000
అసైన్డ్, లిడ్‌క్యాప్, మత సంస్థల భూములకు రక్షణ		6 వేల ఎకరాల అసైన్డ్, 2500 ఎకరాల లిడ్‌క్యాప్ భూముల ఆక్రమణ, ఎస్సీ, ఎస్టీలపైనే అట్రాసిటీ కేసులు	



నేడు.. నొక్కుడుతో సరి

జగనన్న విదేశీ విద్యా దీవెన నిధుల విడుదల బటన్ నొక్కుతున్న జగన్ (ఫైల్)

స్వయం ఉపాధి ఏదీ?

గత ప్రభుత్వంలో ప్రతి ఏటా వందలాది మంది ఎస్సీ యువత స్వయం ఉపాధి పథకాల ద్వారా పలు రకాల యూనిట్లు ఏర్పాటు చేసుకునేవారు. దీని కోసం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఏటా సుమారు రూ.400 కోట్ల దాకా ఖర్చు చేసేవారు. ఎస్సీ యువతకు స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసేందుకు 60 శాతం దాకా సబ్సిడీ అందించేవారు. ఒక్క ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 2.66 లక్షల మంది రూ.3,800 కోట్ల వరకు స్వయం ఉపాధి పథకాల ద్వారా లబ్ధిపొందారు. డ్రైవింగ్ వృత్తిలో ఉన్న యువతకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి 485 ఇన్నోవా కార్లు, 294 ఇతర కార్లు అందజేశారు. వాటితో పాటు మురుగుకాల్వల పూడిక తీసే యంత్రాలు 660, 7500 బ్యాటరీతో నడిచే పవర్ ఆటోలు, ఇతర ప్యాసింజర్ వాహనాలను అందించారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత స్వయం ఉపాధి పథకానికి స్వస్తి పలికారు.

విదేశీ విద్య, విద్యోన్నతికి గండి

చంద్రబాబు సర్కార్ 4,923 మంది విద్యార్థులను ఉన్నత చదువుల కోసం విదేశాలకు పంపించింది. వారిలో 493 మంది దళిత విద్యార్థులు ఉన్నారు. అంబేడ్కర్ విదేశీ విద్య పేరిట ఒక్కొక్కరికి రూ.15 లక్షల చొప్పున అప్పటి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించింది. అందుకోసం రూ.380 కోట్లు ఖర్చు చేసింది. జగన్ సర్కార్ వచ్చిన తర్వాత విదేశీ విద్య సాయాన్ని నిలిపేసింది. మూడున్నరేళ్లకు తిరిగి విదేశీ విద్యను ప్రారంభిస్తూ పథకంలో అంబేడ్కర్ పేరును తొలగించారు. రకరకాల నిబంధనలు పెట్టి దళితులకు విదేశీ విద్యను దూరం చేశారు. అలాగే ఏపీ స్టడీ సర్కిల్స్‌తో పాటు విద్యోన్నతి పథకాన్ని రద్దు చేశారు. గతంలో వేలాదిమంది దళిత విద్యార్థులు ఏపీ స్టడీ సర్కిల్స్/అంబేడ్కర్ స్టడీ సర్కిల్స్ ద్వారా లబ్ధి పొందారు. ఉన్నత విద్య తర్వాత పోటీ పరీక్షలు రాసేందుకు ఈ స్టడీ సర్కిల్స్ ద్వారా కోచింగ్ తీసుకునేవారు. టీడీపీ సర్కార్ ఢిల్లీ, హైదరాబాద్ లాంటి నగరాల్లో కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందే అవకాశం కల్పించింది. అప్పట్లో ఎస్సీలు 2313 మంది, ఎస్టీలు సుమారు వెయ్యిమంది దాకా ఈ పథకం ద్వారా లబ్ధి పొందారు. ఒక్కో దళిత విద్యార్థికి రూ.1.20 లక్షల ఫీజుతో పాటు వసతి ఫీజు కూడా చెల్లించారు. ఇప్పుడు ఈ ఫలాలు అందకుండా చేశారు.

కార్పొరేట్ విద్యకు స్వస్తి



గతంలో మెరికల్లాంటి పేద ఎస్సీ విద్యార్థులను ఎంపిక చేసి పేరున్న కార్పొరేట్ స్కూళ్లలో చేర్పించి నాణ్యమైన విద్య అందించేవారు. ఏటా లక్ష మందికిపైగా ఈ అవకాశాన్ని పొందేవారు. ఏడాదికి ఒక్కో విద్యార్థికి హాస్టల్, బుక్స్, ఫీజు మొత్తం కలిపి రూ.30 వేలు చెల్లించేవారు. ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీల్లో సీట్లకు అగ్రవర్ణాల విద్యార్థులతో దళిత బిడ్డలు పోటీ పడేవారు. ఈ పథకం కింద చదువుకున్న వారు ఐఏఎస్, ఐపీఎస్‌లు అయినవారూ ఉన్నారు. జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత బెస్ట్ అవైలబుల్, కార్పొరేట్ కళాశాలల అడ్మిషన్లకు స్వస్తి పలికారు.

పథకాలు కట్

చంద్రబాబు ప్రభుత్వం 2018 జూలై నుంచి ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేసింది. జగన్ సర్కారు వచ్చిన తర్వాత పిల్లల నోటికాడ ముద్ద తీసేశారు. ఎన్టీఆర్ ప్రారంభించిన గురుకులాలు చంద్రబాబు సర్కార్ దాకా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల ఉన్నతికి తోడ్పడ్డాయి. మెరుగైన విద్యతో పాటు సౌకర్యాలు ఉండేవి. ఇక్కడ చదువుకున్న పలువురు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు నేడు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా పనిచేస్తున్నారు. అలాంటి గురుకులాలను జగన్ నిర్వీర్యం చేశారు. బడ్జెట్ తగ్గించడంతో మెనూ తగ్గిపోయింది. వసతులు కూడా కరువయ్యాయి.

చిటపట!



చింటూ: అన్నియ్య ఫిష్ ఆంధ్రా దుకాణాలు పెట్టించాడు, కనపడలేదా?
చిన్నూ: ఆంధ్రాను ఫినిష్ చేసే దుకాణమూ తెరిచాడులే!
చింటూ: ఆడుదాం ఆంధ్రా... అని ఆటల పోటీలు పెట్టాడు, తెలుసా?
చిన్నూ: 'ఆడుకుందాం ఆంధ్రాతో' గురించి నీకు తెలియదా?!
చింటూ: స్టేటుకు నమ్మకం అన్నియ్యే!
చిన్నూ: 'స్టేటు అమ్మకం' కూడా మీ అన్నియ్యతోనే!
చింటూ: నీది బాగా నెగెటివ్ మైండ్‌లా ఉందే!
చిన్నూ: నీకసలు మైండ్ ఉన్నట్లు లేదే!



సమ్ థింగ్ స్పెషల్

టోకెన్ ఇచ్చుకో.. రూ.300 పుచ్చుకో!

నామినేషన్ల కార్యక్రమానికి తరలివచ్చే జనానికి వైసీపీ నాయకులు భారీగా డబ్బులు పంపిణీ చేస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ వైసీపీ అభ్యర్థి ఉష శ్రీచరణ్ నామినేషన్ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా తన నివాసం నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న వారికి పార్టీ కండువా, టోపీ, టోకెన్లు ఇచ్చారు. కార్యక్రమం ముగిశాక.. కండువా, టోపీ, టోకెన్ తిరిగి ఇచ్చినవారికి రూ.300 చొప్పున చెల్లించారు.

- పెనుకొండ టౌన్




వైసీపీ నాయకులు ఇచ్చిన టోకెన్

టోకెన్ చూపుతున్న అద్దె కార్యకర్త

ఆనాటి ముచ్చట

పే..ద్ద చెరువు దాటి.. ఓటేసి..

నా వయసు సుమారు 60 ఏళ్లు. ధర్మవరం మండలంలోని వసంతపురం మా ఊరు. అప్పట్లో మా ఊళ్లో పోలింగ్ స్టేషన్ లేదు. ఓటు వేయాలంటే చింతలపల్లికి వెళ్లాల్సి వచ్చేది. రెండూళ్లకు మధ్య 300 ఎకరాల విస్తీర్ణంలో చింతలపల్లి చెరువు ఉంది. దాన్ని దాటితేనే ఓటు. కష్టమైనా బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకునే వాళ్లం. ఓటు వదులుకోకూడదని అప్పట్లో మాట్లాడుకునేటోళ్లం. తక్కువ నీరున్నవైపు నుంచి అందరం కలిసి నడుకుంటూ చెరువు దాటేవాళ్లం. 2009 వరకూ అదే పరిస్థితి. 2014 ఎన్నికలకు మా ఊళ్లోనే పోలింగ్ స్టేషన్ పెట్టారు. దీంతో చెరువు దాటే ఇబ్బంది తప్పింది.

- అశ్వత్థ నాయుడు, శ్రీసత్యసాయి జిల్లా



చింతలపల్లి చెరువు



అశ్వత్థ నాయుడు

అబ్బ చా!



అవినాశ్ జీవితం నాశనం చేయాలనుకుంటున్నారు!

వైఎస్ అవినాశ్ రెడ్డి ఏ తప్పూ చేయలేదు. అది బలంగా నమ్మాను కాబట్టే టికెట్ ఇచ్చాను. అవినాశ్ రెడ్డి జీవితం నాశనం చేయాలని చూస్తున్నారు. ఆయన్ని కనుమరుగు చేయాలని చూడడం ఎంత దారుణమో ఆలోచించండి.

- వైఎస్ జగన్, సీఎం

'ఎస్మా'సురుడు



అంగన్వాడీలకు జగన్ వంచన

తెలంగాణ కంటే రూ.వెయ్యి వేతనం అదనంగా ఇస్తామని హామీ

అధికారంలోకి వచ్చాక తూచ్.. ఓసారి వెయ్యి పెంచి పథకాలు కట్.. హామీ అడిగితే ఎస్మా ప్రయోగం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'నా అక్కాచెల్లెమ్మలు' అంటూ ముఖ్యమంత్రి జగన్ సంబోధిస్తుంటారు. కానీ లక్షా నాలుగు వేలమంది అంగన్వాడీలకు ఉసూరు మనిపించారు. గత ఎన్నికల్లో ఇతర వర్గాలకు మాదిరిగానే వారికి ఇచ్చిన హామీని నెరవేర్చకుండా చేతులెత్తేశారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోమని సమ్మెకు దిగిన అంగన్వాడీలపై ఉక్కుపాదం మోపి అణచివేశారు. గత ఎన్నికలకు ముందు పాదయాత్రలో తాము అధికారంలోకి రాగానే తెలంగాణ కన్నా అదనంగా వెయ్యి ఎక్కువగా వేతనాలు ఇస్తామని జగన్ హామీ ఇచ్చారు. దీంతో ఇతర వర్గాల మాదిరే అంగన్వాడీలు జగన్ మాటను నమ్మారు. అయితే అధికారంలోకి వచ్చాక ఆ విధంగా వేతనాలు పెంచలేదు. 2019లో వేతనం రూ.1000 పెంచినట్లే పెంచి అంగన్వాడీ కార్యకర్తలకు వస్తున్న సంక్షేమ పథకాలు రద్దు చేశారు. పలు నిబంధనలతో పథకాలకు అనర్హులుగా చేర్చారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న విద్యాదీవెన, వైఎస్సార్ ఆసరా, రైతు భరోసా, వసతి దీవెన, ఆరోగ్యశ్రీ పథకాలను అంగన్వాడీలు అందుకోలేకపోయారు. పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచకపోవడంతో పాటు సంక్షేమ పథకాలు రద్దు చేయడంతో అంగన్వాడీలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యారు. సంక్షేమ పథకాలు కట్ చేయడంపై వినతులు అందజేసి, నిరసనలు తెలిపినా జగన్ సర్కార్ కనికరించలేదు. చిరుద్యోగులైన తమకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలని కోరినా పట్టించుకున్న దాఖలాలు లేవు. సంక్షేమ పథకాలకు అర్హత కలిగిన అంగన్వాడీలకూ అమలు కావడంలేదని, సాధికార సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులు అనే పదాన్ని తొలగించి అర్హత కలిగిన వారికి సంక్షేమ పథకాల అమలుకు ఉత్తర్వులు ఇవ్వాలని అంగన్వాడీలు కోరినా పట్టించుకోలేదు. ఐదేళ్లుగా జగన్ సర్కార్ అంగన్వాడీలను సంక్షేమ పథకాలకు దూరం చేసింది. మరోవైపు ఒకటికి నాలుగు యాప్‌లు రూపొందించి అంగన్వాడీలపై పనిభారం పెంచేసింది.

మాట మడత..

తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు రూ.వెయ్యి పెంచుతామన్న జగన్ అధికారంలోకి వచ్చాక మాట మార్చారు. వేతనాలపై ప్రశ్నించిన అంగన్వాడీలకు ప్రభుత్వం వింత సమాధానం చెప్పింది. తెలంగాణలో వేతనాలు పెరిగినప్పుడల్లా తాము పెంచుతామని చెప్పలేదని బుకాయించింది. తాము అధికారంలోకి వచ్చిన నాటికి తెలంగాణలో అంగన్వాడీ కార్యకర్తల జీతం రూ.10,500 ఉందని, తాము రూ.వెయ్యి పెంచి రూ.11,500 చేశామని, పొరుగు రాష్ట్రం కంటే ఎక్కువ వేతనం ఇచ్చామని గొప్పలకు పోయింది. అయితే ఆ తర్వాత తెలంగాణలో అంగన్వాడీల వేతనం పెంచారు. ప్రస్తుతం తెలంగాణలో అంగన్వాడీ కార్యకర్తలకు రూ.13,650, ఆయాలకు రూ.7,800 ఇస్తున్నారు. అయితే ఆంధ్రప్రదేశ్‌లోని అంగన్వాడీలకు వేతనాలు వారికంటే రూ.1000 ఎక్కువ ఇవ్వడం మాట అటుంచి, వారితో సమానంగా కూడా పెంచలేదు.

నాడు వేతనాల పెంపు

2014లో చంద్రబాబు ప్రభుత్వం వచ్చే సమయానికి అంగన్వాడీ కార్యకర్తల గౌరవవేతనం రూ.4,200 మాత్రమే. చంద్రబాబు దానిని రూ.7,000 వేలకు పెంచారు. 2018లో మరోసారి రూ.10,500కు పెంచారు. అంటే.. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వంలో అంగన్వాడీ కార్యకర్తల వేతనం రూ.6,300 పెరిగింది. అంతేగాక అంగన్వాడీలకు అన్ని సంక్షేమ పథకాలు అందేలా నిబంధనలు సవరించారు.

నేడు ఎస్మా బహుమతి

అంగన్వాడీలకు తెలంగాణలో కంటే వేతనం రూ.1000 ఎక్కువగా ఇస్తామన్న హామీకి జగన్ తూట్లు పొడిచారు. 2019లో ఒకసారి రూ.1000 పెంచి సంక్షేమ పథకాలు రద్దు చేశారు. ప్రస్తుతం తెలంగాణలో అంగన్వాడీ కార్యకర్తల వేతనం రూ.13,650, ఆయాలకు రూ.7,800 ఇస్తుండగా.. ఏపీలో రూ.11,500, రూ.7,000 ఇస్తున్నారు. వేతనాలు పెంచాలని సమ్మెకు దిగిన అంగన్వాడీల మొర వినకుండా జగన్ సర్కారు వారిపై ఎస్మా ప్రయోగించింది.



42 రోజులు సమ్మె చేసినా..

తమ డిమాండ్ల సాధనకు అనేకసార్లు వినతులు ఇచ్చి, నిరసనలు తెలిపిన అంగన్వాడీలు.. జగన్ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల తర్వాత సమ్మెకు దిగారు. తెలంగాణతో సమానంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అయితే జగన్ సర్కారు చర్చలు అంటూనే అంగన్వాడీలపై నిర్బంధకాండకు దిగింది. వారిని భయభ్రాంతులకు గురి చేసి పోలీసులను ప్రయోగించింది. సర్కారు ఆంక్షల నడుమే 42 రోజులపాటు అంగన్వాడీలు సమ్మె చేశారు. అయినా ప్రభుత్వం దిగి రాలేదు. వారిపై ఎస్మా ప్రయోగించింది. సమ్మె విరమించి విధులకు హాజరుకాకపోతే ఉద్యోగాల నుంచి తొలగిస్తామంటూ ఆదేశాలు ఇచ్చింది. అంగన్వాడీ సంఘాలతో ప్రభుత్వం ఎనిమిదిసార్లు చర్చలు జరిపినా వారి ప్రధాన డిమాండ్ అయిన వేతనాల పెంపుపై దిగిరాలేదు. మళ్లీ వచ్చేది తమ ప్రభుత్వమేనని, జూన్‌లో వేతనాలు పెంచుతామని మాయ మాటలు చెప్పి దాటవేసింది. ఇతర డిమాండ్లపై కొన్ని జీవోలు ఇచ్చి, మరికొన్ని నెరవేరుస్తామంటూ హామీలు ఇచ్చింది. మంత్రుల కమిటీ ఇచ్చిన హామీల్లో కొన్నింటికి జీవోలు ఇవ్వకపోవడంతో అంగన్వాడీ సంఘాలు ఇప్పటికీ ప్రభుత్వానికి వినతులు ఇస్తూనే ఉన్నాయి.

నోట్ దిస్ పాయింట్!

ఓన్లీ లోకల్ బాస్!

ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో జాతీయ పార్టీలకు ఒక్క సీటు కూడా రాని దుస్థితి 2019లో ఎదురైంది. రాష్ట్రాన్ని విభజించిన కాంగ్రెస్‌కు మరోసారి పూర్తిస్థాయి పరాభవం ఎదురు కాగా, బీజేపీకి అంతకు ముందు వచ్చిన నాలుగు సీట్లు కూడా పోయాయి. మొత్తంమీద 5 జాతీయ పార్టీలు, ఇతర రాష్ట్రాల్లో నమోదైన 6 రాష్ట్రస్థాయి పార్టీలకు 2019 ఎన్నికల్లో దక్కింది గుండు సున్నా. ఈ పార్టీలన్నీ కలిపి 422 మంది అభ్యర్థులను బరిలో నిలపగా ఒక్కరంటే ఒక్కరికి కూడా డిపాజిట్ దక్కకపోవడం మరో విశేషం.

పార్టీ	పోటీ	గెలుపు
బీజేపీ	173	0
బీఎస్పీ	21	0
సీపీఐ	7	0
సీపీఎం	7	0
కాంగ్రెస్	174	0
6 ఇతర రాష్ట్రాల పార్టీలు	40	0

ఆనాటి ముచ్చట



ఎడ్లబండితో ప్రచారం పూరిపాకలో పోలింగ్!

ఎన్నికల ప్రచారమంటే.. నాయకుల హంగామా.. కాన్వాయ్‌ల జోరు.. మందీ మార్బలాల అట్టహాసం కళ్లకు కడుతుంది. కానీ, ఒకప్పుడు మాత్రం ఇవేవీ ఉండేవి కావు. ఎడ్లబళ్లు ప్రచార వాహనాలుగా ఉండేవి. వాటిపైనే నాయకులు ఎక్కి ఊరూవాడా చుట్టేసేవారు. ఇదే విషయాన్ని శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలం పెద్ద మతలబుపేట గ్రామానికి చెందిన 102 ఏళ్ల సనపల రాములు పంచుకున్నారు. అప్పటి రాజకీయ అనుభవాలు, ఎన్నికల సంగతులను వివరించారు. రాజకీయ కురువృద్ధుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఆరుసార్లు ఎంపీగా ఎన్నికైన బొడ్డేపల్లి రాజగోపాలరావుతో ఎన్నికల ప్రచారానికి ఎడ్లబండిపై గ్రామాలకు వెళ్లినట్టు తెలిపారు. అలాగే మతలబుపేట గ్రామ చివర పూరిపాకలో ఉన్న పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఉండేదన్నారు. అప్పట్లో గ్రామస్తులంతా ఒకచోటకు చేరి పోటీలో ఉన్న అభ్యర్థుల విలువలు, నిజాయితీపై చర్చించి మద్దతు ప్రకటించేవారని చెప్పారు. ప్రస్తుతం అలాంటి విధానాలు కనిపించడం లేదన్నారు. విపరీత ఖర్చులు, హంగూ ఆర్భాటాలు కనిపిస్తున్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. బొడ్డేపల్లి అనుచరుడిగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన తమ కుటుంబం 1983 నుంచి టీడీపీలో కొనసాగుతున్నామని.. తన ముగ్గురు కుమారులు, మనుమలు, మనుమరాళ్లు అందరూ ఒకే పార్టీలో ఉన్నారని రాములు తెలిపారు.

- సరుబుజ్జిలి(శ్రీకాకుళం)



సుజాతమ్మ రొట్టెలు!

ఓ ఇంటి వసారాలో రొట్టెలు తయారు చేస్తున్న ఈమెను గుర్తుపట్టారా! సాధారణ ఇంట్లో రొట్టెలు వేస్తున్న ఈమె.. అసాధారణ రాజకీయ కుటుంబానికి చెందినవారు. మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయ భాస్కర రెడ్డి కోడలు, సూర్య ప్రకాశ్‌రెడ్డి సతీమణి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ. డోన్ నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన భర్త కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి తరపున ఎన్నికల ప్రచారం చేస్తూ.. డోన్ మండలం కామగాని కుంట్ల గ్రామంలోని ఓ ఇంట్లో గురువారం ఇలా రొట్టెలు చేశారు.



వెలిగిద్దాం.. టార్చిలైటు!



సమాజంలో మార్పు తెచ్చేందుకు కొత్తగా రాజకీయ పార్టీని స్థాపించి ఎన్నికల బరిలోకి దిగిన సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ విశాఖ ఉత్తరం నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. జై భారత్ పార్టీ తరఫున గురువారం ఆయన నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నికల గుర్తు అయిన టార్చిలైటుతో కుటుంబ సభ్యులు, అభిమానులు ఇలా సందడి చేశారు.

చాలా పెద్ద తప్పు చేశాం



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

చంద్రబాబును కాదనుకుని జగన్‌ను తెచ్చుకున్నాం

ఇప్పుడు దీన్ని సరిదిద్దుకోవాలని నిర్ణయించుకున్నాం

'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో ఆంధ్రా పెన్షనర్స్ పార్టీ అధ్యక్షుడు సుబ్బరాయన్

చంద్రబాబు అవసరాన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు అంతా గుర్తించారు. రాష్ట్ర విభజన జరిగి ఆర్థిక లోటులో ఉన్నా ఉద్యోగులకు చంద్రబాబు 43శాతం ఫిట్‌మెంట్ ఇచ్చారు. పది నెలల బకాయిలు విడుదల చేశారు. అటువంటి చంద్రబాబును కాదనుకుని జగన్‌ను తెచ్చుకున్నాం. ఇది మేం చేసిన పెద్దతప్పు. దీన్ని సరిదిద్దుకోవాలని నిర్ణయించుకున్నాం. అందుకే ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లను చైతన్యవంతుల్ని చేస్తున్నాం. రాష్ట్రానికి కాపాడేది చంద్రబాబు మాత్రమే. జగన్ మొత్తం నాశనం చేశాడు. వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగులు, పెన్షనర్లు పడిన ఇబ్బందులు ఇంతకుముందు ఏ ప్రభుత్వంలో చూడలేదు. ఉద్యోగ సంఘాల నాయకులు ప్రభుత్వానికి తొత్తులుగా మారారు. వాళ్ల అసమర్థతతో అనుకున్న ఫలితాలు సాధించలేకపోయామని సుబ్బరాయన్ ఆవేదన వ్యక్తం చేశారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

పార్టీ ఏర్పాటు చేయాలన్న ఆలోచన రావడానికి కారణం?

గవర్నమెంట్ టెక్స్‌బుక్ ప్రెస్‌లో అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేశాను. రాష్ట్ర నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా పనిచేసి, 2019 జూన్ 30న గుంటూరులో ఉద్యోగ విరమణ చేశాను. ప్రస్తుతం ఉద్యోగ సంఘాలు, పెన్షనర్ల సంఘాలు సీఎం జగన్‌కు పాలాభిషేకాలు చేస్తూ ఉద్యోగులను మోసం చేస్తున్నాయి. సీఎం ఏం చేశాడని పాలాభిషేకాలు అభిషేకాలు చేశారు? ఈ సంఘాల నాయకులు వైసీపీకి కార్యకర్తలుగా తయారయ్యారు. ప్రభుత్వ అరాచకాలను ప్రశ్నించకుండా మౌనం పాటిస్తున్నారు. పదవుల కోసం అమ్ముడుపోయి ఉద్యమాన్ని అమ్మేశారు. అందుకే పెన్షనర్ల సమస్యపై పోరాటం చేయాలని నిర్ణయించుకున్నాను. సన్నిహితులతో చర్చించిన తర్వాత ఆంధ్రా పెన్షనర్ల పార్టీని ఏర్పాటు చేశాం.

ఈ పరిస్థితికి కారణం ఏమిటి?

ఉద్యోగులు, పెన్షనర్ల ఓట్లు అవసరం లేదన్న భావనలో జగన్ ఉన్నారు. ఉద్యోగులు, పెన్షనర్లు ఇప్పుడు పడుతున్న ఇబ్బందులు ఉమ్మడి రాష్ట్రంలో ఏనాడూ పడలేదు. ఈ పరిస్థితి ఏ రాష్ట్రంలోనూ ఉండదు. ఈ ప్రభుత్వంపై ఉద్యోగులు, పెన్షనర్లలో తీవ్ర వ్యతిరేకత ఉంది. దీనికి నిదర్శనం 2022 ఫిబ్రవరిలో నిర్వహించిన చలో విజయవాడ కార్యక్రమం. ఉద్యోగ సంఘాల నేతలను భయపెట్టి దాన్ని అణచివేయాలనుకున్నారు. దీంతో ఉద్యోగులే బాధ్యతను భుజాన వేసుకుని ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హెల్త్‌కార్డులను ఏ ఆసుపత్రిలోనూ అనుమతించడం లేదు. అప్పులు చేసి వైద్యం చేయించుకుంటున్నాం. రీయింబర్స్‌మెంట్ బిల్లుల డబ్బులు రెండేళ్లయినా రావడం లేదు. ఉద్యోగ విరమణ చేసిన వారికి బెనిఫిట్స్ సకాలంలో రావడం లేదు. ఏపీజీఎల్ఐ మెచ్యూర్ అయినా డబ్బులు ఇవ్వడం లేదు.

రాష్ట్రంలో ఎంతమంది పెన్షనర్లు ఉన్నారు?

రాష్ట్రంలో 3.87 లక్షల మంది ప్రభుత్వ పెన్షనర్లు ఉన్నారు. వీరుకాకుండా ఆర్టీసీ, మున్సిపల్, పంచాయతీ, సహకార శాఖ, జిల్లాపరిషత్ స్థానిక సంస్థల పెన్షనర్లు లక్షల్లో ఉన్నారు. జగన్ సీఎం అయ్యాక ఆరు, ఏడు నెలలు మాత్రమే పెన్షన్ ఒకటో తేదీన మా ఖాతాల్లో జమ అయింది. ఇప్పుడు 16, 17, 18 తేదీల వరకు జమ చేస్తున్నారు.

మీ కార్యాచరణ ఏమిటి?

రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల వారీగా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లతో సమావేశాలు నిర్వహిస్తున్నాం. వారిలో చైతన్యం తీసుకువస్తున్నాం. చంద్రబాబు ఎందుకు అవసరమో వివరిస్తున్నాం. ఈ సమావేశాల్లో మంచి స్పందన వస్తోంది. వచ్చే నెల 9న పులివెందులలో సభ పెడతాం. అక్కడ పరిణామాలు ఎలా ఉన్నా సభను నిర్వహిస్తాం.

బకాయిలు ఎంత మొత్తంలో ఉంటాయి

2019 నుంచి ఇప్పటివరకు ఒక్కో పెన్షనర్‌కు రూ.2లక్షల నుంచి 4 లక్షల వరకు పీఆర్సీ డీఏ బకాయిలు ఉన్నాయి. బకాయిలకు సంబంధించిన బిల్లులు చేయించి, ఖజానా శాఖకు పంపారు. డబ్బులు లేక ఆ శాఖ బిల్లులు పాస్ చేయలేదు. వాటిని చూపించి ఇన్‌కం టాక్స్ కట్ చేశారు. బకాయిలు తీసుకోకుండానే వందలాది మంది చనిపోయారు. ఇవన్నీ ప్రభుత్వ హత్యలే. దీనికి పూర్తి బాధ్యత సీఎందే. ఉద్యోగులకు 70ఏళ్లు వచ్చాక అప్పటి వరకు తీసుకుంటున్న పెన్షన్‌కు అదనంగా పది శాతం పెంచాలి. దీన్ని జగన్ 3 శాతం తగ్గించాడు. ధరలు పెరిగినప్పుడు క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను పెంచకపోగా తగ్గించారు.

మీ లక్ష్యం ఏమిటి..

జగన్‌ను ఓడించాలన్నదే మా సంకల్పం. మార్చి 26న చంద్రబాబును కలిశాం. పెన్షనర్ల సమస్యలపై వినతి పత్రం ఇచ్చాం. పెన్షనర్లకు సంక్షేమ సంస్థ ఏర్పాటు చేయాలని, ప్రతి పెన్షనర్‌కు రూ.20లక్షల ఆరోగ్య బీమా చేయాలని కోరాం. అధికారంలోకి రాగానే సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.



'కొత్త'గా పల్లెల్లో బౌన్సర్లు!

అరకు పార్లమెంటు నియోజకవర్గ కూటమి అభ్యర్థి కొత్తపల్లి గీత గిరిజన గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఆమె ప్రచారానికి పెద్ద సంఖ్యలో గిరిజనులు వస్తున్నారు. ఈ సందర్భంగా చిన్నపాటి తోపులాటలు జరుగుతున్నాయి. దీంతో గీత తనకు రక్షణగా మహిళా బౌన్సర్లను ఏర్పాటు చేసుకున్నారు. సిటీల్లో సెలబ్రిటీలకు రక్షణగా ఉండే బౌన్సర్లు ఏజెన్సీ ప్రాంతంలో బ్లాక్ డ్రెస్‌తో అభ్యర్థి వెంట ఉండటం ఆకర్షిస్తోంది.

- పాడేరు, ఆంధ్రజ్యోతి

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

The Mark of Achievement
SR Shines Again!

Sterling Performance in JEE MAIN 2024

50 YEARS OF BRILLIANCE

ALL INDIA RANK	Name	APP.
5	G.NAVEEN	APP. 240310345924 (R)
12	A.NANDINI	APP. 240310111980 (R)
42	Y.SATHWIK REDDY	APP. 240310688822 (R)
55	G.KALU	APP. 240310398144 (R)
126	D.MANISH	APP. 240310469723
131	D.KARTHIK	APP. 240310408808 (R)
144	J.SHRETHAN REDDY	APP. 240310686945 (R)
148	K.PRASHANTH REDDY	APP. 240310439090 (R)
149	T.TEJASWI	APP. 240310484777 (R)
154	K.AKHIL YADAV	APP. 240310604565 (R)
186	P.NIHAL SREEVATHSAV	APP. 240310642019 (R)
192	K.SREERAM REDDY	APP. 240310166922 (R)
201	T.AMRUTHA VARSHINI	APP. 240310017984 (R)
211	K.RAMANA REDDY	APP. 240311169525 (R)
225	T.SRESHTA	APP. 240310251866 (R)
314	P.RITHVIK	APP. 240310550132 (R)
357	R.DEEPANSH REDDY	APP. 240310166542
385	G.NAVEEN KRISHNA SAI	APP. 240310308078 (R)
430	Md.TAYYAB	APP. 240310214498 (R)
431	K.SIDDARTHA	APP. 240310562983 (R)
433	B.ABHISHEK RATHOD	APP. 240310361365 (R)
497	G.UDAY	APP. 240310340124 (R)
530	M.SRINU	APP. 240310411282 (R)
550	B.BHAVITHA	APP. 240310684585 (R)
599	S.BHANU PRASAD	APP. 240310517138 (R)
614	D.PRAGNA TEJA	APP. 240310126395 (R)
625	L.RAMYA LEELA PAVANI	APP. 240310598220 (R)
662	G.BHAGAVANDAS	APP. 240310452162 (R)
730	P.MARUTHI	APP. 240310415884 (R)
782	J.SHRESTITHA	APP. 240310460489 (R)
783	T.TEJESH	APP. 240310441887 (R)
788	DANISH FATIMA	APP. 240310281113 (R)
880	V.PRATHEEK	APP. 240310509541 (R)
861	B.ANAND SAI	APP. 240310360916 (R)
870	M.ABHIGNAN	APP. 240310483312 (R)
872	P.MEGHANA	APP. 240310194592 (R)
944	D.VARSHITH	APP. 240310463538 (R)
948	N.MAHENDRA BABU	APP. 240310449409 (R)
986	Y.HARSHITH	APP. 240310189007 (R)

LONG TERM (JEE-MAIN/ADVANCED) ADMISSIONS ARE IN PROGRESS 2024-25

3256 STUDENTS SELECTED FOR JEE-Advanced 2024

SR Educational Academy

TELANGANA ● ANDHRA PRADESH ● KARNATAKA

HYDERABAD: 8886322296, 9121307474, 9290684090, 8712612424, 8712612422, 8712604778, 8712612435, 8712612425, 8712612433 | **WARANGAL:** 9642117378 | **VIJAYAWADA:** 8142111302 | **VIZAG:** 9052222274, 9154854707 | **GUNTUR:** 9154854694 | **TIRUPATI:** 9154854699 | **NELLORE:** 9154854696 | **ANANTHAPURM:** 9154854691 | **KURNOOL:** 9154854695 | **NIZAMABAD:** 9642117110 | **SRIKAKULAM:** 9154854697 | **BHIMAVARAM:** 9642223762, 7331122579 | **RAJAHMUNDRY:** 9154854693 | **KARIMNAGAR:** 9642117335 | **NALGONDA:** 9573927070 | **ONGOLE:** 8712609156 | **KHAMMAM:** 9121155002 | **ADILABAD:** 9154854690 | **KOTHAGUDEM:** 9154854692 | **NIRMAL:** 9642117835 | **HOSAPETE:** 9154854713.

త్వరలో ప్రధాని మోదీ 'పశ్చిమ' పర్యటన

● బీజేపీ పశ్చిమ అభ్యర్థి సుజనా చౌదరి

విద్యాధరపురం, ఏప్రిల్ 25: సార్వత్రిక ఎన్నికల ప్రచార క్రమంలో త్వరలో ప్రధాని నరేంద్ర మోదీ పశ్చిమలో పర్యటించనున్నట్టు కూటమి బలపరచిన నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి అన్నారు. గురువారం భవానీపురంలోని కార్యాలయంలో కేంద్ర మాజీ మంత్రి అరుణ్‌సింగ్, సీనియర్ నేత మర్రి శశిధర్‌రెడ్డి సమక్షంలో స్థానిక కొత్తపేటకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత పోతిన వెంకటేశ్వరరావు బీజేపీలో చేరారు. ఆయనతో పాటు పెద్దసంఖ్యలో కార్యకర్తలు, నేతలు పార్టీలో చేరారు. వారందరికీ బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సుజనా చౌదరి మాట్లాడుతూ పశ్చిమలో ప్రధాని మోదీ రోడ్ షో చేయనున్నారని ఇందుకు సంబంధించిన ప్రోగ్రామ్ ఖరారైందన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన పోయి మంచి పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారు. ప్రధాని దృష్టికి నియోజకవర్గ సమస్యలను తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని పునరుద్ఘాటించారు. అరుణసింగ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో సుజనా చౌదరి ఏపీలో చంద్రబాబు గెలవడం ఖాయమని చంద్రబాబు సీఎం అవుతారన్నారు. గెలిచిన తరువాత అందరినీ అయోధ్యకు తీసుకువెళతామన్నారు. అడ్డూరి శ్రీరామ్, ఫైలా సోమినాయుడు, భోగవల్లి శ్రీధర్, బాడిత శంకర్ పాల్గొన్నారు.



ప్రచార పత్రాలను విడుదల చేస్తున్న కేంద్రమాజీ మంత్రి అరుణసింగ్, మర్రి శశిధర్‌రెడ్డి, సుజనా చౌదరి

ఇళ్ల పట్టాలు మంజూరు చేయండి

సుజనా చౌదరి సోదరి ధనలక్ష్మి పున్నమిఘాట్ ఏరియాలో గురువారం ప్రచారం చేస్తున్న సందర్భంగా అక్కడి వారు ఎన్నో ఏళ్ల తరబడి తాముంటున్న నివాసాలకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. దీనిపై ఆమె స్పందిస్తూ అధికారంలోకి రాగానే అన్ని సమస్యలను సుజనా చౌదరి పరిష్కరిస్తారన్నారు. పున్నమిఘాట్ నుంచి కరకట్ట సౌత్, మసీదు వీధి, ఆళ్ల సింహాద్రి వీధి, గంగానమ్మ గుడి, కొట్టేటి కోటయ్య వీధి, గుప్తాస్ సెంటర్, నాలుగు స్తంభాల సెంటర్, కొండ ప్రాంతాల్లో పర్యటించి సోదరుడి గెలుపు కోసం ప్రచారం చేశారు. చాలా సమస్యలు తమ దృష్టికి వచ్చాయని సుజనా చౌదరి గెలవడంతోనే అన్ని సమస్యలకు పరిష్కారం చేస్తారన్నారు. జనసేన నగరాధ్యక్షుడు శంకర్, 38వ డివిజన్ టీడీపీ అధ్యక్షురాలు పితాని పద్మావతి, కార్యదర్శి భీమశెట్టి ఈశ్వర్, నేతలు లీలా కరుణాకర్, ఈటె బాబు పాల్గొన్నారు.

సుజనా గెలుపు ఖాయం: కేంద్ర మంత్రి

విజయవాడ: పశ్చిమ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి వై.సుజనా చౌదరి రికార్డు మెజారిటీతో గెలవడం ఖాయమని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ జోస్యం చెప్పారు. గురువారం సుజనా గెలుపును కాంక్షిస్తూ ఆయనతో తన అనుబంధాన్ని వివరిస్తూ పీయూష్ గోయల్ ఓ వీడియో విడుదల చేశారు. సుజనా చౌదరి, తాను మంచి మిత్రులని, తామిద్దరం 2010లో ఒకేసారి పార్లమెంట్‌లో అడుగుపెట్టామని గుర్తు చేసుకున్నారు. మోదీ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా ఏపీ ప్రజల కోసం సుజనా చౌదరి సైనికుడిలా పనిచేశారని, రాష్ట్ర భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమించారని ప్రశంసించారు. సుజనా తెలివైన, సమర్థుడైన నేత అని పీయూష్ గోయల్ వ్యాఖ్యానించారు. జాతీయ ప్రయోజనాలే కాకుండా రాష్ట్రం కోసం నిరంతరం శ్రమించిన నేత అని కొనియాడారు. ఏపీలో ఎన్డీయే కూటమి అధికారం చేపట్టబోతోందని, సుజనా ప్రజలకు మరింత సేవ చేస్తారని, కళ తప్పిన ఏపీకి చంద్రబాబు, పవన్, బీజేపీ నేతలు తిరిగి వెలుగులు తెస్తారని ఆకాంక్షించారు.

బీజేపీ, టీడీపీ అభ్యర్థుల గెలుపునకు ప్రత్యేక వ్యూహం

విద్యాధరపురం: పశ్చిమ నుంచి కూటమి బలపరిచిన బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి, పార్లమెంట్ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని) గెలుపునకు పశ్చిమలోని టీడీపీ నేతలు ప్రత్యేక వ్యూహాన్ని రచిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం 42వ డివిజన్‌లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నె ప్రసాద్ (అన్న) ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ తేదీ దగ్గర పడుతుండడంతో ప్రచారాన్ని ముమ్మరం చేయాలని, ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. కూటమి అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. డివిజన్ అధ్యక్షుడు శివాజీ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి పెద్ది సతీష్‌తో పాటు హనుమంతరావు, కోడెబోయిన స్రవంతి, నెలకుర్తి వెంట్రావ్, అనబత్తిన శ్రీనివాస్, మైనంపాటి రమేష్‌చౌదరి, రమేష్, మహిళా నేతలు మొవ్వ విజయ, అందె మేరి పాల్గొన్నారు.

కాంగ్రెస్ 'తూర్పు' అభ్యర్థిగా నాంచారయ్య

విజయవాడ: కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థిగా పొనుగుపాటి నాంచారయ్య పేరును అధిష్టానం ఖరారు చేసింది. ముందుగా ఈ నియోజకవర్గానికి పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ పేరును ప్రకటించింది. ఆమె పోటీకి నిరాకరించడంతో నాంచారయ్యను ఎంపిక చేశారు. నాంచారయ్య ఇంజనీరింగ్ చేశారు. 2019 ఎన్నికల్లో ఇదే నియోజకవర్గం నుంచి పోటీ చేశారు.

మలేసియా ఇంటర్నేషనల్ స్విమ్మింగ్‌లో తీర్థుసమదేవ్‌కు కాంస్యం



విజయవాడ స్పోర్ట్సు: జిల్లాకు చెందిన యువ స్విమ్మర్ ఎం.తీర్థు సమదేవ్ 59వ మలేసియా ఇంటర్నేషనల్ స్విమ్మింగ్‌లో కాంస్యంతో సత్తా చాటాడు. కౌలాలంపూర్ స్పోర్ట్సు సిటీలో ఈ నెల 24న ప్రారంభమైన ఈ టోర్నీలో తొలిరోజు 1500 మీటర్ల ఫ్రీ స్టయిల్ విభాగంలో 16:18:31 సెకన్లలో లక్ష్యాన్ని అధిగమించి కాంస్యం వశం చేసుకున్నాడు. ఈ సందర్భంగా తీర్థు సమదేవ్‌ను జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ సెక్రటరీ ఐ.రమేష్ అభినందించారు.

28న కేడీసీఏ సీనియర్ పురుషుల క్రికెట్ జట్ల ఎంపికలు

విజయవాడ స్పోర్ట్సు: కేడీసీఏ అడహక్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 28న ఉదయం 7 గంటలకు నగరంలోని ఐజీఎంసీ స్టేడియంలో అండర్-23 పురుషుల క్రికెట్ సెలక్షన్స్ (అన్ని ఫార్మాట్లకు టీ-20, మల్టీ డేస్, వన్డే) నిర్వహిస్తున్నట్టు ఉమ్మడి కృష్ణా జిల్లా క్రికెట్ అడహక్ కమిటీ చైర్మన్ టి.త్రినాథ్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు హాజరయ్యేవారు పుట్టినతేదీ, ఆధార్ జిరాక్సులతో వైట్‌డ్రస్, స్పోర్ట్సు షూ ధరించి రావాలన్నారు.

పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తుకు గడువు పొడిగించాలి

కృష్ణలంక: సాధారణ ఎన్నికల సందర్భంగా విధుల్లో పాల్గొనే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ పొందేందుకు ఫారం-12 సమర్పించేందుకు ఎన్నికల కమిషన్ ఈనెల 26 వరకు పొడిగించడం పట్ల ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, ఏపీ జేఏసీ అమరావతి పక్షాన ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. ఇప్పటికీ కొన్ని జిల్లాల్లో ఎన్నికల విధులకు ఉద్యోగులను కేటాయిస్తూ ఉత్తర్వులిస్తున్నందున, ఈ ఫారం-12 సమర్పణకు గడువును ఈనెల 30 వరకు (ఫారం-12 ద్వారా పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకొనేందుకు) మరో అవకాశం కల్పించాలని, అలాగే పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేందుకు వెళ్లే ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం వలే స్పెషల్ క్యాజువల్ లీవ్‌ను మంజూరు చేసేలా తగు చర్యలు తీసుకోవాలని గురువారం సచివాలయంలో ఎన్నికల కమిషన్ అదనపు సీఈవో ఎం.ఎన్.హరీంద్రప్రసాద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఈ విషయాన్ని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ తో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలిపినట్టు ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రమేష్ కుమార్ ఆ ప్రకటనలో తెలిపారు.



బి.తన్విక (1140), ఎ.సంపత్ (1441), పి.అస్మిత (3690), బి.నిత్య శ్రీ (4630), కె. నాగరాహుల్ ధ్రువ (5150), కె.ఉదయ్ బాల కుమార్ (6598)

జేఈఈ మెయిన్స్‌లో శారద విద్యాసంస్థల ప్రతిభ

మొగల్రాజపురం, ఏప్రిల్ 25: జేఈఈ మెయిన్-2024 ప్రవేశ పరీక్ష ఫలితాల్లో జాతీయ ర్యాంకులు సాధించిన విద్యార్థులను గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మొగల్రాజపురం శారద విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వై.రమేష్ బాబు, మేనేజింగ్ డైరెక్టర్ వై. శారదా దేవి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బి.తన్విక (1140), ఎ.సంపత్ (1441), పి.అస్మిత (3690), బి.నిత్య శ్రీ (4630), కె. నాగరాహుల్ ధ్రువ (5150), కె.ఉదయ్ బాల కుమార్ (6598) ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తూ 650 మంది విద్యార్థులు హాజరవగా 350 మందికి పైగా విద్యార్థులు మంచిరాంకులు సాధించారన్నారు. ఒత్తిడి లేని విద్య, క్రమశిక్షణ, అధ్యాపకుల సలహాలు, సూచనలు ప్రశాంత వాతావరణం, ఆన్‌లైన్ పరీక్షా ప్రణాళిక, విద్యార్థుల శ్రద్ధ, తల్లిదండ్రుల సహకారం కారణమని జీఎం జీవీ రావు అన్నారు.

మలేరియా పట్ల అప్రమత్తంగా ఉండండి

● డాక్టర్ పూర్ణచంద్రరావు



మాట్లాడుతున్న జయదీప్

రైల్వేస్టేషన్, ఏప్రిల్ 25: మలేరియా పట్ల అప్రమత్తంగా ఉండాల ని సీనియర్ కన్సల్టెంట్ ఫిజిషియన్ డాక్టర్ జె.పూర్ణచంద్రరావు అన్నారు. స్థానిక రైల్వే ఆసుపత్రిలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆసుపత్రి అవుట్ పేషెంట్ విభాగంలో గురువారం అవగాహన సదస్సు జరిగింది. తొలుత ఆసుపత్రి అదనపు చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ ఎం.జయదీప్ మలేరియా వ్యాప్తి అనారోగ్యం, మరణాలపై ఆడియో, వీడియో ప్రదర్శనను నిర్వహించారు. డాక్టర్ జె.పూర్ణచంద్రరావు మాట్లాడుతూ మలేరియా వ్యాధి ప్రత్యక్షంగా గానీ పరోక్షంగా గానీ ప్రతి ఒక్కరినీ ఇబ్బంది పెడుతుందని, కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే నివారించవచ్చని సూచించారు. చీఫ్ హెల్త్ ఇన్స్‌పెక్టర్ వి.వాసుదేవరావు మాట్లాడుతూ రైల్వే ట్రాక్‌ల వెంట నివాసాల వద్ద ఉండే చెరువుల్లో గంబూసియా చేపల పెంపకంపై అవగాహన కల్పించారు.



కేక్ కట్‌చేసి చరిత్‌కు అభినందనలు తెలుపుతున్న గద్దె రామ్మోహన్

దూసుకెళ్తున్న 'టీడీపీ ఫరెవర్' ఇన్‌స్టా అకౌంట్

పటమట, ఏప్రిల్ 25: టీడీపీ మీద అభిమానంతో యార్లగడ్డ చరిత్ అనే యువకుడు 'టీడీపీ ఫరెవర్' పేరుతో ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ఓపెన్ చేసి టీడీపీ వీడియోలను అందులో పోస్టు చేస్తున్నాడు. రోజురోజుకూ పేజీకి అభిమానులు పెరిగి ఈ రోజు లక్షమంది ఫాలోవర్స్‌కు చేరువైంది. అశోక్‌నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో గద్దె రామ్మోహన్ కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీపై అభిమానంతో ఎంతోమంది యువకులు సోషల్ మీడియా ద్వారా టీడీపీ అభివృద్ధి, గెలుపునకు కృషి చేస్తున్నారన్నారు. ఈ పేజ్‌ను రూపొందించిన చరిత్ తూర్పు నియోజకవర్గానికి చెందినవాడు కావడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. గద్దె క్రాంతి, టి.శివ, ఎం.హేమంత్, ఎం.పృథ్వీ, కె.లోకేష్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హీరో సత్యదేవ్

నగరంలో 'కృష్ణమ్మ' చిత్రబృందం సందడి

పటమట, ఏప్రిల్ 25: బెజవాడ నగరం ఇతివృత్తంగా నగరంలో 60 రోజులపాటు కృష్ణమ్మ చిత్రాన్ని నిర్మించామని, ఈ చిత్రాన్ని ప్రేక్షకులు తప్పక విజయవంతం చేయాలని హీరో సత్యదేవ్ కోరారు. గురువారం స్టెల్లా కాలేజ్ సమీపంలోని హీవాగా స్కూల్ ఆఫ్ బ్యూటీ సెంటర్లో కృష్ణమ్మ చిత్రబృందం విలేకరుల సమావేశం నిర్వహించింది. ఈ చిత్రాన్ని వన్‌టౌన్, వించిపేట కొండ ప్రాంతాల్లో, మూలపాడు అటవీప్రాంతంలో చిత్రీకరించామన్నారు. ఈ చిత్రంలో తాను వించిపేట భద్ర క్యారెక్టర్‌లో ప్రేక్షకులకు కనబడతానని, ముగ్గురు స్నేహితుల మధ్య జరిగే కథస్త్ర ఈ చిత్రమన్నారు. మే 3న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రాన్ని ప్రేక్షకులు విజయవంతం చేయాలని కోరారు. ప్రముఖ దర్శకుడు కొరటాల శివ ఈ చిత్రానికి సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారన్నారు. దర్శకుడు వీవీ గోపాలకృష్ణ మాట్లాడుతూ తాను నగరంలోనే పుట్టి పెరిగానని, అందుకే నగరంలోని పలు అంశాలను ప్రపంచానికి తెలియజేసే ఉద్దేశంతో ఈ కృష్ణమ్మ చిత్రాన్ని నిర్మించినట్టు తెలిపారు. ఈ చిత్రంలో రఘు కుంచె, అర్చన, నందగోపాల్, లక్ష్మణ్ వంటి నటులు నటించారన్నారు.

దుర్గగుడిలో శాస్త్రోక్తంగా ద్వాదశ ప్రదక్షిణలు

వన్‌టౌన్, ఏప్రిల్ 25: బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా చేసే సేవల్లో ద్వాదశ ప్రదక్షణలూ ముఖ్యమైనవే. గురువారం దుర్గగుడిలో ఆలయ సంప్రదాయాల మేరకు ద్వాదశ (12) ప్రదక్షణలను భక్తిశ్రద్ధలతో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిర్వహించారు. ఈవో రామారావు దంపతులు, స్థానాచార్యుడు శివప్రసాదశర్మ, వైదిక కమిటీ సభ్యులు, అర్చకులు, సిబ్బంది పల్లకిలో గంగ, పార్వతీ, మల్లేశ్వరుల ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకువచ్చారు. వేదపండితులు, అర్చకులు ఉత్సవ మూర్తులకు లఘు పూజ చేసి, హారతులు సమర్పించారు. అనంతరం ద్వాదశ ప్రదక్షణల సంకల్పం చెప్పారు. పంచమహా వాద్యం, వేద పఠనం, రుద్ర సూక్తం, స్తోత్ర పఠనం, భేరీ వాయిద్యం, కొమ్ము బూరవాయిద్యం, కాంస్యనాదం, వీణా నాదం మురళీగానం, గానం, నృత్యం, మౌనం ఇలా ఒక్కో ప్రదక్షణకు ఒక్కో అంశాన్ని జోడించి ప్రదక్షణలు నిర్వహించారు.





ఉత్సవ మూర్తులను తీసుకువస్తున్న ఈవో రామారావు దంపతులు, యాగశాల

ఈవోకు బంగారు, వెండి అభరణాల అప్పగింత

దుర్గగుడి ఈవో రామారావుకు గురువారం మాజీ ఈవో, దేవదాయ శాఖ ప్రధాన కార్యాలయంలో జాయింట్ కమిషనర్‌గా పనిచేస్తున్న దర్భముళ్ల భ్రమరాంబ ఆలయంలోని ఖజానాలోని బంగారు ఆభరణాలను అప్పగింతలు జరిగాయి. శుక్రవారం కూడా కొనసాగనుంది. ఈవో భ్రమరాంబను గత దసరా ఉత్సవాలకు ముందు బదిలీ చేశారు. ఆమె స్థానంలో రామారావును నియమించారు. ఖజానాలోని బంగారు, వెండి అభరణాలు, వస్తువులను బదిలీ అయిన ఈవోలు తరువాత వచ్చిన ఈవోలకు అప్పగిస్తారు. ఈ క్రమంలో రామారావుకు ఆమె ఆభరణాలను అప్పగిస్తున్నారు.

దుర్గగుడిలో నేడు యాగశాల ప్రారంభం

దుర్గగుడిలో శుక్రవారం నూతన యాగశాలలను ప్రారంభించనున్నారు. ప్రస్తుత యాగశాల ఇరుకుగా ఉండడంతో నూతన యాగశాలను నిర్మించారు. దీని నిర్మాణానికి దాత సంగా నరసింహరావు విరాళమిచ్చి సహకరించారు. సందర్భంగా గురువారం ఆలయ ఈఈ కోటేశ్వరరావు, స్థపతి షణ్ముఖశాస్త్రి, స్థానాచార్యుడు శివప్రసాదశర్మ సమీక్షించారు. ఈవో రామారావు ఆదేశాలతో యాగశాల ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్య అతిథులుగా దేవదాయశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ కరికాల వలవన్, కమిషనర్ సత్యనారాయణ పాల్గొననున్నారు.



చెస్ టోర్నీ ప్రారంభోత్సవంలో షామ్‌రాక్ ప్రిన్సిపాల్ భారతీధర్, వివిధ జిల్లాల అసోసియేషన్ల సెక్రటరీలు

ఘనంగా 5 దేశాల ఫిడే చెస్ టోర్నీ ప్రారంభం

విజయవాడ స్పోర్ట్సు, ఏప్రిల్ 25: నగరంలోని స్పార్క్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో కానూరులోని షామ్‌రాక్ ఇంటర్నేషనల్ స్కూల్లో 6 రోజుల పాటు సాగే ఐదు దేశాల మొదటి ఇంటర్నేషనల్ ఓపెన్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నీ గురువారం ఘనంగా ప్రారంభమైంది. స్కూల్ ప్రాంగణంలో ఈ టోర్నీని ప్రిన్సిపాల్ భారతీధర్ ప్రారంభించి మాట్లాడుతూ తొలి ఇంటర్నేషనల్ టోర్నీకి తమ స్కూల్ ఆతిథ్యం ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇండియా, శ్రీలంక, బంగ్లాదేశ్, జింబాబ్వే, అమెరికా నుంచి 400 మంది చెస్ ప్లేయర్స్ బరిలో దిగారని అకాడమీ డైరెక్టర్ తాళ్ల నరేష్ తెలిపారు. ఇందులో మొత్తం 174 మంది అంతర్జాతీయ క్రీడాకారులున్నారన్నారు. కోనసీమ, ఎన్టీఆర్ జిల్లాల చెస్ అసోసియేషన్ల సెక్రటరీలు టి.సురేష్, ఎన్ ఎం ఫణికుమార్ పాల్గొన్నారు. ఇండియా నుంచి కోలగట్ల మీనాక్షి, ఎండీ ఇమ్రాన్, శివ పవన్ తేజ, ఎం.శ్రీనివాసరావు, ఎన్.ప్రసాద్, జె.రామకృష్ణ, డి.లక్ష్మణరావు, చరణ్ సంతోష్, జ్ఞాన సంతోష్, విహాన్ కార్తికేయ వంటి ర్యాంక్ ప్లేయర్స్ ఉన్నారు.

వెటర్నరీ అసిస్టెంట్ డైరక్టర్ డాక్టర్ శ్రీనివాసరావుకు

'బెస్ట్ వెటర్నరీ సర్జన్' అవార్డు ప్రదానం

కృష్ణలంక, ఏప్రిల్ 25: లబ్బీపేట పశువుల ఆస్పత్రిలో వైద్యసేవలందిస్తున్న పశుసంవర్థక శాఖ అసిస్టెంట్ డైరక్టర్ డాక్టర్ కామని శ్రీనివాసరావును 'బెస్ట్ వెటర్నరీ సర్జన్' అవార్డు వరించింది. పశుసంవర్థక శాఖలో మెరుగైన వైద్యసేవలందిస్తున్నందుకు రాష్ట్రస్థాయి ఉత్తమ సేవా పురస్కార జ్ఞాపికను గురువారం ఆ శాఖ డైరెక్టర్ డాక్టర్ ఆర్.అమరేంద్ర కుమార్ చేతుల మీదుగా అందించారు. ఎన్టీఆర్ సూపర్ స్పెషాలిటీ పశువైద్యశాలలో దాదాపు మూడేళ్లుగా పనిచేస్తున్న కామని శ్రీనివాసరావు ఇప్పటి వరకు 2వేలకు పైగా మేజర్ ఆపరేషన్లు నిర్వహించారు. అందులో పెంపుడు కుక్కలు, పిల్లులు, కుందేళ్లు, ఆవులు, గేదెలు ఉన్నాయి. డాక్టర్ 'కామని' సేవలను గుర్తించి జాతీయ శిక్షణా కార్యక్రమాలను ప్రారంభించి, మన రాష్ట్రం, ఇతర రాష్ట్రాల్లోని క్షేత్రస్థాయి పశువైద్య సిబ్బందికి పెంపుడు జంతువుల్లో మేజర్ ఆపరేషన్ల మీద ఆయనతో శిక్షణ ఇప్పించడం జరిగింది.



రాష్ట్రస్థాయి 'బెస్ట్ వెటర్నరీ సర్జన్' అవార్డును అందుకుంటున్న పశుసంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కామని శ్రీనివాసరావు

జేఈఈలో నారాయణ విద్యార్థికి 84వ ర్యాంకు



విద్యార్థిని సత్కరిస్తున్న డీన్, ఏజీఎం, ప్రిన్సిపాల్

విజయవాడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ పరీక్షలో నారాయణ కళాశాల విద్యార్థి విద్యాప్రవీణ్ జనరల్ విభాగంలో 84వ ర్యాంకు సాధించాడు. పియూష్ ప్రణవ్ 530, రాహుల్ సాయి 884 ర్యాంకు సాధించారు. వారిని డీన్ కె.శ్రీనివాసులు, ఏజీఎం ఆంజనేయులు, ప్రిన్సిపాల్ కేవీపీసీ బాబ్జి ఘనంగా సత్కరించారు.

శ్రీచైతన్య ప్రతిభ

జేఈఈ మెయిన్స్ పరీక్షా ఫలితాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ఆరుగురు విద్యార్థులు 100లోపు ర్యాంకులను సాధించారు. టి.నిఖిలేష్ 20, ఏవీ తనిష్ రెడ్డి 21, పి.సతీష్‌రెడ్డి 68వ, టీడీఎస్ఎస్ నాగభూషణం ఆరో ర్యాంకు, మణికంట పృథ్విరాజ్ 92వ ర్యాంకు సాయిశివలోచన్ 93వ ర్యాంకును సాధించారు. 30 మంది 500లోపు ర్యాంకులు, 55మంది 1000లోపు ర్యాంకులు 104 మంది 2వేల లోపు ర్యాంకులు, 180 మంది 5వేల లోపు ర్యాంకులు సాధించారు.

వారిని చైతన్య సంస్థల ప్రతినిధులు, అధ్యాపకులు అభినందించారు.



హర్షం వ్యక్తం చేస్తున్న శ్రీ చైతన్య విద్యార్థులు

ఎన్నికల పరిశీలకులకే నేరుగా ఫిర్యాదు

● అతిథి గృహాల్లోనూ కలిసేందుకు అవకాశం: జిల్లా ఎన్నికల అధికారి ఢిల్లీరావు

కృష్ణలంక, ఏప్రిల్ 25: సాధారణ ఎన్నికల నేపథ్యంలో సీ విజిల్ వంటి మార్గాల ద్వారా ఫిర్యాదులు స్వీకరించి, పరిష్కరిస్తున్నామని, అలాగే జిల్లా ఎన్నికల పరిశీలకులను నిర్దిష్ట సమయాల్లో నేరుగా కలిసి ఆయా అంశాలకు సంబంధించి విజ్ఞాపనలు, ఫిర్యాదులు అందించవచ్చని, తీవ్రతను బట్టి ఫోన్ నంబర్లలోనూ సంప్రదించవచ్చని జిల్లా ఎన్నికల అధికారి ఎస్.ఢిల్లీరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరువూరు, విజయవాడ పశ్చిమ, సెంట్రల్, తూర్పు నియోజకవర్గాలకు మంజూరాజ్ పాల్, మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాలకు నరీందర్ సింగ్ బాలి జనరల్ అబ్జర్వర్లుగా వచ్చారన్నారు. ఈ సాధారణ పరిశీలకులు పోలింగ్ తేదీ వరకు ప్రతిరోజు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు మున్సిపల్ గెస్ట్ హౌస్, నందమూరి రోడ్డు, బృందావన్ కాలనీ, లబ్బీపేటలో అందుబాటులో ఉంటారని, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు, ప్రజలు ఎన్నికల ఉల్లంఘనలకు సంబంధించి ఫిర్యాదులు, విజ్ఞాపనలు సమర్పించవచ్చన్నారు. అలాగే మంజూరాజ్‌పాల్ 8121526777 నంబర్‌లోను, నరీందర్ సింగ్ బాలి 9154883009 నంబర్‌లోను అందుబాటులో ఉంటారని, విషయ తీవ్రతను బట్టి ఫోన్‌లో సంప్రదించవచ్చన్నారు. విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గం ఎన్నికల వ్యయ పరిశీలకులు వి.జస్టిన్, తిరువూరు, విజయవాడ పశ్చిమ, సెంట్రల్, మైలవరం నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకులు సౌరబ్ శర్మ, విజయవాడ తూర్పు, నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు మదన్ కుమార్ మధ్యాహ్నం 4 నుంచి 5 గంటల వరకు పంచాయతీ రాజ్ గెస్ట్ హౌస్, డాక్టర్ అంబేద్కర్ స్మృతివనం ఎదురుగా, బందరురోడ్డులో అందుబాటులో ఉంటారన్నారు. జస్టిన్ 8121490777, సౌరభ్ శర్మ 8121405777, మదన్‌కుమార్ 9154883050 నెంబర్లలో అందుబాటులో ఉంటారన్నారు. విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గ పోలీస్ అబ్జర్వర్ ప్రీతిందర్ సింగ్ ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు పోలీస్ గెస్ట్‌హౌస్, అమెరికన్ హాస్పిటల్ ట్రాఫిక్ జంక్షన్, బందరురోడ్డులో అందుబాటులో ఉంటారని, 9154883014 నెంబర్‌లో వారిని సంప్రదించవచ్చన్నారు. ఎన్నికల పరిశీలకులు క్షేత్రస్థాయిలోనూ పర్యటిస్తారని, ఆ సమయాల్లోను ప్రజలు నేరుగా తమ ఫిర్యాదులు తెలియజేయవచ్చునని కలెక్టర్ తెలిపారు.



నామినేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న నరీందర్ సింగ్ బాలి

నియోజకవర్గాల్లో అబ్జర్వర్ పరిశీలన

మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు నరీందర్ సింగ్ బాలి గురువారం మూడు నియోజకవర్గాల పరిధిలో పర్యటించి ఆర్వో కార్యాలయాల్లో జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. అలాగే నియోజకవర్గాల పరిధిలో స్వేచ్ఛాయుతంగా, ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఎన్నికల నిర్వహణకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. స్ట్రాంగ్ రూంలకు సంబంధించి చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. మైలవరం లక్కిరెడ్డి లక్ష్మీరెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని ఈవీఎం, వీవీ ప్యాట్ స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. నందిగామలోని కేవీఆర్ కాలేజీ, జగ్గయ్యపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు.

మండుతున్న ఎండలు



నగరంలో రోజు రోజుకూ ఎండల తీవ్రత పెరుగుతోంది. ఉదయం 10 గంటలు దాటిన తరువాత బయటికట రావాలంటే భయాందోళనలు వ్యక్తం చేసే పరిస్థితి. ప్రధాన రహదారులు కర్ఫ్యూను తలపిస్తున్నాయి. ఒకవేళ బయటికి వచ్చినా ఒళ్లంతా దుస్తులు కప్పుకుని రావాల్సిందే. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న రోజుల్లో ఇంకెలా ఉంటుందోనని నగరవాసులు భయపడుతున్నారు.




కొవ్వూరు-రాజమహేంద్రవరం మధ్య ఉన్న గామన్ బ్రిడ్జి

గామన్ బ్రిడ్జికి మరోసారి మరమ్మతులు

- నేటి నుంచి మే 3 వరకు వంతెనపై ఒకవైపే రాకపోకలు

కొవ్వూరు, ఏప్రిల్ 25: తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం-కొవ్వూరు మధ్య ఉన్న గామన్ బ్రిడ్జి నెల రోజుల వ్యవధిలో మరోసారి మరమ్మతులకు గురైంది. మార్చి 24న గామన్ బ్రిడ్జి 52వ స్తంభం వద్ద వంతెనకు యాక్షన్ ఇచ్చే బాల్ మరమ్మతులకు గురి కావడంతో వంతెనపై ఒకవైపు రాకపోకలను నిలుపుదల చేశారు. మరమ్మతులు పూర్తిచేసి సుమారు నెల రోజుల తరువాత ఈ నెల 23న రెండువైపులా వాహన రాకపోకలను అనుమతించారు. అయితే ప్రస్తుతం రాజమహేంద్రవరం నుంచి కొవ్వూరు వైపు వచ్చే మార్గంలో 28వ స్తంభం వద్ద అమర్చిన బేరింగ్‌లో ఎటువంటి ప్రేజర్ రావడం లేదని గుర్తించారు. దీంతో ఈ నెల 26 నుంచి మే 3వ తేదీ వరకు ఈ మార్గంలో వాహన రాకపోకలను నిలుపుదల చేస్తున్నట్టు సమాచారం. బేరింగ్ మార్పు చేయడానికి 10 రోజుల పాటు వంతెనపై ఒక మార్గంలోనే వాహన రాకపోకలకు అనుమతించనున్నారు. ఎటువంటి సాంకేతిక పరిజ్ఞానం లేని సమయంలో నిర్మించిన వంతెనలు వందేళ్లకు పైగా సేవలందించాయి. ఆధునిక సాంకేతికతతో నిర్మించిన గామన్ వంతెనపై రాకపోకలు ప్రారంభించిన పదేళ్లకే మరమ్మతులకు గురి కావడంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

చెల్లెలు పుట్టుకపైనా విమర్శలా? చంద్రబాబు



అమరావతి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): 'తోడ బుట్టిన చెల్లెలు పుట్టుకపైనా, మహాలక్ష్మిగా భావించే ఇంటి ఆడబిడ్డ కట్టుకున్న చీరపైనా... విమర్శలు చేసేవాడు ఒక ముఖ్యమంత్రా?' అని టీడీపీ అధినేత చంద్రబాబు మండిపడ్డారు. గురువారం ఎక్స్‌లో స్పందిస్తూ... 'ఎంత నీచం..! ఇది కాదా వికృత మనస్తత్వం?' అని బాబు అన్నారు.

జగన్‌ను ఇంటికి పంపితేనే రాష్ట్రానికి భవిష్యత్తు

- ప్రజల నెత్తిన అప్పుల కుంపటి: నీలాయపాలెం



అమరావతి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లూ పరిమితిని మించి అప్పులు చేసిన జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని పూర్తిగా అప్పుల ఊబిలోకి నెట్టి, ప్రజల నెత్తిన అప్పుల కుంపటి పెట్టేశాడని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ ధ్వజమెత్తారు. వృద్ధి, అభివృద్ధి లేకుండా అప్పులు చేస్తే.. భవిష్యత్తులో ప్రజలే భారం మోయాల్సి వస్తుందని హెచ్చరించారు. గురువారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'గత ఐదేళ్లూ విచ్చలవిడిగా అప్పులు చేసి, అభివృద్ధిని విస్మరించిన జగన్... చివరి రెండు నెలల్లో సాధ్యమైనంత బొక్కడానికి మళ్లీ అప్పులు చేస్తున్నాడు. రాష్ట్ర స్థూల ఉత్పత్తిపై జగన్ కాకిలెక్కలు చెబుతూ, కేంద్రాన్ని మోసం చేసి, ఈరెండు నెలల్లో పరిమితిని మించి, ఆర్బీఐ నుంచి రూ.94 వేల కోట్ల అప్పు చేశాడు. అప్పులు చేయకుంటే సంక్షేమ పథకాలు కూడా అమలు చేయలేని స్థితికి రాష్ట్రాన్ని దిగజార్చాడు. ఎంత ఆదాయం ఉంటే అంత అప్పు చేస్తున్నాడు. అప్పు చేస్తే కానీ పింఛన్లు ఇచ్చే పరిస్థితి లేదు' అంటూ లెక్కలతో సహా వివరించారు. అప్పులు చేసినా, జగతి పబ్లికేషన్ తప్ప రాష్ట్రం ఏమాత్రం వృద్ధి సాధించలేదన్నారు. ఎన్నికల్లో అయాచితంగా లబ్ధి పొందాలని చూస్తున్న జగన్‌ను ఇంటికి పంపితేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని విజయకుమార్ స్పష్టం చేశారు.

1న ఇళ్ల దగ్గరే పింఛన్లు పంపిణీ చేయాలి: రామకృష్ణ

అమరావతి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మే నెల పింఛన్లను ఒకటో తేదీనే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన గురువారం ఓ ప్రకటన చేశారు. 'ప్రస్తుతం ఎండల తీవ్రత, వడగాల్పులు వీస్తున్న నేపథ్యంలో పింఛనుదారులకు ఇబ్బందులు కల్పించకుండా ప్రభుత్వం ఇప్పటి నుంచే తగు చర్యలు చేపట్టాలి. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున పింఛన్ల పంపిణీలో వలంటీర్లను వినియోగించరాదని సీఈసీ ఆదేశాలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం విఫలమయింది. పింఛనుదారులను గ్రామ, వార్డు సచివాలయాల వద్దకు రప్పించి మండుటెండలో ఇబ్బందులకు గురి చేసింది. దురదృష్టవశాత్తు ఎండల తీవ్రతకు మరణాలు కూడా సంభవించాయి' అని రామకృష్ణ పేర్కొన్నారు.

ఘనవిజయం మీదే!

- బాబుకు గోయల్ ముందస్తు శుభాకాంక్షలు



అమరావతి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ అధినేత చంద్రబాబుకు కేంద్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి, బీజేపీ సీనియర్ నేత పీయూష్ గోయల్ ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. 'మీరు ఘన విజయం సాధించబోతున్నారు. అన్ని సర్వేల్లో అదే వస్తోంది. రాష్ట్రంలో ఎన్డీయే తిరుగులేని విజయం పొందబోతోంది. మీకు ముందస్తు శుభాకాంక్షలు' అని చంద్రబాబుతో ఆయన అన్నట్లు సమాచారం. ఆయనకు మాజీ సీఎం ధన్యవాదాలు తెలియజేశారు. గురువారం ఉదయం తమ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్, జాతీయ సహాయ కార్యదర్శి శివప్రకాశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుకర్‌తో కలిసి గోయల్ ఇక్కడి ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వచ్చారు. సుమారు 2 గంటలు వివిధ అంశాలపై చర్చించారు. ఇరవై నిమిషాలపాటు వారిద్దరూ విడిగా మాట్లాడుకున్నారు. ఉమ్మడి ప్రచార వ్యూహం, ఇరు పార్టీల మధ్య సమన్వయం, కేంద్ర నేతల పర్యటనలు తదితర అంశాలపై చర్చ జరిగింది. బీజేపీ పోటీ చేస్తున్న కొన్ని నియోజకవర్గాల్లో సమన్వయ లోపం ఉందని.. అందరినీ కదిలించాల్సిన అవసరం ఉందని పీయూష్ నొక్కిచెప్పారు.

కోట్లు కొల్లగొట్టారు!

- నెల్లూరు జిల్లాలో అడ్డగోలుగా వైసీపీ నేతల తెల్లరాయి దోపిడీ
- మైనింగ్ అధికారుల విచారణలో వెల్లడి
- స్థానిక నేతలకు షోకాజ్ నోటీసులు
- ఇప్పటి వరకు 12 కోట్ల జరిమానా
- బడా నాయకులు 400 కోట్లు సొమ్ము చేసుకున్నట్టు అంచనా
- ప్రభుత్వ, అటవీ భూముల్లో తవ్వకాలు
- సూత్రధారులను కాపాడే యత్నాలు
- కేంద్రానికి నివేదిక ఇవ్వకుండా జాప్యం
- రిపోర్టు మార్చేందుకు మరోసారి విచారణ?



మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రధాన అనుచరుడు మోపూరు శ్రీనివాసులురెడ్డికి మైనింగ్ శాఖ జారీ చేసిన షోకాజ్ నోటీసు

నెల్లూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తెల్లరాయి (క్వార్ట్జ) అక్రమ తవ్వకాల్లో వైసీపీ నాయకుల పాత్ర బయటపడింది. ఎన్నికల కోడ్ ముందు వరకూ తమ అధికారాన్ని అడ్డం పెట్టుకొని జరిపిన అవినీతి బాగోతం బట్టబయలైంది. నెల్లూరు జిల్లాలో తెల్లరాయి అక్రమ తవ్వకాలు నిజమేనని మైనింగ్ శాఖ అధికారులు నిగ్గు తేల్చారు. తవ్వకాలు జరిపిన ప్రాంతాల్లో ఇటీవల తనిఖీలు చేసి స్థానికంగా పంచనామా నిర్వహించారు. వైసీపీ నాయకులే ఈ తవ్వకాలు జరిపారని ఆ విచారణలో తేలడంతో వారికి మైనింగ్ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇప్పటి వరకు నెల్లూరు జిల్లాలో రూ.12 కోట్ల వరకు జరిమానాలు విధించారు. ఇప్పటి వరకూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు నిజమేనని ఈ విచారణతో తేటతెల్లమవుతోంది. వైసీపీ నేతలు రూ.400 కోట్ల విలువైన తెల్లరాయిని విదేశాలకు ఎగుమతి చేసి సొమ్ము చేసుకున్నారు. అక్రమాలు జరగడం లేదని ఇప్పటి వరకూ దబాయిస్తూ వచ్చిన ఎమ్మెల్యేలు, మంత్రులు ఇప్పుడు తమ అనుచరులకు నోటీసులు అందడంతో తేలుకుట్టిన దొంగల్లా నోరు మెదపడం లేదు. అసలు సూత్రధారులు ఎమ్మెల్యేలు, మంత్రులు కాగా.. పాత్రధారులుగా వారి అనుచరులు ఉన్నారు. బడా నేతలు తెల్లరాయిని అక్రమంగా తవ్వకునే గ్రామాల్లో స్థానిక వైసీపీ నాయకులను కాపలాగా పెట్టారు. తవ్వకాలు జరిపే ప్రాంతంలోకి ఇతరులు వెళ్లకుండా వారు అడ్డుకునేవారు. ఎవరైనా ప్రతిపక్ష పార్టీల నేతలు లేక అధికారులు ఆ ప్రాంతాలకు వస్తే ఆ సమాచారాన్ని ఎమ్మెల్యేలు లేక మంత్రులకు చేరవేసేవారు. వారు ఇంట్లో కూర్చొని కథ నడిపిస్తూ వచ్చారు. ఇప్పుడు రూ.వందల కోట్లు దోచుకున్న ఎమ్మెల్యేలు, మంత్రులు దర్జాగా తిరుగుతుంటే నోటీసులను మాత్రం కాపలా ఉన్న స్థానిక నాయకులకు అందాయి. ఈ విషయంపై వైసీపీ కేడర్‌లో కలకలం రేపుతోంది.

అంతా వైసీపీవారే...

పొదలకూరు మండలం మరుపూరులో అక్రమంగా తెల్లరాయి తవ్వకాలు జరిపినందుకు మంత్రి కాకాణి ప్రధాన అనుచరుడు మోపూరు శ్రీనివాసులురెడ్డికి రూ.36.41 లక్షల పెనాల్టీతో మైనింగ్ అధికారులు షోకాజు నోటీసు జారీ చేశారు. మొగళ్లూరులో తవ్వకాలు జరిపినందుకు కొత్తలూరు కోటేశ్వరరావు, త్రిప్పిరిశెట్టి రత్నంలకు రూ.25.39 లక్షలు, మొగళ్లూరులోనే మరో చోట అక్రమంగా తవ్వకాలు జరిపినందుకు యనమాల శ్రీనివాసులురెడ్డి, పేర్నాటి దినేష్ రెడ్డిలకు రూ.1.40 కోట్లు, గురవాయపాలెంలో తవ్వకాలు చేసినందుకు వర్దినేని కొండయ్యకు రూ.4.99 లక్షలు, కుంకు అన్నపూర్ణకు రూ.13.32 లక్షలు పెనాల్టీ విధిస్తూ షోకాజు నోటీసులు జారీ చేశారు. వీరంతా వైసీపీ నాయకులు, కాకాణి అనుచరులు. అలాగే సైదాపురం మండలంలో కూడా మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ అనుచరులకు షోకాజు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పొదలకూరు, సైదాపురం, గూడూరు రూరల్, రాపూరు మండలాల పరిధిలో పదుల సంఖ్యలో వైసీపీ నేతలకు మైనింగ్ శాఖ నుంచి షోకాజు నోటీసులు అందాయి. ఎవరూ ఈ నోటీసులకు స్పందించకపోవడంతో త్వరలో డిమాండ్ నోటీసులు ఇచ్చిన అనంతరం వారిపై రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రయోగించాలని యోచిస్తున్నట్లు తెలిసింది.

స్పందించని రెవెన్యూ

తెల్లరాయి అక్రమ తవ్వకాలన్నీ ప్రభుత్వ భూములు, అటవీ భూముల్లోనే జరిగాయి. మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా నిర్వహించిన పంచనామాలో కూడా ఆ భూములన్నీ ప్రభుత్వ అనాధీనం, అటవీ పోరంబోకు భూములుగా నిర్ధారించారు. అయినా రెవెన్యూ ఉన్నతాధికారులు మాత్రం కనీస చర్యలు తీసుకోవడం లేదు. అక్రమాలకు పాల్పడ్డ వైసీపీ నేతలపై క్రిమినల్ కేసులకు ఆదేశాలివ్వడం లేదు. క్రిమినల్ కేసులు నమోదు చేసి విచారణ చేపడితే ఈ అక్రమ తవ్వకాల వెనుక అసలు సూత్రధారులెవరన్నది స్పష్టమవుతుంది. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం లేదని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఓబులాపురం మైనింగ్ స్కామ్ తరహాలో నెల్లూరు జిల్లాలో ప్రభుత్వ భూముల్లో రూ.వందల కోట్ల తెల్లరాయిని తవ్వేసినా తమకేమీ పట్టదన్నట్లు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ అక్రమ సంపాదనతోనే వైసీపీ అభ్యర్థులు ప్రస్తుత ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేస్తున్నారన్న చర్చ జిల్లా వ్యాప్తంగా నడుస్తోంది.

కోడ్ వచ్చాక విచారణ

ఎన్నికల కోడ్ వచ్చాక తెల్లరాయి అక్రమ తవ్వకాలపై మైనింగ్ అధికారులు కదిలారు. అప్పటి వరకూ తవ్వకాలు జరిపిన ప్రదేశాల్లో కొలతలు తీసి ఎంత మేరకు తరలించారన్న లెక్కలు వేశారు. మైనింగ్ చట్టాల ప్రకారం తెల్లరాయి టన్నుకు రూ.90 సీన రైజ్ ఫీజు కాగా అనుమతులు లేకుండా తవ్వినందుకు పది రెట్లు పెనాల్టీ వేస్తూ టన్నుకు రూ.900 చొప్పున షోకాజు నోటీసులు ఇచ్చారు. అయితే ఇదే టన్ను తెల్లరాయి విలువ అంతర్జాతీయ మార్కెట్లో రూ.30 వేల వరకు ఉంది. నెల్లూరు జిల్లాలో రూ.12 కోట్ల వరకు జరిమానాలు విధించారు. ఈ లెక్కన రూ.400 కోట్ల విలువైన తెల్లరాయిని విదేశాలకు ఎగుమతి చేసి వైసీపీ నేతలు సొమ్ము చేసుకున్నారు. ఇంత భారీ స్థాయిలో దోపిడీ జరుగుతున్నా ఎన్నికల కోడ్ ముందు వరకూ ఒక్క అధికారి కూడా పట్టించుకోలేదు.

కేంద్రం ఆదేశాలతో కదలిక

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీలకు ఫిర్యాదు చేయడంతో అక్రమార్కులకు బ్రేక్ పడింది. నెల్లూరు, తిరుపతి జిల్లాల పరిధిలో అక్రమంగా జరిగిన తెల్లరాయి తవ్వకాలపై వెంటనే విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కేంద్ర నుంచి రాష్ట్ర అధికారులకు ఆదేశాలు అందాయి. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో మైనింగ్ అధికారులు విచారణ మొదలుపెట్టారు. అక్రమ తవ్వకాలు స్పష్టంగా కనిపిస్తుండడంతో... తప్పుడు నివేదికలు ఇవ్వాలంటూ పైస్థాయి నుంచి ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా జిల్లా స్థాయి అధికారులు సాహసించలేదు. ఉన్నది ఉన్నట్లుగా నివేదిక తయారు చేశారు. అయితే ఈ నివేదికను కేంద్రానికి పంపితే ఇబ్బందులు తప్పవని భావించిన రాష్ట్ర ఉన్నతాధికారులు ఇప్పుడు మరోసారి విచారణ అంటూ కొత్త డ్రామాకు తెరలేపారు. నెల్లూరు జిల్లా అధికారులు ఇచ్చిన నివేదికను పక్కన పెట్టి ఇతర జిల్లాల అధికారులతో ప్రత్యేక టీమ్‌ను నియమించినట్లు తెలిసింది.

నా వ్యాఖ్యలను వక్రీకరించారు

- నాపై బురద చల్లడానికే ఫిర్యాదు
- తదుపరి చర్యలు నిలిపేయండి
- సీఈవోకు కోమటి జయరామ్ విజ్ఞప్తి

అమరావతి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): 'నా వ్యాఖ్యలను వైసీపీ నేతలు వక్రీకరించి, ఫిర్యాదు చేశారు. వాస్తవాలను పరిశీలించండి. ఉద్దేశపూర్వకంగా నాపై బురద చల్లాలని చేసిన ఫిర్యాదుపై తదుపరి చర్యలు నిలుపుదల చేయండి' అని టీడీపీ ఎన్ఆర్ఐ సమన్వయకర్త కోమటి జయరామ్ కోరారు. వైసీపీ నేత ఏఎస్ఎన్‌మూర్తి ఈసీకి చేసిన ఫిర్యాదుపై ఇచ్చిన నోటీసుపై గురువారం ఆయన వివరణ ఇచ్చారు. 'మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన టీడీపీ ఎన్ఆర్ఐ సానుభూతిపరుల సమావేశం రహస్యంగా నిర్వహించిందని కాదు. సమావేశాన్ని యూట్యూబ్‌లో ప్రేక్షకుల కోసం ప్రసారం చేశాం. ఓటర్ల మద్దతు కూడగట్టేందుకు టీడీపీ భావజాలం, పార్టీ కార్యక్రమాలను ప్రచారం చేయాలని సమావేశంలో వక్తలు నిర్ణయించారు. నాలుగు దశాబ్దాల పాటు టీడీపీ పాలనలో అనేక కుటుంబాలకు జరిగిన మేలును ప్రచారం చేయడమే సమావేశం ప్రధాన లక్ష్యం. టీడీపీకి ఓటేస్తే రాబోయే తరాలకు మంచి జరుగుతుందని చెప్పాలని అనుకున్నాం. కానీ సమావేశంలో నేను చేసిన ప్రసంగాన్ని వక్రీకరిస్తూ నాపై ఫిర్యాదు చేశారు. నచ్చిన పార్టీకి ప్రచారం చేసుకోవడం ప్రాథమిక హక్కు. టీడీపీ ఎన్ఆర్ఐ సభ్యుడిగా నా సహచర ఎన్ఆర్ఐలను టీడీపీకి పనిచేయాలని అభ్యర్థించా. లంచాలు ఇచ్చి ప్రభావితం చేశానని చెప్పడం అవాస్తవం. ప్రభుత్వ సలహాదారులపై మేం తప్పుడు వ్యాఖ్యలు చేశామంటూ వైసీపీ నాయకులు మమ్మల్ని బెదిరిస్తున్నారు. టీడీపీ ఎన్ఆర్ఐ సభ్యులుగా మేం దేశ చట్టాలను గౌరవించి, పాటిస్తాం. నేను అనేక సంవత్సరాలుగా పార్టీ కోసం పనిచేస్తున్నా. నేను గత ఆరు సాధారణ ఎన్నికల్లో ప్రచారాల్లో సైతం పాల్గొన్నా. కానీ ఎన్నికల నియమ నిబంధనలను ఎన్నడూ ఉల్లంఘించలేదు' అని జయరామ్ వివరించారు.

హెల్త్ రికార్డులు డిజిటలైజ్ చేయాలి

- ఆరోగ్యశాఖ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్

అమరావతి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రుల్లో రోగుల ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డుల్ని డిజిటలైజ్ చేయడం వల్ల ఎంతో ఉపయోగమని ఆరోగ్యశాఖ కమిషనర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం ఇక్కడ ఆయుష్మాన్ భారత్ హెల్త్ మిషన్ నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన శిక్షణ పొందిన వైద్యులకు సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాశ్చాత్య దేశాలు డిజిటలైజేషన్ వైపు పరుగులు తీస్తున్న ప్రస్తుత తరుణంలో మనం కూడా ఆ దిశగా పయనించాల్సిన అవసరముందన్నారు. హెల్త్ రికార్డులు వంద శాతం ఆన్‌లైన్ విధానంలోకి వెళ్లాలన్నారు. రోగుల డిజిటల్ వివరాల్ని ఏకీకరణ చేయడం ద్వారా.. పరీక్షించే డాక్టర్లకు సులువుగా ఉంటుందని వివరించారు.

టీబీ రోగులకు అందుబాటులో మందులు..

రాష్ట్రంలో టీబీ రోగులకు సరిపడా మందులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయని టీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.రమేశ్ తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు టీబీ మందుల కొనుగోలుకు కూడా అనుమతి ఇచ్చినట్టు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాధారణ మొండి రోగాల మందుల కొనుగోలుకు రూ.49 లక్షలు మంజూరు చేసి, జిల్లాలకు అందించామన్నారు. సెంట్రల్ టీబీ డివిజన్ సరఫరాను పునరుద్ధరించే వరకూ టీబీ మందులను అందించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని వివరించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో స్టాక్స్ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామన్నారు.

2 వేల నోట్ల మార్పిడికి ఆర్బీఐ పచ్చజెండా

- రూ.3.20 కోట్ల విలువైన నోట్లను మార్చిన టీటీడీ

తిరుమల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా రద్దయిన రూ.2 వేల నోట్ల మార్పిడికి రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో శ్రీవారి ఖాతాలోకి రూ.3.20 కోట్లు చేరాయి. రూ.2 వేల నోట్ల మార్పిడి గడువు తీరాక కూడా కొందరు భక్తులు శ్రీవారి హుండీలో రూ.2 వేల నోట్లను కానుకగా వేస్తూనే వచ్చారు. దీంతో ఆ నోట్ల మార్పిడికి అనుమతి ఇవ్వాలంటూ టీటీడీ పలుమార్లు ఆర్బీఐకి విన్నవించింది. ఈ క్రమంలో ఆర్బీఐ అనుమతించడంతో 2023 అక్టోబరు 8 నుంచి ఈ ఏడాది మార్చి 22వ తేదీ వరకు హుండీ ద్వారా వచ్చిన రూ.3.20 కోట్ల విలువైన రూ.2 వేల నోట్లను టీటీడీ అధికారులు ఐదు విడతల్లో ఆర్బీఐకి జమజేశారు. ఆర్బీఐ నుంచి వచ్చిన సొమ్మును స్వామి ఖాతాలో చేరుస్తున్నారు. కేంద్రప్రభుత్వం 2016లో రద్దు చేసిన రూ.వెయ్యి, రూ.500 నోట్లు టీటీడీ వద్ద దాదాపు రూ.50 కోట్లు ఉన్న విషయం తెలిసిందే. వీటి మార్పిడి కోసం టీటీడీ పలుమార్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు, రిజర్వు బ్యాంకుకు లేఖలు రాసినా సానుకూల స్పందన లభించలేదు.

ఓపెన్ స్కూల్ ఫలితాలు విడుదల

- టెన్త్ 55.81 శాతం, ఇంటర్ 65.77 శాతం ఉత్తీర్ణత

అమరావతి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): దూరవిద్యా విధానంలో టెన్త్, ఇంటర్ చదివిన విద్యార్థుల 2024 పరీక్షల ఫలితాలను ఓపెన్ స్కూల్ సొసైటీ గురువారం విడుదల చేసింది. పదో తరగతిలో 55.81 శాతం, ఇంటర్మీడియట్‌లో 65.77 శాతం ఉత్తీర్ణత నమోదైనట్టు తెలిపింది. టెన్త్‌లో 32,581 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 18,185 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్‌లో 73,550 మందికిగాను 48,377 మంది పాసయ్యారు. పదో తరగతిలో తూర్పుగోదావరి జిల్లాలో 92.24 శాతం అత్యధిక ఉత్తీర్ణత నమోదు కాగా, ఏలూరు జిల్లాలో అత్యల్పంగా 6.9 శాతం మందే పాసయ్యారు. ఇంటర్‌లో తిరుపతి జిల్లా 93.3 శాతంతో మొదటి స్థానంలో ఉండగా, విశాఖపట్నం 22.88 శాతం చివరన నిలిచింది. జూన్ 1 నుంచి 8 వరకు టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని, ఈ లోగా రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పాఠశాల విద్యాశాఖ తెలిపింది.

నా కోసం ట్రాఫిక్‌ను ఆపొద్దు

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆదర్శం

విజయవాడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): "నేను కోర్టుకు వెళ్లేటప్పుడు.. వచ్చేటప్పుడూ ట్రాఫిక్‌ను ఆపుతున్నారు. ఇక నుంచి అలా చేయవద్దు" అని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ తరఫున హైకోర్టు రిజిస్ట్రార్ విజయవాడ పోలీస్ కమిషనరేట్‌కు సమాచారం అందించారు. గురువారం ఉదయం ఈ మేరకు సమాచారం వచ్చింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాకూర్ ఎంజీ రోడ్డులోని బంగ్లా నుంచి ప్రకాశం బ్యారేజ్, ఉండవల్లి కరకట్ట మీదుగా హైకోర్టుకు వెళ్తారని, మరలా బంగ్లాకు అదే మార్గంలో వస్తారని చెప్పారు. వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను నిలుపుదల చేస్తున్నారని, శుక్రవారం నుంచి అలా చేయవద్దని సూచించారు. సాధ్యమైనంత వరకు ట్రాఫిక్‌ను వదిలిపెట్టాలన్నారు. దీనిపై కమిషనర్ రామకృష్ణ ట్రాఫిక్ డీసీపీ కె.చక్రవర్తికి ఆదేశాలిచ్చారు.

సియాచిన్ సమీపంలో చైనా రోడ్డు నిర్మాణం

- పాక్ ఆక్రమిత కశ్మీర్ ప్రాంతంలో దుందుడుకు చర్యలు
- భారత భద్రతకు ముప్పు అంటున్న నిపుణులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: భారత సరిహద్దు ప్రాంతంలో చైనా దుందుడుకు చర్యలు కొనసాగిస్తూనే ఉంది. సియాచిన్ హిమనీనదానికి అత్యంత సమీపంలో ఉన్న పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో చైనా అక్రమంగా రహదారి నిర్మిస్తోంది. శాటిలైట్ చిత్రాల ద్వారా ఈ విషయం వెల్లడైంది. 1963లో పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో కొంత భాగం చైనా ఆధీనంలోకి వెళ్లింది. ఇక్కడే షాక్స్‌గామ్ లోయ ఉంది. ఈ లోయలో చైనా తన హైవే జీ219ను విస్తరిస్తోంది. ఈ ప్రాంతం సియాచిన్‌లోని ఇందిరా కోల్‌కు ఉత్తరాన 50 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ ప్రాంతాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గత మార్చి నుంచి రెండు సార్లు సందర్శించారు. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ తీసిన ఈ చిత్రాలను ఇండియా టుడేకు చెందిన ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్ (ఓఎస్ఇంట్) సమీక్షించి.. ఈ రహదారిని గతేడాది జూన్ నుంచి ఆగస్టు మధ్య నిర్మించినట్టు వెల్లడించింది. సియాచిన్‌కు ఉత్తరాన పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేసే క్రమంలో భాగంగా చైనా ఈ కొత్త రహదారిని నిర్మించినట్టు భావిస్తున్నారు. చైనా నిర్మిస్తున్న ఈ రహదారి పూర్తిగా చట్ట విరుద్ధమని భారత ఆర్మీ మాజీ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ రాకేశ్ శర్మ అన్నారు. ఈ అంశాన్ని భారత్ దౌత్యపరంగా వ్యతిరేకించాలని సూచించారు.

ఈ ప్రాంతం భారత్‌కు చాలా కీలకం

ఈ రహదారి ట్రాన్స్-కారకోరం ట్రాక్ట్‌లో ఉంది. ఇది కశ్మీర్‌లో భాగం. ఆర్టికల్ 370 రద్దు తర్వాత భారత ప్రభుత్వం విడుదల చేసిన కొత్త మ్యాప్‌లో ఈ ప్రాంతాన్ని కూడా భారత సరిహద్దులో చూపించారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని అన్ని ప్రాంతాలనూ వెనక్కు తీసుకుంటామని పార్లమెంటులో భారత్ పదేపదే పునరుద్ఘాటిస్తోంది. చైనా ఇక్కడ మరిన్ని ప్రాజెక్టులు నిర్మిస్తే తమ భద్రతకు ముప్పు వాటిల్లుతుందని భారత్ భావిస్తోంది.

బెంగళూరులో రైలు ఢీకొని ముగ్గురి మృతి

- మృతులు ఆంధ్రవాసులు



లోకేశ్, శశికుమార్, సుబ్రహ్మణ్యం (ఫైల్)

బెంగళూరు/రామసముద్రం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): యశ్వంతపుర నుంచి కణ్ణూరుకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు ఢీ కొనడంతో ముగ్గురు యువకులు మృతి చెందారు. బెంగళూరు నగరంలోని బయ్యప్పనహళ్లి రైల్వే స్టేషన్ పరిధిలోని మారతహళ్లి సమీపాన ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ట్రాక్ దాటే సమయంలో గురువారం మధ్యాహ్నం వీరిని రైలు ఢీ కొట్టి ఉంటుందని భావిస్తున్నారు. రైల్వే పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతులు శశికుమార్, లోకేశ్, సుబ్రహ్మణ్యంగా గుర్తించారు. జీవనోపాధికి వెళ్లి.. ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం కనగాని గ్రామానికి చెందిన శశికుమార్ (25), గజ్జగానిపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యం (24), పేద్రాజుపల్లెకు చెందిన లోకేశ్ (25) డిగ్రీ పూర్తి చేసుకుని నాలుగు నెలల క్రితం ఉద్యోగం కోసం బెంగళూరు వెళ్లారు. వీరు ముగ్గురు ఉద్యోగాన్వేషణలో ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో గురువారం ముగ్గురూ బెంగళూరులోని కేఆర్‌పురం రైల్వేస్టేషన్ సమీపంలో మృతి చెందినట్లు కుటుంబసభ్యులకు కర్ణాటక పోలీసులు సమాచారం అందించారు. ఇది విన్న కుటుంబీకులు దిగ్భ్రాంతికి గురయ్యారు.

నవ్య | చిత్రజ్యోతి

ముంబైలో కుబేర యాక్షన్



ధనుష్, నాగార్జున కథానాయకులుగా రూపొందుతున్న మల్టీస్టారర్ 'కుబేర'. దర్శకుడు శేఖర్ కమ్ముల తన పంథాకు భిన్నంగా పూర్తి వాణిజ్య హంగులతో రూపొందిస్తున్నారు. ఇటీవలే చిత్రబృందం బ్యాంకాక్ షెడ్యూల్ పూర్తి చేయగా, గురువారం నుంచి ముంబైలో తాజా షెడ్యూల్ ప్రారంభమైంది. 12 రోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో నగరంలోని పలు ప్రదేశాల్లో చిత్రీకరణ జరుగుతుంది. ధనుష్, రష్మికతో పాటు కీలకపాత్రధారులు పాల్గొనే ఈ షెడ్యూల్‌లో కొంత టాకీ పార్ట్‌తో పాటు యాక్షన్ ఎపిసోడ్స్ తెరకెక్కించనున్నట్లు యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్‌మోహన్‌రావు నిర్మాతలు. రష్మిక మందన్న కథానాయిక. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: నికిత్ బొమ్మి

సత్యభామ ప్రేమగీతం



కాజల్ అగర్వాల్ లీడ్‌రోల్‌లో నటిస్తున్న చిత్రం 'సత్యభామ'. ఈ క్రైమ్ థ్రిల్లర్‌లో ఆమె శక్తిమంతమైన పోలీస్ అధికారిణిగా కనిపించనున్నారు. నవీన్‌చంద్ర కీలకపాత్ర పోషిస్తున్నారు. దర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పణలో బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మిస్తున్నారు. సుమన్ చిక్కాల దర్శకుడు. మే 17న 'సత్యభామ' చిత్రం విడుదలవుతోంది. గురువారం ఈ చిత్రం నుంచి 'కళ్లారా చూశాలే నువ్వేనా' అంటూ సాగే తొలి పాటను యూనిట్ విడుదల చేసింది. కాలేజీ ప్రేమ నేపథ్యంలో సాగే ఈ గీతానికి రాంబాబు గోసాల సాహిత్యం అందించగా శ్రీచరణ్ పాకాల స్వరాలందించారు. శ్రేయా ఘోషల్ ఆలపించారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: బి విష్ణు.

అందరికీ కనెక్ట్ అయ్యే కథ



సినిమాలు నిర్మించాలనే దీర్ఘకాలిక ప్రణాళికతో చిత్రపరిశ్రమలోకి వచ్చాను. మంచి కథ కోసం వెదుకుతున్నప్పుడు దర్శకుడు మల్లి ఈ కథ చెప్పారు. పెళ్లి చుట్టూ తిరిగే ఈ కథలో కామెడీ, ఎంటర్‌టైన్‌మెంట్, ఎమోషన్స్.. అన్నీ ఉన్నాయి. అందుకే ఆ కథతో 'ఆ ఒక్కటీ అడక్కు' చిత్రం తీశాను' అన్నారు నిర్మాత రాజీవ్ చిలక. అల్లరి నరేశ్, ఫరియా అబ్దుల్లా జంటగా నటించిన ఈ చిత్రం మే 3న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో రాజీవ్ మీడియాతో చిత్ర విశేషాలు పంచుకున్నారు.

- ఈ కథ వినగానే నరేశ్‌గారినే హీరోగా అనుకున్నాం. మొదట మైండ్‌లోకి రాజేంద్రప్రసాద్‌గారు వచ్చినా యంగ్‌గా ఉంటే ఆయన పర్ఫెక్ట్. ఇప్పుడు నరేశ్‌కు యాప్ట్. మేం ఆయనకి కథ చెప్పినప్పుడు చాలా బిజీగా ఉన్నారు. ఆయన కోసం వెయిట్ చేశాం.
- పెళ్లి కావడం లేదని చాలా మంది మానసికంగా కుంగిపోతున్నారు. ఈ రోజుల్లో సెటిల్ అవడం కంటే పెళ్లి కావడం పెద్ద టాస్క్‌గా మారింది. అందుకే అందరికీ కనెక్ట్ అవుతుందని ఈ కథను ఎన్నుకుని వినోదాత్మకంగా చెప్పాం.
- సినిమా కోసం కొన్ని టైటిల్స్ అనుకున్నాం కానీ సరిగ్గా సెట్ కాలేదు. అప్పుడు నరేశ్‌గారే ఈ టైటిల్ సూచించారు. హీరోని అందరూ పెళ్లి ఎప్పుడని అడుగుతుంటారు. విసిగిపోయిన హీరో 'ఆ ఒక్కటీ అడక్కు' అంటుంటాడు. దర్శకుడు ఇవీవీ సత్యనారాయణగారి క్లాసిక్ సినిమా టైటిల్ ఇది. సినిమా చూసి హ్యాపీగా ఫీల్ అయిన నరేశ్‌గారు ఈ టైటిల్ వాడుకోండి అని చెప్పారు.
- మా బేనరులో మంచి సినిమాలు తీయాలని ఉంది. ఫాంటసీ, హిస్టారికల్, కామెడీ జోనర్స్.. అన్ని రకాలు తీయాలని ఉంది. ఇక యానిమేషన్ విషయానికి వస్తే 'ఛోటా భీమ్'ని పిల్లలతో చేయబోతున్నాం. అలాగే డిస్నీలో ఒక యానిమేషన్ షో లాంచ్ కాబోతోంది.

పద్నాలుగేళ్ల తర్వాత మళ్లీ..



బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్, దర్శకుడు ప్రియదర్శన్ మళ్లీ చేతులు కలిపారు. "హేరాఫేరి', 'భూల్ భులయ్య' చిత్రాల తర్వాత మళ్లీ వీరిద్దరి కాంబినేషన్‌లో ఓ సినిమా రూపుదిద్దుకోనుంది. పద్నాలుగేళ్ల తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న చిత్రం ఇది కావడం విశేషం. హారర్ కామెడీ కథాంశంతో రూపుదిద్దుకొనే ఈ చిత్రాన్ని ఏక్తా కపూర్ నిర్మించనున్నారు. 'అక్షయ్‌తో సినిమా చేయడం ఎప్పుడూ హ్యాపీనే. ఇదొక సైకలాజికల్ థ్రిల్లర్. అతీంద్రియ శక్తుల నేపథ్యంలో చిన్న ఫ్యాంటసీతో సినిమా ఉంటుంది' అని చెప్పారు ప్రియదర్శన్.

రిలేషన్స్‌పై నమ్మకం లేదు



'సీతా రామం', 'హాయ్ నాన్న', 'ఫ్యామిలీ స్టార్' వంటి చిత్రాలతో తెలుగులో పాపులర్ అయ్యారు మృణాల్ ఠాకూర్. ఇటీవల మీడియాతో ముచ్చటించిన ఆమె పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

"వర్క్ లైఫ్ ఒత్తిడి, ఆందోళనలు వ్యక్తిగత జీవితంపై పడకుండా బ్యాలెన్స్ చేసుకోవడం చాలా ముఖ్యం. కెరీర్ ప్రారంభ దశలో బాడీ షేమింగ్ ఎదుర్కొన్నాను. నా బాడీ స్ట్రక్చర్ హీరోయిన్‌కు సెట్ కాదని, స్క్రీన్ మీద గ్లామరస్‌గా కనిపించనని విమర్శించేవారు. కానీ వాటన్నింటినీ సవాలుగా తీసుకున్నా. ఇండస్ట్రీలోని బ్యూటీ స్టాండర్డ్స్‌ను మార్చాలని నిశ్చయించుకున్నా. ప్రస్తుత కాలపు రిలేషన్స్‌పై నమ్మకం లేదు. ఒకరితో జీవితం సజావుగా సాగాలంటే మనల్ని, మన ప్రొఫెషనల్ లైఫ్‌ను పూర్తిగా అర్థం చేసుకునే భాగస్వామిని పొందడం అవసరం. ఇక, పిల్లలను కనే విషయమై ఎగ్ ఫ్రీజింగ్ (అండాలను నిల్వ చేయడం) ఆలోచన ఉంది" అని చెప్పారు.



● బి.సుగుణమ్మ.. కొండప్రాంతంలో నివాసం ఉంటుంది. ఒక నెలలో 166 యూనిట్ల విద్యుత్‌ను వినియోగించింది. ఈ యూనిట్లకు వచ్చిన మొత్తం బిల్లు రూ.995. ఉపయోగించిన యూనిట్ల వరకు అయితే, మొత్తం రూ.663 బిల్లు రావాలి. అలాకాకుండా, ట్రూ అప్ చార్జీలుగా విధించిన మొత్తం రూ.124.96, ఫిక్స్‌డ్, కస్టమర్ చార్జీలుగా మరో రూ.124.96 కలిపి అదనంగా రూ.331.68 బిల్లులో చూపించారు. ఓ మధ్యతరగతి వినియోగదారురాలికి తగిలిన విద్యుత్ షాక్ ఇది.


● బంగారయ్య మూడేళ్ల క్రితం తన ఇంటిని మురళీకృష్ణకు విక్రయించాడు. రిజిస్ట్రేషన్ అయ్యాక ఆ ఇంటికి ఉన్న విద్యుత్ సర్వీసును బంగారయ్య విద్యుత్ శాఖకు అప్పగించేశాడు. తర్వాత మురళీకృష్ణ కొత్త సర్వీసులను తీసుకున్నాడు. బంగారయ్య వినియోగించుకున్న విద్యుత్‌కు సంబంధించిన ట్రూ అప్ చార్జీలు చెల్లించాలని లైన్‌మన్ కొద్దిరోజుల క్రితం మురళీకృష్ణ ఇంటికి వెళ్లాడు. బంగారయ్య నుంచి తాను ఇంటిని కొన్నానని, సర్వీసులన్నీ తన పేరు మీద ఉన్నాయని మురళీకృష్ణ చెప్పాడు. బంగారయ్య రూ.1,500 బకాయి చెల్లించాలని, అది వెంటనే చెల్లించాలని, లేకపోతే సర్వీసును తొలగిస్తామని హెచ్చరించారు. దీంతో మురళీకృష్ణ షాక్ అయ్యాడు.

● కూలి పని చేసే ఓ వ్యక్తి మొత్తం 50 యూనిట్ల విద్యుత్‌ను వినియోగించాడు. ఈ మొత్తానికి శ్లాబ్ ప్రకారం ఆయన చెల్లించాల్సిన బిల్లు రూ.117. కానీ, రూ.280 బిల్లు చెల్లించాడు. ఇందులో రూ.109.85 కేవలం ట్రూ అప్ చార్జీలే.

ఇలా.. అధికారంలోకి వచ్చింది మొదలు సీఎం జగన్ విద్యుత్ వినియోగదారులకు షాక్‌ల మీద షాక్‌లు ఇస్తూనే ఉన్నాడు. అసలు చార్జీల కంటే కొసరు చార్జీలను ఎక్కువగా చూపిస్తూ ఈ ఐదేళ్ల కాలంలో జగనన్న ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి దోచుకుంది అక్షరాలా రూ.782 కోట్లు.

ఐదేళ్లుగా షాకులు





ఉమ్మడి కృష్ణాజిల్లాపై విద్యుత్ ట్రూ అప్ భారం

* రూ.782 కోట్లు అదనంగా వసూలు చేసిన జగనన్న
* బిల్లులు చూసి లబోదిబోమంటున్న వినియోగదారులు
* వాడకంతో సమానంగా ట్రూ అప్ భారం

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఒక్క ఛాన్స్.. అని అధికారంలోకి వచ్చిన జగన్ విద్యుత్ వినియోగదారులకు షాక్‌ల మీద షాక్‌లు ఇస్తూనే ఉన్నాడు. 2019లో అధికారం చేపట్టిన ఆయన 2022 నుంచి విద్యుత్ రంగంలో ట్రూ అప్‌ను తెరపైకి తెచ్చాడు. ప్రజలు ఎప్పుడో వినియోగించుకున్న విద్యుత్‌కు 2022 నుంచి ట్రూ అప్ చార్జీలను వసూలు చేయడం మొదలుపెట్టాడు. అన్ని కేటగిరీల వినియోగదారులపై ఈ భారాలు మోపాడు. వినియోగించుకున్న విద్యుత్‌కు అయిన బిల్లు కంటే.. దానికి విధిస్తున్న చార్జీలు దరిదాపుగా ఉంటున్నాయి. దీంతో వినియోగదారులు అల్లాడిపోతున్నారు.

జిల్లాపై భారం రూ.782 కోట్లు

ఉమ్మడి కృష్ణాలో ట్రూ అప్ చార్జీల రూపంలో వినియోగదారుల నుంచి విద్యుత్ శాఖ మొత్తం రూ.782 కోట్లు వసూలు చేసింది. 2022, ఆగస్టు నుంచి వసూలు చేసిన ట్రూ అప్ చార్జీలు రూ.196 కోట్లు ఉండగా, 2023 ఏప్రిల్ నుంచి ఎఫ్‌పీపీసీఏ-1 (ఫ్యూయల్ పర్చేజ్ చార్జీ ఎరియర్స్) కింద రూ.471 కోట్లు, ఎఫ్‌పీపీసీఏ-2 కింద రూ.115 కోట్లు వసూలు చేసింది. 2014-15 నుంచి 2018-19 కాలంలో పంపిణీ సంస్థలకు నష్టాలు వచ్చాయని ఈ ట్రూ అప్ చార్జీలను తెరపైకి తెచ్చారు. ప్రతి యూనిట్‌కు 22 పైసలు చొప్పున లెక్కించి బిల్లులో వడ్డిస్తున్నారు. 2022, ఆగస్టు నుంచి మొత్తం 36 నెలల పాటు ఈ చార్జీలు వసూలు చేయాలని నిర్ణయించారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన నష్టాలను పూడ్చుకోవడానికి విద్యుత్ సంస్థలు ఎఫ్‌పీపీసీఏ పేరుతో భారం వేయడం మొదలుపెట్టాయి. 2021-22లో ఏ నెలలో వాడిన యూనిట్లను 2023-24లో అదే నెల బిల్లులో సర్దుబాటు చేస్తున్నారు. యూనిట్‌కు 20 పైసల నుంచి 66 పైసల వరకు వినియోగదారులకు వడ్డించారు. మొదటి మూడు నెలల్లో యూనిట్‌కు 20 పైసలు, రెండో త్రైమాసికంలో యూనిట్‌కు 63 పైసలు, మూడో త్రైమాసికంలో 63 పైసలు, చివరి త్రైమాసికంలో యూనిట్‌పై 66 పైసల చొప్పున లెక్కించి ట్రూ అప్ విధిస్తున్నారు.

ఇదో కొత్తకోణం

2014-15 నుంచి 2018-19 మధ్యకాలంలో వినియోగించుకున్న విద్యుత్‌కు ట్రూ అప్ చార్జీలు వసూలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది. ప్రస్తుతం ఉన్న విద్యుత్ వినియోగదారుల నుంచే కాకుండా ఆ సమయంలో ఇళ్లను విక్రయించుకుని వెళ్లిపోయిన వారినీ వదిలిపెట్టలేదు. వివిధ అవసరాల నిమిత్తం కొంతమంది తమ ఇళ్లను విక్రయించుకుంటారు. మరికొంతమంది స్థలాలను అమ్ముకుంటారు. ఇది నిత్యం జరిగే ప్రక్రియ. సాధారణంగా నిర్మించిన ఇంటిని విక్రయించినప్పుడు ఇల్లు కొనుగోలుదారుల పేరు మీద రిజిస్టర్ అవుతుంది. అప్పటికే ఆ ఇంటికి విద్యుత్ కనెక్షన్ ఉంటే తమ పేరు మీద ఉన్న దస్తావేజులను చూపించి సర్వీసు పేరును కొనుగోలుదారులు మార్చుకుంటారు. కొంతమంది అప్పటికే ఉన్న సర్వీసును విద్యుత్ శాఖకు అప్పగించేస్తారు. రిజిస్ట్రేషన్ అయ్యాక మరమ్మతులు చేయించుకుని కొత్త విద్యుత్ కనెక్షన్లు తీసుకుంటారు. ఇంటి యజమానులు మారినా ఇక్కడ ఇంటి నెంబర్ మాత్రం ఒకటే ఉంటుంది. 2014-2019 మధ్య ఇళ్లను విక్రయించుకుని వెళ్లిపోయిన వారు వాడిన విద్యుత్‌కు ట్రూ అప్ చార్జీలను చెల్లించాలని ప్రస్తుతం ఉంటున్న వారిపై విద్యుత్ శాఖ సిబ్బంది ఒత్తిడి తెస్తున్నారు. తాము ముందున్న సర్వీసును ఇచ్చేసి, కొత్తగా తీసుకున్నామని చెబుతున్నా వినడం లేదు. యజమానులు మారినా ఇంటి నెంబరు అప్పుడు, ఇప్పుడు ఒకటే కదా అని చెబుతున్నారు. ఆ బకాయిని చెల్లించకపోతే ఉన్న సర్వీసును తొలగించడం గానీ, ఈ సర్వీసుకు వచ్చే బిల్లులో ఆ మొత్తాన్ని కలపడం గానీ చేస్తామని స్పష్టం చేస్తున్నారు. ఆదాయం కోసం జగన్ ప్రభుత్వం అన్ని అడ్డదారులు తొక్కుతోందని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

జనం లేక విలవిల..!





గుడివాడలో కొడాలి నాని ర్యాలీలో అంతంతమాత్రంగా ఉన్న జనం (ఇన్‌సెట్‌లో) గన్నవరంలో వంశీ ర్యాలీ వెళ్తుండగా ఖాళీగా కనిపిస్తున్న రోడ్డు

- అసహనంతో ఎడ్లబండి తోలే వ్యక్తిపై చేయిచేసుకున్న నాని
- జనం కనిపించకపోవడంతో ర్యాలీ మధ్యలోనే జంప్
- ర్యాలీకి రండంటూ అనుచరుడు శశి రోడ్డుపై వేడుకోలు
- గన్నవరంలోనూ దాదాపు ఇదే పరిస్థితి
- జనం కనిపించకపోవడంతో మండిపోయిన వంశీ
- పెనమలూరు నుంచి జనాన్ని తెచ్చే యత్నం.. విఫలం..
- రెండుచోట్లా స్పష్టంగా కనిపించిన నాయకత్వలేమి

గుడివాడ, గన్నవరంలో కొడాలి నాని, వల్లభనేని వంశీ నామినేషన్‌కు జనం కరువు

గడ్డం గ్యాంగ్‌కు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. గురువారం నాటి నామినేషన్ కార్యక్రమం బొక్కబోర్లా కొట్టింది. ఏదో జరుగుతుంది అనుకుంటే, మరేదో జరగడంతో అటు గుడివాడ వైసీపీ అభ్యర్థి కొడాలి నాని, ఇటు గన్నవరం వైసీపీ అభ్యర్థి వల్లభనేని వంశీ తీవ్ర అసహనంతో రగిలిపోయారు. జనాలు పల్చగా కనిపించడంతో ఏం తోచని స్థితిలో గుడివాడలో కొడాలి నాని ఎడ్లబండి దిగి కారులో వెళ్లిపోగా, గన్నవరంలో వల్లభనేని వంశీ అయితే ఎండలో అసహనంతో ఊగిపోయారు. రెండుచోట్లా నాయకత్వలేమి స్పష్టంగా కనిపించిందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. - గుడివాడ, గన్నవరం

గుడివాడలో గలాటా..

మాజీమంత్రి, ఎమ్మెల్యే కొడాలి నానికి రోజురోజుకూ అసహనం పెరుగుతోంది. ఓటమి భయం పట్టడంతో ఏం చేస్తున్నారో అర్థంకాని పరిస్థితికి చేరారు. గతంలో నాని తన కారు డ్రైవర్‌పై బూతులతో విరుచుకుపడగా, గురువారం నాటి నామినేషన్ ర్యాలీలో ఎడ్లబండి తోలే వ్యక్తి తలపై కొట్టారు. తొలుత వేలమందితో నామినేషన్ వేయాలని కొడాలి నాని అనుకున్నారు. పార్టీ నాయకులను పిలిచి జనాన్ని సమీకరించాలని ఆదేశించారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని ఇంటి నుంచి గురువారం ప్రారంభమైన ఆయన ర్యాలీ ఇరుకు రోడ్ల మీదుగా ఏలూరు రోడ్డు ఎక్కే వరకూ సాఫీగానే సాగింది. ర్యాలీలో నానీతో పాటు వైసీపీ మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, పెడన వైసీపీ అభ్యర్థి ఉప్పాల రాము పాల్గొన్నారు. అక్కడి నుంచి కార్యకర్తలు, అభిమానులు ఆశించినంత స్థాయిలో కనిపించలేదు. దీంతో నాని, ఆయన ముఖ్య అనుచరుడు శశిలకు అసహనం పెరిగింది. ఈ క్రమంలో ఎడ్లబండి నడుపుతున్న వ్యక్తిపై నాని ఆగ్రహం చూపించారు. అటు కాదు.. ఇటు వెళ్లాలి.. అంటూ తలపై ఒక్కటి కొట్టారు. ఇదిచూసిన నాయకులు, కార్యకర్తలు హతాశులయ్యారు. నాని ముఖ్య అనుచరుడు ర్యాలీ వెంట నడుస్తూ రహదారి వెంబడి కనిపించిన ప్రతి వ్యక్తినీ ర్యాలీలో రావాలని వేడుకోవడం కనిపించింది. స్థానిక నెహ్రూచౌక్ సెంటర్‌కు ర్యాలీ వచ్చేసరికి జనం మరీ పలచగా కనిపించారు. దీంతో నాని అసహనానికి గురై ఎడ్లబండి దిగి కారులో ఆర్డీవో కార్యాలయానికి వెళ్లిపోయారు. అక్కడే ఉన్న శశి నాయకులపై చిందులు తొక్కి చేతిలో సెల్‌ఫోన్‌ను నేలకేసి కొట్టినట్టు స్థానికులు చెబుతున్నారు. అనుకున్న స్థాయిలో జనాలు లేకపోవడంతో వైసీపీ నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాని అలిగి వెళ్లిపోవడంతో స్థానిక నెహ్రూచౌక్ సెంటర్‌లో అభిమానులు రోడ్డుపైనే పూల బస్తాలు వదిలేశారు.

పోలీసుల అత్యుత్సాహం

కొడాలి నాని ర్యాలీకి అనుమతి ఇచ్చిన రూట్‌మ్యాప్‌ను పోలీసులు ఒక్కసారిగా మార్చేశారు. దీంతో స్థానిక రాజేంద్రనగర్‌లోని నాని స్వగృహం సమీపంలో స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. వన్‌టౌన్ సీఐ కె.ఇంద్ర శ్రీనివాసరావు మార్చిన రూట్‌మ్యాప్ ప్రకారం అటుగా అనుమతి లేదని స్పష్టం చేశారు. వైసీపీ నాయకులు పాలడుగు రాంప్రసాద్, వల్లూరుపల్లి సుధాకర్‌లు సీఐతో వాగ్వాదానికి దిగారు. సీఐ ససేమిరా అనడంతో ర్యాలీ పోలీసులు అనుమతిచ్చిన రూట్‌లోనే సాగింది.

గన్నవరంలో గడబిడ


గన్నవరం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ నామినేషన్ సందర్భంగా డబ్బు, మద్యం, బిర్యానీ ప్యాకెట్లు పెద్ద ఎత్తున పంపిణీ చేశారు. ఇంతచేసినా ఆయన నామినేషన్‌లో జనాల సందడి కరువైంది. గ్రామ, మండల స్థాయిలో వైసీపీని వెంటాడుతున్న నాయకత్వ సమస్య నామినేషన్ సందర్భంగా బయటపడింది. గ్రామాల్లో వైసీపీ నాయకులు ఒక్కొక్కరికి రూ.300 నుంచి రూ.500 వరకూ ఇచ్చారు. క్వార్టర్ బాటిల్, బిర్యానీ ప్యాకెట్ ఇచ్చి బైకులపై వచ్చిన వారికి పెట్రోల్ కొట్టించారు. ఇంతచేసినా జనాలు పెద్దగా లేకపోవడంతో వంశీలో కాస్త అసహనం కనిపించింది. నామినేషన్ వేశాక ఆయన మాట్లాడిన మాటల్లో ఇది స్పష్టమైంది. గురువారం మధ్యాహ్నం నామినేషన్ కార్యక్రమం జరిగింది. ఎండ మండుతుండటంతో బలవంతంగా తీసుకొచ్చిన ప్రజలు ఎండ బారిన పడి అల్లాడిపోయారు. ర్యాలీలో ఎక్కువ మంది పెనమలూరు నియోజకవర్గ జనాలే కనిపించారు. గన్నవరం నియోజకవర్గంలో మండల, గ్రామస్థాయి నాయకులు టీడీపీలోకి వలస పోవడంతో వైసీపీని నాయకత్వలేమి వెంటాడుతోంది. గురువారం నాటి నామినేషన్ కార్యక్రమంలో అది స్పష్టమైంది. డబ్బు ఇచ్చినా జనాలను తరలించేందుకు నాయకులు కొరవడటంతో జనసమీకరణలో వంశీ విఫలమయ్యారని సొంతపార్టీ శ్రేణులే వ్యాఖ్యానిస్తున్నాయి. నామినేషన్ వేసేందుకు వల్లభనేని వంశీ ర్యాలీగా రావటంతో ట్రాఫిక్ జామ్ అయింది. ర్యాలీకి వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు మరో వాహనాన్ని ఓవర్ టేక్ చేయబోయి కిందపడిపోయారు. తీవ్ర గాయాలయ్యాయి.

ఓటమి భయమా..?

తన చివరి ఎన్నికలంటూ కొడాలి నాని ఇప్పటికే సానుభూతి అస్త్రం

అదే బాటలో వల్లభనేని వంశీ కూడా..

- వచ్చే ఎన్నికల్లో దుట్టా కుమార్తె పోటీ అంటూ మరో వ్యాఖ్య
- మాటలతో దుట్టా ఫ్యామిలీని మంచి చేసుకునే ప్రయత్నం
- నామినేషన్ అనంతరం కల్లబొల్లి కబుర్లు
- నాడు పదవి రాకుండా అడ్డుపడి.. నేడు ఓట్ల కోసం డ్రామాలు



కొడాలి నాని, వల్లభనేని వంశీ

'వచ్చే ఎన్నికల్లో దుట్టా రామచంద్రరావు కూతురు సీతామహాలక్ష్మి వైసీపీ తరఫున పోటీలో ఉంటారు. ఆమెకు మేము సపోర్టు చేస్తాం. రాజకీయాల్లో ఉన్నా లేకున్నా, గతంలో ఏ రకంగా అయితే విజయవాడ పార్లమెంటుకు పోటీచేసి ఓడిపోయినా మా అమ్మ పేరుతో చారిటబుల్ ట్రస్టు పెట్టి గన్నవరంలో ఏ విధంగానైతే సేవలు చేశామో అవన్నీ కొనసాగుతాయి.'

..గురువారం గన్నవరంలో నామినేషన్ వేసిన అనంతరం వల్లభనేని వంశీ చేసిన వ్యాఖ్యలివి. ఒకప్పుడు దుట్టా రామచంద్రరావును నానా దుర్భాషలాడిన వంశీకి అకస్మాత్తుగా ఆయన కుమార్తె గురించి ఎందుకంత పాజిటివ్‌గా మాట్లాడారు? ఎన్నికలు దగ్గరపడుతున్న ఈ సమయంలో ఒక్కసారిగా దుట్టా ఫ్యామిలీపై ప్రేమ ఎందుకు పొంగుకొచ్చింది..? అనే గుసగుసలు గన్నవరం నియోజకవర్గంలో వినిపిస్తున్నాయి.

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : ఆది నుంచీ దుట్టా రామచంద్రరావు కుటుంబం ఎదుగుదలను ఎమ్మెల్యే వల్లభనేని వంశీ సహించలేకపోయారు. గన్నవరం నియోజకవర్గంలో ప్రభావవంతమైన నాయకుడిగా ఉన్న దుట్టా రామచంద్రరావుకు వైఎస్ కుటుంబంతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఒకప్పుడు కాంగ్రెస్‌లో, ఆ తర్వాత వైసీపీలో ఆయన క్రియాశీలకంగా వ్యవహరించారు. 2014 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీచేసిన దుట్టా.. టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన వంశీ చేతిలో 10వేలలోపు ఓట్లతో ఓడిపోయారు. 2019లో వైసీపీ అధిష్ఠానం యార్లగడ్డ వెంకట్రావుకు టికెట్ కేటాయించినా - మిగతా 2లో

కొత్త సీపీ బాధ్యతల స్వీకరణ



విజయవాడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్‌కు కొత్త కమిషనర్‌గా పీహెచ్‌డీ రామకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శనం చేసుకున్న ఆయన.. ఆ తర్వాత కార్యాలయానికి వచ్చారు. ఆయనకు డీసీపీలు, ఏసీపీలు స్వాగతం పలికారు. డీసీపీ కంచి శ్రీనివాసరావు ఆయనకు బాధ్యతలు అప్పగించారు. అనంతరం డీసీపీలతో సమావేశం నిర్వహించారు. నగరంలో, రూరల్ పరిధిలో ఉన్న పరిస్థితులను తెలుసుకున్నారు. ఎక్కడెక్కడ అల్లర్లు జరిగే ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాలు ఉన్నాయో తెలుసుకున్నారు. డీసీపీలు అధిరాజ్‌సింగ్ రాణా, టి.హరికృష్ణ, ట్రాఫిక్ డీసీపీ కె.చక్రవర్తి, స్పెషల్ బ్రాంచ్ ఏడీసీపీ కనకరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కమిషనరేట్ పరిధిలోని ఇన్‌స్పెక్టర్లు కొత్త సీపీని మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్త కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణ.. ఆ తర్వాత డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డిని కలిశారు.

చివరి రోజూ వెల్లువలా..

రెండు జిల్లాల్లో భారీగా నామినేషన్లు

- మచిలీపట్నం పార్లమెంట్ స్థానానికి 37
- 'కృష్ణా'లో ఏడు అసెంబ్లీ స్థానాలకు 200
- విజయవాడ పార్లమెంట్ స్థానానికి 42
- 'ఎన్టీఆర్'లో ఏడు అసెంబ్లీ స్థానాలకు 270
- చివరి రోజూ భారీగా దాఖలు
- నేడు నామినేషన్ల స్క్రూటినీ

2లో..



జగ్గయ్యపేటలో టీడీపీ అభ్యర్థి శ్రీరాం తాతయ్య నామినేషన్ ర్యాలీ

మందే మందు..!



- కొడాలి నాని నామినేషన్ ర్యాలీలో ఫుల్లుగా..
- ర్యాగింగ్ చేసిన యువకుడికి దేహశుద్ధి
- రహదారులపై నాని అనుచరుల ఫీట్లు

గుడివాడ, ఏప్రిల్ 25 : గుడివాడ వైసీపీ అభ్యర్థి కొడాలి నాని నామినేషన్ ర్యాలీలో గురువారం మందుబాబులు వీరంగం సృష్టించారు. ర్యాలీలో పాల్గొన్న ఇద్దరు యువకులు.. ఒక అమ్మాయిని ర్యాగింగ్ చేశారు. దీంతో సదరు యువతి కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. ఇద్దరు యువకుల్లో ఒకరు పారిపోగా, దొరికిన యువకుడికి దేహశుద్ధి చేశారు. నామినేషన్‌కు వచ్చిన వారికి మంచినీరు అందించలేదు గానీ, మద్యం మాత్రం ఫుల్లుగా దొరికింది. దీంతో మందుబాబులు మద్యం దుకాణాల వద్ద ప్రత్యక్షమయ్యారు. ఫుల్లుగా మద్యం సేవించి రహదారులపై సర్కస్ ఫీట్లు చేశారు. వాహనదారులతో పాటు పాదచారులు బెంబేలెత్తిపోయారు.



వెంటనే వెళ్లిపో.. క్రిమినల్ కేసు పెట్టిస్తా..



- గుడివాడలో స్వతంత్ర అభ్యర్థి కొడాలి వెంకటేశ్వరరావుకు ఆర్వో బెదిరింపు
- చివరికి నామినేషన్ వేసేందుకు అనుమతి
- దళిత దివ్యాంగుడిపై దాష్టీకమా : కొడాలి వెంకటేశ్వరరావు

4లో..



దుర్గమ్మను దర్శించుకున్న నూతన సీపీ పీహెచ్‌డీ రామకృష్ణ దంపతులు

దుర్గమ్మ సేవలో నూతన సీపీ రామకృష్ణ

వన్‌టౌన్, ఏప్రిల్ 25 : ఎన్టీఆర్ జిల్లా నూతన పోలీస్ కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ దంపతులు గురువారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకున్నారు. ఈసీ ఆదేశాల మేరకు సీపీ కాంతి రాణాను బదిలీ చేసిన క్రమంలో రామకృష్ణను కొత్తగా నియమించారు. బాధ్యతలు స్వీకరించే ముందు ఆయన ఇంద్రకీలాద్రిపై సతీసమేతంగా దుర్గమ్మను దర్శించుకున్నారు. ఈవో కేఎస్ రామారావు వారికి సాదర స్వాగతం పలికారు. దుర్గమ్మ దర్శనానంతరం చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదం అందజేశారు. వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు.

అన్నవితరణకు రూ.3.60లక్షల విరాళం

దుర్గగుడిలో అన్నవితరణ కార్యక్రమానికి చెన్నైలోని టి.నగర్‌కు చెందిన పి.బాలకృష్ణ కుటుంబసభ్యులతో కలిసి గురువారం ఆలయానికి విచ్చేసి రూ.3.60 లక్షల చెక్కును దేవస్థానం అధికారులకు అందజేశారు.

అట్టహాసంగా శ్రీరాం తాతయ్య నామినేషన్

జగ్గయ్యపేట, ఏప్రిల్ 25 : జగ్గయ్యపేటలో జనసేన, బీజేపీ బలపరచిన టీడీపీ అభ్యర్థిగా శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీకి కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. సుమారు రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ఉదయం 10 గంటలకు వేయాల్సిన నామినేషన్ మధ్యాహ్నం ఒంటిగంటకు వేశారు. తొలుత శ్రీరాం తాతయ్య స్వయంభూ విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో నామినేషన్ పత్రాలు ఉంచి పూజలు చేశారు. సర్వమత ప్రార్థనలు చేసి అందరి ఆశీస్సులు తీసుకుని ర్యాలీగా ఎన్టీఆర్ సర్కిల్‌కు చేరుకున్నారు. ఆయన వెంట విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, విజయవాడ పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్, ఆచంట సునీత, ముల్లంగి రామకృష్ణారెడ్డి, నియోజకవర్గ కార్యకర్తలు ఉన్నారు. పట్టణం పసుపు మయం కాగా.. ఎండను సైతం లెక్కచేయక కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. ర్యాలీలో శ్రీరాం సుబ్బారావు, బీజేపీ నేతలు ఎ.శ్రీకాంత్, కేసర రాంబాబు, జనసేన నేతలు బాడిశ మురళీకృష్ణ, ఈమని కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ప్రశ్నిస్తే దాడి చేయిస్తారా..

▸▸ కొడాలి నానిపై వెనిగండ్ల ఫైర్



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న వెనిగండ్ల రాము

గుడ్లవల్లేరు, ఏప్రిల్ 25 : ప్రజా సమస్యలు పట్టని నేతలు.. ఐదేళ్ల తర్వాత ఓట్ల కోసం వస్తే ప్రశ్నించినందుకు అనుచరులతో దాడి చేయిస్తారా.. మీకు దిగిపోయే టైం వచ్చింది.. దాడులకు పాల్పడితే చూస్తూ ఊరుకోం.. అంటూ గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవేంకటేశ్వరరావు(నాని)పై టీడీపీ కూటమి అభ్యర్థి వెనిగండ్ల రాము ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం రాత్రి కూరాడ గ్రామంలో కొడాలి నాని అనుచరుల దాడిలో గాయపడిన శాయిన శ్రీకాంత్, వీరంకి బాలకృష్ణ, రాజులపాటి కన్నాలను గురువారం వారి ఇంటికి వెళ్లి రాము పరామర్శించారు. రానున్నది టీడీపీ ప్రభుత్వమేనని, నిందితులు ఎక్కడున్నా శిక్ష పడేలా కృషి చేస్తానని రాము హామీ ఇచ్చారు. ఓటమి భయంతోనే నాని పిచ్చిపనులు చేయిస్తున్నాడన్నారు. కార్యక్రమంలో వల్లభనేని వెంకట్రావు, మాదాసు ప్రసాద్, బాసా శ్రీరామచంద్రరావు, జనసేన నాయకులు పేర్ని జగన్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధం..

జగన్ పాలనపై ప్రజల్లో పెద్ద ఎత్తున వ్యతిరేకత వస్తోందని, జగన్ గణాన్ని ఇంటికి పంపేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారని వెనిగండ్ల రాము అన్నారు. గురువారం గుడ్లవల్లేరులో 'బాబుష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ' కార్యక్రమంలో ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి, రావి వెంకటేశ్వరరావు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దావులూరి సురేంద్రబాబు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని వీడిన మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్

▸▸ నాని వ్యవహార శైలి నచ్చక టీడీపీలో చేరిక



రాజీనామా పత్రాన్ని చూపుతున్న రవికాంత్

గుడివాడ, ఏప్రిల్ 25 : గుడివాడలో అధికార వైసీపీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. నాని వ్యవహార శైలి నచ్చక నాయకులు ఇప్పటికే పార్టీ ఫిరాయిస్తుండగా, మరో కీలక నేత పార్టీని వీడుతున్నట్టు ప్రకటించారు. తొలినుంచి ఎమ్మెల్యే కొడాలి నాని వెన్నంటి ఉన్నానని, నాని రోత రాజకీయాలకు మానసికంగా విసిగిపోయానని మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్, వైసీపీ నేత చోరగుడి రవికాంత్ అన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, నాని అంటే ఎంతో అభిమానమని, వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటినుంచి తనను మానసికంగా హింసించారని, అక్రమ కేసులు బనాయించి జైలు పాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితుడిని కాబట్టే తన పట్ల చిన్నచూపు చూసారని, రాజకీయ అనుభవం ఉన్నా ఎదగకుండా అడ్డుపడ్డారని అన్నారు. దీంతో విసిగిపోయి వైసీపీని వీడుతున్నానని, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని రవికాంత్ ప్రకటించారు.

వెల్లటూరు వైసీపీకి బీటలు..

▸▸ సర్పంచ్ దంపతులు సహా పలువురు టీడీపీలో చేరిక



టీడీపీ కండువాలు కప్పి సర్పంచ్ దంపతులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న వసంత

జి.కొండూరు, ఏప్రిల్ 25 : వైసీపీ కంచుకోటగా ఉన్న వెల్లటూరు గ్రామం బలహీన పడుతోంది. వైసీపీ పాలనలో గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి కుంటుబడింది. పారిశుధ్య పనులు చేసేందుకు కూడా నిధుల్లేకపోవడంతో వరుసగా రెండోసారి సర్పంచ్‌గా ఎన్నికైన వేల్పూరి సుజానమ్మ, ఆమె భర్త వేల్పూరి మరియన్నలు, గ్రామానికి చెందిన ఇతర వైసీపీ నాయకులు చింతపల్లి రవి, జంగం ఏసుపాదం, దొప్పల సురేష్, తంబితో పాటు మరో 20 మంది వైసీపీని వీడి టీడీపీ తీర్థం తీసుకున్నారు. వారికి మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. దీంతో దశాబ్దాలుగా వైసీపీ కంచుకోటగా ఉన్న వెల్లటూరులో ఈసారి టీడీపీకి మెజార్టీ వస్తుందనే నమ్మకం టీడీపీ క్యాడర్‌లో బలంగా నెలకొంది. గ్రామాభివృద్ధి కోసం టీడీపీలో చేరినట్టు సర్పంచ్ దంపతులు పేర్కొన్నారు.



జానకిరామాపురంలో వైసీపీ నుంచి టీడీపీలోకి భారీ చేరికలు

జానకిరామాపురంలో..

బంటుమిల్లి : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పిల్లల భవిష్యత్తు బాగుంటుందని వైసీపీ నుంచి టీడీపీలోకి చేరుతున్నామని జానకిరామాపురం గ్రామస్థులు అన్నారు. గురువారం నాగేశ్వరరావుపేట జానకిరామాపురానికి చెందిన వైసీపీ ఆర్బీకే ఛైర్మన్ కటకం రాజేష్, ఆరేపల్లి లక్షణ రావు, పెద్ది నాగేశ్వరరావు, ముత్యాల అజయ్, యర్రంశెట్టి బాబురావు, టేకు వెంకన్న, కళ్యాణం శ్రీనివాసరావు, బాల, రాజులపాటి శేఖర్, రాజా, లంకపల్లి కాశీ, ఆరేపల్లి నాగరాజు, గంగిశెట్టి రాంబాబు, ఈడేపల్లి సుబ్రమణ్యం తదితరులు టీడీపీలోకి చేరారు. బాలశౌరి, కాగిత కృష్ణప్రసాద్‌లను గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో కూనపరెడ్డి వీరబాబు, యిల్లూరి లీలాకృష్ణ, బడుగు వెంకటేశ్వరరావు, కాగిత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చివరిరోజు వెల్లువలా..

నామినేషన్ వేస్తున్న శ్రీరాం తాతయ్య →





▸▸ ఏడు రోజుల్లో 312 నామినేషన్లు

▸▸ విజయవాడ పార్లమెంట్‌కు 42, అసెంబ్లీ నియోజకవర్గాలకు 270

▸▸ చివరి రోజు రికార్డు స్థాయిలో.. పార్లమెంట్ 21, అసెంబ్లీ పరిధిలో 115 నామినేషన్లు

▸▸ నేడు నామినేషన్ల స్క్రూటినీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : చివరి రోజున పతాక స్థాయిలో అభ్యర్థుల నామినేషన్లు ట్రిబుల్ సెంచరీ దాటింది. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా గురువారం నాటికి రికార్డుస్థాయిలో మొత్తం 312 నామినేషన్లు దాఖలయ్యాయి. విజయవాడ పార్లమెంట్‌కు 42 నామినేషన్లు దాఖలయ్యాయి. ఎన్టీఆర్ జిల్లా తూర్పు, పశ్చిమ, సెంట్రల్‌లతో పాటు మైలవరం, తిరువూరు, నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాలలో 270 నామినేషన్లు దాఖలయ్యాయి. చివరి రోజు గురువారం రికార్డు స్థాయిలో మొత్తం 136నామినేషన్లు దాఖలయ్యాయి. పార్లమెంట్ పరిధిలో 21 నామినేషన్లు, అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 115 నామినేషన్లు దాఖలయ్యాయి.

● విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలో జై మహాభారత్ పార్టీ అభ్యర్థిగా చింతలచెరువు హేమలత, స్వతంత్ర పార్టీ, జై భీమ్ పార్టీ అభ్యర్థిగా దాట్ల లూర్ధు మేరీ, స్వతంత్ర అభ్యర్థిగా ఎస్.చరణ్ సుజిత్, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా పేరం శివనాగేశ్వరరావు, స్వతంత్ర అభ్యర్థులు వై.సాంబశివారెడ్డి, వై.మహేష్, షేక్ మగలాన్, రాణి లక్ష్మీనారాయణ శర్మ, దేవరకొండ రామకృష్ణ, చెవిటి అర్జున్, తమ్మి రామారావు, అబ్బూరి వెంకటశివనాగమల్లేశ్వరరావు, నంబూరి చరణ్ సుజిత్, కాంగ్రెస్ అభ్యర్థిగా ఇర్ఫాన్ మహ్మద్, వల్లూరు భార్గవ్, టీడీపీ అభ్యర్థిగా కేశినేని శివనాథ్, లిబరేషన్ కాంగ్రెస్ అభ్యర్థిగా వి.రవిచంద్రా రెడ్డి, జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా కోకా వినయ్ కుమార్, జనరాజ్యం పార్టీ అభ్యర్థిగా డి.కుమార్, బీఎస్పీ అభ్యర్థిగా మేకా వెంకటేశ్వరరావులు నామినేషన్లు దాఖలు చేశారు.

● పశ్చిమ నియోజకవర్గం పరిధిలో చివరి రోజు మొత్తం 22 నామినేషన్లు, సెంట్రల్‌లో 11, విజయవాడ తూర్పులో 13, మైలవరంలో 13, జగ్గయ్యపేటలో 11, తిరువూరురులో 10, నందిగామలో 14 నామినేషన్లు వేశారు.

ఒకే పేరుతో అటు, ఇటుగా..

గన్నవరం నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థిగా వల్లభనేని వంశీ మోహన్ నామినేషన్ వేయగా, దాదాపు అదే పేరుతో ఉన్న మరో వ్యక్తి వల్లభనేని మోహన్ శ్రీకృష్ణ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. తిరువూరు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థిగా కొలికపూడి శ్రీనివాస్ నామినేషన్ వేశారు. ఆపేరుకు దగ్గరగా కొలికపోగు శ్రీను పేరుతో ఉన్న వ్యక్తి జాతీయ జనసేన పార్టీ తరఫున నామినేషన్ వేశారు. అవనిగడ్డ నియోజకవర్గంలో జనసేన అభ్యర్థిగా మండలి బుద్ధ ప్రసాద్ నామినేషన్ వేశారు. నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరఫున అదే పేరుతో ఉన్న బోయిన బుద్ధ ప్రసాద్ నామినేషన్ దాఖలు చేశారు. గుడివాడ నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థిగా కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) నామినేషన్ వేశారు. అదే పేరుతో ఉన్న కొడాలి వెంకటేశ్వరరావు అనే వ్యక్తి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ఈయన ప్రతి ఎన్నికల్లోనూ నామినేషన్ వేస్తుంటారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో టీడీపీ తరఫున శ్రీరాం రాజగోపాల్ నామినేషన్ వేయగా.. జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా శ్రీరామ్ రామకృష్ణ నామినేషన్ వేశారు. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో గద్దె రామమోహన్ నామినేషన్ వేయగా.. స్వతంత్ర అభ్యర్థులుగా యలమంచిలి రామమోహనరావు, గట్టి రామమోహనరావుల పేరుతో నామినేషన్లు పడ్డాయి. నందిగామ నియోజకవర్గంలో టీడీపీ తరఫున తంగిరాల సౌమ్య నామినేషన్ వేయగా స్వతంత్ర అభ్యర్థి పేరుతో తంగిరాల సౌమ్య అనే మహిళ నామినేషన్ దాఖలు చేశారు.

నేడు నామినేషన్ల స్క్రూటినీ

నామినేషన్ల ఘట్టం గురువారంతో ముగియటంతో శుక్రవారం నామినేషన్ల స్క్రూటినీ ప్రక్రియను చేపట్టనున్నారు. నామినేషన్ల స్క్రూటినీ అనేది సాయంత్రం 6 గంటలకు ముగుస్తుంది. ఎవరివి తిరస్కరించటం జరిగిందో, ఎవరివి ఆమోదించారో తెలుస్తుంది. శుక్రవారం ఇచ్చే జాబితా తుది నామినేషన్ల జాబితా అవుతుంది. ఇందులో ఎవరైనా ఉపసంహరించుకోవాలంటే 29 వ తేదీ వరకు గడువు ఉంది. 29 తర్వాత పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా వస్తుంది.

కృష్ణాజిల్లాలో..

▸▸ పార్లమెంటు స్థానానికి 37, ఏడు అసెంబ్లీ స్థానాలకు 200

మచిలీపట్నం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం పార్ల మెంటు స్థానానికి గురువారం 19నామినేషన్లు దాఖలయ్యాయి. ఏడు అసెంబ్లీ స్థానాలకు గురువారం 76నామినేషన్లు దాఖలయ్యాయి. ఈనెల 18వతేదీనుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా నామినేషన్ల స్వీకరణకు గడువు ముగిసే నాటికి మచిలీపట్నం పార్లమెంటు స్థానానికి 37 నామినేషన్లు దాఖలయ్యాయి. ఏడు అసెంబ్లీ స్థానాలకు 200 నామినేషన్లు దాఖలయ్యాయి. శుక్రవారం నామినేషన్ల పరిశీలన కార్యక్రమం ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. .

నామినేషన్ల స్వీకరణకు చివరి రోజైన గురువారం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో 66నామినేషన్లు దాఖలయ్యాయి. గుడివాడ నియోజకవర్గంలో ఆఖరిరోజు 23నామినేషన్లు దాఖలు కావడం విశేషం. అవనిగడ్డలో జనసేనపార్టీ అభ్యర్థి మండలి బుద్ధ ప్రసాద్ నామినేషన్‌ను దాఖలు చేయగా, స్వతంత్ర అభ్యర్థిగా బోయిన బుద్ధ ప్రసాద్ నామినేషన్‌దాఖలు చేశారు. పెడన నియోజకవర్గంలోనూ టీడీపీ అభ్యర్థిగా కాగిత కృష్ణప్రసాద్ నామినేషన్‌ను దాఖలుచేయగా ఆయన పేరుతోనే ఉన్న కాగిత శ్రీహరికృష్ణ ప్రసాద్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్‌ను దాఖలు చేశారు.

● అవనిగడ్డ నియోజకవర్గంలో నవరంగ్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా బోయిన బుద్ధ ప్రసాద్, జనసేనపార్టీ అభ్యర్థిగా మండలి వెంకట్రామ్, స్వతంత్ర అభ్యర్థులుగా మత్తి పుష్పకుమార్, నీలా మనోహర్‌బాబు, జాతీయజనసేన పార్టీ అభ్యర్థిగా వెంట్రప్రగడ అనంద్‌కుమార్, వైసీపీ అభ్యర్థిగా సింహాద్రి రమేష్‌బాబు, నవరంగ్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా తాడంకి చంటి నామినేషన్‌లను దాఖలు చేశారు.

● పామర్రు నియోజకవర్గం వైసీపీ అభ్యర్థిగా కైలే అనిల్‌కుమార్, జైభీమ్ భారత్‌పార్టీ అభ్యర్థిగా నాయుడు శిరీషారాణి, టీడీపీ అభ్యరిగా వర్ల రామయ్య వర్ల కుమార్‌రాజా, కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా దోవారి యేసుదాస్ నామినేషన్‌లను దాఖలు చేశారు.

● పెడన నియోజకవర్గం టీడీపీ అభ్యర్థులుగా కాగిత కృష్ణప్రసాద్, కాగిత శిరీష, వైసీపీ అభ్యర్థులుగా ఉప్పాల రమేష్(రాము) ,ఉప్పాల హారిక, యుగతులసి పార్టీ అభ్యర్థిగా కాట్రగడ్డ విష్ణుమూర్తి, స్వతంత్ర అభ్యర్థిగా కాగిత శ్రీహరికృష్ణ ప్రసాద్ నామినేషన్‌లను దాఖలు చేశారు.

● గన్నవరం నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థులుగా గూడపాటి సుధీర్‌కుమార్, పొట్లూరి శ్రీదేవి, మాదాసు వరలక్ష్మీ, ఆల్‌ఇండియా పార్వర్డ్‌బ్లాక్ అభ్యర్థిగా దొండపాటి ఆనందప్రసాద్, వైసీపీ అభ్యర్థిగా వల్లభనేని వంశీమోహన్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా పొట్లూరి రవీంద్రబాబు, టీడీపీ అభ్యర్థులుగా యార్లగడ్డ వెంకట్రావ్, యార్లగడ్డ జ్ఞానేశ్వరి, జై మహాబారత్ పార్టీ అభ్యర్థిగా గూడూరు వెంకట రవికుమార్ నామినేషన్‌లను దాఖలు చేశారు.

● మచిలీపట్నం నియోజవర్గం వైసీపీ అభ్యర్థిగా పేర్ని వెంకట్రామయ్య(నాని), టీడీపీ అభ్యర్థులుగా కొల్లు రవీంద్ర, కొల్లు నీలిమ, స్వతంత్ర అభ్యర్థులుగా అంగర చాముండేశ్వరి, చింతపల్లి మనోహర్, అమ్మిరెడ్డి శ్రావణి, ఈడే భాస్కరరావు, కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా అబ్దుల్ మతీన్, భారతచైతన్య యువజనపార్టీ అభ్యర్థిగా కోన నాగార్జున నామినేషన్‌లను దాఖలు చేశారు.

● పెడనమలూరు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా బోడె ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎలిశల సుబ్రహ్మణ్యం, భారత్ చైతన్య యువజన పార్టీ అభ్యర్థిగా గుర్రాల హరిత, జైభారత్ నేషనల్‌పార్టీ అభ్యర్థిగా లంకా కరుణాకరదాస్, స్వతంత్ర అభ్యర్థిగా దొండపాటి సతీష్, జాతీయజనసేనపార్టీ అభ్యర్థిగా గుండారు సీతారామయ్య నామినేషన్‌లను దాఖలు చేశారు.

● గుడివాడ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థులుగా వెనిగండ్ల రాము, వెనిగండ్ల రామకృష్ణ, వైసీపీ అభ్యర్థులుగా కొడాలి శ్రీవెంకటేశ్వరరావు, (నాని), కొడాలి నాగేశ్వరరావు (చిన్ని), స్వతంత్ర అభ్యర్థులుగా మెండా శుభకరరావు, దుక్కిపాటి రాధాకృష్ణమూర్తి, ఏల్చూరి వేణుగోపాలరావు, తాళ్లూరి పెద్ద నాగేశ్వరరావు, షేక్ కరీముల్లా, కుమ్మరి భావన్ నారాయణ, వడ్డాది నాగరాజు, హసన్ అహ్మద్ అబ్దుల్, కొడాలి వెంకటేశ్వరరావు, నవరంగ్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా పంది నాగార్జున, తెలుగు రాజాధికార సమితిపార్టీ అభ్యర్థిగా అవుల ప్రవీణ్‌కుమార్, జై భారత్ నేషనల్‌పార్టీ అభ్యర్థిగా ఆలూరి హేమంత్‌కుమార్, కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా శిష్టా దత్తాత్రేయులు, జై మహాభారత్‌పార్టీ అభ్యర్థిగా మిట్టపల్లి వెంకట వంశీనరేష్ నామినేషన్‌లను దాఖలు చేశారు.

వేసవి ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్, ఏప్రిల్ 25 : వేసవిలో ప్రయాణికుల రద్దీని నివారించడానికి దక్షిణ మధ్య రైల్వే 26 వేసవి ప్రత్యేక అన్‌రిజర్వ్‌డ్ రైళ్లను సికింద్రాబాద్-సత్రగంజ్ మధ్య నడిపేందుకు నిర్ణయించింది. ఈ నెల 28 నుంచి ఈ రైళ్లు అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు రైళ్ల షెడ్యూల్‌ను రూపొందించారు. స్పెషల్ రైళ్లు 18 జనరల్ కోచ్‌లు కలిగి ఉంటుంది. అన్‌రిజర్వ్‌డ్ ఎక్స్‌ప్రెస్ రేట్లను వసూలు చేస్తారు. అన్ని రైల్వేస్టేషన్‌లలో టికెట్ కౌంటర్‌లు అందుబాటులో ఉంటాయని యూటీఎస్ మొబైల్ యాప్ ఆన్‌లైన్‌లో కూడా టికెట్లు బుక్ చేసుకోవచ్చని తెలిపారు.

07234/07235 సికింద్రాబాద్-సత్రగంజ్-సికింద్రాబాద్ 10 ప్రత్యేక రైళ్ల సర్వీసు నడవనున్నాయి. సికింద్రాబాద్-సత్రగంజ్ మధ్య ఆదివారాలలో రైలు నడుస్తుంది. ఈ నెల 28 నుంచి జూన్ 30వ తేదీ వరకు, సత్రగంజ్-సికింద్రాబాద్ మధ్య ప్రతి మంగళవారం రైలు నడుస్తుంది. ఈ నెల 30 నుంచి జూలై 2వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. అటు ఇటు మొత్తం పది సర్వీసుల చొప్పున నడవనున్నాయి. 07234 రైలు సికింద్రాబాద్‌లో 11.40 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరుతుంది. నల్గొం డ, మిర్యాలగూడ, నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, విజయనగరం, శ్రీకాకుళం రోడ్డు, పలాస, బెర్హంపూర్, ఖుర్దా రోడ్డు, భువనేశ్వర్, కటక్, బద్రక్, బాలసోర్, ఖర్గపూర్‌ల మీదుగా సత్రగంజ్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 07235 నెంబరుతో మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి అదే మార్గంలో ఈ రైలు నడుస్తుంది.

ఓటమి భయమా..?

(మొదటి పేజీ తరువాయి)

దుట్టా ఆయనకు మద్దతుగా నిలిచారు. ఎప్పుడైతే వంశీ టీడీపీ నుంచి వైసీపీలోకి వచ్చారో అప్పటి నుంచి దుట్టా అంటీముట్టనట్టుగా ఉంటున్నారు. ఈ పరిస్థితుల్లో దుట్టా వర్గం మద్దతు కోసం వంశీ ఎత్తులు వేయడం ప్రారంభించారు. ఇటీవల నియోజకవర్గంలో బస్సు యాత్ర చేసిన సమయంలో జగన్ వద్దకు దుట్టా రామచంద్రరావును పిలిపించిన వంశీ తనకు మద్దతుగా పనిచేయాలని చెప్పించగా, ఆయన ఎలాంటి హామీ ఇవ్వకుండా వెనుదిరిగారని సమాచారం. దీంతో ఎలాగైనా దుట్టా మద్దతు కూడగట్టేందుకు తొలుత ఆయన అల్లుడు శివభరత్‌రెడ్డితో తనకు అనుకూలంగా మాట్లాడించిన వంశీ.. తాజాగా దుట్టా కుమార్తె మద్దతు కూడగట్టేందుకు వచ్చే ఎన్నికల్లో ఆమె పోటీ చేస్తుందని ప్రకటించి మైండ్‌గేమ్‌కు తెరదీశారు. ఈ కారణంగానైనా దుట్టా మద్దతు లభిస్తుందన్న ఆలోచనలో వంశీ ఉన్నట్లు తెలుస్తోంది.

నాడు పదవి రాకుండా చేసి..

వైసీపీ అధికారంలోకి వచ్చాక 2021లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో దుట్టా సీతామహాలక్ష్మి ఉంగుటూరు నుంచి జెడ్పీటీసీగా ఎన్నికయ్యారు. జెడ్పీ ఛైర్మన్ పీఠం జనరల్ మహిళకు రిజర్వ్ కావడంతో కాపు సామాజికవర్గానికి చెందిన సీతామహాలక్ష్మికి జెడ్పీ పీఠం ఖాయం అన్న ప్రచారం జరిగింది. అయితే, చివరి నిమిషంలో కొడాలి నాని, వల్లభనేని వంశీ చక్రం తిప్పి గుడివాడ నియోజకవర్గం పరిధిలో ఉన్న గుడ్లవల్లేరు జెడ్పీటీసీగా గెలుపొందిన బీసీ సామాజికవర్గానికి చెందిన ఉప్పాల హారికకు ఛైర్‌పర్సన్ పీఠం దక్కేలా చేశారు. దుట్టా కుటుంబానికి జెడ్పీ పీఠం దక్కితే గన్నవరం నియోజకవర్గంలో తనకు పోటీ అధికార కేంద్రం ఏర్పడుతుందన్న ఉద్దేశంతో వంశీ పావులు కదపడం వల్లే దక్కాల్సిన పదవి దక్కకుండా పోయిందని అప్పట్లో దుట్టా వర్గం ఆగ్రహం వ్యక్తం చేసింది. తాజాగా ఓటమి భయం వెంటాడుతుండటంతో వంశీ అదే కుటుంబానికి పదవి ఆశచూపి పబ్బం గడుపుకొనేందుకు ప్రయత్నిస్తున్నారని దుట్టా వర్గీయులు విమర్శిస్తున్నారు.

ఇవే చివరి ఎన్నికలంటూ సెంటిమెంట్ డ్రామా

వంశీ గురువారం చేసిన వ్యాఖ్యల్లో వచ్చే ఎన్నికల్లో తాను పోటీ చేయబోనన్న సంకేతాలు ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో సీతామహాలక్ష్మి వైసీపీ తరఫున పోటీ చేస్తారని, తాను ఆమెకు మద్దతు ఇస్తానని చెప్పారు. 'ఇవే నా చివరి ఎన్నికలు.. నన్ను గెలిపించాలి..' అని పరోక్షంగా ప్రజలకు విజ్ఞప్తి చేసి సెంటిమెంట్‌తో ఓట్లు దండుకునేందుకు ప్రయత్నాలు చేశారు. మరోవైపు ఆయన మాటల్లో ఓటమి భయం స్పష్టంగా కనిపించింది. గతంలో విజయవాడ పార్లమెంట్ నుంచి పోటీ చేసి ఓడిపోయినా గన్నవరం నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు కొనసాగించానని, ఈసారి కూడా సేవలు కొనసాగుతాయని అన్న మాటలు అందుకు సంకేతాలు ఇచ్చేలా ఉన్నాయని వైసీపీ నాయకులే చెబుతున్నారు. వంశీ సన్నిహితుడు, గుడివాడ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి కొడాలి నాని కూడా ఇవే తన చివరి ఎన్నికల సెంటిమెంట్‌ను ఇప్పటికే గుడివాడలో ప్రయోగించారు. వచ్చే ఎన్నికల్లో తాను పోటీ చేయబోనని, తన సోదరుడి కొడుక్కి ఆసక్తి ఉంటే రాజకీయాల్లోకి వచ్చి పోటీ చేస్తాడని నాని ఓ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు. చివరి ఎన్నికలు కాబట్టి ఈ ఒక్కసారి తనకు ఓటు వేయాలంటూ ఓటర్లను సెంటిమెంట్‌తో ఆకట్టుకునేందుకే నాని ఈ డ్రామా ఆడుతున్నారని విమర్శలు వెల్లువెత్తాయి. మొత్తం మీద బూతు బ్రదర్స్‌గా పేరొందిన నాని, వంశీలు ఇద్దరూ ఒకే సెంటిమెంట్ అస్త్రాన్ని నమ్ముకుని ఎన్నికల్లో విజయం సాధించాలని ప్రయత్నించడం గమనార్హం.

కాంగ్రెస్ నేత అదృశ్యం కేసులో ముందడుగు

▸▸ కారును గుర్తించిన పేట పోలీసులు



జగ్గయ్యపేట, ఏప్రిల్ 25 : తెలంగాణా రాష్ట్రం సూర్యాపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్డే ఎల్లయ్య అదృశ్యం కేసులో జగ్గయ్యపేట పోలీసులు ముందడుగు వేశారు. గురువారం జాతీయ రహదారిపై పెనుగంచిప్రోలు మండల పరిధిలో ఒక కర్మాగారం గోడ పక్కన నిలిపిన కారును గుర్తించారు. ఎల్లయ్య ఈ నెల 18న ఒక కేసులో మధ్యవర్తిత్వానికి అపర్ణ అనే మహిళతో టీఎస్.29 బి 9495 నెంబరు కారులో జగ్గయ్యపేట రావటం, డబ్బులిస్తానని శ్రీనివాస్ అనేవ్యక్తి కారులో తీసుకెళ్లటం, ఆ తర్వాత అపర్ణ కూడా అదృశ్యం కావటం, ఎల్లయ్యతో వచ్చిన స్నేహితుడు అంజయ్య కుటుంబ సభ్యులకు తెలియజేయటంతో వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. సూర్యాపేట, జగ్గయ్యపేట పోలీసులు నిందితుల కోసం తొమ్మిది ప్రత్యేక బృందాలు గాలిస్తున్న విషయం తెలిసిందే. కాగా గురువారం కర్మాగారం సమీపంలో కారు ఉన్నట్టు పోలీసులకు సమాచారం రావటంతో వెళ్లి స్వాధీనం చేసుకున్నారు. వారం క్రితం అదృశ్యం కాగా కారు ఇప్పుడు వెలుగులోకి రావటం, తాజాగా కారు ఇప్పుడే ఉంచారా? లేదా అప్పటి నుంచి హైవేపై ఉంటే ఎందుకు పోలీసులు గమనించ లేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. త్వరలోనే కేసు మిస్టరిని ఛేదిస్తామని జగ్గయ్యపేట పోలీసులు చెబుతున్నారు. కారు సూర్యాపేటకు చెందిన కలప వ్యాపారిదిగా చెబుతున్నారు.

పోలీసు కస్టడీకి గులకరాయి కేసు నిందితుడు

విజయవాడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : సీఎం జగన్‌పై జరిగిన గులకరాయి దాడి కేసులో ప్రధాన నిందితుడు వేముల సతీష్‌కుమార్‌ను పోలీసులు గురువారం కస్టడీకి తీసుకున్నారు. విజయవాడలోని జిల్లా జైలు నుంచి అజిత్‌సింగ్ నగర్ పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. జైలు వద్దకు తల్లిదండ్రులు, న్యాయవాది అబ్దుస్ సలీం హాజరయ్యారు. అనంతరం అక్కడి ఇనుంచి అజిత్‌సింగ్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడ సాయంత్రం ఐదు గంటల వరకు విచారించారు. గురువారం నుంచి శనివారం వరకు సతీష్‌కుమార్‌ను విచారిస్తారు.

ఏసీబీకి చిక్కిన జూ.అసిస్టెంట్

▸▸ జీతం బిల్లుకు రూ.10వేలు డిమాండ్



మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 25 : రూ. 10 వేలు లంచం తీసుకుంటూ మచిలీపట్నం జిల్లా ఖజానా శాఖ కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ నాగేశ్వరప్రసాద్ ఏసీబీ అధికారులకు దొరికిపోయాడు. గురువారం లంచం తీసుకుంటున్న జూనియర్ అసిస్టెంట్‌ను అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ ఏఎస్పీ స్నేహిత తెలిపిన వివరాల ప్రకారం.. మచిలీపట్నం నగరపాలక సంస్థలో డ్రైవర్‌గా పనిచేస్తున్న అమీర్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. అమీర్‌కు రావాల్సిన మూడు నెలల జీతాల బిల్లు పే ఆర్డర్ చేసేందుకు అతడి భార్య షాజాహా జిల్లా ఖజానా శాఖ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నాగేశ్వర వరప్రసాద్‌ను కలిసింది. దానికి నాగేశ్వరవరప్రసాద్ పది వేల రూపాయలు లంచం అడిగాడు. గతంలోనూ బాధితురాలిని ప్రసాద్ రూ. 4 వేలు లంచం అడిగాడు. మళ్లీ మూడు నెలల జీతం బిల్లు చేసేందుకు రూ. పదివేలు అడగటంతో బాధితురాలు ఏసీబీ అధికారులను ఆశ్రయించింది. దీంతో ఏసీబీ ఏఎస్పీ స్నేహిత, డీఎస్పీ సత్యానంద్‌లు దాడులు చేసి రూ. 10వేలు లంచం ఇస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా వరప్రసాద్‌ను పట్టుకుని కేసు నమోదు చేశారు.

ఎమ్మెల్యే సింహాద్రి నామినేషన్ కార్యక్రమంలో అపశృతి

▸▸ బాణసంచా నిప్పురవ్వలు పడి తెలుగు యువత నేత ఇల్లు దగ్ధం



దగ్ధమైన యాసం వెంకటేశ్వరరావు ఇల్లు

అవనిగడ్డ, ఏప్రిల్ 25 : అవనిగడ్డ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేశ్‌బాబు నామినేషన్ ర్యాలీలో అపశృతి చోటు చేసుకుంది. సింహాద్రి రమేశ్ నామినేషన్ వేసేందుకు కార్యకర్తలతో కలిసి లంకమ్మ అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి బాణసంచా కాలుస్తూ ర్యాలీగా నామినేషన్ కేంద్రానికి బయలుదేరగా, అవనిగడ్డ జెడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలోని తెలుగుయువత నేత యాసం వెంకటేశ్వరరావు ఇంటిపైకి నిప్పురవ్వలు పడటంతో ఇల్లు దగ్ధమైంది. అవనిగడ్డ గురక రేవులోని యాసం వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు కుటుంబాలకు చెందిన ఉమ్మడి ఇంటి విషయమై వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి వివాదం నడుస్తున్నది. ఎట్టి పరిస్థితుల్లో అక్కడ స్థలంలో బాట వేయాలని వైసీపీ నేతలు పట్టుపట్టడంతో గ్రామపంచాయతీ కోర్టు ఉత్తర్వులు ధిక్కరించి మరీ బాట వేసేందుకు పలుమార్లు ప్రయత్నించగా, జనవరిలో వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావులు స్టే తీసుకురావటంతో అప్పట్లో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది. అయితే జనవరి నెలలో తహసీల్దార్ కార్యాలయ, పంచాయతీ సిబ్బంది అక్కడ సర్వే చేసేందుకు ప్రయత్నించగా, దానిని అడ్డుకునే క్రమంలో భావోద్వేగానికి గురైన యాసం శ్రీనివాసరావు అదే రోజు రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. తమను ఖాళీ చేయించలేక ఇలా ఇంటిపైకి తారాజువ్వలను కావాలని వేసి ఇల్లు దగ్ధం కావటానికి వైసీపీ నేతలు కారణమయ్యారని, యాసం వెంకటేశ్వరరావు, దివంగత యాసం శ్రీనివాసరావు కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. తారా జువ్వలు ఒకదాని తర్వాత ఒకటి ఇంటిపైకి వచ్చి పడ్డాయని, దీని కారణంగానే తమ ఇల్లు దగ్ధమైందని యాసం శ్రీనివాసరావు కుమార్తె లక్ష్మి తెలిపారు. ఇల్లు దగ్ధమైన సమయంలో ఎమ్మెల్యే చూసి వెనుతిరిగి వెళ్లిపోయాడు కానీ కనీసం ఏం జరిగిందని కూడా అడగలేదని వారు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై అవనిగడ్డ ఎస్ఐను వివరణ కోరగా, తారాజువ్వలు వేసిన వ్యక్తిని గుర్తించామని, దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. సుమారు రూ.9 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్టు యాసం వెంకటేశ్వరరావు తెలిపారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన బుద్ధప్రసాద్

అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన యాసం వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు కుటుంబాలను అవనిగడ్డ జనసేన అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్, ఆయన కుమారుడు వెంకట్రామ్‌లు పరామర్శించారు.

వంశీ నామినేషన్‌కు వెళుతూ ప్రమాదంలో మహిళ మృతి

▸▸ మరో మహిళకు తీవ్రగాయాలు



హనుమాన్ జంక్షన్ రూరల్, ఏప్రిల్ 25 : గన్నవరంలో జరిగే నామినేషన్ కార్యక్రమానికి వెళుతూ రోడ్డు పక్కన నిలబడిన మహిళను ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టడంతో ఇద్దరు మహిళలు తీవ్రగాయాలయ్యాయి. వారిలో ఒక మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రేమల్లె గ్రామానికి చెందిన మన్నెం సుశీల(62), సొదిమెళ్ల కన్నమ్మ గన్నవరంలో వంశీ నామినేషన్ కార్యక్రమానికి వెళుతూ ఆటో ఆగిపోవడంతో దిగి రోడ్డు పక్కన నిలపడింది. ఆదే సమయంలో రేమల్లె నుంచి గన్నవరం వెళుతున్న బైక్ ర్యాలీలో యువకుడు అతివేగంగా మహిళలను ఢీ కొనడంతో ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలిస్తుండగా సుశీల మార్గమధ్యలో మృతి చెందింది. మరో మహిళ కన్నమ్మకు కాలు, చేయి విరిగి తలకు తీవ్రగాయమవడంతో ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వీరవల్లి ఎస్సై చిరంజీవి తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	133, 142, 153
చికెన్ విత్ స్కిన్	254
చికెన్ స్కిన్‌లెస్	264

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 3.80

వైసీపీని చిత్తుగా ఓడించేందుకు యువత సిద్ధం

టీడీపీ యువనేత వల్లూరి కిరణ్

విద్యాధరపురం, ఏప్రిల్ 25: ఎన్నికల్లో వైసీపీని చిత్తు చిత్తుగా ఓడించేందుకు యువత సిద్ధంగా ఉన్నారని టీడీపీ యువనేత వల్లూరి కిరణ్ అన్నారు. గురువారం నగరంలోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు లేక నిరాశ నిస్పృహలలో కూరుకుపోయారన్నారు. వైసీపీ ఎంపీలు ప్రధాని కాళ్లకు మొక్కడం తప్ప ఏనాడైనా పార్లమెంట్‌లో ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రత్యేక హోదా గురించి కేంద్రాన్ని ప్రశ్నించారా అని విమర్శించారు. యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించకపోగా రాష్ట్రాన్ని గంజాయి, హెరాయిన్, డ్రగ్స్, నాసిరకం మద్యంకు నిలయంగా మార్చి యువతను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని చిత్తుగా ఓడించేందుకు యువత సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు.

రోజుకు 10 గంటలు తాగునీరందిస్తాం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ హామీ

గుణదల, ఏప్రిల్ 25: టీడీపీ అధికారంలోకి రాగానే కొండ ప్రాంతాల్లో నివాసం ఉండే వారికి రోజుకు 10 గంటలు తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గద్దె రామ్మోహన్ ఐదవ డివిజన్ కొండ ప్రాంతంలో గురువారం పర్యటించి ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి టీడీపీ అధికారంలోకి రాగానే రోజుకు 10 గంటలు తగ్గకుండా సరఫరా అయ్యేలా చేయడంతోపాటు మరిన్ని కుళాయిల ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. క్రీస్తురాజపురం కొండపైన మరో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి టీడీపీ ప్రభుత్వం రూ. 3 కోట్లు కేటాయించిందని, రిజర్వాయర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశామని ఈలోగా ఎన్నికలు రావడంతో పనులు ఆగాయని తెలిపారు. ప్రభుత్వం మారడంతో ఆ నిధులను వైసీపీ ప్రభుత్వం మరో పనికి మళ్లించుకుని రిజర్వాయర్ నిర్మాణ పనులను పక్కన పెట్టారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయం ఖాయమని, మరో మారు నిధులు మంజూరు చేసి రిజర్వాయర్ నిర్మాణం చేసి తీరతామన్నారు. మే 13న జరగనున్న పోలింగ్‌లో సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపిగా కేశినేని శివనాథ్(చిన్ని)ను గెలిపించాలని కోరారు. డివిజన్ అధ్యక్షుడు నందిపాటి దేవానంద్, ముమ్మనేని ప్రసాద్, అల్లిపల్లి రామకృష్ణ, గుడిపాటి కెనడి, టి.రామకృష్ణ, కోడూరు సుబ్రహ్మణ్యం, షేక్ షరీఫ్,ఆంజనేయులు, బి.వంశి, పి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పటమట: 12వ డివిజన్‌లో పండరీ పురం నుంచి సరూర్‌నగర్, కరివేపాకుతోట, పప్పులమిల్లు, అశోక్‌నగర్, చౌదరిపేట, అయ్యపునగర్, కాకతీయబజార్, యార్లగడ్డ అప్పారావు బజార్, సంజయ్‌గాంధీ కాలనీల్లో గురువారం రాత్రి గద్దె ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కేశినేని శివనాథ్‌లను గెలిపించాల్సిందిగా కోరారు. జనసేన నాయకులు అమ్మిశెట్టి వాసు, బీజేపీ నాయకులు పోతంశెట్టి నాగేశ్వరారావులు మాట్లాడుతూ ఆయనను 50వేల మెజారిటీతో గెలిపించే బాధ్యతను తీసుకుంటామన్నారు. పొట్లూరి సాయిబాబు, ముమ్మనేని ప్రసాద్, శాయన సత్యనారాయణ, మాకినీడు నీరజ, ఖలీల్, కె.రవికుమార్, తెనాలి అరుణ పాల్గొన్నారు.



ఐదవ డివిజన్లో కొండపైన ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



14వ డివిజన్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న గద్దె అనురాధ, రాజేష్, క్రాంతి

జగన్ గెలిస్తే ప్రజల ఆస్తులు అన్యాక్రాంతం

గద్దె అనురాధ

పటమట: వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి గెలిస్తే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అమలు చేస్తారని, ఈ చట్టం వలన ప్రజలు ఆస్తులకు రక్షణ ఉండదని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ అన్నారు. 14వ డివిజన్ పరిధిలోని దర్శిపేట జెండా చెట్టు దగ్గర నుంచి గద్దె అనురాధ, గద్దె రాజేష్, క్రాంతికుమార్‌లు గురువారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. జన సేన, బీజేపీలు బలపర్చిన టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్‌లను సైకిల్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని వారు ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహిం చారు. బీజేపీ నాయకులు నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర సహకారంతో రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ ప్రభుత్వం రావాలన్నారు. నర్రా కిషోర్, యడ్లపల్లి శివనాగరాజు, రమాదేవి, కర్ణా కోటేశ్వరరావు, రాధారపు యల్లబాబు, షేక్ ఫాతిమా, నాసర్‌వలీలు పాల్గొన్నారు.

గుణదల: 4వ డివిజన్లోని శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీలో గద్దె అనురాధ, మాజీ కార్పొరేటర్ దేవినేని అపర్ణ, యువ నాయకుడు గద్దె రాజేష్‌లు ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. జగన్మోహనరెడ్డి చేసిన కుట్రలను భగ్నం చేయడానికి ఓటు అనే ఆయుధం ఇప్పుడు ప్రతి ఒక్కరి చేతిలోనూ ఉందన్న విషయం మర్చిపోవద్దని చెప్పారు. మరో మారు తూర్పు ఎమ్మెల్యే సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. డివిజన్ అధ్యక్షుడు గొల్లపూడి నాగేశ్వరరావు, కొల్లి రవీంద్రబాబు, చలసాని వాసు, కోయ వనజా, సౌజన్య పాల్గొన్నారు.

పశ్చిమను ఆదర్శంగా నిలుపుతా

47వ డివిజన్ ప్రచారంలో సుజనా చౌదరి

చిట్టినగర్, ఏప్రిల్ 25: పశ్చిమ నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి సుజనా చౌదరి అన్నారు. గురువారం 47వ డివిజన్ కొండప్రాంతంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో ఇంటింటికీ వెళ్లి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలువురు మహిళలు హారతులతో సుజనా చౌదరికి స్వాగతం పలికారు. పలువురు ప్రజలు స్థానిక సమస్యలను సుజనా చౌదరి దృష్టికి తీసుకెళ్లారు. జగన్ ప్రభుత్వం తమను మోసం చేసిందని ప్రజలు మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల కోసం హామీలు ఇచ్చి అమలు చేయని వారిని రీకాల్ చేసే విధానం రావాలని, అప్పుడు ప్రజలను ప్రజా ప్రతినిధులు మోసం చేయలేరన్నారు. కేంద్రరాష్ట్రాల్లో తనకున్న పరిచయాలతో పశ్చిమ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానన్నారు. కనకదుర్గమ్మ తనకు ప్రత్యక్షంగా పోటీ చేసే అవకాశం కల్పించిందని, మోదీని ఈ నియోజకవర్గానికి తీసుకొస్తానన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు నాగుల్‌మీరా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, డివిజన్ అధ్యక్షుడు నాగోతి రామారావు, జనసేన నాయకుడు బాడిత శంకర్ గౌరీశంకర్, బీజేపీ నాయకులు బలివాడ శివకుమార్ పట్నాయక్, బోగవల్లి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్లకు అండగా ఉంటా

నియోజకవర్గంలో టీచర్లందరికీ అండగా నిలబడతానని పశ్చిమ కూటమి అభ్యర్థి సుజనా చౌదరి అన్నారు. భవిష్యత్ తరాల కోసం విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తానన్నారు. ప్రచారంలో భాగంగా చిట్టినగర్ గౌతమ్ స్కూల్‌ను సుజనా చౌదరి సందర్శించారు. ఈ సందర్భంలో టీచర్లు తమ సమస్యలను సుజనా చౌదరి దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన గీతాంజలి విద్యార్థి తేజ కుమార్‌ను ఆయన అభినందించారు.



47వ డివిజన్ కొండప్రాంతంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సుజనా చౌదరి

పాతరాజరాజేశ్వరి పేట: స్థానిక 34వ డివిజన్‌లోని కేదారేశ్వరపేట మసీదు సెంటర్, ఖుద్దూస్ నగర్ ప్రాంతాల్లో గురువారం రాత్రి కూటమి పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని, కూటమిని భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, నాయకులు పైలా సోమినాయుడు, జనసేన నాయకుడు అకుల రవిశంకర్, పాల్గొన్నారు.

54వ డివిజన్‌లో కేశినేని శ్రీదేవి ప్రచారం

విద్యాధరపురం: జగన్ ప్రభుత్వ హయాంలో అంధకారంగా మారిన రాష్ట్రంలో వెలుగు రావాలంటే చంద్రబాబు సీఎం కావాలని విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ సోదరి శ్రీదేవి అన్నారు. గురువారం ఆమె శివనాథ్, సుజనా చౌదరిల విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం నిర్వహించారు. షేక్ ఆషా, చెన్నుపాటి ఉషారాణి ఇంకా పలువురు నాయకులు పాల్గొన్నారు.

జగన్‌ను ఇంటికి పంపాలి

మధురానగర్ ఎన్నికల ప్రచారంలో కేశినేని జానకీ లక్ష్మి

మధురానగర్, ఏప్రిల్ 25: సంక్షేమ పథకాల పేరుతో రూపాయి ఇచ్చి పన్నులు, అధిక ధరలతో పది రూపాయలు లాగేసుకుంటున్న జగన్‌ను ప్రజలంతా ఇంటికి పంపాలని, ప్రజలు సైకిల్ గుర్తుకు ఓటేసి గుణపాఠం చెప్పాలని టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) భార్య కేశినేని జానకీ లక్ష్మి విజ్ఞప్తి చేశారు. బీజేపీ, జనసేన బలపరచిన పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్, అసెంబ్లీ అభ్యర్థి బొండా ఉమా విజయాన్ని కాంక్షిస్తూ గురువారం 29వ డివిజన్ మధురానగర్ ఇందిరా కాలనీ, వీవీ నరసరాజు రోడ్డు, కొబ్బరితోట, రామాలయం వీధి, కేదార్ వీధి, అన్నాజీరావు రోడ్డులో ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి టీడీపీ అధికారంలోకి రాగానే అమలు చేయబోయే సంక్షేమ పథకాలకు సంబంధించి సూపర్ సిక్స్ పేరిట ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. డివిజన్ ఇన్‌ఛార్జి నెక్కంటి ప్రసాద్, డివిజన్ అధ్యక్షులు పీవీఆర్, కార్యదర్శి సూరి, సింగం వెంకన్న, అంగిరేకుల రాంబాబు, మసిముక్కు శ్రీనివాస్, ప్రసాద్ పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో కేశినేని జానకీ లక్ష్మి

పాయకాపురం: జగన్మోహనరెడ్డి ప్రభుత్వానికి చరమగీతం పాడాలని విజయవాడ టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) సతీమణి కేశినేని జానకీ లక్ష్మి పిలుపు నిచ్చారు. 58వ డివిజన్ కేఎల్‌రావు రోడ్డు, కృష్ణాహోటల్ సెంటర్, పీఎన్‌టీ కాలనీలో గురువారం సాయంత్రం బొండా ఉమామహేశ్వరరావు సతీమణి బొండా సుజాతతో కలిసి ఆమె పర్యటించారు. ఆమె ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి టీడీపీ జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించారు. బాబుష్యూరిటీ భవిష్యతుకు గ్యారంటీ కరపత్రాలను అందచేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక అమలు చేయనున్న పథకాలను వివరించారు. దాసరి కనకారావు, పిరియా సోమేశ్వరరావు, ఎరుబోతుశ్రావణి, తిరుపతి, బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అధికారంలోకి ఎన్డీఏ కూటమి రావడం ఖాయం

పాతరాజరాజేశ్వరి పేట : జగన్ ఎన్ని డ్రామాలు ఆడినా ప్రజలు నమ్మరని, ఖచ్చితంగా ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తుందని విజయవాడ పార్లమెంట్ కూటమి అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) తనయుడు కేశినేని వెంకట్ అన్నారు. స్థానిక 35వ డివిజన్‌లోని పూర్ణానందంపేట, రైల్వే క్వార్టర్స్ ప్రాంతాల్లో గురువారం కేశినేని వెంకట్ పర్యటించి ఎన్నికల ప్రచార కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంలో కేశినేని వెంకట్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం బాగుపడుతుందన్నారు. ఎన్డీఏ అభ్యర్థులైన పశ్చిమ నియోజకర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరిని కమలం గుర్తుపై, ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్‌కు సైకిల్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మాజీ కార్పొరేటర్ పైడిమాల సుభాషిణి, నందకుమారి, నాగలక్ష్మి, రాజు, బొడ్డు నాగలక్ష్మి పాల్గొన్నారు.

బీసీలను మోసం చేసిన జగన్ : బొండా ఉమా



సుందరయ్యనగర్‌లో ప్రచారం చేస్తున్న బొండా ఉమామహేశ్వరరావు

పాయకాపురం, ఏప్రిల్ 25: బీసీలకు ఉన్న అవకాశాలను నిర్వీర్యం చేసి అర్థాకలితో పడుకునే పరిస్థితికి జగన్ మోహన్‌రెడ్డి తీసుకు వచ్చాడని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు ఆరోపించారు. 63వ డివిజన్ సుందరయ్యనగర్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద నుంచి గురువారం సాయంత్రం ప్రజాచైతన్యయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బొండా ఉమా మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలను పూర్తిగా మోసం చేశారన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలి, బీసీ వర్గాలకు న్యాయం జరగాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. డివిజన్ అధ్యక్షుడు లాబ్బా వైకుంఠం, కొలా శ్రీను, బత్తుల కొండ, పైడి తులసి, ఆంజనేయులు, రాము , కిషోర్, పద్మ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

విస్తృత ప్రచారం

గవర్నర్‌పేట: జనసేన, బీజేపీ బలపర్చిన సెంట్రల్ నియోజవర్గం టీడీపీ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ టీడీపీ ఫ్లోర్‌లీడర్ బాలస్వామి ఆధ్వర్యంలో గురువారం 23వ డివిజన్‌లోని సూర్యారావుపేటలో విస్తృత ప్రచారం జరిగింది. డివిజన్ పరిధిలోని డోర్నకల్ రోడ్డు, పీసపాటి వారి వీధి, తాడేపల్లి వారి వీధి ప్రాంతాల్లో బొండా తనయుడు బొండా రవితేజ నేతృత్వంలో టీడీపీ శ్రేణులు ఇంటింటికీ తిరుగుతూ భవిష్యత్తుకు గ్యారెంటీ ఇస్తూ ప్రచారం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, నేతలు ఆలపాటి రాము, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ పైప్‌లైన్ లీక్: తప్పిన పెను ప్రమాదం

పాయకాపురం, ఏప్రిల్ 25: అజిత్‌సింగ్‌నగర్ 58వ డివిజన్ నందమూరినగర్‌లో గృహావసరాలకు సరఫరా చేసే గ్యాస్ పైప్‌లైన్ లీకై మంటలు ఎగసి పడ్డాయి. సకాలంలో సిబ్బంది మంటలు ఆర్పడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే ఆంధ్రప్రభకాలనీ మెయిన్ రోడ్డు బొమ్మరిల్లు అపార్టుమెంటు వద్ద గురువారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో గృహావసరాలకు సరఫరా చేసే గ్యాస్ పైప్‌లైన్ లీక్ అయింది. ఒక్కసారిగా మంటలు పది అడుగులు పైకి లేచాయి. స్థానికులు ప్రజాప్రతినిధులకు, ఫైర్ డిపార్టుమెంట్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పారు.

మహంతి ట్రస్ట్ వితరణ

గవర్నర్‌పేట, ఏప్రిల్ 25: ఫిట్స్, మానసిక వ్యాధితో బాధపడుతున్న కస్తూరిబాయిపేటకు చెందిన బాలుడు జాన్ ఇమ్మానియేలుకు మందుల ఖర్చు నిమిత్తం మహంతి అప్పల నర్సయ్య-మహాలక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ (ఎంఏఎం) చైర్మన్ మహంతి వాసుదేవరావు (వాసు) శుక్రవారం రూ. 5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. 25వ డివిజన్ సీతారామపురంలోని ట్రస్ట్ కార్యాలయంలో నగదు సాయాన్ని బాలుడు తల్లికి అందజేశారు.



45వ డివిజన్ ప్రచారంలో టీడీపీ, జనసేన నాయకులు పేరం సత్యనారాయణ, రాంబాబు

టీడీపీ, జనసేన నేతల ఆధ్వర్యంలో విస్తృతప్రచారం

భవానీపురం, ఏప్రిల్ 25 : పశ్చిమ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి వై.సుజనా చౌదరి, విజయవాడ టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని)ల విజయాన్ని కాంక్షిస్తూ 44, 45 డివిజన్లలో జనసేన, టీడీపీ డివిజన్ల అధ్యక్షులు గురువారం విస్తృతప్రచారం నిర్వహించారు. 44వ డివిజన్ లేబర్ కాలనీలో బొడ్డుపల్లి శ్రీనివాస రావు(టీడీపీ అధ్యక్షుడు), మల్లెపు విజయలక్ష్మి(జనసేన అధ్యక్షురాలు), పశ్చిమ తెలుగు యువత ఉపాధ్యక్షుడు కుప్పిలి నాగబాబు, క్లస్టర్ ఇన్‌ఛార్జి బడుగు గణేష్, నాగరాజు, ఏడుకొండలు, సత్యనారాయణ సింగ్‌లు పాల్గొన్నారు. 45వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పేరం సత్యనారాయణ, జనసేన అధ్యక్షురాలు బొమ్ము గోవిందలక్ష్మి, రాంబాబు, బీజేపీ అధ్యక్షురాలు రమాదేవి, యూనిట్ టీడీపీ ఇన్‌ఛార్జి షేక్ సుభానీలు సుజనా చౌదరి, శివనాథ్‌ల విజయాన్ని కోరుతూ కబేళా సమీపంలోని శ్రీనిధి శాంతినగర్ కాలనీలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. సూపర్ సిక్స్ పథకాలపై, పోలింగ్ తేదీ, గుర్తులను తెలిపే కరపత్రాలను పంచిపెట్టారు.

గొల్లపూడిలో పోలీసుల మార్చ్‌ఫాస్ట్

విద్యాధరపురం, ఏప్రిల్ 25: ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేందుకు భరోసా కల్పిస్తూ గురువారం గొల్లపూడిలో భవానీపురం పోలీసులు, మిలటరీ పోలీసు బృందాలు మార్చ్‌ఫాస్ట్‌ను నిర్వహించాయి. భవానీపురం సీఐ ఆధ్వర్యంలో స్థానికులకు అవగాహన కల్పించారు. రానున్న ఎన్నికల్లో నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

వైసీపీని వీడి బీజేపీలో చేరిన యువనాయకులు

వన్‌టౌన్, ఏప్రిల్ 25: వైసీపీని వీడిన పలువురు కాపు యువనాయకులు బీజేపీలోకి చేరుతున్నారు. గురువారం సీనియర్ నాయకుడు మర్రి శశిధరరెడ్డి, పశ్చిమ అభ్యర్థి సుజనా చౌదరిల ఆధ్వర్యంలో పశ్చిమ కాపు యువ నాయకుడు పి కోటేశ్వరరావు (నాని) వైసీపీని వీడి బీజేపీలో చేరారు. ఆయనతో పాటు పలువురు బీజేపీ కండువాలు కప్పుకున్నారు. పార్టీలో చేరిన అనంతరం కోటేశ్వరరావు మాట్లాడుతూ, బీజేపీలో చేరడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. స్వామి వివేకానంద ఆశయ సాధన కోసం తామంతా బీజేపీలో చేరినట్లు తెలిపారు.

● సుజనా చౌదరి, కేశినేని శివనాథ్ (నాని) ల గెలుపు కోరుతూ గురువారం 42వ డివిజన్‌లో సీనియర్ నాయకుడు మర్రి శశిధర్ రెడ్డి పర్యటించారు ఈ సందర్భంగా సీనియర్ టీడీపీ నాయకుడు ఎంఎస్ బేగ్, స్థానిక డివిజన్ అధ్యక్షుడు శివాజీ, వెంకటరమణి, నెలకుర్తి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమలో 38 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు


విద్యాధరపురం , ఏప్రిల్ 25: సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేసే అభ్యర్థులు 38 మంది భవానీపురంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి కిరణ్మయికి నామినేషన్‌లు సమర్పించారు. ఈ నెల 19నుంచి నామినేషన్‌ల ప్రక్రియ ప్రారంభమైంది. మొదటి రోజు నుంచే వివిధ పార్టీ అభ్యర్థులు, ఇండిపెండెంట్ అభ్యర్థులు తమ నామినేషన్‌లను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. చివరి రోజు గురువారం 21 నామినేషన్‌లను అభ్యర్థులు ఆర్‌వోకు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

లబ్బీపేట, ఏప్రిల్ 25: విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం స్క్యూ బ్రిడ్జి సెక్షన్, స్క్యూ బ్రిడ్జి విద్యుత్ ఉపకేంద్రం, 11కేవీ పటమటలంక ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 8గంటల నుంచి రాత్రి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ తెలిపారు. వీఎం రంగా పార్క్ ఏరియా, ఆశ్రమం రోడ్, కోగంటివారి వీధి, ట్రెండ్‌సెట్ అపార్ట్‌మెంట్స్ రోడ్, సేవా నికేతన్ రోడ్, పరుచూరి వారి వీధి, మసీదు రోడ్డు, జాస్తివారి వీధి, సర్వీస్ రోడ్డు ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

పగిలిన మంచినీటి పైపు

● కలుషితమవుతున్న నీరు ● స్థానికుల పాట్లు



వన్‌టౌన్, ఏప్రిల్ 25: మల్లికార్జునపేటలో మెయిన్ వాటర్ పైపు పగలడంతో గత కొన్ని రోజులుగా స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. కార్పొరేషన్ సిబ్బంది ఎవరూ కూడా ఇటువైపు దృష్టి సారించకపోవడంతో సమస్య జఠిలంగా మారింది. పగిలిన మంచినీటి పైపులోకి డ్రెయినేజీ నీరు చేరుతోంది. అధికారులు దృష్టి సారించి సమస్యను వెంటనే పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. రోడ్డు మీదకు నీరు రావడంతో నడిచేందుకు కూడా ఇబ్బందికరంగా ఉందని, దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు.





మొన్న పాలాభిషేకం... నేడు పాదాభివందనం!

మొన్న ఎన్నికల ప్రచారంలో మహిళా కార్యకర్తతో పాదాలకు పాలాభిషేకం చేయించుకోవడం, తాజాగా యువకులతో పాదాభివందనం చేయించుకోవడం చూసి కొడాలి నాని తీరుపై స్థానికులు అసహ్యించుకుంటున్నారు. గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేసి వస్తున్న నానికి ఏరియా ఆసుపత్రి కాంట్రాక్టర్ గుమ్మడి నరేంద్రతో పాటు మరో ఐదుగురు వైసీపీ యువకులు పాదాభివందనం చేయడం పలు విమర్శలకు దారితీసింది. - గుడివాడ


గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గ మ్యాప్

పసుపు అడ్డాలో పట్టు ఎవరిదో?

10 సార్లు ఎన్నికలు జరిగితే 7 సార్లు టీడీపీదే గెలుపు

విదర్భపురిగా.. అనేక దేవాలయాలతో గుడులవాడగా ప్రసిద్ధికెక్కిన ఘన చరిత్ర గుడివాడది. ఒకప్పుడు కృష్ణా జిల్లా రాజకీయం అంతా గుడివాడ చుట్టూనే తిరిగేదంటారు. వర్తక, వాణిజ్యాలతోపాటు విద్య, వైద్య రాజకీయ రంగాల ప్రముఖులకు పెట్టింది పేరు ఈ గడ్డ. టీడీపీ ఆవిర్భావం నుంచి ఏడుసార్లు నెగ్గి అభివృద్ధికి బాటలు వేసి గుడివాడ పేరును రాష్ట్రస్థాయిలో ఇనుమడింపజేసింది. వైసీపీ రెండుసార్లు నెగ్గి కేసినోకు కేంద్రంగా చేసి చెడ్డ పేరును తీసుకొచ్చింది. పచ్చని పొలాలు, చెరువు గట్టులతోపాటు శుభకార్యాలకు నెలవులైన కల్యాణమండపాలను సైతం జూదగృహాలుగా మార్చేసింది. ఇప్పుడు మళ్లీ టీడీపీ, వైసీపీ తలబడుతున్నాయి. ఈసారి అభివృద్ధివైపు నిలబడలా? అరాచకానికి బలవ్వాలా? అనేది ప్రజలు కొద్దిరోజుల్లో నిర్ణయించనున్నారు.

- విజయవాడ/గుడివాడ- ఆంధ్రజ్యోతి

- కొడాలి నాని 2 సార్లు గెలిచింది టీడీపీ జెండాతోనే
- వరుసగా ఐదోసారి పోటీ చేస్తున్న నానికి ఎదురుగాలి
- గుడులవాడను జూదవాడగా మార్చాడని జనాగ్రహం
- ప్రముఖుల పుట్టినింట కేసినో సంస్కృతిని తెచ్చిన ఘనత నానిదే

ఎన్టీఆర్‌తో మొదలై..



ఆంధ్రుల ఆరాధ్యదైవం నందమూరి తారకరామారావు జన్మించింది ఒకప్పటి గుడివాడ నియోజకవర్గంలోని నిమ్మకూరులోనే. సొంత ఊరిపై మమకారంతో 1983లో ఆయన తన రాజకీయ అరంగేట్రానికి గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గాన్నే కార్యశాలగా ఎంచుకున్నారు. 1985లోనూ ఎన్టీఆర్ గుడివాడ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయన హయాంలో గుడివాడ రూపురేఖలు మారాయి. అందమైన రహదారులతోపాటు క్రీడాప్రియుల కోసం ఎన్టీఆర్ స్టేడియంను నిర్మించారు. 1983 నుంచి ఇప్పటి వరకు 10 సార్లు ఎన్నికలు జరిగితే 7 సార్లు టీడీపీకి పట్టం కట్టారు. ఒకే ఒక్కసారి కాంగ్రెస్ గెలవగా రెండుసార్లు వైసీపీ గెలుపొందింది. సిటింగ్ ఎమ్మెల్యే కొడాలి వెంకటేశ్వరరావు (నాని) వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. రెండుసార్లు టీడీపీ నుంచి రెండు సార్లు వైసీపీ నుంచి గెలుపొందిన ఆయన ఈసారి కూడా వైసీపీ తరపున పోటీ చేస్తున్నారు. ఆయనకు ప్రత్యర్థిగా టీడీపీ నుంచి ఎన్ఆర్ఐ వెనిగండ్ల రాము పోటీలో ఉన్నారు.

అపకీర్తితో నానికి ఎదురుగాలి



భారతదేశంలో రెండోది, దక్షిణ భారతదేశంలోనే మొదటి హోమియో కాలేజీ గుడివాడలో ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే హోమియో రీసెర్చ్ సెంటర్ ఉంది. వ్యవసాయ పరికరాల తయారీకి రెండు తెలుగు రాష్ట్రాల్లోనే గుడివాడ అగ్రగామి అటేవంటి కేంద్రాన్ని 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అరాచకాలకు అడ్డాగా మార్చేసింది. ఎందరో మధ్యతరగతి జీవుల జీవితాలను చిన్నాభిన్నం చేయడంతోపాటు ధనికులనూ రోడ్డుపాలు చేస్తున్న ఘనత గుడివాడ ఖాతాలో చేరింది. స్థానిక ప్రజాప్రతినిధి కొడాలి నాని అండతో ఆయన అనుచరులు విచ్చలవిడిగా పేకాటలు, గుండాటలు వంటివి నిర్వహిస్తున్నారు. నాని రాష్ట్ర మంత్రిగా చేశారు. జూద గృహాల నిర్వహణ అంతా ఆయన అనుచరుల కనుసన్నల్లోనే నడిచేవి. నియోజకవర్గ సమస్యలపై దృష్టి పెట్టడం కన్నా ప్రతిపక్ష నాయకులపై బూతులతో విరుచుకుపడానికే ప్రాధాన్యం ఇచ్చారు.

సమస్యల్ని పట్టించుకోని ప్రజాప్రతినిధిగా..

ఇసుక రీచ్‌ల్లో దోపిడీతో కోట్లు కొల్లగొట్టడంపై ఎమ్మెల్యే నాని దృష్టి పెట్టారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్యతోపాటు రహదారుల సమస్య తీవ్రంగా ఉన్నా ఏనాడూ పట్టించుకోలేదు. టీడీపీ హయాంలో పూర్తి చేసుకున్న టిడ్కో ఇళ్లను ఐదేళ్లపాటు లబ్ధిదారులకు ఇవ్వకుండా ఎన్నికల ముందు స్టంట్‌లో భాగంగా సీఎం జగన్‌తో ప్రారంభించి హడావిడి చేశారు. ఇలాంటివెన్నో నానికి ప్రతికూలంగా మారనున్నాయి. దీంతో ఈసారి ఆయన గెలుపు అనుమానమేనని సొంత పార్టీ వారే చెబుతున్న మాట.

ఎందరో మహానుభావులు

గుడివాడ నియోజకవర్గంలో గుడివాడ, మున్సిపాల్టీతోపాటు, నందివాడ, గుడ్లవల్లేరు మండలాలున్నాయి. ఎందరెందరో మహానుభావులు ఈ ప్రాంతంలో పుట్టి పెరిగి దేశ విదేశాల్లో కీలకమైన కొలువులు చేపట్టి తమ ప్రాంతానికి వన్నెలద్దారు. మహాత్మాగాంధీ స్ఫూర్తితో గుడివాడకు చెందిన గూడూరి రామచంద్రుడు హరిజనాశ్రమం నిర్మించారు. పాత గుడివాడ నియోజకవర్గం పరిధిలోని పామర్రు మండలం నిమ్మకూరు స్వర్గీయ నందమూరి తారక రామారావు స్వగ్రామం. పద్మశ్రీ స్వర్గీయ అక్కినేని నాగేశ్వరరావుది నందివాడ మండలం వెంకటరాఘవాపురం. గానగాంధర్వ ఘంటసాల వెంకటేశ్వర రావుది చౌటపల్లి గ్రామం. కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరిది గుడ్లవల్లేరు మండలం అంగలూరు. సినీఫొటోగ్రఫీ దిగ్గజం వి.ఎస్.ఆర్.స్వామిది గుడివాడ మండలం వలివర్తిపాడు. గుడ్లవల్లేరు మండలం కౌతవరం నవరస నటనాసార్వభౌమ కైకాల సత్యనారాయణ స్వగ్రామం. సినీపాటలకు సాహిత్య శోభను అద్దిన జాలాది గుడివాడ నియోజకవర్గవాసే. దేశ విద్యుత్తు రంగానికి వెన్నెముకలా నిలిచిన నార్ల తాతారావు, ప్రముఖ పాత్రికేయుడు, కవి నార్ల వెంకటేశ్వరరావు గుడివాడ నియోజకవర్గంలోని కౌతరంలో జన్మించినవారే. ఉయ్యూరు కేసీపీ షుగర్స్ సంస్థ వ్యవస్థాపకుల్లో గుడివాడకు చెందిన అడుసుమిల్లి గోపాలకృష్ణయ్య ముఖ్యులు. ఇలా మరెందరో మహామహులను అందించిన నియోజకవర్గంగా గుడివాడ కీర్తికెక్కింది.

నియోజకవర్గంలో పార్టీల గెలుపోటములు

ఏడాది	విజేత	పార్టీ	సమీప ప్రత్యర్థి	పార్టీ
1978	కఠారి సత్యనారాయణ	కాంగ్రెస్	పుట్టగుంట సుబ్బారావు	సీపీఎం
1983	నందమూరి తారక రామారావు	టీడీపీ	కఠారి సత్యనారాయణ	కాంగ్రెస్
1985	నందమూరి తారకరామారావు	టీడీపీ	ఉప్పలపాటి సూర్యనారాయణ	కాంగ్రెస్
1989	కఠారి ఈశ్వర్‌కుమార్	కాంగ్రెస్	రావి శోభనాద్రిచౌదరి	టీడీపీ
1994	రావి శోభనాద్రిచౌదరి	టీడీపీ	కఠారి ఈశ్వర్‌కుమార్	కాంగ్రెస్
1999	రావి హరిగోపాల్	టీడీపీ	కఠారి ఈశ్వర్‌కుమార్	కాంగ్రెస్
2000	రావి వెంకటేశ్వరరావు (ఉప ఎన్నిక)	టీడీపీ	శేగు వెంకటేశ్వర్లు	కాంగ్రెస్
2004	కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని)	టీడీపీ	కఠారి ఈశ్వర్‌కుమార్	కాంగ్రెస్
2009	కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని)	టీడీపీ	పిన్నమనేని వెంకటేశ్వరరావు	కాంగ్రెస్
2014	కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని)	వైసీపీ	రావి వెంకటేశ్వరరావు	టీడీపీ
2019	కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని)	వైసీపీ	దేవినేని అవినాశ్	టీడీపీ

పక్కా వ్యూహంతో టీడీపీ



ఈ ఎన్నికల్లో గెలుపు కోసం టీడీపీ పక్కా వ్యూహంతో అడుగులు వేస్తోంది. టీడీపీ అధినేత చంద్రబాబు, యువనేత నారా లోకేశ్‌పై బూతులతో దాడులు చేస్తున్న నాని విషయంలో టీడీపీ అధిష్ఠానం కూడా సీరియస్‌గా ఉంది. వెనిగండ్ల రాముకి టీడీపీ టికెట్ ప్రకటించిన తర్వాత అప్పటి వరకు టికెట్ ఆశించిన రావి వెంకటేశ్వరరావు సైతం రాముకి మద్దతుగా నిలిచారు. ఎటువంటి పొరపొచ్చాలూ లేకుండా ప్రతి కార్యక్రమంలో ఇద్దరూ కలిసి పనిచేస్తున్నారు. ప్రచారంలోనూ అదేస్థాయిలో దూసుకుపోతున్నారు. పిన్నమనేని వర్గం సైతం రాముకి మద్దతుగా నిలవడం అదనపు బలం. ఈసారి ఎలాగైనా గుడివాడలో పసుపు జెండా ఎగురవేయాలన్న కసితో టీడీపీ శ్రేణులు కదనరంగంలో దూసుకుపోతున్నాయి.

వెంటనే వెళ్లిపో.. క్రిమినల్ కేసు పెట్టిస్తా..

- స్వతంత్ర అభ్యర్థి కొడాలి వెంకటేశ్వరరావుకు ఆర్వో బెదిరింపు
- గుడివాడలో దళిత దివ్యాంగుడి పట్ల ఇంత దారుణమా?
- ఎట్టకేలకు నామినేషన్ వేసేందుకు అనుమతి


స్వతంత్ర్య అభ్యర్థి కొడాలి వెంకటేశ్వరరావు

గుడివాడ, ఏప్రిల్ 25 : గుడివాడలో అధికారులు రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ, అధికార వైసీపీకి మడుగులొత్తుతున్నారు అనడానికి నామినేషన్ల చివరిరోజు ఆర్వో, పోలీసులు వ్యవహరించిన తీరు సాక్ష్యంగా నిలుస్తోంది. గుడివాడ నియోజకవర్గంలోని గుడ్లవల్లేరు మండలం కుచ్చికాయలపూడికి చెందిన కొడాలి వెంకటేశ్వరరావు అనే స్వతంత్ర్య అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసేందుకు నిర్ణీత సమయంలో గుడివాడ రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకున్నారు. నిర్ణీత సమయం ముగియడంతో ఆర్వో కార్యాలయంలో ఉన్న అభ్యర్థుల నామినేషన్ పత్రాలను తీసుకునేందుకు వీలుగా అందరికీ టోకెన్‌లు అందించసాగారు. అక్కడే ఉన్న స్వతంత్ర అభ్యర్థి కొడాలి వెంకటేశ్వరరావుకు టోకెన్ ఇచ్చేందుకు ఆర్వో పద్మావతి నిరాకరించారు. 'వెంటనే కార్యాలయం నుంచి వెళ్లిపో. లేదంటే క్రిమినల్ కేసులు పెట్టిస్తా' అని వెంకటేశ్వరరావును ఆమె బెదిరించారు. కొడాలి వెంకటేశ్వరరావుతో పాటు వచ్చిన లాయర్లు పఠాన్ బాజీఖాన్, ఎం.రాజేష్, బి.వీరయ్య, కె.శివప్రసాద్.. 'మమ్మల్ని ఎందుకు వెళ్లమంటున్నారు, మా తప్పేంటి' అంటూ నిలదీశారు. ఏ కారణంతో నామినేషన్‌ను తిరస్కరిస్తున్నారో తెలియజేయాలని పట్టుపట్టారు. తిరస్కరణకు కారణం రాసి ఇవ్వాలని, లేనిపక్షంలో నామినేషన్ తీసుకోవాలని కొడాలి వెంకటేశ్వరరావుతో వచ్చిన లాయర్లు భీష్మించారు. వెంటనే ఆర్వో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఇద్దరు సీఐలు రంగప్రవేశం చేసి కొడాలి వెంకటేశ్వరరావుతో పాటు అతనితో వచ్చిన నలుగురిని బయటకు వెళ్లాల్సిందిగా కోరారు. కారణం చెప్పాలన్నారు. సీఐలు మరోమారు ఆర్వో వద్దకు వెళ్లి పరిస్థితిని వివరించారు. కొడాలి వెంకటేశ్వరరావు నామినేషన్ తీసుకునేందుకు ఎంతకూ ఆర్వో పద్మావతి ఒప్పుకోలేదు. దీంతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామంటూ స్వతంత్ర అభ్యర్థి వెంకటేశ్వరరావు బయటకు వచ్చేశారు. ఆ తర్వాత పది నిమిషాల వ్యవధిలోనే స్వతంత్ర్య అభ్యర్థి కొడాలి వెంకటేశ్వరరావుకు సీఐ ఫోన్ చేసి నామినేషన్ వేసేందుకు రావాలని సమాచారం అందించారు. దీంతో వెంకటేశ్వరరావు నామినేషన్ దాఖలు చేశారు.

ఆర్వో బెదిరించారు : కొడాలి వెంకటేశ్వరరావు


తాను దళిత దివ్యాంగుడినని, తనను కనీసం నామినేషన్ కూడా వేయకుండా రిటర్నింగ్ అధికారే అడ్డుకోవడం దారుణమని స్వతంత్ర అభ్యర్థి కొడాలి వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో పోటీ చేసే హక్కు రాజ్యాంగం ప్రతి పౌరుడికీ కల్పించిందని, దీనిని అడ్డుకోవడం దారుణమని అన్నారు. నామినేషన్ దాఖలు చేయడానికి వెళ్లిన తనపై క్రిమినల్ కేసులు పెట్టిస్తానని రిటర్నింగ్ అధికారి పి.పద్మావతి బెదిరించారన్నారు. గత ఎన్నికల్లో కూడా స్వతంత్ర్య అభ్యర్థిగా తాను పోటీ చేశానని తెలిపారు.

టీడీపీలో 'దేవినేని'లేని తొలి ఎన్నికలు

- 1983 నుంచి టీడీపీ తరపున దేవినేని కుటుంబం పోటీ
- నెహ్రూతో ప్రారంభమైన అనుబంధం
- ఉమా వరకు కొనసాగుతున్న బంధం

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఆ కుటుంబం నుంచి ఎవరో ఒకరు ఎన్నికల్లో పోటీ చేయకుండా ఉమ్మడి కృష్ణాజిల్లాలో టీడీపీ ఎన్నికలకు వెళ్లలేదు. అదే దేవినేని కుటుంబం. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన తర్వాత 1983లో జరిగిన ఎన్నికలు మొదలు ప్రతి ఎన్నికల్లోనూ దేవినేని కుటుంబం నుంచి ఎవరో ఒకరు టీడీపీ తరపున పోటీ చేయడం ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఆనవాయితీగా వస్తోంది. కానీ తొలిసారి ఈ ఎన్నికల్లో టీడీపీ తరపున దేవినేని కుటుంబం నుంచి ఎవ్వరూ పోటీలో లేకపోవడం గమనార్హం.


దేవినేని నెహ్రూ (ఫైల్)


దేవినేని ఉమా

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ పురుడు పోసుకున్న నాటి నుంచి దేవినేని నెహ్రూ ఎన్టీఆర్‌కు, పార్టీకి ఎంతో నిబద్ధతతో పని చేసేవారు. దీంతో 1983 నుంచి 1999 వరకు టీడీపీ వెల్లడించిన ప్రతి జాబితాలోనూ నెహ్రూ పేరు ముందు వరుసలో ఉండేది. 1983లో దేవినేని నెహ్రూ కంకిపాడు నుంచి టీడీపీ తరపున పోటీచేసి గెలుపొందారు. ఆ తర్వాత 1985, 1989, 1994 ఎన్నికల్లో అదే నియోజకవర్గం నుంచి నెహ్రూ విజయం సాధించారు. 1994లో నెహ్రూకు వరుసకు సోదరుడు అయిన దేవినేని వెంకట రమణ టీడీపీలో క్రియాశీలక పాత్ర పోషించడంతోపాటు నందిగామ టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు. ఆ తర్వాత టీడీపీలో ఏర్పడిన సంక్షోభం కారణంగా నెహ్రూ కాంగ్రెస్ పార్టీలో చేరారు. దేవినేని రమణ చంద్రబాబుకు విధేయుడిగా ఉండటంతో చంద్రబాబు క్యాబినెట్‌లో మంత్రి పదవి దక్కింది. 1999 జూన్‌లో జరిగిన రైలు ప్రమాదంలో దేవినేని వెంకట రమణ మరణించారు. అదే ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రమణ సోదరుడు దేవినేని ఉమా.. రమణ వారసుడిగా రాజకీయాల్లోకి అడుగు పెట్టి నందిగామ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2004లోనూ అదే స్థానం నుంచి ఉమా విజయం సాధించారు. ఆ తర్వాత నియోజకవర్గాల పునర్విభజన జరగడంతో నందిగామ ఎస్సీ రిజర్వ్ అయింది. దీంతో దేవినేని ఉమా మైలవరం నుంచి 2009 ఎన్నికల్లో బరిలో దిగి ముచ్చటగా మూడోసారి విజయం సాధించారు. 2014లో మైలవరం నుంచే దేవినేని ఉమా పోటీ చేసి విజయం సాధించారు. చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిగా చేశారు. 2019లో దేవినేని కుటుంబం నుంచి ఇద్దరు టీడీపీ తరపున పోటీ చేసినా అసెంబ్లీలోకి ఒక్కరూ అడుగుపెట్టలేకపోయారు. దేవినేని కుటుంబానికి అసెంబ్లీలో ప్రాతినిధ్యం లేకుండా పోయిన తొలి ఎన్నికలు అవే. ఆ ఎన్నికల్లో గుడివాడ నుంచి దేవినేని అవినాశ్, మైలవరం నుంచి దేవినేని ఉమా టీడీపీ తరపున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఈ ఎన్నికల్లో దేవినేని ఉమా పోటీలో లేకపోవడంతో దేవినేని కుటుంబం నుంచి టీడీపీ తరుపున పోటీ లేకపోవడం ఇదే తొలిసారి అయింది.


ధ్వంసమైన బోట్



ఏపీటీడీసీ బోటింగ్ మూసివేసినట్టు తెలుపుతూ నోటీస్ బోర్డు

పర్యాటకానికి పాడె

- ఏపీ.. నాటి పర్యాటక హంగులు.. ఆర్భాటాలు?
- భవానీ ద్వీపం, సప్త దీవుల అభివృద్ధి లేదు
- ఈవెంట్లు లేవు.. ఫెస్టివల్స్ అంతకన్నా లేవు
- వరదల సాకు చెప్పి ద్వీపాన్ని నాశనం చేశారు
- పర్యాటక యూనిట్ల అభివృద్ధి లేదు..
- పర్యాటకుల సందడి లేదు

పర్యాటకం ప్రజలకు వినోదాన్ని ఇస్తుంది. ఆహ్లాదాన్ని పంచుతుంది. కొత్త అనుభూతిని కలిగిస్తుంది. విదేశీయులను ఆకర్షిస్తుంది. రాష్ట్రానికి మంచి పేరు తెస్తుంది. వీటితోపాటు ప్రభుత్వానికి ఆదాయాన్ని అందిస్తుంది. ఇన్ని ప్రయోజనాలున్నాయి కాబట్టే టీడీపీ హయాంలో ప్రభుత్వం దృష్టి పెట్టింది. ప్రణాళికాబద్ధంగా అభివృద్ధికి బాటలు వేసింది. ఎన్నో హంగులు అద్దింది. ఈవెంట్లతో కృష్ణాతీరం కళకళలాడేలా చేసింది. వైసీపీ అధికారంలోకొచ్చాక పర్యాటకం పడకేసింది. పర్యాటకులు లేక కృష్ణాతీరం వెలవెలబోతోంది. ఉమ్మడి కృష్ణాజిల్లాలోనే కాకుండా యావత్ దేశానికే చిరపరిచితమైన భవానీ ద్వీపం బోసిపోతోంది.

- విజయవాడ, ఆంధ్రజ్యోతి

టీడీపీ హయాంలో పర్యాటకం పరుగులు

భవానీ ద్వీపంతో పాటు మరో ఆరు వరకు కృష్ణానదిలో దీవులు ఉన్నాయి. ఈ దీవులన్నింటినీ అభివృద్ధి చేయాలని కిందటి టీడీపీ ప్రభుత్వం డిజైన్లకు రూపకల్పన చేసింది. ఆ మేరకు అంచనాలు తయారు చేసింది. ఈ దీవులకు సంబంధించి ఒక మాస్టర్ ప్లాన్‌ను తయారు చేసింది. ముందుగా భవానీ ఐల్యాండ్‌ను విస్తరించాలని నిర్ణయించింది. వరదలకు దుర్భేద్యంగా తీర్చిదిద్దటం కోసం ఐరన్ షీటింగ్ వేసింది. ఈ ప్రాజెక్టు నడుస్తున్న దశలోనే సమాంతరంగా భవానీ ఐల్యాండ్ అభివృద్ధి పనులు చేపట్టింది. భవానీ ఐల్యాండ్‌లో మినీ ఫారెస్ట్, రోజ్ గార్డెన్, మేజ్ గార్డెన్‌లను అభివృద్ధి చేసింది. రోబోటిక్ పార్క్‌ను అభివృద్ధి చేసింది. మిర్రర్ మేజ్, వీడియోగేమ్స్ వంటివి ఏర్పాటు చేసింది. కాటేజీలను ఆధునీకరించింది. కృష్ణానదిలో రూ.16 కోట్లతో మ్యూజికల్ అండ్ లేజర్ షోను ఏర్పాటు చేసింది. పర్యాటకంతో పాటు అనుబంధంగా పెద్దపెద్ద ఈవెంట్లను నిర్వహించేది. తద్వారా దేశ విదేశాల నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో వచ్చేవారు. దీంతో ప్రభుత్వానికి కూడా భారీగా ఆదాయం సమకూరేది. విజయవాడలో కృష్ణానదీ తీరాన అంతర్జాతీయ స్థాయిలో ఎఫ్1హెచ్2ఓ మెగా ఈవెంట్‌ను నిర్వహించింది. ఈవెంట్ల విషయానికి వస్తే ప్రధానంగా ఎఫ్1హెచ్2వో రేసింగ్‌తో పాటు, నేవీ షోలు, ఎయిర్ షోలు ఆకట్టుకునేవి. తరచూ ఫుడ్ ఫెస్టివల్స్ ఎగ్జిబిషన్స్ వంటివి జరుగుతుండేవి. వీటి కారణంగా.. పర్యాటకం ఊపందుకుంది. ఒకప్పుడు భవానీ ఐల్యాండ్‌లో సాధారణ బోట్లు తప్ప మరేవి కనిపించేవి కావు. అలాంటిది టీడీపీ హయాంలో గోవా బీచ్‌లలో ఉండే వాటర్ స్పోర్ట్స్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. స్పీడ్ బోట్లు, జెట్ స్కీయింగ్‌లు, కానోయింగ్, వైల్డ్ వాటర్ స్పోర్ట్స్, బోట్ పారాసైలింగ్ ఇలాంటి కార్యక్రమాలు అనేకం జరిగేవి.

వైసీపీ హయాంలో అటకెక్కిన అభివృద్ధి

వైసీపీ అధికారంలోకి వచ్చా పర్యాటకం నాశనమైంది. కృష్ణానదికి భారీగా వరదలు రావటంతో.. భవానీ ద్వీపం నీట మునిగింది. ద్వీపాన్ని అభివృద్ధి చేస్తే బూడిదలో పోసిన పన్నీరు చందాన అవుతుందన్న వాదన తీసుకొచ్చింది. ఆ వరదల సందర్భంగా భవానీ ద్వీపం తీవ్రంగా దెబ్బతింది. పునరుద్ధరించటానికి ఇస్తామన్న డబ్బులు నేటికీ ఇవ్వలేదు. రూ.16 కోట్ల మ్యూజికల్ అండ్ ఫౌంటెయిన్ దెబ్బతింది. దీనికి ఇన్స్యూరెన్స్ చేయిస్తే క్లెయిమ్ చేసుకుని ఏర్పాటు చేయవచ్చు. కానీ వైసీపీ ప్రభుత్వం దీని ఊసెత్తలేదు. సరిగ్గా ఇదే సందర్భంలో గోదావరి నదిలో బోటు ప్రమాదం జరిగిందన్న కారణంతో రాష్ట్ర వ్యాప్తంగా బోటింగ్‌ను నిలిపివేసింది. కృష్ణానదిలో కూడా బోటింగ్ నిలిచిపోయింది. దాదాపుగా రెండేళ్ల పాటు బోటింగ్ లేక పర్యాటకులు దూరమయ్యారు. భవానీ ద్వీపాన్ని అభివృద్ధి చేయకపోవటంతో సందర్శకులు తగ్గిపోయారు. హరిత బెర్మ్‌పార్క్ అభివృద్ధి కూడా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంది. దీంతో పర్యాటకులు గణనీయంగా తగ్గిపోయారు. ప్రభుత్వానికి గణనీయంగా ఆదాయం కూడా తగ్గిపోయింది.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● శుక్రవారం 26 ఏప్రిల్ 2024



ఇఫ్లూలో

పీజీ డిప్లొమా, పీహెచ్‌డీ

హైదరాబాద్‌లోని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సులు, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. హైదరాబాద్ సహా షిల్లాంగ్, లఖ్‌నవూ క్యాంపస్‌లలో ఈ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఎంట్రెన్స్ టెస్ట్‌లో అర్హత పొందాలంటే కనీసం 50 శాతం మార్కులు రావాలి. పీజీ డిప్లొమా కోర్సు వ్యవధి ఏడాది. ఇందులో రెండు సెమిస్టర్లు ఉంటాయి. పీహెచ్‌డీ ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ఇఫ్లూ దూరవిద్య విధానంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్ కోర్సును కూడా అందిస్తోంది.

పీజీ డిప్లొమా ఇన్ టీచింగ్ ఆఫ్ ఇంగ్లీష్: హైదరాబాద్ క్యాంపస్‌లో 40, లఖ్‌నవూ క్యాంపస్‌లో 20 సీట్లు ఉన్నాయి.
అర్హత: కనీసం 55 శాతం మార్కులతో ఎంఏ(ఇంగ్లీష్/ఇంగ్లీష్ లిటరేచర్/లింగ్విస్టిక్స్/టీఈఎస్ఎల్/ఈఎల్‌టీ) ఉత్తీర్ణులై ఉండాలి.
పీజీ డిప్లొమా ఇన్ టీచింగ్ ఆఫ్ అరబిక్: హైదరాబాద్ క్యాంపస్‌లో 20 సీట్లు ఉన్నాయి.
అర్హత: కనీసం 55 శాతం మార్కులతో ఎంఏ(అరబిక్/అరబిక్ లిటరేచర్/లింగ్విస్టిక్స్/టీచింగ్ ఆఫ్ అరబిక్) పూర్తిచేసి ఉండాలి.
పీజీ డిప్లొమా ఇన్ ట్రాన్స్‌లేషన్: హైదరాబాద్ క్యాంపస్‌లో 20 సీట్లు ఉన్నాయి.
అర్హత: కనీసం 55 శాతం మార్కులతో ఎంఏ(ఇంగ్లీష్) ఉత్తీర్ణతతోపాటు ఏదేని ఇండియన్/ఫారిన్ లాంగ్వేజ్ చదవడం, రాయడంలో ప్రావీణ్యం ఉండాలి.
పీజీ డిప్లొమా ఎంట్రెన్స్ టెస్ట్: పరీక్ష సమయం రెండు గంటలు. మొత్తం మార్కులు 100. పీజీ డిప్లొమా ఇన్ టీచింగ్ అరబిక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో అరబిక్ లాంగ్వేజ్‌కు సంబంధించి 75, సబ్జెక్ట్ స్పెసిఫిక్ నాలెడ్జ్‌కు సంబంధించి 25 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. పీజీడీటీఈ, పీజీడీటీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నిర్వహించే టెస్ట్‌లో ఇంగ్లీష్ లాంగ్వేజ్ ప్రొఫిషియెన్సీ నుంచి 50, సబ్జెక్ట్-స్పెసిఫిక్ నాలెడ్జ్ నుంచి 50 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు.
పీజీ డిప్లొమా స్కాలర్‌షిప్‌లు: కుటుంబ వార్షికాదాయం రూ.1,50,000లు మించనివారికి మెరిట్ కమ్ మీన్స్ ఫెలోషిప్ కింద ట్యూషన్ ఫీజు మినహాయిస్తారు. బుక్ గ్రాంట్ కింద ఏడాదికి రూ.1000లు ఇస్తారు. సోషల్ వెల్ఫేర్ సంస్థలు/రాష్ట్ర ప్రభుత్వాలు/ మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ అఫైర్స్/యూజీసీ నుంచి ప్రతినెలా రూ. 1000లకు పైగా స్కాలర్‌షిప్ పొందుతున్న అభ్యర్థులకు ఇవి వర్తించవు. ఈ మొత్తం రూ. 1000 కన్నా తక్కువగా ఉంటే మిగిలి నదాన్ని ఇఫ్లూ ఇస్తుంది.
పోస్ట్ గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్ ఇన్ టీచింగ్ ఆఫ్ ఇంగ్లీష్: ఈ డిస్టెన్స్ ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. అడ్మిషన్ టెస్ట్, వయోపరిమితి నిబంధనలు లేవు.
అర్హత: ఎంఏ(ఇంగ్లీష్/లింగ్విస్టిక్స్/ఎడ్యుకేషన్/మాస్ కమ్యూనికేషన్/సైకాలజీ/క్రిటికల్ హ్యూమానిటీస్/లిబరల్ ఆర్ట్స్) ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
దరఖాస్తు ఫీజు+ప్రోగ్రామ్ ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.6,820; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.4,070; దివ్యాంగులకు రూ.1,320

పీహెచ్‌డీ: విభాగాలు-సీట్లు: ఇంగ్లీష్ లిటరేచర్ 7, కంపారేటివ్ లిటరేచర్ 3, ఇండియన్ అండ్ వరల్డ్ లిటరేచర్స్ 6, ట్రాన్స్‌లేషన్ స్టడీస్ 3, హిందీ 5, ఇంగ్లీష్ లాంగ్వేజ్ ఎడ్యుకేషన్ 16, ఎడ్యుకేషన్ 1, లింగ్విస్టిక్స్ అండ్ ఫొనెటిక్స్ 18, ఈస్థటిక్స్ అండ్ ఫిలాసఫీ 1, కల్చరల్ స్టడీస్ 8, ఫిల్మ్ స్టడీస్ అండ్ విజువల్ కల్చర్ 6, మీడియా అండ్ కమ్యూనికేషన్ 18, ఫ్రెంచ్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్ 8, రష్యన్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్ 5, జర్మన్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్ 3, స్పానిష్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్ 4, అరబిక్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్ 9 సీట్లు ఉన్నాయి.
అర్హత: విభాగాన్ని అనుసరించి (ఎంఏ/ఎంఫిల్)(ఇంగ్లీష్/కంపారేటివ్ లిటరేచర్/ట్రాన్స్‌లేషన్ స్టడీస్/హిందీ/టీఈఎస్ఎల్/ఈఎల్‌టీ/ఎడ్యుకేషన్/కల్చరల్ స్టడీస్/ఫిల్మ్ స్టడీస్/కమ్యూనికేషన్/ఈస్థటిక్స్/ఫిలాసఫీ/విజువల్ ఆర్ట్స్/కల్చర్/లీగల్ స్టడీస్/ఆంత్రోపాలజీ/హిస్టరీ/పొలిటికల్ సైన్స్/సోషియాలజీ/సోషల్ వర్క్/మీడియా స్టడీస్/జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్/ లింగ్విస్టిక్స్/ఫొనెటిక్స్/అప్లయిడ్ లింగ్విస్టిక్స్/ఫ్రెంచ్/రష్యన్/జర్మన్/స్పానిష్/ అరబిక్) లేదా ఎంఫిల్ ఇంగ్లీష్(కామన్వెల్త్ లిటరేచర్/ఇంగ్లీష్ లిటరేచర్/ కంపారేటివ్ లిటరేచర్) ఉత్తీర్ణులై ఉండాలి.
- యూజీసీ(నెట్/జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్) అర్హత ఉన్నవారు ఎంట్రెన్స్ టెస్ట్ రాయనవసరం లేదు. వీరిని నేరుగా ఇంటర్వ్యూకి పిలుస్తారు. ఇంటర్వ్యూకి 30 మార్కులు కేటాయించారు. ఇందులో సాధించిన మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.
- **ఎంట్రెన్స్ టెస్ట్:** పరీక్ష సమయం రెండు గంటలు. సంబంధిత సబ్జెక్ట్, రీసెర్చ్ మెథడాలజీల నుంచి ఒక్కోదానిలో 35 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మొత్తం మార్కులు 70.
- **ఫెలోషిప్:** నెట్ అర్హత లేని వారికి నెలకు రూ.8000ల ఫెలోషిప్‌తోపాటు కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.8000 ఇస్తారు. జేఆర్ఎఫ్ అర్హత ఉన్నవారికి నెలకు రూ.31000ల ఫెలోషిప్, రూ.7440ల హెచ్ఆర్ఏ, ఏడాదికి రూ.10000ల కంటింజెన్సీ గ్రాంట్ ఇస్తారు. ఎస్ఆర్ఎఫ్ అర్హత ఉన్నవారికి నెలకు రూ.35,000ల ఫెలోషిప్, రూ.8400ల హెచ్ఆర్ఏ, ఏడాదికి రూ.20,500ల కంటింజెన్సీ గ్రాంట్ ఇస్తారు.

ముఖ్య సమాచారం
- **ఎంట్రెన్స్ టెస్ట్ ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.500; దివ్యాంగులు, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు రూ.250
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** పీజీసీటీఈకి మే 10; పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లకు మే 8.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** జూన్ 8
- **వెబ్‌సైట్:** efluniversity.ac.in

లిటిల్స్




మీకు తెలుసా?

- పొడవైన తోక, చూడటానికి గంభీరంగా... మెడ కిందిభాగంలో ఎరుపు, తల మీద బంగారు రంగు ఉంటుంది. మెడ చుట్టూ చీరనేసినట్లుండే అందం... మొత్తానికి చూడటానికి ఫస్ట్‌లుక్‌లో నెమలిలా ఉండే ఈ పక్షి పేరు 'గోల్డెన్ పీజంట్'. భూమ్మీద ఉండే అందమైన పక్షుల్లో ఇదొకటి. విచిత్రమేంటంటే ఇవి.. మగ పక్షులు. ఆడపక్షులు నలుపు, బ్రౌన్ కలర్‌లో ఉంటాయి.
- వీటి పుట్టినిల్లు చైనా. కొండప్రాంతాల్లో తిరుగుతుంటాయివి. బరువు 600 గ్రాములు ఉంటాయి. ఇక మగపక్షులు 90 నుంచి 100 సెంటీమీటర్ల పొడవుంటే.. ఆడపక్షులు 70 నుంచి 80 సెం.మీ పొడవు ఉంటాయి.



- ఈ పక్షులు తెలివైనవి. అయితే సహనం కూడా వీటికి ఎక్కువ. అయితే ఒక్కోసారి మగపక్షులకు కోపం ఎక్కువ వస్తుంది. ఎంత అంటే ఆడపక్షులను చంపేస్తాయి. అయితే ఇది చాలా అరుదుగా జరుగుతుంది. ఇవి గాల్లోకి మరీ ఎత్తుకు ఎగరలేవు. అయితే వేగంగా పరిగెత్తగలవు.
- చలి, వేడి ప్రాంతాల్లో కూడా బతకగలవు. వీటిని పెంచుకోవచ్చు కూడా.
- ఈ పక్షుల గుడ్లు బాతు గుడ్లంత ఉంటాయి. మట్టిలో కంటే గడ్డిమీద గుడ్లు పెట్టటానికి ఇష్టపడతాయి. 5 నుంచి 12 గుడ్లు వరకూ పెడతాయి. ఇవి పొదిగే కాలం మూడు వారాలు.


జత లేని బొమ్మ ఏది?




సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి





5 తేడాలు గుర్తించండి

ఐఐఎఫ్‌టీ

ఆన్‌లైన్‌లో ఎంబీఏ(ఐబీ)

న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ) - ఎంబీఏ(ఇంటర్నేషనల్ బిజినెస్) ఆన్‌లైన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అకడమిక్ మెరిట్, అనుభవం ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి ఆన్‌లైన్ విధానంలో ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

ప్రోగ్రామ్ వివరాలు: ఈ ప్రోగ్రామ్‌ను వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఉద్దేశించారు. దీని వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి ఏడాది మేనేజ్‌మెంట్ స్ట్రాటజీ, ట్రేడ్ అండ్ ఫైనాన్స్, మార్కెటింగ్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్సెస్ కోర్సులు చదవాల్సి ఉంటుంది. రెండో ఏడాది ఫైనాన్స్, ట్రేడ్, మార్కెటింగ్, స్ట్రాటజీ, హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎకనామిక్స్ స్పెషలైజేషన్‌లలో ఒకదాన్ని ఎంచుకోవాలి. ప్రోగ్రామ్‌లో భాగంగా వర్చువల్ సెషన్స్ ఉంటాయి. ప్రముఖ పారిశ్రామిక నిపుణులు గెస్ట్ లెక్చర్స్ ఇస్తారు. కేస్ స్టడీస్, ప్రాబ్లం సాల్వింగ్ విధానాలపై బృంద చర్చలు ఉంటాయి. వారాంతాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఆన్‌లైన్ సెషన్స్ నిర్వహిస్తారు.


అర్హత: కనీసం 55 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు. కనీసం ఏడాది ప్రొఫెషనల్ అనుభవం తప్పనిసరి. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.



ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** రూ.3,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 31
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** జూలై 15 నుంచి
- **వెబ్‌సైట్:** www.iift.ac.in

ఐఎల్‌బీఎస్‌లో అకడమిక్ ప్రోగ్రామ్‌లు

న్యూఢిల్లీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లివర్ & బైలరీ సైన్సెస్(ఐఎల్‌బీఎస్) - వివిధ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. పీహెచ్‌డీ, పీడీసీసీ, పీజీసీసీ, సర్టిఫికెట్ కోర్సులు సహా ఫెలోషిప్ ప్రవేశాలు నిర్వహించనున్నారు. ఆల్ ఇండియా ఎంట్రెన్స్ టెస్ట్, డిపార్ట్‌మెంటల్ అసెస్‌మెంట్/ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. పీహెచ్‌డీ వ్యవధి 3 నుంచి 5 సంవత్సరాలు. పోస్ట్ డాక్టోరల్ సర్టిఫికెట్ కోర్సులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు, ఫెలోషిప్‌ల వ్యవధి ఏడాది. కొన్ని పీజీసీసీ కోర్సులు, ఇతర సర్టిఫికెట్ కోర్సుల వ్యవధి ఆర్నెల్లు.



సీట్లు: అన్ని కోర్సుల్లో కలిపి మొత్తం సీట్లు 91. పీహెచ్‌డీ కోర్సులో 13 సీట్లు ఉన్నాయి. వీటిలో మాలిక్యులార్ అండ్ సెల్యులార్ మెడిసిన్‌లో 4, హెపటాలజీలో 2, క్లినికల్ న్యూట్రిషన్‌లో 1, వైరాలజీలో 1, నర్సింగ్‌లో 5 సీట్లు ఉన్నాయి. పీడీసీసీ కోర్సులో 47 సీట్లు ఉన్నాయి. వీటిలో ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ అనెస్తీషియా 3, ఇంటర్వెన్షనల్ రేడియాలజీ 3, హెపటోపాథాలజీ 3, నెఫ్రాలజీ 3, ట్రాన్స్‌ప్లాంట్ వైరాలజీ 3, డయాగ్నస్టిక్ వైరాలజీ 1, క్రిటికల్ కేర్ మెడిసిన్ 3, జీఐ మెడికల్ అంకాలజీ 3, హెచ్‌పీబీ అండ్ జీఐ అడ్వాన్స్‌డ్ రేడియేషన్ అంకాలజీ 3, గ్యాస్ట్రో రేడియాలజీ 3, బ్లడ్ బ్యాంకింగ్ అండ్ ఇమ్యూనోహెమటాలజీ 3, అడ్వాన్స్‌డ్ డయాగ్నస్టిక్ అండ్ క్లినికల్ మైక్రోబయాలజీ 3, అఫెరిసిస్ టెక్నాలజీ అండ్ బ్లడ్ కాంపొనెంట్ థెరపీ 3, సెల్యులార్ ట్రాన్స్‌ప్లాంట్ ఇమ్యూనాలజీ 1, హెపటాలజీ 4, అడ్వాన్స్‌డ్ క్లినికల్ బయోకెమిస్ట్రీ 2, హెపటో-హెమటాలజీ 1, పల్మనరీ-క్రిటికల్ కేర్-స్లీప్ మెడిసిన్ 2 సీట్లు ఉన్నాయి. పీజీసీసీ కోర్సులో 17 సీట్లు ఉన్నాయి. వీటిలో క్లినికల్ న్యూట్రిషన్ 2, ఎపిడిమియాలజీ ఆఫ్ వైరల్ హెపటైటిస్ అండ్ లివర్ డిసీజెస్ 1, క్లినికల్ రీసెర్చ్ ఇన్ లివర్ డిసీజెస్ 2, క్లినికల్ బయో ఇన్ఫర్మాటిక్స్ 10, డయాలిసిస్ థెరపీ 2 సీట్లున్నాయి. అడ్వాన్స్‌డ్ హెపటాలజీలో 2 ఫెలోషిప్‌లు ఉన్నాయి. సర్టిఫికెట్ కోర్సుల్లో క్రిటికల్ కేర్ 2, బయోస్టాటిక్స్ 10 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: పీహెచ్‌డీ కోర్సుకు ప్రథమ శ్రేణి మార్కులతో ఎంబీబీఎస్/మాస్టర్స్ డిగ్రీ(మెడికల్/డెంటల్ సైన్సెస్)/ఎంటెక్/ఎంఫార్మసీ/ఎంవీఎస్సీ/ఎమ్మెస్సీ నర్సింగ్/ఎంఫిల్ నర్సింగ్/మాస్టర్స్ డిగ్రీ(బయోలాజికల్ సైన్సెస్-(బయో కెమిస్ట్రీ/బయోటెక్నాలజీ/లైఫ్ సైన్సెస్/జువాలజీ/మైక్రోబయాలజీ)) ఉత్తీర్ణులై ఉండాలి. సీఎస్ఐఆర్/యూజీసీ నెట్ జేఆర్ఎఫ్, డీబీటీ జేఆర్ఎఫ్, ఐసీఎంఆర్ జేఆర్ఎఫ్ ఉన్న అభ్యర్థులు ఎంట్రెన్స్ ఎగ్జామ్ రాయనవసరం లేదు. వీరిని నేరుగా ఇంటర్వ్యూకి అనుమతిస్తారు. పీడీసీసీ కోర్సుకు సంబంధిత విభాగంలో ఎండీ/డీఎన్‌బీ ఉత్తీర్ణులై ఉండాలి. పీజీసీసీ కోర్సుకు విభాగాన్ని అనుసరించి ఎమ్మెస్సీ/ఎంబీబీఎస్/బీఏఎంఎస్/బీహెచ్ఎంఎస్/బీడీఎస్/ఎమ్మెస్సీ-లైఫ్ సైన్సెస్/ఎమ్మెస్సీ-స్టాటిస్టిక్స్/బీఎస్సీ-నర్సింగ్ ఉత్తీర్ణులై ఉండాలి. సర్టిఫికెట్ కోర్సులకు ఎంబీబీఎస్/పీజీ(సైన్స్/ఎకనామిక్స్/సోషియాలజీ/స్టాటిస్టిక్స్/సైకాలజీ/ఫిజియోథెరపీ); ఫెలోషిప్‌లకు డీఎం/డీఎన్‌బీ(గ్యాస్ట్రో ఎంటరాలజీ) పూర్తిచేసి ఉండాలి.

ఎంపిక: పీహెచ్‌డీ కోర్సుకు నిర్వహించే ప్రవేశ పరీక్షలో 100 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నలన్నీ పీజీ స్థాయిలో ఉంటాయి. మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం గంటన్నర. ఇందులో అర్హత సాధించాలంటే కనీసం 50 శాతం మార్కులు రావాలి. అర్హత పొందిన అభ్యర్థులను 1:5 నిష్పత్తిలో ఎంపిక చేసి ఇంటర్వ్యూ/డిపార్టుమెంటల్ అసెస్‌మెంట్‌కు పంపుతారు. నెట్ అర్హత ఉన్నవారికి వ్యాలిడ్ జేఆర్ఎఫ్‌కు 30 మార్కులు, ఆర్నెల్ల పరిశోధన అనుభవానికి 20 మార్కులు, ప్రజంటేషన్‌కు 10 మార్కులు, ఇంటర్వ్యూకి 40 మార్కులు వెయిటేజీ ఇస్తారు. పీడీసీసీ/పీజీసీసీ/ఫెలోషిప్/సర్టిఫికెట్ కోర్సుల ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో నిర్దేశిత సబ్జెక్టుల నుంచి నిర్దేశించిన మేరకు ప్రశ్నలు ఇస్తారు. రాత పరీక్ష స్కోర్‌కు 70 శాతం, డిపార్టుమెంటల్ అసెస్‌మెంట్/ఇంటర్వ్యూకి 30 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 12
- **రిటెన్ ఎగ్జామినేషన్:** మే 26
- **డిపార్ట్‌మెంటల్ అసెస్‌మెంట్:** మే 27
- **కోర్సులు ప్రారంభం:** జూలై 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.ilbs.in


జాబ్ కార్నర్

సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ (అసిస్టెంట్ కమాండెంట్) ఎగ్జామ్ 2024

మొత్తం ఖాళీలు: 506

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్... సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్(అసిస్టెంట్ కమాండెంట్) ఎగ్జామినేషన్-2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పరీక్ష ద్వారా బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్, ఇండో-టిబెటిన్ బోర్డర్ పోలీస్, సశస్త్ర సీమాబల్‌లో అసిస్టెంట్ కమాండెంట్ల(గ్రూప్ ఎ) ఉద్యోగాలు భర్తీ చేస్తారు. అర్హులైన పురుష, మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

మొత్తం ఖాళీలు: 506(బీఎస్ఎఫ్-186, సీఆర్‌పీఎఫ్-120, సీఐఎస్ఎఫ్-100, ఐటీబీపీ-58, ఎస్ఎస్‌బీ-42)
అర్హత: బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు నిర్దిష్ట శారీరక, వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.
వయోపరిమితి: 2024 ఆగస్టు 1 నాటికి 20 నుంచి 25 సంవత్సరాల మధ్య ఉండాలి.
ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష(పేపర్-1, పేపర్-2), ఫిజికల్ స్టాండర్డ్స్/ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ/పర్సనాలిటీ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.
దరఖాస్తు రుసుము: రూ.200. ఎస్సీ, ఎస్టీ, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.
తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, తిరుపతి, విశాఖపట్నం
దరఖాస్తుకు చివరి తేదీ: మే 14
రాత పరీక్ష తేదీ: ఆగస్టు 4
వెబ్‌సైట్: https://upsc.gov.in/



నేవల్ డాక్‌యార్డ్‌లో అప్రెంటిస్‌లు

మొత్తం ఖాళీలు: 301

భారత నౌకాదళానికి చెందిన ముంబయిలోని మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్(నేవీ), నేవల్ డాక్‌యార్డ్ అప్రెంటిస్ స్కూల్... కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
1. ఏడాది అప్రెంటిస్‌షిప్ ట్రెయినింగ్: **288 ఖాళీలు**
2. రెండేళ్ల అప్రెంటిస్‌షిప్ ట్రెయినింగ్: **13 ఖాళీలు**

ట్రేడులు: ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రోప్లేటర్, ఫిట్టర్, ఫౌండ్రీమన్, మెకానిక్(డీజిల్), ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, మెషినిస్ట్, ఎంఎంటీఎం, పెయింటర్(జి), ప్యాటర్న్ మేకర్, పైప్ ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, మెకానిక్ రిఫ్రిజిరేషన్ అండ్ ఏసీ, షీట్ మెటల్ వర్కర్, షిప్‌రైట్(ఉడ్), టైలర్(జి), వెల్డర్(జి అండ్ ఇ), మేసన్(బీసీ), ఐ అండ్ సీటీఎస్ఎం, షిప్ రైట్(స్టీల్), రిగ్గర్, ఫోర్జర్ అండ్ హీట్ ట్రీటర్.
అర్హత: ఎనిమిది, పదో తరగతితోపాటు సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
వయోపరిమితి: కనిష్ఠ వయసు 14 ఏళ్లు, గరిష్ఠ వయోపరిమితి లేదు.
ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ/స్కిల్ టెస్ట్‌లో వచ్చిన మార్కులు, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: మే 10
వెబ్‌సైట్: https://indiannavy.nic.in/

ఏఆర్ఐలో స్టెనోగ్రాఫర్స్

భారత ప్రభుత్వ రంగ సంస్థకు చెందిన పుణెలోని మహారాష్ట్ర అసోసియేషన్ ఫర్ ద కల్టివేషన్ ఆఫ్ సైన్స్ - అగార్కర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎంఏసీఎస్-ఏఆర్ఐ)... డైరెక్ట్/డిప్యూటేషన్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
1. ప్రైవేట్ సెక్రటరీ: **2 పోస్టులు**
2. స్టెనోగ్రాఫర్ గ్రేడ్ 2: **2 పోస్టులు**

అర్హత: ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణతతో పాటు టైపింగ్ స్పీడ్ ఉండాలి.
జీతం: ప్రైవేట్ సెక్రటరీ పోస్టుకు రూ.44,900 - రూ.1,42,400. స్టెనోగ్రాఫర్ గ్రేడ్ 2 పోస్టుకు రూ.25.500 - రూ.81,100.
వయోపరిమితి: స్టెనోగ్రాఫర్ పోస్టుకు 27 ఏళ్లు మించరాదు. ప్రైవేట్ సెక్రటరీ పోస్టుకు 56 ఏళ్లు మించరాదు.
ఎంపిక విధానం: స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
దరఖాస్తు చివరి తేదీ: మే 6
వెబ్‌సైట్: https://aripune.org/

డైలీ సుడోకు - 291

3		4			1			7
	5							
			6					8
6			9			2	7	3
			8		7			
2	1	7			3			5
5					4			
							9	
1			2			4		6

సుడోకు - 290 సమాధానం

6	7	2	9	1	3	4	8	5
8	1	9	4	2	5	7	3	6
3	4	5	6	7	8	9	2	1
9	2	8	5	6	4	1	7	3
7	6	1	8	3	2	5	9	4
5	3	4	7	9	1	2	6	8
1	9	7	3	4	6	8	5	2
2	5	3	1	8	7	6	4	9
4	8	6	2	5	9	3	1	7

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.